వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక
VEEKSHANAM, TELUGU MONTHLY
సంపుటి : 19 సంచిక : 6-7 హైదరాబాద్ 236 జూన్-జూలై 2021 పేజీలు : 76 రు. 25

- ఏడేళ్ల మోడీ పాలనలో దేశం అధోగతి
- ఏడేళ్ల తెలంగాణ ముఖచిత్రం
- రఘురామ రాజన్ దృష్టిలో వర్తమానం
- ప్రజా సంఘాల నిషేధం శ్మశాన శాంతి
- ఆంధ్రప్రదేశ్‌లో ఆస్తి పన్ను పెంపు
- ఆహార సంక్షోభం పాలనా వైఫల్యమే
- చిలే, పెరూ ప్రజా విజయాలు

వీక్షణం ఫోన్ నంబర్ మారింది

సాంకేతిక కారణాల వల్ల వీక్షణం పాత ల్యాండ్‌లైన్ నంబర్ రద్దయింది. కొద్ది కాలంగా వీక్షణంకు ఆ నంబర్ మీద ఫోన్ చేయడానికి ప్రయత్నించిన పాఠకులకు, అభిమానులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాం. ఇక నుంచి వీక్షణంకు ల్యాండ్‌లైన్ నంబర్ ఉండదు.

73307 95849

అనే సెల్‌ఫోన్ మాత్రమే ఉంటుంది. ఈ సెల్‌ఫోన్ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆఫీసు వేళల్లో మాత్రమే పనిచేస్తుంది. ఇక నుంచి పాఠకులు, మిత్రులు, అభిమానులు ఈ ఫోన్ నంబర్‌కు మాత్రమే చేయాలని విజ్ఞప్తి.

వీక్షణం పాఠకులు, అభిమానులు క్షమించాలి - జూన్ సంచిక అచ్చులో రాలేదు

లాక్‌డౌన్ వల్ల, వీక్షణం ఆఫీసు, ప్రింటింగ్ ప్రెస్ పూర్తికాలం పనిచేసే అవకాశం లేకపోవడం వల్ల గత సంచిక - జూన్ 2021 - అచ్చులో వెలువరించలేకపోయాం. అయినా సమకాలీన రాజకీయార్థిక, సామాజిక అంశాల మీద పాఠకులతో సంభాషణను ఆపగూడదనే ఉద్దేశంతో ఆ సంచిక సాఫ్ట్ కాపీ బ్లాగ్ సైట్ మీద, ఫేస్‌బుక్ పేజీ మీద వెలువరించాం. సోషల్ మీడియాలో చాల మంది మిత్రులు పంచుకున్నారు. అయినప్పటికీ అచ్చు ప్రతి ద్వారా చేరగలిగిన పాఠకులందరినీ చేరలేకపోయాం. కొందరు అసలు ఈ సోషల్ మీడియాలో లేకపోవడం వల్ల, ఉన్నవారిలో కూడా కొందరికి పత్రికలు సాఫ్ట్ కాపీ చదివే అలవాటు లేకపోవడం వల్ల వీక్షణం పాఠకులలో 20 - 25 శాతాన్ని కూడా చేరి ఉండకపోవచ్చు. వీక్షణం పాఠకులూ, అభిమానులూ మా ఇబ్బందిని అర్థం చేసుకోవాలని కోరుతున్నాం. సాఫ్ట్ కాపీ ప్రతిలో వెలువడిన వ్యాసాలలో ముఖ్యమైనవి వీలును బట్టి అచ్చులో మళ్లీ అందజేస్తాం. చందాదారులకు మరొక సంచిక వరకూ వారి చందా పొడిగిస్తాం.

- వీక్షణం కలెక్టివ్

237 ISSN 2231-6892

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాస పత్రిక

జూన్ - జూలై 2021
సంపుటి : 19
సంచిక : 6-7

'వీక్షణం'లో అచ్చువుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

'వీక్షణం' పేరిట రచనలు, ఎం.ఓ.లు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం VEEKSHANAM
మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫోన్ : 7330795849
Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : నవ్య ప్రింటర్స్
అంబర్‌పేట్, హైదరాబాద్.

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 25	రు. 25
సంవత్సరం	రు. 300	రు. 250
మూడు సంవత్సరాలు	రు. 900	రు. 650
ఐదు సంవత్సరాలు	రు. 1500	రు. 1100
పది సంవత్సరాలు	రు. 3000	రు. 2000

ఆన్‌లైన్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా డబ్బులు పంపేవారు బ్యాంక్ స్లిప్‌లపై **'VEEKSHANAM'** అని రాసి తమ పేరు కూడా రాయాలి. వీక్షణం అకౌంట్ నెంబర్ - **013911011002175** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **UBIN0801399** నెంబర్‌తో పాటు తమ పేరు కూడా రాసి వేయాలి.

గత నెల ఆన్‌లైన్‌లో వచ్చిన వీక్షణం జూన్ సంచికలో భూసారం శివన్న రాసిన 'మేడే, ప్యారిస్ కమ్యూన్, శ్రామికోద్యమ నవ నిర్మాణం' వ్యాసానికి రచయిత పరిచయం సామాజిక కార్యకర్త అని రావాల్సిన చోట రైతు నేస్తం సంపాదకులు అని అచ్చయింది. ఈ పొరపాటుకు చింతిస్తున్నాం....సం.

జూన్ నెల వీక్షణం లాక్‌డౌన్ కారణంగా, పాఠకులకు అందకపోవడానికి మీ ఇబ్బందులను, దానికిగల కారణాలను అర్థం చేసుకున్నాము. ఫోన్ చేసి చందాదారుల వాట్స్ అప్ నెంబర్ గాని, ఇమెయిల్ అడ్రస్ గాని అడిగి వెంటనే సాఫ్ట్ కాపీ పెట్టినందుకు వీక్షణం కలెక్టివ్ వారికి నా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. పాఠకులకు ఏదో విధంగా వీక్షణం పత్రికను అందజేయాలనే మీ తపనకు, మీ నిజాయితీకి నా హృదయపూర్వక అభినందనలను తెలియజేస్తున్నాను.

రోమ్ నగరం తగలబడిపోతుంటే ఫిడేలు వాయిస్తూ కూర్చున్న నీరో చక్రవర్తి లాగ ఉంది జగన్ ప్రభుత్వ తీరు. కరోనా వల్ల వేలాది మంది ఆసుపత్రుల్లో బెడ్స్ లేక, ఆక్సిజన్ అందక, సరియైన వైద్య సదుపాయాలు లేక ప్రజలు అల్లల్లాడిపోతుంటే తనకేమి పట్టనట్టు చూస్తు ఉండిపోవడం, ఇంకా ఏ పథకాలు పెట్టి ప్రజలకు డబ్బులు పంచిపెట్టి వారిని ఎలా తమ ఓటు బ్యాంకు ఖాతాలో వేసుకోవాలా అని ఆలోచించడం చాలా దుర్మార్గం. 'ఈ అసాధారణ మరణాలన్నీ వ్యవస్థ చేసిన హత్యలే' సంపాదకీయం వాస్తవ పరిస్థితులకు అద్దం పడుతోంది. ఏప్రిల్ 29న చిత్రకారుడు చంద్ర మరణించాడన్న వార్త నన్ను ఎంతో కలచివేసింది. చంద్ర గీసిన చిత్రాలంటే నాకు చాలా అభిమానం. ఒక ప్రముఖ చిత్రకారుడు కరోనా వలన మరణించడం చాలా బాధాకరం. ప్రజా సంఘాలను నిషేధించడం మరో ఎమర్జెన్సీని తలపిస్తోంది. తెలంగాణ రావడానికి ఈ ప్రజా సంఘాలు ఎనలేని కృషి చేశాయి. అటువంటి వాటిని నిషేధించడమంటే కెసిఆర్ పరిపాలన విధానమేంటో మనకు స్పష్టంగా అవగాహన అవుతోంది. ఇప్పటికైనా ప్రజలు మేల్కొని మరో బలమైన పోరాటం చేయవలసిన అవసరం ఉందని 'ప్రజా సంఘాల నిషేధ లక్ష్యం శ్మశాన శాంతి స్థాపన' వ్యాసం తెలియజేస్తోంది.

ఆంధ్రప్రదేశ్‌లో 'రఘురామ కృష్ణరాజుపై రాజద్రోహం కేసు' చిమ్మె జాన్ బర్నబాస్ గారి వ్యాసంలో అసలు రాజద్రోహం అంటే ఏమిటి అనేది నేను తెలుసుకోగలిగాను. మే 17న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఉన్న సుక్మా గ్రామం సిల్గేర్‌లో పోలీస్ క్యాంపు పెట్టి ఆదివాసులపై అకారణంగా కాల్పులు జరిపి సృష్టించిన మారణకాండ చాలా అమానుషం. అక్కడి వాస్తవ పరిస్థితులను రచయిత చక్కగా విశ్లేషించారు. లాక్‌డౌన్‌లో కూడా జూన్ నెల వీక్షణం పత్రికను ఎంతో శ్రమకోర్చి సాఫ్ట్‌కాపి ప్రిపేర్ చేసి పాఠకులకు అందజేసిన సంపాదకవర్గానికి, టెక్నికల్ వర్గానికి, అందరికీ నా కృతజ్ఞతలను తెలియజేసుకుంటున్నాను.

– మద్రి సూర్యనారాయణ
నరసింహనగర్, విశాఖపట్నం

జూన్ నెల వీక్షణంలో రఘురామ కృష్ణరాజుపై రాజద్రోహం కేసులో బర్నబాస్ గారి విశ్లేషణలో కొన్ని అర్థం కాని విషయాలు. రాజు గారి గురించి పార్లమెంట్ సభ్యుడికి విస్తృత అధికారాలు దేశంలో జరిగే సంఘటనలు స్పందించే అధికారం ఉందని అన్నారు. ఆ అధికారాన్ని ఉపయోగించి రాష్ట్రానికి రావలసిన బకాయిలు, కేంద్రం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయించినట్లయితే బాగుండేదని సలహా ఇస్తే బాగుండేది. ఎబిఎన్ ఆంధ్రజ్యోతి ఛానల్ గురించి చాలా పాజిటివ్‌గా రాశారు. అంటే వాళ్లు కావాలని పని కల్పించుకొని డిబేట్ పెట్టడం (యాంత్రికమా) లేక స్వేచ్ఛా. కోవాక్సిన్ తయారు చేసే విషయంలో కులాలను సిఎం ఆపాదించారు అని బర్నబాస్ గారు రాశారు. అది వాస్తవమా, కాదా? అసలు కులాలుగా విభజించే రాజకీయ మూల పురుషుడు ఎవరో ఈ మేధావులకు తెలియదా. కొంచెం విపులంగా వివరిస్తే బాగుండేది. గంటకు లక్షలు తీసుకునే న్యాయ కోవిదులు 12 గంటల్లో సిఐడి నుంచి సుప్రీం వరకు వేగంగా ప్రయాణించిన రాజు గారు దేనికి సంకేతం?

– శేషయ్య
పాలపర్తి, విజయవాడ

వీక్షణం జూన్ సంచిక రెండో దశ లాక్‌డౌన్ కారణంగా ప్రింట్ చేయడం కుదరకపోయినా సమయానికి ఆన్‌లైన్‌లో తీసుకువచ్చినందుకు కృతజ్ఞతలు. రెండవ దశ కరోనా వ్యాపిస్తున్న ఇలాంటి సమయంలో జూన్ సంచికలో కరోనాపై ఏకంగా ఎనిమిది వ్యాసాలు ప్రచురించడం అభినందనీయం. కరోనా సాకుతో పాలకులు అనుసరిస్తున్న అనేక తప్పుడు విధానాలను, వాక్సిన్ విషయంలో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్యపూరిత విధానాలను ఈ ఎనిమిది వ్యాసాలలో రచయితలు చాలా చక్కగా వివరించారు. కరోనా విషయంలో శాస్త్రజ్ఞులు, వైద్య నిపుణులు ప్రభుత్వాలకు ముందు జాగ్రత్తలు తీసుకోమని ఎన్ని సార్లు చెప్పిన వాటిని నిర్లక్ష్యం చేయడమే కాకుండా, తమ రాజకీయ మనుగడ కోసం వాటిని పాటించకుండా నిర్లక్ష్యం చేశాయి. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలలో తమ ఉనికిని నిలుపుకోవడానికి ఎన్నికలు నిర్వహించి సభలు, ర్యాలీలు నిర్వహించి, కుంభమేళాలకు అనుమతులిచ్చి, అనేక తప్పుడు విధానాలను అనుసరించి ఇంకా కరోనా వ్యాపించడానికి కారణమయ్యింది. ఇలాంటి పరిస్థితుల్లో ముందు జాగ్రత్తలు తీసుకొని దేశ ప్రజలను కాపాల్సింది పోయి, తమ ఓట్ల రాజకీయాల కోసం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం విచారకరం. మళ్లీ మూడవ దశ కొవిడ్ మూలంగా లాక్‌డౌన్ ప్రకటించి ఇప్పటికే కోలుకోలేని స్థితిలో ఉన్న సామాన్య ప్రజల జీవితాలను మరోసారి ప్రమాదంలో పడేసే పరిస్థితి ఉన్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను ఎప్పటికీ మోసం చేస్తూనే ఉంటాయి. పాలకుల తప్పుడు విధానాలను ఎప్పటికప్పుడు వీక్షణంలో వ్యాసాల రూపంలో తెస్తున్నందుకు ఎడిటోరియల్ కలెక్టివ్ వారికి ధన్యవాదాలు.

– కృష్ణహరి
మహబూబ్‌నగర్

వీక్షణం ఏప్రిల్ 2021 సంచికలో మయన్మార్‌లో సైనిక పాలక బీభత్సం గురించి రాస్తూ 'మయన్మార్ భద్రతా సిబ్బంది, పోలీసులు కొంతమంది సైనిక చర్యలను భరించలేక, వాటిని ఆచరణలో పెట్టలేక, తమ సొంత ప్రజలపై (మిగతాది 8వ పేజీలో)

కోవిడ్ వల్ల పత్రికలలో సాధారణ వార్తలు రావడం లేదు గనుక అసహజ మరణాల సూచి సమగ్రంగా తయారు చేయడం సాధ్యం కావడం లేదు. కొద్దికాలంగా అసహజ మరణాల సూచి వేయలేకపోతున్నందుకు చింతిస్తున్నాం. సం.

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; వరంగల్ – ఓరగంటి ఎల్లయ్య

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ

దొంగ లెక్కల, అబద్ధాల ప్రభుత్వాలు

దేశంలో మార్చ్ 2021 నాటికి, అంటే కొవిడ్ రెండో అల మొదలయ్యే నాటికి గడిచిన ఏడాదిలో కొవిడ్ వల్ల 1,62,000 మంది చనిపోయారని, అప్పటి నుంచి జూన్ 27 నాటికి మూడు నెలల కాలంలో అంతకన్న చాల ఎక్కువగా 2,33,780 మంది మృత్యువాత పడ్డారని, మొత్తంగా 3,95,780 మరణాలు సంభవించాయని ప్రభుత్వం చెపుతున్నది. వ్యక్తులుగా ఎవరైనా ఇటువంటి భారీ అంకెల నిజానిజాలను, విశ్వసనీయతను గుర్తించడం సాధ్యం కాదు. ఏ ఒక్కరూ సొంత అనుభవంతో ఈ అంకెలు గ్రహించడానికి వీలులేదు. దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల నుంచి అనేక స్థాయిల ప్రభుత్వ సంస్థలు పోగుచేసిన సమాచారం ఒక అంకె రూపంలో వెలువడినప్పుడు, అది కూడ అధికారికంగా ప్రభుత్వం ప్రకటించినప్పుడు ఆ అంకెను నమ్మడం తప్ప గత్యంతరం లేదు. ఇతర అనేక విషయాలలో ప్రభుత్వాలను ప్రశ్నించేవారు కూడ ప్రభుత్వ గణాంకాలను ప్రశ్నించలేరు. అవి నమ్మలేకుండా ఉన్నాయని అనుకున్నా, వాటి స్థానంలో విశ్వసనీయమైన సమాచారం సేకరించే అవకాశం వ్యక్తులకు, సంస్థలకు లేదు.

భారత ప్రభుత్వం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఎంత ఘోరమైన అబద్ధాలు ఆడుతాయో, ఎటువంటి దొంగలెక్కలు ప్రచారం చేస్తాయో ఈ కొవిడ్ మరణాల లెక్కలు సాక్ష్యం చెపుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా సరిగ్గా ఎన్ని మరణాలు సంభవించాయో, ప్రభుత్వం చెప్పిన అంకె కన్న వాస్తవమైన అంకె ఏమిటో చెప్పగలిగిన పరిస్థితి లేకపోవచ్చు గాని ప్రభుత్వాలు అబద్ధాలు చెపుతున్నాయనే వాస్తవం మాత్రం చాల మందికి తెలిసి వచ్చింది. ఒకానొక జిల్లా కేంద్రంలో కుటుంబ సభ్యులొకరి అంత్యక్రియలకు వెళ్లిన వారు, కొవిడ్ మృతులకు ప్రత్యేకించిన ఆ శ్మశానంలో తమకంటే ముందు 29 శవదహనాలు జరిగాయని, తమ తర్వాత మరొక ఐదు శవాలు క్యూలో ఉన్నాయనే వాస్తవాన్ని మర్నాడు రాష్ట్రం మొత్తానికీ ముందురోజు మరణాల సంఖ్య 19 అనే ప్రభుత్వ ప్రకటనతో పోల్చిచూసి ఆశ్చర్యపోయారు. ఇటువంటి అనుభవం రాష్ట్రంలోనూ, దేశంలోనూ ఎంతో మందికి కలిగి ప్రభుత్వ అబద్ధాల స్వభావం తేటతెల్లమయింది.

అలాగే భారత కొవిడ్ మరణాల అంకెల నిజానిజాలను పరిశీలిస్తూ న్యూయార్క్ టైమ్స్ ప్రచురించిన ఒక వార్తా విశ్లేషణా వ్యాసం భారత ప్రభుత్వ అబద్ధాలను తుత్తునియలు చేసింది. అమెరికా ప్రభుత్వం ఆరు లక్షల మరణాలను ప్రకటించగా వాస్తవంగా తొమ్మిది లక్షల మరణాలు సంభవించాయని తేలింది గనుక, అన్ని దేశాల ప్రభుత్వాలు విడుదల చేసిన అంకెల కన్న వాస్తవ మరణాల సంఖ్య రెట్టింపు ఉండవచ్చునని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేసింది గనుక భారత ప్రభుత్వ గణాంకాలను కూడ విశ్లేషించాలని న్యూయార్క్ టైమ్స్ ప్రయత్నించింది. 2.69 కోట్ల మందికి కరోనా సోకిందని, 3,07,000 మంది మరణించారని మే 24 నాటికి ప్రభుత్వం విడుదల చేసిన అంకెలను పునాదిగా పెట్టుకుని, నిపుణుల బృందంతో విశ్లేషణ జరిపి, ఈ అంకెలు చాల తగ్గించి చెప్పినవనీ, మూడు రకాల స్థితి ఉండవచ్చునని న్యూయార్క్ టైమ్స్ అంచనా వేసింది. మొదటిది, ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్పిన "మితవాద" అంచనా. దాని ప్రకారం, కరోనా సోకినవారు నలభై కోట్లు, మరణించినవారు ఆరు లక్షలు ఉండవచ్చు. రెండోది, "ఎక్కువ సంభావ్యమైన" అంచనా. దాని ప్రకారం నలభై కోట్ల మందికి కరోనా సోకి ఉండవచ్చు, పదహారు లక్షల మంది మరణించి ఉండవచ్చు. మూడోది, "దారుణమైన" అంచనా. దాని ప్రకారం యాభై నాలుగు కోట్ల మందికి కరోనా సోకి, 42 లక్షల మంది మరణించి ఉండవచ్చు. ఈ మూడు అంచనాలలో రెండో అంచనా వాస్తవానికి దగ్గరగా ఉండవచ్చునని పరిశీలకులు అంటున్నారు. ఏది నిజమైనా ప్రభుత్వం అబద్ధాలు చెప్పిందనేదే నిజం. ఒక్క హైదరాబాద్ లోనే ప్రభుత్వ ప్రకటన కన్న పది రెట్ల ఎక్కువ మరణాలు జరిగాయని వార్తలు వెలువడ్డాయి.

అయితే ప్రభుత్వ గణాంకాలను పవిత్రమైనవిగా భావించి వాటిమీద ఆధారపడి పరిశోధనలు చేసే, సిద్ధాంత పత్రాలు రాసే సామాజిక శాస్త్రవేత్తల కన్న ఎక్కువగా ఈ అబద్ధాల గురించి సమాజానికీ తెలుసు, వ్యవస్థా నిర్వాహకులకూ తెలుసు. భారత ఆర్థిక గణాంకాల గురించి చాల అవగాహన ఉండడానికి అవకాశం ఉన్న, రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ గా, ప్రధానమంత్రిగా పనిచేసిన డా. మన్మోహన్ సింగ్ ఒక సందర్భంలో భారత గణాంకాల నాణ్యత హీనంగా ఉన్నదని వ్యాఖ్యానించారు. సమాజానికి సంబంధించిన సమస్త సమాచారం సేకరించడానికి సర్వాధికారాలూ, వనరులూ, అవకాశాలూ ఉన్న ప్రభుత్వాలకు ఆ సమాచారం మీద గుత్తాధిపత్యం ఉండడంవల్ల అబద్ధానికి అవకాశం సహజమే. కేంద్ర ప్రభుత్వమైనా, రాష్ట్ర ప్రభుత్వాలైనా తమ పరిధిలోపలి అనేక సామాజిక, రాజకీయార్థిక అంశాల మీద సమాచారం సేకరించడానికి ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నాయి, లేదా తాత్కాలిక అవసరాల కోసం ప్రభుత్వోద్యోగులనో, ఇతరులనో నియమించి సమాచార సేకరణ చేస్తాయి. ప్రతి సామాజిక సన్నివేశాన్నీ గణాంకాలలో, పట్టికలలో, క్లుప్తమైన నిర్ధారణలలో క్రోడీకరించడం వలస పాలన నేర్పిపోయిన పద్ధతి. 1947 తర్వాత కూడ యథాతథంగా కొనసాగుతున్నది. విధాన నిర్ణయాలు చేయడానికి, ప్రజోపయోగకరమైన కార్యక్రమాల రూపకల్పనకు, ప్రజా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు రూపొందించి అమలు చేయడానికి అవసరమైన వనరుగా ఈ సమాచార సంపద ఉపయోగపడుతుందని సైద్ధాంతిక సమర్థన ఉంటుంది. తమదగ్గర పోగుపడిన గణాంక సమాచార సంపదను ప్రభుత్వ శాఖలు ఆయా అవసరాల మేరకు, ఆయా సందర్భాలలో విడుదల చేస్తాయి. ఆ గణాంకాలే వార్తాపత్రికలలో, ప్రభుత్వ శాఖలు ప్రచురించే నివేదికలలో వెలువడి సమాజం దృష్టికి వస్తాయి. కాని వాటి వెనుక ఇన్ని అబద్ధాలూ, ఇంత మాయా ఉందంటే ఈ పాలనే, ఈ ప్రభుత్వాలే అబద్ధాల మీద ఆధారపడిన పేకమేడలని తేటతెల్లమవుతుంది. ఈ పాలక వ్యవస్థలు ప్రజలకేదో మేలు చేయడం అలా ఉంచి, ప్రజలకు అవసరమైన, తాము మాత్రమే చెప్పగల వాస్తవాలను చెప్పే కనీస బాధ్యతతో కూడ లేవని ఈ అబద్ధాలు రుజువు చేస్తున్నాయి. ఈ అంకెల అబద్ధాల ద్వారానైనా ఈ పాలకులకు సమాజాన్ని పాలించే అర్హతా యోగ్యతా లేవని గుర్తించవలసి ఉంది. వీ

సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

అబ్బ, దొర పోకడ మారినట్టున్నదిలే!

తెలంగాణోల్లమే గంత, ఉబ్బుచ్చులోల్లం. కుదుమంటె పండుగనుకుంటం. ఎకాఎకిన దొర గడి తలుపులు దీసిండట. ఏడేండ్లు మొఖం జూడనోల్లను పిలిశి పీటేశి కూసోబెట్టి బువ్వ పెట్టిండట. ఇగె పాయె. అబ్బ దొర పోకడ మారింది అని తాలాలు గొట్టుడు షురు జేసిరి. అయ్యా దొరా, చక్రం పురాగ దిరిగినట్టున్నది గద. గిట్లెట్లాయె బాంచెన్, నమ్మబుద్ధయిత లేదు. గిచ్చుకోని చూశిన. పొద్దు తూర్పుల ఎల్లిందా పడమట్ల ఎల్లిందా అని చూశిన. ఇటు ముండ్ల కంచెల మీద ముండ్ల కంచెలు గట్టుకున్న పట్నం గడీలనో, అటు మనిశి గనబడని ఎర్రవల్లి గడీలనో ఉండే మారాజు జనంలకు వచ్చుడు మొదలైంది. నివద్దె, ఎన్నడన్న జనమే రాజు దగ్గరికి బోవాలె, సబ్బండవర్ణాల పేదసాదలే దొర గడీకి బోవాలె, లోపటి నుంచి పిలుపొస్తె చెప్పులు ఇప్పి, పబ్బతి బట్టుకోని పోవాలె గని, రాజులు, దొరలు ఊళ్లెకొస్తరా? బంతి బోయినంల కూకుంటరా? కని అంత తారుమారు అయిపోయింది. దొరే పోను గిలాసల సర్పంచ్ సాబును పిలిశిండు. ఊళ్లెకొస్తనన్నడు. బంతి బోయినంల కూకుంటనన్నడు. గంతేనా, మాల మరియమ్మను గొట్టి సంపిన పోలీసుల మీద అగ్గి గుగ్గిలమైండు. మరియమ్మకు అన్యాలం జరిగింది అని కాంగ్రెసోల్లు ఫిర్యాదు జేస్తమంటె గడిలకు రానిచ్చిండు. వాల్లిచ్చిన కమ్మ దీస్కున్నడు. నా రాజ్జెంల మాలోల్ల మీద, మాదిగోల్ల మీద గింత అన్యాలమా, ఊకుంటనా అని రంకెలేసిండు. అక్కడితోటి ఆగలే. అన్ని పాల్టిలోల్లను బిలిశి కూసోబెడ్తనన్నడు. ఏడేండ్లు ఎంత అర్జీజు గోస బెట్టినా కలవనోడు, ఎంతెంత దండి మాత్కార్యాలు జరిగినా అటు దిక్కు తిరిగి సూడనోడు, ఇయాల అన్ని పాల్టిలోల్లను బిలిశి మాల, మాదిగలకు ఏం జెయ్యాల్నో జెప్పుండ్రి, అన్ని జేశి పారేద్దాం అంటండు. ఇంకొగ దిక్కు పొరుగోల్ల మీద ఒంటి కాలు మీద లేశి నీల్ల దొంగతనం అని మాట్లాడ్తండు. అటు మల్లొకపారి తెలంగాణ ఉబ్బుచ్చులు లేపాలె, ఇటు ఎన్నడు లేనిది, మనసుల లేనిది, మాల మాదిగల మీద, సబ్బండవర్ణాల మీద నెనరు జూపాలె. అవ్వల్ దర్జగున్నది దొర ఇక్మతి. తెలంగాణ కోసం కొట్లాడెటప్పుడు, తెలంగాణ రాంగనె మాల మాదిగలకు ముక్కె మంతిరి అనె. గద్దె మీద ఎక్కంగనె అది పక్కన బెట్టె. మాల మాదిగలకు ఇంటికి మూడెకరాలు ఇస్తననె. అది మర్శి పాయె. తాతల నాటి నుంచి మాల మాదిగలు సాగు చేసుకుంటున్న భూమి గుంజుకోవట్టె. ఇగ ఏడేండ్లుగ ఎంతమంది మాల మాదిగల మీద మరియమ్మ తీర్గ అన్యాలం జరిగిందో లెక్కే లేకపాయె. పట్నంల పెద్ద బడిల ఉరి బెట్టుకోని సచ్చిపోయిన పిల్లగాడైతేంది, పావురపడ్డ పిల్లను పెండ్లి జేసుకున్నందుకు పానాలు పోగొట్టుకున్న మిర్యాలగూడెం, మంథని పడుసు పోరగాండ్లైతేంది, ఉశికె లారీలు జర సూస్కోని నడుపాలె, మన్సుల మీద నడుపొద్దన్నందుకు ఈపులు పలగ్గొట్టిచ్చుకోని, కేసుల్లబడి, జైల్ల అరిగోస పడ్డ నేరెళ్ల పిల్లగాండ్లయితేంది, ఎన్ని కతలున్నయి. దొరవారు ఎన్నడన్న గిటు దిక్కు జూస్తిరా? ఊ అంటిరా ఆ అంటిరా? గిప్పుడు అచానక్ గింత నెనరు ఎట్ల బుట్టెనో? మల్ల ఓట్ల పండుగ ఏమన్న ఒస్తాందా ఏంది?

వీ

సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్

ప్రజల మీద అదనపు పన్నుల భారం


ఆస్తుల మీద, నివాస భవనాల మీద పన్ను పెంచాలని, చెత్త సేకరణ మీద పన్ను విధించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెలువడిన సందర్భం రీత్యానైనా, ప్రజలందరి మీద, ప్రధానంగా మధ్యతరగతి మీద వేయనున్న భారం రీత్యానైనా, విస్తృత ప్రజా చర్చ లేకుండా అమలు చేస్తున్న పద్ధతి రీత్యానైనా తీవ్రంగా వ్యతిరేకించవలసినది. ఈ నిర్ణయాన్ని ఇప్పటికే ప్రతిపక్ష పార్టీలు మొక్కుబడిగా వ్యతిరేకిస్తున్నాయి గాని, ఈ భారాన్ని మోయవలసి ఉన్న ప్రజల దగ్గరికి సమస్యను తీసుకువెళ్లి విశాల ప్రజా ఆందోళన నిర్మించే పనికి పూనుకోవలసే ఉంది. విశాఖపట్నం పురపాలక సంస్థ సమావేశంలో గందరగోళం కూడ జరిగింది గాని అది ప్రతిపక్ష కార్పొరేటర్ల సమస్యగానే మిగిలిపోయింది. ప్రభుత్వ నిర్ణయం వల్ల నివాసభవనాల మీద ఆస్తి పన్ను హఠాత్తుగా 15 శాతం పెరుగుతుంది. ఈ పెరుగుదల ఏటేటా ఉంటుంది గనుక నాలుగైదేళ్లలో ఇప్పుడు చెల్లిస్తున్న పన్నుకు రెట్టింపు చెల్లించవలసిన స్థితి వస్తుంది. నివాస భవనాల మీద పన్ను పెరిగినందువల్ల దాని ప్రభావం ఇళ్ల అద్దెల మీద, చిన్న వ్యాపారాల మీద పడుతుంది. మరొకవైపు పురపాలక సంస్థలు తమ బాధ్యతగా చేయవలసిన పారిశుధ్య కార్యక్రమాలకు, వ్యర్థపదార్థాల సేకరణకు, చెత్త సేకరణకు ప్రజల మీద పన్ను వేయాలని కూడ ప్రభుత్వం నిర్ణయించింది. ఇంత తీవ్రమైన నిర్ణయాలను ప్రకటిస్తున్నప్పుడు ఏ అవసరాల కోసం ఆ నిర్ణయాలు తీసుకుంటున్నారో, వాటివల్ల ప్రజలకు ఒనగూరబోయే ప్రయోజనం ఏమిటో పారదర్శకంగా వివరించి ప్రజా ఆమోదం పొందడం ప్రభుత్వ బాధ్యత. కాని అటువంటి పని ఏమీ చెయ్యకుండా, అన్ని పురపాలక సంస్థలూ అధికారపార్టీ చేతిలో ఉన్న స్థితిని దుర్వినియోగం చేస్తూ తీసుకున్న నిర్ణయం ఇది. కరోనా వల్ల సంవత్సరానికి పైగా మధ్యతరగతి, చిరుద్యోగులు, సాధారణ ప్రజానీకం ఉపాధి లేక, జీత భత్యాలు సరిగా అందక, ఆర్థిక వ్యవస్థే కుదేలు అయి ఉన్న పరిస్థితిలో ఈ అదనపు భారం మోపడం మూలిగే నక్క మీద తాటిపండు పడిన చందమే. ఈ పన్నుల పెంపు నిర్ణయానికి వ్యతిరేకత ప్రారంభమైన తర్వాత ప్రభుత్వం వైపునుంచి సాకులూ, సమర్థనలూ మొదలయ్యాయి. పురపాలక సంస్థల నిర్వహణలో సంస్కరణలు ప్రవేశపెట్టాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇచ్చిన ఆదేశాల మేరకే ఈ చర్యలు తీసుకున్నామని అంటున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆయా పురపాలక సంస్థలు రుణాల కోసం ద్రవ్య సంస్థల దగ్గరికి వెళ్లదలచుకుంటే ఈ సంస్కరణలు చేపట్టాలని సూచించింది. అన్ని పురపాలక సంస్థలకూ అసలు రుణం అవసరమే లేకపోవచ్చు. ఆ పేరు చెప్పి అన్ని పట్టణాల ప్రజలనూ ఈ పన్నుపోటుకు బలి చేయడం అన్యాయం. ఇతర రాష్ట్రాలలో పన్నుల విధానాన్ని పరిశీలించి, శాస్త్రీయ పద్ధతిలోనే ఈ పన్ను ప్రవేశపెట్టామని సంబంధిత మంత్రి అన్నారు. పట్టణ స్వపరిపాలన సంస్థలలో ప్రతి ఒక్కటీ ప్రత్యేకమైనది, మరొక రాష్ట్రమో, మరొక పట్టణమో ఒక సూచికగా ఉండవచ్చు గాని పులిని చూసి నక్క వాతలు పెట్టుకోనక్కరలేదు. ఇంత చేసీ, ఇది పెద్ద భారం కాదని చెప్పడానికి, ఈ కొత్త పన్నుల విధానం వల్ల అదనపు రాబడి కేవలం రు. 186 కోట్లు మాత్రమేనని మంత్రి అంటున్నారు. మరి ఆ మాత్రానికి మొత్తం రాష్ట్రపు పన్నుల విధానాన్ని మార్చనక్కర లేదు. రాష్ట్ర ఖజానాకు ఆ రు. 186 కోట్లు అదనంగా సంపాదించడానికి లక్షలాది పట్టణ ప్రజల మీద ఈ భారం వేసే బదులు ఇతర మార్గాలు అన్వేషించవచ్చు.

వీ

జి-7 దేశాల తాజా భౌగోళిక రాజకీయాలు

- నర్సింహారెడ్డి

ఏడు సంపన్న దేశాల కూటమి జి-7 అధినేతలు జూన్ 11-13 తేదీలలో బ్రిటన్‌లోని కార్న్‌వాల్ కార్బిస్ బే సాగర తీర రిసార్టులో సమావేశం అయ్యారు. కొవిడ్ కారణంగా ఈ నేతలు రెండేళ్ల తర్వాత స్వయంగా ముఖాముఖి సమావేశానికి హాజరయ్యారు. జి-7లో కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, ఇటలీ, బ్రిటన్, అమెరికాలకు సభ్యత్వం ఉన్నది. ప్రచ్ఛన్న యుద్ధం నాటి మనస్తత్వంతో ఉన్న జి-7 కూటమికి దూరంగా ఉండాల్సిన భారత్, ఆస్ట్రేలియా, ద.కొరియా, దక్షిణాఫ్రికా దేశాధినేతలు అతిథులుగా హాజరయ్యారు. ఈ భేటీ వల్ల ప్రపంచ సంపన్నులకు మేలు జరుగుతుందేగాని సామాన్య ప్రజానికానీకి అంతగా ఒరిగేదేమీ ఉండదు. జి-7 నిర్ణయాలు ఎప్పుడూ ఆ దేశాల వ్యాపార దిగ్గజాలకు మార్కెట్లను అన్వేషించడమే పనిగా ఉంటుంది. ట్రంప్ మాదిరిగా రుసరుస లాడకుండా అంతర్జాతీయ సమస్యలపై అందరిలో ఒకరై కలుపుకొనిపోయే వైఖరిని బైడెన్ ప్రదర్శించడం గమనించవలసిన విషయం. జి-7 నాలుగున్నర దశాబ్దాలుగా ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యసంస్థ, ప్రపంచ వాణిజ్య సంస్థల ద్వారా ప్రపంచ దేశాలను శాసిస్తోంది. ఇవి ప్రజల సమస్యలైన కొవిడ్ కట్టడి, ఉపాధి సృష్టి, పేదరికం నివారణ, విద్య, వైద్యం, పర్యావరణ రక్షణ వంటి ప్రజా సమస్యలపై కార్చే కన్నీళ్లు నిజమైనవి కావు. అవి ముమ్మాటికి మొసలి కన్నీళ్లే. మిత్ర పక్షాల దన్నుతో అమెరికాను తిరిగి మార్గదర్శక పాత్రలో నిలబెట్టాలన్నది బైడెన్ సంకల్పమైతే అగ్రరాజ్యానికి అనుచరులం కాము, భాగస్వాములమన్నది ఐరోపా దేశాల నవీన దృక్పథం. వాణిజ్య ప్రయోజనాలే ప్రపంచ రాజకీయాలను శాసిస్తున్న తరుణంలో కార్బిస్ బే ప్రకటన ఎలా అమలు కానున్నదన్నదే ఆసక్తికరం. ఏడు ఖండాలపై ఏడు దేశాల ఆధిపత్యం చెల్లదంటూ జి-7 సమావేశంపై చైనా రుసరుసలాడింది. వర్ధమాన దేశాల వనరులు దోచుకోవడానికి పోటీపడే, యుద్ధాలకైతే క్షణం ఆగకుండా పరుగులు తీసే జి-7 దేశాలు కొవిడ్ నియంత్రణ పట్ల ఉదాసీనంగా ఉన్నాయి. ప్రజల ప్రాణాలను కబళిస్తుంటే 1100 కోట్ల డోసుల టీకాలు అవసరమైతే ఏడాది కాలంలో 100 కోట్ల మేరకు విదిలిస్తామన్న జి-7 వితరణ పైనా విమర్శలు రేగుతున్నాయి. అలాగే వాతావరణ మార్పులకు కారణమవుతున్న కర్బన ఉద్గారాలు నియంత్రించడానికి 2050 వరకు గడువు విధించుకోవడం హాస్యాస్పదం. జి-7 వైఖరికి నిరసనగా కార్న్‌వాల్‌లో భారీ నిరసనలు చోటు చేసుకున్నాయి. పాలస్తీనా, మయన్మార్, వాక్సిన్ రాజకీయాలు, వాతావరణ మార్పులపై సంపన్న దేశాల వైఖరిని ఖండించారు. సంపన్న దేశాల శిఖరాగ్ర సదస్సు ముగింపు సందర్భంగా విడుదల చేసిన 25 పేజీల ప్రకటన చైనా కట్టడి చుట్టూనే తిరిగింది. ఒకటి రెండుచోట్ల రష్యాను కూడ టార్గెట్‌గా చేసుకున్నా ప్రధానంగా చైనా మీదనే కేంద్రీకరించింది. ఎనిమిదేళ్ల క్రితం ఆసియా నుంచి ఆఫ్రికా మీదుగా ఐరోపా వరకు డ్రాగన్ దేశ ఆర్థిక రాజకీయ ప్రాబల్యాన్ని విస్తరిస్తున్న బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్(బి.ఆర్.ఐ) ప్రాజెక్టుకు పోటీగా బి-3 డబ్ల్యు (బిల్డ్ బ్యాక్ బెటర్ వరల్డ్)ను తెరపైకి తెచ్చింది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 40 లక్షల కోట్ల డాలర్ల మేరకు మౌలిక వసతుల కొరతకు పరిష్కారం చూపిస్తామంటున్నారు. చైనాతో జి-7 దేశాల మధ్య విభేదాలు అలానే ఉన్నాయి. దౌత్య మార్గంలో పరిష్కరించుకోవాలని ఇటలీ, ఫ్రాన్స్‌లు స్పష్టం చేశాయి. ఇక రష్యా విషయంలో అమెరికా వైఖరిని జర్మనీ వ్యతిరేకిస్తున్నది. ఎందుకంటే జర్మనీ రష్యన్ గ్యాస్ పై ఆధారపడి ఉంది. సరికొత్త కూటములు ప్రపంచం నడినెత్తిన ఉరుముతున్న వేళ అందరి సంస్థగా ప్రపంచ శాంతి కోసం ఐరాసను ప్రజాస్వామీకరిస్తేనే మానవాళి భవితకు భరోసా. వీ



దాడులు, కాల్పులు చేయలేక తమ దేశాన్ని విడిచి పొరుగు దేశాలకు వలస వెళ్లి తలదాచుకుంటున్నారు. భారత ఈశాన్య రాష్ట్రాలు మిజోరాం, మణిపూర్‌లకు శరణార్థులుగా తరలివస్తున్నారు' అని రాసిన చోటనైనా మయన్మార్ సైనిక పాలన బీభత్సం పట్ల భారత ప్రభుత్వ వైఖరి, ఆ ప్రభుత్వంతో భారత ప్రభుత్వం సంబంధాల గురించి రచయిత రాస్తాడని ఆశించాను. మన ఇరుగు పొరుగు దేశాలలోని పరిణామాల గురించి రాసేప్పుడు అక్కడి ప్రజలతో చరిత్రలో, వర్తమానంలో మన ప్రజల సంబంధాలేమిటి, ప్రభుత్వాల సంబంధాలేమిటి అనేది రేఖా మాత్రంగా నైనా ప్రస్థావించాలి.

అటువంటి ఇరుగు పొరుగు దేశాల్లో చాల ముఖ్యమైనది నిన్నటి బర్మా, ఇవాల్టి మయన్మార్. ముందు దాని వర్తమాన స్థితి చూద్దాం. భారత ఈశాన్య రాష్ట్రాలు అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరాంలకు మయన్మార్‌తో సుదీర్ఘమైన భౌగోళిక సరిహద్దు ఉంది. మిజొరాం మణిపూర్‌లకు పొరుగున ఉన్న చిన్ రాష్ట్రం నుంచి ఈ సంచిక వెలువడిన కాలానికి 15 వందల మంది జూనియర్ పోలీసు అధికారులు, రచయిత చెప్పిన కారణాల వల్లనే పారిపోయి వచ్చారు.

మన దేశంలో చాల మంది అర్థం చేసుకోవాల్సిన అంశం ఏమిటంటే మయన్మార్‌లోని చిన్‌లో, మిజోరాంలోని మిజోలు, మణిపూర్‌లోని కుకిలకు, వాటి ఉప తెగలకు చారిత్రక సంబంధాలు ఉన్నాయి. అవి జాతి, మత, భాషా పరమైనవి.

ఈ వ్యాసంలో ప్రస్థావించిన 1988 మయన్మార్ విద్యార్థి ఉద్యమంపై సైనిక మారణకాండ తర్వాత ఎందరో చిన్ తెగవారు కూడా మిజోరాం, మణిపూర్‌లకు శరణార్థులుగా వచ్చారు. ఎందరో స్థానిక నాయకులు, ఎన్‌జిఒలు వాళ్లకిక్కడ పునరావాసం కల్పించారు. ఉపాధి కల్పించారు. వాస్తవానికి ఇప్పుడు కూడా అటువంటి చర్యలే చేపట్టాల్సి ఉండింది. కాని కేంద్ర అర్ధ సైనిక బలాలలో ఒకటై రెండు రాష్ట్రాల సరిహద్దులు కాపలా కాస్తున్న అస్సాం రైఫిల్స్ శరణార్థులను అడ్డగిస్తున్నారు. ఈ సందర్భంలో మిజోరాం, మణిపూర్‌లలో ఉన్న బిజెపి అనుకూల ప్రభుత్వాలు కూడా కేంద్ర వైఖరిని సున్నితంగా నిరాకరించక తప్పడం లేదు. మిజొరాం ముఖ్యమంత్రి జొరా ముతంగా ఈ వైఖరిని నిరాకరిస్తూ తన ప్రభుత్వం మయన్మార్ నుంచి తప్పించుకొని వస్తున్న వారిని మానవతా దృక్పథంతో స్వీకరిస్తుందని చెప్పాడు. 'అక్కడి వారి కష్టాల పట్ల మిజోరాం ఉదాసీనంగా ఉండజాలదు. మన ఇంటి వెనుకనే వ్యక్తమవుతున్న మానవ సంక్షోభం పట్ల ఇండియా కళ్లు మూసుకోజాలదు' అని ఆయన ప్రధాన మంత్రికి లేఖ రాశాడు.

కాందిశీకులను సరిహద్దుల దగ్గరే మర్యాదపూర్వకంగా తిప్పి పంపండి అని జిల్లా అధికారులకు మొదట పంపిన ఉత్తర్వులను మణిపూర్ ప్రభుత్వం వెనక్కి తీసుకున్నది.

ఒక్క మాటలో చెప్పాలంటే భారత ప్రభుత్వానికి మయన్మార్ సైనిక పాలన పట్ల రెండు దేశాల ప్రజలకు ఉన్నటువంటి చిత్తశుద్ధితో కూడిన వ్యతిరేకత లేదు. సైనిక ప్రభుత్వం ఇటీవల మార్చ్ 27న నిర్వహించిన తాత్మాడ (సైనిక శక్తి) వార్షికోత్సవంలో భారత ప్రభుత్వం పాల్గొన్నది. మౌలికంగా మన ప్రభుత్వం కూడా అక్కడ కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలనే బలపరుస్తున్నది.

2. మయన్మార్‌లోని రఖీన్ రాష్ట్రంలోని రోహింగ్యాలపై సూకీ కూడా సమర్థించిన సైనిక దాడుల గురించి రోహింగ్యాల దయనీయ స్థితి గురించి రచయిత వివరంగానే రాశారు. కాని అక్కడ కూడా రోహింగ్యాలకు పునరావాసం కల్పించడానికి నిరాకరించిన భారత ప్రభుత్వ వైఖరిని ప్రస్తావించలేదు. రోహింగ్యాలను భారత ప్రభుత్వం కూడా మిలిటెంట్ ముస్లింలుగా చూసి మళ్లీ సైనిక మారణ హోమంలోకే తోసివేసింది. బంగ్లాదేశ్‌లో స్వీకరించబడిన లక్షలాది రోహింగ్యాలు తప్ప మన దేశంలోకి వచ్చిన వారిని శరణార్థులుగా గుర్తించడానికి సుప్రీంకోర్టు కూడా నిరాకరించింది. ఈ విషయంలో ప్రశాంత్ భూషణ్ వంటి న్యాయవాది సుప్రీంకోర్టులో చేసిన న్యాయ పోరాటం రచయిత చూసే ఉంటాడు. 2017లో దేశవ్యాప్తంగానే కాదు హైదరాబాద్‌లో కూడా ప్రజాస్వామిక శక్తులు, ప్రజాస్వామ్యవాదులు, పాత నగరంలోని మైనారిటీ మత సంస్థలు, విద్యార్థి సంస్థలు ప్రదర్శనలు, సభలు నిర్వహించి రోహింగ్యాలకు మన దేశంలో పునరావాసం, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేసిన విషయం రచయితకు తెలిసే ఉంటుంది.

3. బర్మా బ్రిటిష్ సామ్రాజ్యవాద వలసగా ఉన్న రోజుల్లో బ్రిటిష్ వలసగానే ఉన్న భారత ప్రజలకు, పోరాట శక్తులకు బర్మా ఒక ఆశ్రయంగా ఉండేది. ఇంకా బర్మా జపాన్ సామ్రాజ్యవాద అధీనంలో ఉన్న రోజుల్లోనైతే నేతాజీ, సుభాష్ చంద్రబోస్ లాంటి వాళ్లు అక్కడి నుంచి బ్రిటిష్ సామ్రాజ్యంపై జాతీయ సైనిక తిరుగుబాటుకు కూడా ప్రయత్నించారు. ఇది దృష్టిలో పెట్టుకొనే శరత్‌బాబు రాసిన పథేర్ దాది (భారతి) అనే రాజకీయ చారిత్రక నవల గురించి వీక్షణంలో వచ్చిన పరిచయ వ్యాసం కూడా రచయిత చదివే ఉంటారు. అమితవ్ గోష్ వంటి వాళ్ల రచనల్లో బర్మాకు బతకుదెరువు కోసం నౌకా నిర్మాణ రంగం మొదలు హోటళ్ల వరకూ మన దేశంలో నుంచి కార్మికులుగా వెళ్లిన వాళ్ల గురించి, అక్కడ ఒక ప్రభావ శక్తిగా మారిన వైనం గురించి కూడా చాల సాహిత్యం వచ్చింది.

4. తెలుగు ప్రజలకు ముఖ్యంగా రాజమహేంద్రవరం, కాకినాడల నుంచి శ్రీకాకుళం దాకా వలస కార్మికులకు, దళితులకు బర్మా, అందులోనూ రంగూన్ ఒక జీవన రంగం అయింది. వంగపండు పాటల్లో కూడా రంగం వెళ్లిన కార్మికుల ప్రస్తావన వస్తుంది. బొజ్జా తారకం గారు తన తండ్రి బొజ్జా అప్పలస్వామి జీవిత చరిత్రలో ఆయన రంగూన్ బతుకుదెరువుకు వెళ్లి అక్కడ నౌకా నిర్మాణంలో పాల్గొని వడ్రంగం నేర్చుకొని వచ్చి ఇక్కడ ఆ వృత్తి కొనసాగించిన విషయం రాశారు. అంతేకాదు అక్కడ ఆయనకు బెంగాలీ సంపర్కం నుంచి బ్రహ్మ సమాజం, వెళ్లిన వాళ్లలో ఎక్కువ మంది దళితులైనందువల్ల అక్కడ అప్పటికే ఉన్న డా. బాబా సాహెబ్ బి.ఆర్. అంబేద్కర్ ప్రభావం ఆంధ్ర ప్రాంతానికి తెచ్చారు. సి. విజయ లక్ష్మి తదితరులు రాసిన కుసుమ ధర్మన్న జీవితం, తొలి దళిత ఉద్యమం గురించిన పుస్తకాలు అందుబాటులో లేకున్నా ఇటీవలనే వెలువడిన వి. చెంచయ్య గారు రాసిన చరిత్రలో కుసుమ ధర్మన్న బుక్‌లెట్ చదివినా ఆయన కూడా రంగూన్ వెళ్లి అంబేద్కర్ భావజాలంతో ప్రభావితుడై వచ్చిన విషయం తెలుస్తుంది.

చరిత్రలో ఇంతగా సామ్రాజ్యవాదంతో పోరాడిన ప్రజల మధ్యన రెండు దేశాల్లో ఉన్న సంబంధాల దృష్ట్యా కూడా మయన్మార్‌లో పరిణామాలు మన హృదయానికి దగ్గరివి. రోహింగ్యాల పట్ల సూకీతో సహా అక్కడి ప్రభుత్వ వైఖరి, ఇక్కడి ప్రభుత్వ వైఖరి, ప్రజాస్వామ్య శక్తులపై, ప్రజలపై అక్కడి సైనిక ప్రభుత్వం దాడి, దానికి మన ప్రభుత్వ సహకారం గురించి మన పరిశీలనలో మాత్రమే కాదు, బాధిత పీడిత ప్రజాస్వామ్య శక్తులుగా ప్రజలుగా సంఘీభావంతో ప్రతిఘటించాలి.

– వి. సహదేవ్
హైదరాబాద్

ఏడేళ్ల మోడీ పాలనలో దేశం అధోగతి

మోడీ ప్రభుత్వ విధానాలు ప్రజల హక్కులను హరించి తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టి కార్పొరేట్ శక్తులకు బలం చేకూర్చాయని, వీటికి ప్రత్యామ్నాయ ఆర్థిక వ్యవస్థను రూపొందించుకోవాలని అంటున్నారు ఎ. నర్సింహారెడ్డి

కేంద్రంలో నరేంద్ర మోడీ నేతృత్వంలో ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో నడిచే ప్రభుత్వం 2014 మేలో అధికారంలోకి వచ్చింది. 2021 మే నాటికి ఏడు సంవత్సరాలు పూర్తి చేసుకుంది. అచ్చేదిన్(మంచి రోజులు) వస్తాయని ఒకవైపు ప్రభుత్వం బాకాలూదుతుంటే, మరోవైపు ప్రజలు మాత్రం కరోనా వైరస్, ఉపాధి లేమితో చచ్చేదిన్ వచ్చాయని వాపోతున్నా రు. 2014లో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా 'ఆర్థిక వ్యవస్థ అంతా యుపిఎ హయాంలో అస్తవ్యస్తమయింది - ఎదుగుదల లేదు, రూపాయి మారకం విలువ పడిపోయింది, ఎగుమతులు పెరగడం లేదు. పరిశ్రమలకు బ్యాంకులు ఇచ్చిన రుణాలు తిరిగి చెల్లించడం లేదని మోడీని గెలిపిస్తే తన మంత్ర దండంతో ఈ పరిస్థితులన్నీ మార్చేస్తారని' బిజెపి నమ్మబలికింది. భారతదేశం ప్రపంచంలోనే అతి వేగంగా అభివృద్ధి చెందే దేశంగా మారిపోతుందని, డాలర్‌తో రూపాయి మారకం విలువ మెరుగుపడుతుందని, ఎగుమతులు పెరుగుతాయని, విదేశీ స్వదేశీ పెట్టుబడిదారులు దేశానికి ఎగిరివస్తారని, భారతదేశం ఒక పారిశ్రామిక హబ్‌గా మారిపోతుందని చెప్పా రు. ఏటా కోటి మందికి ఉపాధి కల్పన జరుగుతుందని, రైతులు పెట్టిన పెట్టుబడికి రెట్టింపు ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నా రు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో విదేశాల్లో దాగి ఉన్న 70 లక్షల కోట్ల అక్రమ సంపదను దేశానికి తెచ్చి పేదల సేవింగ్ ఖాతాల్లో ఒక్కొక్కరికి 15 లక్షల చొప్పున జమ చేస్తామని గొప్పగా చెప్పా రు.

మోడీ ఏడేళ్ల పాలనను గమనిస్తే సేవింగ్స్ అకౌంట్‌లు లేనివారికి కొత్త ఖాతాలు ఇవ్వడం వరకే పరిమితమైందని అర్థం అవుతున్నది. ఏ ఒక్కరి ఖాతాలో చిల్లి పైసా కూడా జమ కాలేదు. ఇప్పటికీ బిజెపి ప్రభుత్వం మత రాజకీయాలతోనే మనుగడ సాగించాలనుకుంటున్నది. మోడీ ప్రభుత్వ అనుచిత, అనాలోచిత, ఏకపక్ష విధానాలైన పెద్ద నోట్ల రద్దు మొదలుకొని ఎన్నో భారాలను మోయలేక సామాన్య జనం సతమతమవుతున్నా రు. మరోవైపు కరోనా విస్తృతి, కేంద్రం నిర్లక్ష్యం కారణంగా అత్యధిక కుటుంబాల్లోనూ వైరస్ విషాదాన్ని నింపేస్తున్నది. అన్ని రంగాలు మోడీ పాలనలో అధోగతి పాలయ్యాయి. రాజ్యాంగ వ్యవస్థలు స్వతంత్రతను కోల్పోయి ప్రభుత్వ జేబు సంస్థలుగా మారాయి. మొత్తంగా గత ఏడేళ్ల ఎన్‌డిఎ ప్రభుత్వం అనుసరించిన అనాలోచిత అవివేక రాజకీయార్థిక విధానాల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ 40 ఏళ్లు వెనక్కు వెళ్లింది. దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ దేశ విదేశాల్లో అబాసు పాలయ్యింది. అంతర్జాతీయంగా మనదేశ ప్రతిష్ట మసక బారిపోతున్నది. దేశంలో ఆర్థిక అంతరాలు అనూహ్యంగా పెరిగాయి.

మోడీ ప్రభుత్వం గత ఏడేళ్లుగా బడా బూర్జువా వర్గాలకు, కార్పొరేట్లకు ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదులకు పూర్తి విధేయతతో ఊడిగం చేస్తోంది. అదే సమయంలో బ్రాహ్మణీయ హిందూత్వ ఫాసిస్టు తరహా పాలనను సాగిస్తోంది. సంఘ్ పరివార్ మూకలు గో రక్షణ, లవ్ జిహాద్ ఘర్ వాపసి పేరుతో ఆరాచక స్వైర విహారం చేశాయి. ప్రగతి శీల శక్తులపై అక్రమకేసులు, హంతక దాడులు జరిగాయి. భిన్నాభిప్రాయం పట్ల అసహనం పెరిగింది. ప్రజల వేష భాషలను, ఆహార అలవాట్లను, జీవన శైలులను దౌర్జన్య పూరితంగా నియంత్రించడానికి ఆర్ఎస్ఎస్ ప్రజలపై సాంస్కృతిక దాడి చేసింది. ఈ దాడులకు ప్రభుత్వ మద్ధతు ఉండడం శోఛనీయం. మోడీ ప్రభుత్వం ఏడేళ్లుగా చేపట్టిన రాజకీయార్థిక విధానాలు.. ప్రజల మౌలిక సమస్యల పరిష్కారానికి గానీ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు గానీ, రాజ్యాంగం నిర్ధేశించిన మౌలిక భావనలకు గానీ, దేశ ఆర్థిక వ్యవస్థ పురోగమనానికి గానీ తోడ్పడలేదు సరికదా. అవి సమాజంపై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి.

ఈ ఏడేళ్లలో మోడీ ప్రభుత్వం రాష్ట్రాల హక్కులు హరిస్తూ అధికార కేంద్రీకరణకు చర్యలు తీసుకుంది. రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడింది. ప్రణాళిక సంఘం రద్దు చేసి నీతి ఆయోగ్ ఏర్పాటుతో రాష్ట్రాలు ఆర్థిక అవసరాలకు కేంద్రం మీద ఆధారపడే పరిస్థితి పెరిగింది. పెద్దనోట్ల రద్దు, ఆ తర్వాత ఒకే దేశం - ఒకే పన్ను అంటూ తీసుకొచ్చిన వస్తు సేవల పన్ను(జిఎస్‌టి) విధానం ఆర్థిక వ్యవస్థ కుదేలవ్వడానికి తోడ్పడింది. జమ్మూ-కశ్మీర్ విభజన - కేంద్ర పాలిత ప్రాంతాలుగా ప్రకటన, 370 అధికరణ రద్దు, పౌరసత్వ చట్ట సవరణలు రాజ్యాంగ విరుద్ధమైనవి. కార్మిక వ్యతిరేక చట్టాలు కార్మికులను కార్పొరేట్లకు బానిసలుగా మార్చడానికే రూపొందించా రు. వ్యవసాయాన్ని కార్పొరేటు వ్యవసాయంగా మార్చడానికి రైతు వ్యతిరేక చట్టాలు తెచ్చింది. ప్రభుత్వ అనుచిత విధానాల పట్ల వ్యక్తమవుతున్న భిన్నాభిప్రాయాలు, ప్రజా ఆందోళనలను క్రూరంగా అణిచి వేయడానికి ఇప్పటికే అమలులో ఉన్న అప్రజాస్వామిక చట్టాలకు సవరణల పేరుతో మరింత కోరలు తొడిగింది. ఇవేకాక భూసేకరణ చట్ట సవరణ, అటవీ హక్కుల చట్ట సవరణ, ఐటి సవరణలు ఏవి ప్రజాశ్రేయస్సు కొరకు చేసినవి కావు. ఇవన్నీ అధికార కేంద్రీకరణ, ఫాసిస్టు పాలన స్థిరీకరణకు, బహుళ జాతి సంస్థల దోపిడీకి తోడ్పడేవేనన్నది అక్షర సత్యం.

ఏదేని ఒక ప్రభుత్వం పాలన మంచి చెడులను అర్థం చేసుకోవాలంటే మనం కొన్ని ప్రమాణాల (పారా మీటర్స్) ఆధారంగా అంచనా వేయాలి. మోడీ పాలన కాలంలో దేశ స్థూల జాతీయోత్పత్తి పెరుగుతుందా లేక తగ్గుతుందా? ఎగుమతులు, దిగుమతుల్లో మిగులు ఉందా లేదా లోటు ఉందా? దేశంలో ఉపాధి అవకాశాలు

పెరుగుతున్నాయా లేదా క్షీణిస్తున్నాయా? అలాగే పేదల సంఖ్య పెరుగుతుందా లేదా తగ్గుతుందా?. ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందా లేదా తగ్గుతుందా? ద్రవ్యోల్బణం పెరుగుతుందా లేదా తగ్గుతుందా? దేశంలో సంపన్నులకు, పేదలకు మధ్య ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయా లేదా తగ్గుతున్నాయా? ప్రజలందరికి విద్యా, వైద్యం, గృహవసతి, పౌష్టికాహారం, తాగునీరు వంటి సౌలభ్యాలు మెరుగవుతున్నాయా లేదా క్షీణిస్తున్నాయా? డాలర్‌తో రూపాయి మారక విలువ పెరుగుతుందా లేక తరుగుతుందా? అన్న అంశాల ఆధారంగా ప్రభుత్వ పనితీరును అంచనా వేయాలి. పై ప్రమాణాల ఆధారంగా మోడీ పాలనను బేరీజు వేస్తే అన్ని రంగాలలో తిరోగమనం మనకు స్పష్టంగా కనిపిస్తోంది.

పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌర, ప్రజాతంత్ర హక్కుల రక్షణ చాల ప్రామాణికమైన అంశాలుగా భావించాలి. ఐరాస ఏటా విడుదల చేసే మానవాభివృద్ధి సూచీలో మనదేశ స్థానం అట్టడుగున ఉంది. అంతర్జాతీయ సంస్థ ఆక్స్‌ఫామ్ నివేదిక దేశంలో పెరిగిపోతున్న ఆర్థిక అంతరాలను ఎత్తిచూపింది. 'ఫ్రీడం నౌ' అనే స్వతంత్ర సంస్థ దేశంలో ప్రజాస్వామ్యం నియంతృత్వం వైపు పయనిస్తుందని కుండబద్దలు కొట్టినట్టు చెప్పింది. అలాగే విద్యా వైద్యంలో తిరోగమిస్తుందని పేర్కొంది. ప్రపంచ ఆర్థిక వేదిక విడుదల చేసిన నివేదిక దేశంలో లింగ అసమానత హెచ్చుగా ఉందని తెల్పింది, ఆకలి సూచీలో మన దేశం ప్రపంచ దేశాల్లో అట్టడుగు స్థానాల్లో ఉంది. బాలలకు పౌష్టికాహార లోపం, బాలింతలు, గర్భిణీ స్త్రీలు రక్తహీనతతో బాధపడుతున్నా రు. కరోనా విజృంభనతో 60 శాతం ప్రజలు కొనుగోలు శక్తి కోల్పోయారని 'క్యూ' నివేదిక పేర్కొంది.

మోడీ మొదటి ఐదేళ్ల పాలన:

2014 మే 28న నరేంద్రమోడీ ప్రధాని పదవి చేపట్టా రు. బిజెపి కేంద్రంలో అధికారం చేపట్టిన మరుక్షణం నుండే మితవాద, నిరంకుశ, మతతత్వ పాలనను ముందుకు తెచ్చింది. దేశ లౌకిక, ప్రజాతంత్ర వ్యవస్థను చిన్నాభిన్నం చేసింది. రాజ్యాంగ వ్యవస్థలను బలహీనపరిచింది. ప్రజాతంత్ర హక్కులను కాలరాసింది. సామ్రాజ్యవాద అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంచుకుని, జూనియర్ భాగస్వామి పాత్రను పోషిస్తున్నది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను మరింత వేగంగా అమలు చేసింది. నియంతృత్వ పాలనకు రూపకల్పన చేస్తూ పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ప్రతిబంధకాలు ఏర్పరచింది. మోడీ ప్రభుత్వం మొదటి ఐదేళ్ల పాలనలో సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను వేగవంతం చేసే విధంగా విధానాలను రూపొందించింది.

2014 సెప్టెంబర్‌లోనే 'మేక్ ఇన్ ఇండియా', 'మేడ్ ఇన్ ఇండియా' విధాన ప్రకటన జరిగింది. ఇది 'పేరు గొప్ప ఊరు దిబ్బ' లాంటి ప్రణాళిక. భారత్‌లో వస్తూత్పత్తికి విదేశీ నిధులు, విదేశీ సాంకేతికత, స్వదేశీ శ్రమ, స్వదేశీ సహజ వనరులు ఆలంబనగా ఉంటుంది. విదేశీ కార్పొరేట్లు తన పెట్టుబడి, సాంకేతికతో ఒక పరిశ్రమను స్థాపిస్తే మన ప్రభుత్వం నీరు, విద్యుత్తు, ముడిసరుకు చౌకగా అందిస్తే, మన శ్రామికులు శ్రమిస్తే ఉత్పత్తి జరుగుతుంది. ఆ ఉత్పత్తిని యాజమాన్యం ఎక్కడ లాభమొస్తే అక్కడ అమ్ముకుంటుంది. దీనితో మనకొచ్చే ప్రయోజనం ఏమీ లేదు. వనరుల దోపిడీ, శ్రమ దోపిడీ తప్ప! ఇక 'స్టార్టప్ ఇండియా', 'సిల్క్ ఇండియా' అని ఊదరగొట్టడం తప్ప భారతీయులు నూతనంగా స్థాపించిన కంపెనీలు, మన యువత ఉపాధి పొందిన సందర్భాలు చాలా తక్కువేనని చెప్పాలి. మేక్ ఇన్ ఇండియా కోసం భూసేకరణ చట్టాన్ని కార్పొరేట్లకు అనుకూలంగా సవరించింది. అలాగే కార్మిక చట్టాలను పలుచన చేసింది. ఫలితంగా, ప్రైవేటీకరణ పెరిగింది. ప్రజలకు ఒరిగింది మాత్రం శూన్యం.

మోడీ అనుచిత, అనాలోచిత విధానాలు:

2016 నవంబర్ 8న పెద్దనోట్లను రద్దు చేసింది. ఫలితంగా రు. 15.41 లక్షల కోట్ల విలువ కలిగిన కరెన్సీని చలామణి నుండి ఉపసంహరించినట్లైంది. చలామణిలో ఉన్న కరెన్సీలో రద్దుచేయబడిన కరెన్సీ విలువ 86 శాతం వరకు ఉన్నది. రద్దు చేయడానికి కారణాలుగా అవినీతి అరికట్టబడుతుందని, నకిలీ నోట్ల చలామణిని నిరోధిస్తుందని, తీవ్రవాదాన్ని అడ్డుకుంటుందని పేర్కొన్నది. పెద్దనోట్ల రద్దుతో ద్రవ్య సరఫరా లేక ప్రజలు నానా బాధలు పడ్డా రు. నిజానికి, దీని వెనుక అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు ఉన్నాయి. నగదురహిత చలామణిని పెంచాలన్నది వాటి లక్ష్యం. మొత్తం రద్దు చేయబడిన పెద్ద నోట్లలో 99.3 శాతం తిరిగి బ్యాంకులకు చేరింది. అంటే, బ్యాంకులకు వచ్చింది రు. 15.3 లక్షల కోట్లు, బ్యాంకులకు తిరిగి చేరని మొత్తం కేవలం రు. 10,720 కోట్లు మాత్రమే. నోట్ల రద్దు వలన మనదేశపు చీకటి వ్యాపారులు పన్నుల ఎగవేత ద్వారా అక్రమంగా దాచిపెట్టుకున్న కరెన్సీ బ్యాంకులకు చేరి సక్రమ కరెన్సీగా మారిపోయింది. మొత్తంగా విదేశీ ద్రవ్య సంస్థల వ్యాపారానికి, స్వదేశీ కార్పొరేట్ల అక్రమ సంపాదనకు సాధికారత కల్పించినట్లైనది. చిన్న పరిశ్రమలు, వ్యాపారాలు మూతపడి కోట్లాది ప్రజలు తల్లడిల్లిపోయా రు.

నోట్లరద్దు వల్ల ప్రకటిత లక్ష్యాలలో ఏ ఒక్కటి సాధ్యం కాలేదు. కానీ ప్రజల ఉపాధి పోయి వారి కొనుగోలు శక్తి సన్నగిల్లి మార్కెట్ కుదేలయింది. మార్కెట్ కుదేలవడంతో పరిశ్రమలు మూతపడి ఉత్పత్తి పడిపోయింది. అంతిమంగా మన దేశ స్థూల జాతీయోత్పత్తి(జిడిపి) పతనం అయ్యింది. ఇది మోడీ తుగ్లక్ చర్యగా చరిత్రలో నిలిచిపోయింది. కేంద్రం జిఎస్‌టి విధానాన్ని 2017 జూలై 1 నుంచి అమలులోకి తెచ్చింది. దీనితో రాష్ట్రాలు పన్ను విధించే హక్కులు కోల్పోయాయి. ఇది సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాల అమలులో భాగమే. కార్పొరేట్లకు విశాల మార్కెట్‌ను ఏర్పాటు చేయడం దీని లక్ష్యం. ఐతే, మన దేశపు ఫెడరల్ విధాన వ్యవస్థ బలహీనపడింది. వస్తు సేవల పన్ను(జిఎస్‌టి) సామాన్య ప్రజలపై, చిన్న పరిశ్రమలపై, వర్తకులపై, అసంఘటితరంగ వృత్తులపై అదనపు భారాలు మోపింది. ఉద్యోగాలు పోయాయి. అనేక వస్తువులు, సేవల ధరలు పెరిగిపోయాయి. నేటి ఆర్థిక వ్యవస్థ సంక్షోభ మూలాలు పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టి విధానాలలో ఉన్నాయి.

రెండవసారి మోడీ ప్రభుత్వం:

2019 మేలో రెండవసారి ప్రధానిగా మోడీ బాధ్యతలు చేపట్టారు. గత ఐదు సంవత్సరాలలో (2014-2019) మోడీ ప్రభుత్వం అమలుచేసిన ప్రజా వ్యతిరేక, విష, విద్వేష రాజకీయాలను మరింత దూకుడుగా కొనసాగించడానికి ప్రజామోదం లభించిందన్న ఉత్సాహం, తలబిరుసు పెరిగింది. హింసకు, అసమానతలకు, అంతరాలకు ఆలవాలమైన పరివార్ శక్తులు రెచ్చిపోయాయి. బ్రాహ్మణీయ హిందూత్వ ఫాసిస్టు ప్రభుత్వాన్ని కూలదోయాలని, సమభావం

పునాదిగా ఆర్థిక, సాంఘిక, రాజకీయ న్యాయాన్ని నిర్మించాలని ఆకాంక్షించే సమూహాలు అన్నింటినీ అణచివేయాలన్న దృఢ సంకల్పంతో రాజ్యం వ్యవహరిస్తోంది. వ్యక్తి స్వేచ్ఛను, వాక్-సభా స్వాతంత్ర్యాలను, పత్రికా స్వేచ్ఛను లక్ష్యంగా చేసుకుంది. ప్రజాస్వామ్యమన్నా, రాజ్యాంగమన్నా, సమాఖ్య విధానం(ఫెడరల్ విధానం) అన్నా మోడీ ప్రభుత్వం తిరస్కరిస్తున్నది. అదే సమయంలో లౌకిక, ప్రజాతంత్ర, అభ్యుదయ, ప్రజానుకూల శక్తులను ఉక్కుపాదంతో అణచివేస్తున్నది.

కుదేలైన ఆర్థిక వ్యవస్థ:

2021-22 ఆర్థిక సంవత్సరంలో దేశం పదకొండు శాతం వృద్ధి రేటు సాధించబోతున్నదంటూ మోడీ ప్రభుత్వం సాగించిన ప్రచారంలోని డొల్లతనం బయటపడింది. 2020-2021 ఆర్థిక సంవత్సరంలో స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) వృద్ధిరేటు గత నాలుగు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంత అథోగతికి చేరిందనడానికి ప్రభుత్వ తాజా గణాంకాలే సాక్ష్యం. గత ఆర్థిక సంవత్సరం వృద్ధిరేటు మైనస్ 7.3 శాతానికి పడిపోయింది. 1964-65లో సుమారు 3 శాతం, 1979-80లో 5 శాతం తగ్గితే, ఇప్పుడు ఏకంగా 7.3 శాతం తగ్గింది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరించిన ఆర్థిక దివాళాకోరు విధానాలు, కొవిడ్ సంక్షోభ సమయంలో దాని అసమర్థ నిర్వాకం ఆర్థిక వ్యవస్థ పాలిట పెను శాపంగా మారాయి. 2014-15లో మోడీ అధికారం చేపట్టే నాటికి 7.4 శాతంగా ఉన్న జిడిపి వృద్ధి రేటు ఇప్పుడు మైనస్ 7.3 శాతానికి పడిపోయింది. ప్రపంచంలో ఏ ఇతర వర్ధమాన దేశంలోనూ జిడిపి మన దేశంలో మాదిరిగా ఇంత దారుణంగా పడిపోలేదు. మితవాద మోడీ ప్రభుత్వం అనుసరించిన మతిమాలిన విధానాలే ఈ ఘోర వైఫల్యానికి కారణం.

కరోనా నియంత్రణలో వైఫల్యం వల్ల మే 15 నాటికి 25 శాతం కార్మికులు ఉపాధి కోల్పోయా రు. నిరుద్యోగిత 14.5 శాతానికి పెరిగింది. ఈ పరిస్థితులల్లో ఆర్థిక వ్యవస్థ తిరిగి నిలదొక్కుకుని సాధారణ స్థితికి రావాలంటే ప్రజల చేతిలో కొనుగోలు శక్తి పెంచాల్సిన అవసరముందని ఆర్థిక వేత్తలు చేసిన సూచనలను మోడీ ప్రభుత్వం పెడచెవిన పెడుతూ వస్తున్నది. లాక్‌డౌన్‌లు, కర్ఫ్యూలతో జీవనోపాధి కోల్పోయిన వలస కార్మికులు, అసంఘటితరంగ కార్మికుల కుటుంబాలకు నెలకు 8 వేలు చొప్పున నేరుగా నగదు బదిలీ చేయడం, గోదాముల్లో మూలుగుతున్న తిండిగింజలను ఉచితంగా అందచేయడం వంటి చర్యలు చేపడితే అసంఖ్యాకంగా ఉన్న కష్టజీవులకు కొంతైనా ఊరట లభించేది. దీంతోబాటు మౌలిక ప్రాజెక్టులు చేపట్టడం వంటి చర్యలు కష్టజీవుల ఆదాయాన్ని పెంచేందుకు తోడ్పడతాయి. మార్కెట్‌లో వస్తువులకు డిమాండ్ పెరుగుతుంది. తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుంది. అందుకవసరమైన ధనాన్ని సమీకరించడానికి కార్పొరేట్ల ఆదాయాలపై పన్నులు అదనంగా వేయాలి. కానీ, మోడీ ఆ విధంగా చేయకపోగా కార్పొరేట్లకే ఇంకా దోచిపెడుతున్నాడు. దీనికితోడు మోడీ ప్రభుత్వం సామాన్యులకిచ్చే సబ్సిడీల్లో నిర్దాక్షిణ్యంగా కోత పెడుతున్నది.

అగాథంలో ఎంఎస్ఎంఇ పరిశ్రమలు:

దేశ ఆర్థిక వ్యవస్థకు గ్రోత్ ఇంజిన్‌గా ఉన్నటువంటి సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఇ) నోట్ల రద్దు, జిఎస్‌టి అమలు, కొవిడ్ వ్యాధితో తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నాయి. కేంద్రం ప్రకటించిన ఉద్దీపన ప్యాకేజీ మసకబారింది. నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇవి మొత్తం 6 కోట్ల 30 లక్షల వరకు ఉన్నాయి. వీటిలో 12 కోట్ల మంది ఉపాధి పొందుతున్నా రు. ఎగుమతుల్లో వీటి వాటా 40 శాతం వరకు ఉంటుంది. జాతీయ స్థూల ఉత్పత్తిలో 29 శాతం వీటినుండే వస్తోంది. మోడీ ప్రభుత్వం ఎంఎస్ఎంఇల కోసం స్వయం పోషకం (ఆత్మనిర్భర) కింద ప్యాకేజీ ప్రకటించి పెద్ద ప్రచారం చేసుకుంది. కానీ పథకాన్ని అమలు చేయడంలో శ్రద్ధ చూపలేదు. ఫలితంగా లక్ష్యం నెరవేరకుండానే నీరుగారి పోయింది. ఇప్పడికి పథకం ప్రకటించి 8 మాసాలు కావస్తున్న నిర్దేశిత రుణపందేర లక్ష్యం ఇంకా నెరవేరలేదని తిరిగి గడువు పొడగించింది. 4.5 లక్షల కోట్లు అవసరం కాగా బ్యాంకులు సమకూర్చింది 25 శాతంలోపే. తీవ్ర కష్టాల్లో ఉన్న చిన్న పరిశ్రమలు చిన్నాభిన్నం కాకుండా ఉండాలంటే యుకె సిన్హా కమిటీ సిఫార్సుల్ని కేంద్రం తక్షణం అమలు చేయాలి.

9.3 శాతానికి పెరిగిన ద్రవ్యలోటు:

గత ఆర్థిక సంవత్సరం(2020-21) ద్రవ్యలోటు గణాంకాలను ఆర్థిక మంత్రిత్వ శాఖ మే 31న విడుదల చేసింది. గత ఏడాది కేంద్ర బడ్జెట్ సందర్భంగా 2020-21లో ద్రవ్యలోటు రు. 7.96 లక్షల కోట్లు లేదా జిడిపిలో 3.5 శాతం ఉంటుందని ప్రభుత్వం అంచనా వేసింది. అయితే ద్రవ్యలోటు రు. 18,21,461 కోట్లు నమోదైంది. ఇది దేశ జిడిపిలో 9.3 శాతంగా ఉంది. 2019-20 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య లోటు జిడిపిలో 4.6 శాతంగా ఉంది. 2021-22 బడ్జెట్‌లో ప్రభుత్వం జిడిపిలో 9.5 శాతానికి అంచనా వేసింది. ఈ ఆర్థిక సంవత్సరానికి రు. 18.48 లక్షల కోట్లు కావచ్చని తెలిపింది. గత ఏప్రిల్‌లో టోకు ధరల సూచీ 10.4 శాతానికి పెరిగింది. టోకు ధరల సూచీ ఇంత గరిష్టంగా పెరగడాన్ని సూపర్ ఇన్‌ఫ్లేషన్ అంటా రు. 50 రూపాయల డిజిల్ 100 రూపాయలు, 90 రూపాయల కెజి నూనె 180 రూపాయలు, 400 రూపాయల గ్యాసు సిలిండర్ 800 రూపాయలకు పెరిగాయి.

అమ్మకానికి భారతదేశం:

కేంద్రం 2021-22 వార్షిక బడ్జెట్ ప్రవేశపెడుతూ 'ఆత్మ నిర్భర్ భారత్'లో భాగంగా ప్రభుత్వ రంగ సంస్థలలో వాటాలను అమ్మివేస్తానని, వ్యాపారం చేయడం ప్రభుత్వాల బాధ్యత కాదని చాలా బాధ్యతారాహిత్యంగా ప్రకటించింది. దేశ స్వావలంబనకు మూల స్తంభాలుగా ఉండే 300 ప్రభుత్వ రంగ పరిశ్రమలు, సంస్థలను కారుచౌకగా స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు అప్పగించడానికి మించిన దేశద్రోహం మరోటి ఉండదు. నిజానికి 1990 నుండే ప్రభుత్వ రంగ సంస్థల వాటాల విక్రయం మొదలైంది. 2002లో నాటి వాజ్‌పేయి ప్రభుత్వంలో ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మివేయడానికి ఏకంగా 'పెట్టుబడుల ఉపసంహరణ మంత్రిత్వశాఖ'నే సృష్టించిన అపర దేశభక్తులు ఈ కాషాయ పాలకులు. ఇప్పుడు మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగమే అవసరం లేదంటున్నది. ప్రభుత్వ ఆస్తుల విక్రయం కూడా ఒక సామాన్యమైన ప్రక్రియగా ఆర్థిక మంత్రి చెప్పుకోవడం సిగ్గుచేటు. ఒకవైపు స్వావలంబన అంటూనే మరోవైపు ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ చేపట్టడం మోడీ ప్రభుత్వం చెబుతున్నట్టు ఆత్మ నిర్భర్

భారత్ కాదు ఇది ఆత్మ దుర్భర్ భారత్‌గా ఉంది. నిజానికి ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభుత్వానికి లాభాలు అందించాయి. ప్రజలకు సేవలందించాయి, యువతకు ఉపాధి కల్పించాయి. ప్రభుత్వ రంగ సంస్థల వాటాల విక్రయం తిరోగమన చర్య. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తే పెట్టుబడిదారులు వాటిని సాంకేతికతతో ఆధునీకరిస్తారు. ఫలితంగా కొందరికి ఉన్న ఉద్యోగాలు పోతాయి. కొత్త ఉద్యోగాలు రావు. ఇక రిజర్వేషన్లు ఉండవు.

ప్రమాదంలో ఫెడరల్ వ్యవస్థ:

గత ఏడేళ్లుగా మన రాజ్యాంగ ఫెడరల్ స్వభావాన్ని దెబ్బతీసే దిశగానే మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. మోడీ రెండవసారి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ దాడి మరింత ఎక్కువైంది. రాష్ట్రాల హక్కులను కాజేయడం, వాటిని నిర్వీర్యం చేయడం ద్వారా కేంద్రీకృత పాలనా వ్యవస్థ వైపు నడవాలన్న ఆర్ఎస్ఎస్ ఎజెండాను మోడీ అమలు చేస్తున్నా రు. రాష్ట్రాల పరిధిలోనే వ్యవసాయం ఉంది. కానీ, దానిని తోసిరాజని కార్పొరేట్లకు వ్యవసాయ రంగాన్ని అప్పచెప్పే చట్టాలను మోడీ ప్రభుత్వం చేసింది. ఒకే దేశం... ఒకే పన్ను అంటూ రాష్ట్రాల ఆదాయ వనరులకు గండి కొట్టింది. ఏకపక్షంగా నూతన విద్యా విధానాన్ని రుద్దుతోంది. సంక్షేమ పథకాల అమలులోనూ ఇదే ధోరణి. సమీక్షా సమావేశాల్లో కూడా ఫెడరల్ స్ఫూర్తికి మోడీ ప్రభుత్వం గండికొడుతుండటం దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. రాష్ట్రాల ప్రమేయం లేకుండా రూపొందించిన ఎన్ఆర్‌సితో మత ప్రాతిపదికన పౌరులను విడదీయాలన్న ప్రయత్నాన్ని పెద్ద ఎత్తున ప్రతిఘటించడం ద్వారా దేశ ప్రజలు అడ్డుకున్నా రు.

భారత దేశమంటేనే రాష్ట్రాల కలయిక, కులాలు, మతాలు, సాంప్రదాయాలు, ఆచారాలు, భాషలు, పూలదండలోని దారంతో వీటన్నింటిని కలిపి ఉంచే సోదరతత్వం, దీనికి తగ్గట్టుగా రాష్ట్రాల పొందిక, రాష్ట్రాలను గౌరవించడం, వాటి హక్కులను కాపాడడమంటే ప్రజల హక్కులను పరిరక్షించడమే. విశాల సాంస్కృతిక, రాజకీయ బహుళత్వాన్ని ముందుకు తీసుకుపోవడమే. రాజ్యాంగం నిర్దేశించిన సమాఖ్య తత్వం ఇదే! సామాజికంగానూ, పారిశ్రామికంగానూ, ఆర్థికంగానూ బలోపేతమైన రాష్ట్రాలు కేంద్రాన్ని మరింతగా పరిపుష్టం చేస్తాయి. ఇతర రాష్ట్రాల ఎదుగుదలకు దోహదం చేస్తాయి. సైద్ధాంతికంగానే భారతీయ జనతా పార్టీ ఈ భిన్నత్వానికి వ్యతిరేకం! అందుకే రాష్ట్రాల హక్కులను కబళించడానికి పదేపదే ప్రయత్నాలు చేస్తోంది. కేంద్రం తీసుకొచ్చే నూతన చట్టాల ఆమోదానికి రాష్ట్ర బాధ్యులతో సంప్రదించడం అనవాయితీ. మోడీ ప్రభుత్వం అమానవీయ, రాజ్యాంగ వ్యతిరేక చట్టాలను ఏకపక్షంగా రూపొందిస్తోంది. అన్యాయమే చట్టంగా మారినప్పుడు, ప్రతిఘటనే ప్రజల బాధ్యతగా మారుతుందని ప్రభుత్వం గుర్తించడం లేదు.

పౌర హక్కులపై ముప్పేట దాడి:

మోడీ ప్రభుత్వం వ్యక్తి స్వేచ్ఛను, వాక్-సభా స్వాతంత్ర్యాలను, పత్రికా స్వేచ్ఛను, సమన్యాయాన్ని ప్రతిపాదించేవారిని లక్ష్యంగా చేసుకుంది. ప్రజాస్వామ్యమన్నా, రాజ్యాంగమన్నా, సమాఖ్య విధానం (ఫెడరల్ విధానం) అన్నా మోడీ ప్రభుత్వం తిరస్కరిస్తున్నది. లౌకిక, ప్రజాతంత్ర, ప్రజానుకూల శక్తులను ఉక్కుపాదంతో అణచివేస్తున్నది. దేశవ్యాప్తంగా కవులు, కళాకారులు, రచయితలు, పాత్రికేయులు, హక్కుల సంఘాల నాయకులపై కుట్ర కేసులు, దేశద్రోహం, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఊపా) కింద కేసులు నమోదు చేస్తున్నా రు. ఉభయ తెలుగు రాష్ట్రాలలోనే 16 సంఘాలను నిషేధించడం జరిగింది. అందులో విప్లవ రచయితల సంఘం (విరసం), పౌర హక్కుల సంఘం (సిఎల్‌సి) చేర్చడం ఎంత దుర్మార్గమో ఆలోచించండి. ఈ మొత్తం వ్యవహారాన్ని జాతీయ నేర పరిశోధనా సంస్థ (ఎన్ఐఏ) చూస్తున్నది.

హిందూత్వ ఫాసిస్టు రాజ్యానికి అనుకూలంగా ప్రతిపక్షాల, ప్రజా సంఘాల, ప్రజా మేధావుల గొంతునొక్కే పనిని అత్యుత్సాహంతో చేస్తున్నది. చివరికి సామాజిక మాధ్యమం (సోషల్ మీడియా)పై కూడా ఆంక్షలు విధించింది. మోడీని పొడిగితే దేశభక్తి, విమర్శిస్తే దేశద్రోహంగా పరిణమించింది. ఇవాళ మోడీ వ్యవహారం రోమన్ సామ్రాజ్యాధిపతి నీరో చక్రవర్తిని, 1930ల నాటి జర్మన్ ఫాసిస్టు హిట్లర్‌ను తలపిస్తోంది. గోడి మీడియా (ఆర్నబ్ గోస్వామి) ద్వారా అబద్ధ ప్రచారానికి పూనుకోవడం సిగ్గుచేటు. ఇంకా నాగ్‌పూర్ నుండి తప్పుడు వాట్సాప్‌ల ద్వారా గోబెల్స్‌ను మించిన ప్రచారం చేయిస్తున్నది. మోడీ ప్రజాస్వామ్యానికి పాతరేసి నిరంకుశ పాలన సాగిస్తున్నాడు. దేశంలో ఇవాళ ప్రజాస్వామ్యానికి ముంచుకొస్తున్న ప్రమాదాన్ని పౌర సమాజం గుర్తించి, ప్రతిఘటించకపోతే రేపు మనమంతా ఒక జాతిగా మనుగడ సాగించడం అసాధ్యమవుతుంది.

మహారాష్ట్రలోని భీమా కోరేగావ్‌లో 2018 జనవరి ఒకటిన జరిగిన అల్లర్లలో పాల్గొన్న సంఘ్ పరివార్‌కు చెందిన అసలు నేరస్తులను వదిలేసి సదరు ఘటనతో ఏ సంబంధం లేని సామ్యవాద, ప్రగతిశీల, విప్లవ మేధావులు 16 మందిపై తప్పుడు ఆరోపణలతో కేసులు పెట్టడం దోపిడీ ప్రభుత్వ పాలకవర్గాలు పన్నిన నీచమైన కుట్ర అని అర్థమవుతుంది. ప్రజా సమస్యల సాధన కొరకు నిరంతరం సమరశీల ఉద్యమాలకు తోడుగా ఉంటున్న 16 మంది విప్లవ మేధావులపై అక్రమ కేసులు బనాయించడం, జైలు పాలు చేయడం ప్రజాస్వామిక పౌర హక్కులను కాలరాయడమే అవుతుంది. బీమా-కోరేగావ్ ఘర్షణలకు కుట్ర చేశారని, ప్రధానిని హత్య చేయడానికి పన్నిన పథకాలకు సహకరిస్తున్నారనే నేరారోపణలపై 'ఊపా' (చట్ట విరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం) కింద 2018 జూన్ 6న సుధీర్ ధావ్లే, షోమా సేన్, సురేంద్ర గడ్లింగ్, రోనా విల్సన్, మహేశ్ రౌతులను, ఆగష్టు 28న సుధా భరద్వాజ్, గౌతమ్ నవ్లాఖా, వరవరరావు, అరుణ్ ఫరేరా, వర్నన్ గోంజాల్వేస్‌లను అరెస్టు చేశా రు. ఆనంద్ తేల్తుంబ్డెను కూడా మోడీ సర్కారు టార్గెట్ చేసింది. విద్యార్థులపై, మహిళలపై, రైతులపై, పాత్రికేయులపై, సామాజిక కార్యకర్తలపై దేశద్రోహం కేసులు పెట్టడం మోడీ ప్రభుత్వ ఫాసిస్టు పాలనకు సంకేతంగా ఉంది.

మోడీ విధానాలకు నిరసనగా భారత్ బంద్‌లు:

ఏడేండ్లలో 12 భారత్ బంద్‌లు, ఒక దేశవ్యాప్త బ్లాక్ డే జరిగాయి. పెద్ద ఎత్తున నిరసనలు సాగుతున్నా మోడీ తన విధానాలలో ప్రజానుకూల మార్పు చేయకపోగా మరింత ఘనీభవించి కార్పొరేట్లకు లాభాలు కట్టబెట్టే విధానాలను కొనసాగిస్తున్నా రు. ఆర్డినెన్స్‌లతో పాలన సాగిస్తున్నా రు. 2015 సెప్టెంబర్ 2న కార్మిక సంస్కరణలకు

వ్యతిరేకంగా భారత్ బంద్. 2016 సెప్టెంబర్ 2న 18 కోట్ల మంది కార్మికులు సమ్మె చేశా రు. 2017 ఫిబ్రవరి 27న మధ్యప్రదేశ్‌లోని మందసోర్‌లో రైతులపై కాల్పులు జరిపి 6గురు రైతులను ప్రభుత్వం కిరాతకంగా చంపింది. 2019 డిసెంబర్ 19న హిందువులకు మాత్రమే పౌరసత్వం కల్పించడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్త బంద్‌లు జరిగాయి. 2020 జనవరి 8న కార్మిక హక్కుల రక్షణ కోసం బంద్ జరిగింది. 2020 నవంబర్ 26న కార్మిక వర్గం హక్కుల కోసం సమ్మె, అదేరోజు రైతులచే ఢిల్లీ దిగ్బంధం మూడు కార్పొరేట్ అనుకూల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా బంద్ పాటించా రు. 2021 మే 26న మోడీ పాలన ఏడేళ్లు ముగిసిన సందర్భంగా దేశవ్యాప్తంగా బ్లాక్ డే పాటించా రు. ఢిల్లీలో లక్షలాది రైతులు 2020 నవంబర్ 26 నుంచి నేటికి ఏడు మాసాలుగా ఆందోళన చేస్తున్నా రు. అయినా మోడీ ప్రభుత్వం పరిష్కారం చూపడం లేదు.

పోరుబాటలో రైతన్న:

కేంద్రంలో బిజెపి నాయకత్వంలో ఎన్‌డిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో రైతు నిరసనలు, ఆందోళనలు ఐదు రెట్లు పెరిగాయి. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తమిళనాడు రైతులు తమ నిరసనలు తీవ్రంగా తెలిపినప్పటికి ప్రభుత్వం నుండి స్పందన కరువైంది. మూడు వివాదాస్పదమైన వ్యవసాయ చట్టాలతో పాటు ధాన్య సేకరణ, వ్యవసాయ మార్కెట్ సంబంధిత వైఫల్యాలు రైతుల ఆందోళనలను పెంచాయని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సిఎంసి) సేకరించిన డేటా వెల్లడించింది. 2017లో 15 రాష్ట్రాల్లో, 34 ప్రధాన ఆందోళనలు, నిరసనలు చోటు చేసుకున్నాయి. ఆ సంఖ్య ఈ ఏడాదికి 22 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 165కి పెరిగింది. వీటిల్లో 11 ఢిల్లీలో, గతేడాది ప్రవేశపెట్టిన వినాశకర వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా జరిగినవే.

రుణాల మాఫీ చేయాలని, పంటల భీమా కవరేజి, నష్టపరిహారం చెల్లింపులో లొసుగులను సరిచేయాలని కోరుతూ రైతులు ఏడుసార్లు ఆందోళనలు చేపట్టా రు. వ్యవసాయ ఉపకరణాలు, ఎరువుల ధరల పెంపునకు నిరసనగా 2020-21లో నాలుగు సార్లు రైతులు ఆందోళనకు దిగా రు. రైతు నేతల అరెస్టును నిరసిస్తూ కూడా ఆందోళనలు జరిగాయి. దేశంలో ప్రస్తుతం భూ యజమానులు, సాగుదార్లు కన్నా వ్యవసాయ కూలీలు ఎక్కువగా ఉన్నా రు. దాదాపు ప్రతిరోజూ 28 మందికి పైగా వ్యవసాయ కూలీలు, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా రు. 2019లో 5,957 మంది రైతులు, అదనంగా 4,324 మంది కూలీలు ఆత్మహత్యలు చేసుకుని మరణించారని తాజా గణాంకాలు తెలుపుతున్నాయి. ప్రస్తుతం పెద్ద ఎత్తున వ్యవసాయ సంక్షోభం, అశాంతి అనే టైం బాంబ్ మీద భారత్ కూర్చుని ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నా రు.

మత ప్రాతిపదికన పౌరసత్వం:

మోడీ ప్రభుత్వం మత ప్రాతిపదికన 1955 నాటి చట్టానికి సవరణలు 2019 డిసెంబర్‌లో (సిటిజెన్‌షిప్ అమెండ్‌మెంట్ బిల్లు) పార్లమెంట్ ఆమోదం పొందింది. ఈ బిల్లు ప్రతిపాదన దశలో ఉన్నప్పుడే ఈశాన్య రాష్ట్రాల నుండి వ్యతిరేకత వచ్చింది. బిల్లు చట్టంగా మారాక దేశవ్యాప్త నిరాసనాందోళనలకు దారితీసింది. ఢిల్లీలో మహిళలు పౌరసత్వ చట్టం(సిఎఎ), జాతీయ పౌరుల రిజిస్టర్ (ఎన్‌ఆర్‌సి), జాతీయ జనాభా రిజిస్టర్ (ఎన్‌పిఆర్)లకు వ్యతిరేకంగా షహీన్‌బాగ్‌లో మహిళలు చారిత్రాత్మక ఉద్యమం చేశా రు. ఐనా ప్రభుత్వం మాత్రం పౌరసత్వ చట్టాన్ని అమలుచేసి తీరుతామని బీరాలు పలుకుతుంది. ఢిల్లీ మహిళల ఉద్యమాన్ని చెదరగొట్టడానికి పోలీసు బలగాలను, మిలిటరీ బలగాలను ఉపయోగించా రు. చివరికి ఆర్‌ఎస్‌ఎస్ గూండాలు మహిళలపై దాడులుచేసి, ఆస్తుల నష్టానికి పూనుకున్నా రు. తామే రెచ్చగొట్టడానికి పాల్పడి ఉద్యమకారులపై దుర్మార్గంగా కేసులు నమోదు చేసింది. ప్రభుత్వం కొందరిపై దేశద్రోహం కేసులు పెట్టింది. ఈ చట్టం మత దృక్పథంతో కూడుకుని ఉన్నందువలన మైనారిటీలు వ్యతిరేకిస్తున్నా రు. పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్ఘనిస్తాన్ నుండి వచ్చే హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ, క్రైస్తవులకు పౌరసత్వం ఇస్తారు కానీ ముస్లింలకు పౌరసత్వం ఇవ్వవద్దన్నది ఇందులోని వివక్ష.

ముగింపు:

దేశంలో సుదీర్ఘకాలం ప్రధానిగా బాధ్యతలు నిర్వహించిన ప్రధాని మోడీ ఆత్మ పరిశీలన చేసుకోవాలి! ఆయన తీసుకున్న నిర్ణయాలు ప్రజలను ఆశాపథం వైపు మళ్లించాయా లేదా అని సమీక్షించుకోవాలి. చలించని రాతి గుండెతో ప్రధాని మోడీ పాలన సాగించడం ఈ దేశానికి పట్టిన పీడగా భావించాలి. గత రెండు సంవత్సరాలు కరోనా వైరస్ కట్టడికి లాక్‌డౌన్ ప్రకటించడం, పరిశ్రమలు మూడపడటం, కోట్లాది మంది ఉపాధి కోల్పోయి, కొనుగోలు శక్తి లేక బతుకు భారమై, అయిన వాళ్లను కోల్పోయిన క్షోభతో చస్తున్నా, హహకారాలు చేస్తున్న ప్రజలకు స్వాంతన కల్పించే చర్యలు లేవు. మొత్తంగా మోడీ పాలనలో దేశ వనరులు, శ్రమ, దేశీయ, విదేశీ పెట్టుబడిదారులకు దోచి పెడుతున్నా రు. భౌగోళిక రాజకీయాల్లో సామ్రాజ్యవాద అమెరికాకు బంటుగా విదేశీ విధానాలు రూపొందుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచీకరణ ఆర్థిక విధానాలకు ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలు రూపొందించుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం కావాలంటే లౌకిక ప్రజాస్వామ్యం, స్వావలంబనతో కూడిన సమగ్ర అభివృద్ధి కోసం ప్రణాళికా పద్ధతిని పునరుద్ధరించాలి. ఉత్పత్తి శక్తులను అభివృద్ధి చేసి ఉపాధిని కల్పించాలి. ఆర్థిక అసమానతలను తగ్గించాలి. భూ సంస్కరణలను అమలు జరిపి వ్యవసాయ సంబంధాలలో ప్రజాతంత్ర మార్పు సాధించాలి. సహకార సేద్యాన్ని, సహకార మార్కెటింగ్‌ను అభివృద్ధి చేయాలి. ప్రైవేటీకరించబడిన ప్రభుత్వ రంగ సంస్థలను తిరిగి జాతీయం చేయాలి. విద్యుచ్ఛక్తి, నీటి సరఫరా, ప్రజా రవాణా, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలను తిరిగి ప్రభుత్వ రంగంలోకి తేవాలి. సంపద పునఃపంపిణీ జరిగేలా ద్రవ్య విధానంలో, పన్ను విధానంలో మార్పులు చేయాలి. సూక్ష్మ, చిన్న మధ్యతరగతి పరిశ్రమలకు, సంప్రదాయ పరిశ్రమలకు భద్రత కల్పించాలి. ఇవన్నీ అమలులోకి రావాలంటే ప్రభుత్వం మెడలు వంచే సంఘటిత ప్రజా ఉద్యమం తప్ప మరో మార్గం లేదు.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, రాజనీతిశాస్త్ర విద్యార్థి) వీ

ఏడేళ్ల తెలంగాణ ముఖచిత్రం

ఏడేళ్ల ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ఐదేళ్ల తెరాస పాలన ప్రజలు ఆశించినమేర జరగలేదని, జరిగిన దాంట్లో లాభపడినది ఆంధ్ర కాంట్రాక్టర్‌లు, స్థానిక భూస్వాములు, ధనిక వర్గాలేనని అంటున్నారు **అర్వాణి రాజేంద్రబాబు**

ఎగిసిన కెరటం లాగా, ఓ పెద్ద ప్రభంజనం లాగా జనం ఉవ్వెత్తున పాల్గొన్న ఏ ఉద్యమంలోనయినా ప్రజల ఆకాంక్షలు, ఆశలు వెల్లివిరుస్తాయి. దాదాపు వందేళ్లుగా సాగిన భారత స్వాతంత్ర పోరాటంలో అన్ని వర్గాల ప్రజలు అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నారు. స్వాతంత్ర పోరాటం తర్వాత రచించబడ్డ భారత రాజ్యాంగంలో చాలా మేరకు ప్రజల ఆకాంక్షలను, ఆశయాలను పొందుపరచే ప్రయత్నం చేశారు. ఆ రాజ్యాంగం ఏ మేరకు అమలవుతుంది అన్నది వేరే విషయం. అది ఈ వ్యాస పరిధిలోకి రాని సంగతి. తెలంగాణ విషయానికొస్తే, 1952లో 'ఇడ్లీ సాంబార్ గో బాక్' అన్న నినాదంతో మొదలయిన తెలంగాణ అస్థిత్వ పోరాటం 2014 జూన్ 2న భౌగోళిక తెలంగాణ సిద్దించడంతో ఒక ప్రధానమయిన అంకానికి చేరుకొంది. 'ఇడ్లీ సాంబార్ గో బాక్' అన్న గొంతుకల వెనక ప్రతిధ్వనించింది 'గైర్ ముల్కి గో బాక్' అన్న పోరాట ధ్వనులే. 1969లో జరిగిన తొలి తెలంగాణ సమరంలో పాలనా పగ్గాలు తెలంగాణ వారి చేతుల్లోకి రావాలన్న బలమయిన కాంక్ష కనిపించింది. ఆ రోజుల్లో ఏ ఆఫీసులో చూసినా ఆంధ్ర రాయలసీమ ప్రాంతాలకు చెందిన వారే; ఏ స్కూల్‌లో చూసినా అక్కడి టీచర్లే, ఏ కాలేజీలో చూసినా ఆంధ్ర రాయలసీమ ప్రాంతం నుండి వచ్చిన లెక్చరర్లే, విద్యార్థులు కూడా ఆ ప్రాంతాల నుండి వచ్చి ఇక్కడ చదువుకునే వారే; చివరికి తెలంగాణలో అప్పుడు ఉన్న ఏకైక విశ్వవిద్యాలయం ఉప కులపతి కూడా ఆంధ్రా ప్రాంత వాసియే. మాకు చదువు కావాలి, మాకు ఉద్యోగాలు కావాలి అని యువత ఆకాంక్షిస్తే రాజకీయ నాయకులు ఉద్యమాన్ని హైజాక్ చేసి, ప్రభుత్వంలో తమ వంతు భాగాన్ని గ్యారంటీ చేసుకొని ఉద్యమాన్ని అటకెక్కించారు.

1969 ఉద్యమ ఆకాంక్షలు తీరకుండా మనో వైఫల్యంతో ఉన్న తెలంగాణ సమాజం నిరాశతో, నిస్పృహతో తెలంగాణ కాంగ్రెస్ రూపంలోనో, తెలంగాణ జనసభ రూపంలోనో, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్లు తెలంగాణకు అన్ని రంగాలలో జరిగిన అన్యాయాల అధ్యయన రూపంలోనో బయట పడుతూనే ఉంది. చివరికి తెలంగాణ కోసం ఒక ప్రాంతీయ పార్టీ ఆవిర్భవించి తెలంగాణ మలి ఉద్యమం ఒక సమగ్ర రూపం తీసుకుంది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మేధావులు, కళాకారులు, కులసంఘాలు, సబ్బండ వర్గాలు కలిసి ఐక్య కార్యాచరణ సమితి జెఏసిగా ఏర్పడి ఆ రాజకీయ పార్టీకి చేదోడు వాదోడుగా ఉండి, తెలంగాణ సమాజం మొత్తం సమన్వయంతో పోరాడి తెలంగాణను సాధించుకున్నది. భారత స్వాతంత్ర పోరాటంలో ప్రజల ఆకాంక్షలు భారత రాజ్యాంగంలో నిక్షిప్తమయినట్టు, తెలంగాణ ప్రజల ఆకాంక్షలు 2014 నాటి ఎన్నికలలో పోటీ చేసిన రాజకీయ పార్టీల మేనిఫెస్టోలలో, ప్రజలకిచ్చిన వాగ్దానాలలో ఇమిడి ఉన్నాయి.

దశాబ్దాల పోరాటం ఫలితంగా సాధించుకున్న తెలంగాణ! ఉద్యమంలో ప్రజలందరినీ భాగస్వాములను చేసిన రాజకీయ పార్టీ సారథ్యంలో తెలంగాణ! నూతన రాష్ట్రం తెలంగాణలో రెండు పర్యాయాలు ఎన్నికలయ్యాయి. ఏడేళ్లు గడిచాయి. ఇప్పుడు తెలంగాణ ముఖ చిత్రం ఉహించుకుందామంటే కొంత భయంగాను, మరికొంత బెరుకుగాను ఉంది. ఓ పక్క కాళేశ్వరం నుండి నీటి ధార టివీలలో హోరెత్తిస్తూనేఉంది. మరో పక్క మల్లన్న సాగర్ నిర్వాసితుల దయనీయమయిన మూలుగులు బలహీనంగా వినిపిస్తూనే ఉన్నాయి. రైతు బంధు పథకంలో పేద రైతుకు కొంతపెట్టుబడితో ప్రభుత్వం వెసులుబాటు కల్పిస్తుందని ముఖం పై చిరునవ్వు పూయిద్దామనుకుంటే 18 లక్షల కౌల్దారీ రైతుల చిన్న బోయిన ముఖాలు మౌనంగా ముకుళించుకుపోయిన దృశ్యం మాట పెలగనివ్వడం లేదు. రైతు బీమాతో గుండె నిండా ఊపిరి పీల్చుకుందామని అనుకుంటే, తెలంగాణ వచ్చిన తర్వాత కూడా ఆరేళ్లలో 6000 మంది రైతులు, అంటే సగటున సంవత్సరానికి వెయ్యి మంది చొప్పున, ఆత్మహత్యలు! బలవన్మరణాలకు పాల్పడిన రైతుల కుటుంబాల రోదనలు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. రైతు రాజ్యం అన్నారు. వ్యవసాయం లాభదాయకం చేస్తానన్నారు.

ఈ నేపథ్యంలో రాష్ట్ర జిడిపి వృద్ధిని పరిశీలిద్దాం. 2014-2015 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర జిడిపి సుమారు నాలుగు లక్షల కోట్లు ఉండగా 2020-2021 ఆర్థిక సంవత్సరానికి అది దరిదాపు 10 లక్షల కోట్ల రూపాయలకు పెరిగింది. మంచిదే. కాని, ఏ యే జిల్లాలలో జిడిపి వృద్ధి నమోదయ్యింది? ఏ ప్రదేశాలలో అయితే పారిశ్రామిక, సేవా రంగాలు అభివృద్ధి చెందాయో ఆ జిల్లాలలోనే ఆర్థిక వృద్ధి గోచరిస్తున్నది. వ్యవసాయం, వ్యవసాయ సంబంధిత ఉత్పత్తులు, అటవీ ఉత్పత్తులు మాత్రమే ఉన్న జిల్లాలలో ఏమాత్రం జిడిపి పెరగలేదు. అంటే ప్రభుత్వ ఆర్థిక విధానాలు రైతులకు తీపి మాటలు సేవా రంగాలకు అనుకూలం అన్నట్టే కదా!

తెలంగాణలో సెంటు భూమి కూడా లేని దళిత కుటుంబాలు 3లక్షల దాకా ఉన్నాయని, వాటిలో ఒక్కొక్క కుటుంబానికి 3 ఎకరాలు ఇస్తామని, ఇవి కాక 3 ఎకరాల భూమి కంటే తక్కువ భూమి కలిగిన దళిత కుటుంబాలు మరో మూడు లక్షలు ఉంటాయని, వాటిని కూడా ఒక్కో కుటుంబానికి కనీసం మూడు ఎకరాలు ఉండేలా తక్కువయిన

భూమిని కొని వారికి కేటాయిస్తామని ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేసి ఏడేళ్లయింది. తెరాస ప్రభుత్వం ఏర్పడ్డ మొదటి నాలుగేళ్లలో 32 జిల్లాలలో 549 కోట్ల రూపాయిలు వెచ్చించి 12,393 ఎకరాల భూమిని కొని 5,759 దళిత కుటుంబాలకు పంచారు. మిగిలిన 2 లక్షల 94 కుటుంబాల సంగతి, 3 ఎకరాల పొలము లేని 3 లక్షల కుటుంబాల సంగతి ఏమయ్యిందో ఆ మాటనే ఎవ్వరూ ఎత్తడం లేదు. పంపిణీ చేసిన 13 వేల ఎకరాల భూమి కూడా చాలా వరకు సాగు యోగ్యం కాదని, సాగు నీటి సౌకర్యం లేనిదని, ఒక సంవత్సరం పాటు వ్యవసాయానికి పెట్టుబడి ప్రభుత్వమే సమకూరుస్తుందన్న హామీని ప్రభుత్వం నిలబెట్టుకోలేదని, లబ్ది దారులకంటే ఎక్కువ లాభం పొందింది భూమిని అమ్మిన భూకామందులేనని అనేక విమర్శలు ఈ పథకం గురించి ఉన్నాయి. వీటిల్లో ఏ విమర్శకు ప్రభుత్వ పెద్దల నుంచి సమాధానం లేదు.

గణాంకాలు పరిశీలిస్తే రాష్ట్రంలో సగటు తలసరి ఆదాయం పెరిగిందని కనిపిస్తుంది. కాని, రాష్ట్ర జనాభా 3 కోట్ల 50 లక్షల పై చిలుకు ఉంటే అందులో 2,79,29,680 మంది కొన్ని నిత్యావసర సరుకుల కోసం ప్రభుత్వం వారి ప్రజా పంపిణీ వ్యవస్థ మీదే ఆధారపడి ఉన్నారన్న వాస్తవమూ ఆ గణాంకాల వల్లే తెలుస్తుంది. ధనికులు ధనికులవుతున్నారు. పేదలు ఇంకా ఇంకా పేదరికంలో కూరుకు పోతున్నారన్నది మన కళ్ల ముందు కనిపిస్తున్న సత్యం. 'దేశంలో ఉన్న అనేక రాష్ట్రాలలో ఇది ఒకటి. కేంద్ర ఆర్థిక విధానాలకు మనమూ లోబడే ఉండాలి కదా! ఈ విషయంలో మనమేమి చేయగలం' అని వాదన కోసం అనవచ్చు. కాని, రాష్ట్ర పరిధిలో ఉన్న విధాన పరమయిన విషయాలలోనయినా రాష్ట్ర ప్రభుత్వం సన్నకారు రైతులకు, వ్యవసాయ కూలీలకు, చిన్న పరిశ్రమలకు, కుటీర పరిశ్రమలకు, చిన్న దుకాణదారులకు, మధ్య తరగతి ప్రజానీకానికి, పేద రైతాంగానికి అనుకూలంగా ఉన్నదా అన్నది అసలు ప్రశ్న.

ఏ సమాజానికయినా సహజ అభివృద్ధి సూచికలు విద్య, వైద్య రంగాలలో సాధించిన ప్రగతి. తెలంగాణ ఉద్యమ సమయంలో 'కెజి టు పిజి' ఉచిత విద్య అన్నది అన్ని వర్గాలను ఆకట్టుకున్న నినాదం. నిజంగా అది గొప్ప ఆశయం. కాని ఆచరణలో ఏమయ్యింది. కొన్ని వందల గురుకుల పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు స్థాపించారు. వీటిల్లో ఇంగ్లిష్ మాధ్యమం, పోషకాహారం, మంచి శిక్షణ అందుబాటులో ఉంచారు. అందులో చదువుతున్న నిమ్న వర్గాల పిల్లలు మంచి ఫలితాలు సాధిస్తున్నారు. ఇంతవరకు అభినందనీయమే. కాని, ఆ పాఠశాలలను కులాలవారీగా, వర్గాల వారీగా స్థాపించారు. దేశమంతా ప్రస్తుతించిన కొఠారి కమిషన్ సిఫారస్ కామన్ స్కూల్ పద్దతి తెలంగాణ ప్రభుత్వ విధానానికి వ్యతిరేకమా? "మతములన్నియు మాసి పోవును, జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును' అన్న గురజాడ కలను విఫలం చేసే ప్రయత్నమేనా మీది? కులాలవారిగా, మతాలవారిగా సమాజ విభజనను శాశ్వతం చేయాలనుకోవడం ఏ అభివృద్ధికి ప్రతీక!

రెసిడెన్షియల్ స్కూళ్ల విషయం అలా ఉంటే, ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఈ ఏడేళ్ల కాలంలో మరీ దిగజారి పోయింది. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రభుత్వ ఎజండాలోనే లేకపోవడం అత్యంత శోచనీయం. చివరిసారిగా ఉమ్మడి రాష్ట్రంలో దశాబ్ద కాలం కిందట 2012లో ఉపాధ్యాయ నిమాయకాలు జరిగాయి. 20,000కు పైగా ఉపాధ్యాయ పోస్టులలో ఖాళీలు ఉన్నాయి. రాష్ట్ర ఆదాయంలో ప్రతి ఏటా 30 శాతం బడ్జెట్ విద్యా రంగానికి కేటాయించాలని కొఠారి కమిషన్ సూచిస్తే, 2014-15 ఆర్థిక సంవత్సరంలో 10 శాతం కేటాయించి చేతులు దులిపేసుకున్నారు. ఆ తర్వాత ప్రతి సంవత్సరం ఒక్కో శాతం తగ్గిస్తూ వస్తున్నారు. కళాశాలల్లో కాంట్రాక్ట్ పద్దతిన నియామకాలు. విశ్వ విద్యాలయాల పరిస్థితి దారుణం. గవర్నర్ చీవాట్లు పెడితేనే గాని ఉప కులపతుల నియామకం జరగలేదు. పరిశోధన నత్త నడక నడుస్తున్నది. యూనివర్సిటీలలో మొత్తం 2,979 బోధనా సిబ్బందికి సంభందించిన పోస్టులు ఉంటే, అందులో 2,152 పోస్టులు ఖాళీగా ఉన్నాయంటే ఉన్నత విద్యను ప్రైవేటీకరించి పేద వర్గాలకు దానిని అందని ద్రాక్షలా గగనకుసుమం చెయ్యడమే ప్రభుత్వ ఆలోచన అన్నది స్పష్టం. కెజితో పిజి ఉచిత విద్య అంటే ఇదేనా? దశాబ్దాల కాలం సాగిన ఉద్యమంలో సబ్బండ వర్గాలు తెలంగాణలో విజ్ఞాన సమాజం నెలకొంటుందని కన్న కలలు ఏమయ్యాయి.

ప్రభుత్వ వైద్య రంగం కుదేలయి పోయింది. ప్రభుత్వ దావఖానాలలో వైద్య సిబ్బంది పూర్తి స్థాయిలో లేరని, వందలాదిగా పోస్ట్‌లు ఖాళీగా ఉన్నాయన్న వార్త మనసును కలచి వేస్తుంది. ప్రయివేట్, కార్పొరేట్ ఆసుపత్రులది ఇష్టా రాజ్యంగా నడుస్తున్నది. కోవిడ్ సెకండ్ వేవ్‌లో తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వం ప్రకటించిన మరణాల సంఖ్య కంటే వాస్తవంగా ఒక్క హైదరాబాద్ నగరంలోనే వంద శాతం ఎక్కువ మరణాలు సంభవించాయని 'ద హిందూ' పత్రిక రాసిందంటే తెలంగాణలో వైద్య రంగం ఎంత రోగ గ్రస్థమైందో ఊహించుకోవచ్చు.

తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, నియామకాలు అన్న అంశాల కేంద్రంగా ఎగిసి పడిందని చరిత్రలో రికార్డయింది. తెలంగాణ ఏర్పడడంతోటే నిధుల సమస్య పరిష్కారమయ్యిందని చాలా మంది భావిస్తుంటారు. నిజమే. తెలంగాణ నుండి వసూలయిన పన్నులు గాని, తెలంగాణకు కేటాయించబడ్డ నిధులు గాని తెలంగాణ కోసమే వెచ్చిస్తున్నారు. కాని, ప్రాజెక్టుల నిర్మాణంలో వేల కోట్ల రూపాయల కాంట్రాక్ట్‌లు ఎవరికిస్తున్నారు? ప్రధానంగా ఆ కాంట్రాక్ట్ లన్నీ ఆంధ్రా ప్రాంతం వారి సొంతం అవుతున్నాయని, ఆరకంగా ఉమ్మడి రాష్ట్రంలో లా నిధులలో కొంత భాగం ఆంధ్ర వైపే వెళుతున్నాయని లోకం కోడై కూస్తుంది. తెలంగాణ కాంట్రాక్టర్‌లకు ఆర్థిక స్తోమత లేకపోతే వారికి రుణ సదుపాయం కల్పించి, ఇక్కడి నిధులు ఈ ప్రాంతం వారికే చెందేలా చర్యలు తీసుకోవచ్చు కదా! ఇక ఉద్యోగాలు, నియామకాలు లేక తెలంగాణ యువత నిరాశ నిస్పృహలోకి జారుకుంది. రైతుల ఆత్మహత్యల లాగా కొలువుల్లేక నిరుద్యోగుల ఆత్మహత్యలు తెలంగాణలో ప్రారంభమయ్యాయి. ఈ పాపం ఎవ్వరిది! లక్షా తొంభై వేల ఖాళీలని, చివరికి అవి కుంచించుక పోయి 50 వేలయ్యాయి. 50,000 వేల పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించి నెలలు గడుస్తున్నా నోటిఫికేషన్ గతి లేదాయె. యువత అశాంతికి లోనయితే సమాజం అతలాకుతలం అవుతుందని తెరాస పెద్దలకు తెలియదా?

ఇలా ఎన్నో వాగ్దాన భంగాలు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు ఆవిరయి పోయాయి. పరిపాలనలో ప్రజాస్వామ్య వాతావరణం అడుగంటి పోయింది. మిగిలిన పౌర సమాజం అణిచివేతకు గురవుతున్నది. ఆదుకోవలసిన రాజకీయ రంగం నిస్తేజానికి గురై మాటల బింకాలతో కాలం గడుపుతుంది. కేంద్ర ప్రభుత్వం రోజు

రఘురామ రాజన్ దృష్టిలో వర్తమానం

***వైఫల్యాలను వైఫల్యాలుగా గుర్తించ నిరాకరించడం మరిన్ని వైఫల్యాలకు దారి తీస్తుందని, ఈ వైఖరులను ప్రశ్నించకపోవడమూ ఓ వైఫల్యమేనని అంటున్నారు* బి.ఎస్. రాజు**

2021 జూన్ 4న 'ద వైర్' అంతర్జాల పత్రిక తరఫున ప్రముఖ పాత్రికేయుడు, విశిష్ట వ్యక్తులను వాడిగా వేడిగా ఇంటర్వ్యూలు చేయడంలో నేర్పరి అయిన కరణ్ థాపర్, డా.రఘురాం రాజన్‌తో సుదీర్ఘమైన ఇంటర్వ్యూ జరిపాడు. పేరుకు ఇది కోవిడ్ 19 విలయం చుట్టూ జరిపిన సంభాషణే అయినా, నిజానికది మన దేశప్రజలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న పలు ప్రాథమిక సమస్యల, పాలనా సంక్షోభాలపై లోతైన చర్చ అనడం సమంజసం. ఈ సంభాషణలో పాల్గొన్న ఇరువురూ నయా ఉదారవాద కోవకు చెందిన వారే కాబట్టి ఈ చర్చ సహజంగానే ఆ రాజకీయ ఆర్థిక కోణంలో సాగడంలో ఆశ్చర్యమేమీ లేదు. అయితే ఈ విధానాలను ఖండించే, వ్యతిరేకించే నాలాటి వాడు దానిపై వ్యాసం రాయడం బహుశా కొంతమందిని ఆశ్చర్యానికి గురిచేయవచ్చు. రఘురాం రాజన్ అభిప్రాయాలపై వ్యాసం రాయాల్సిన అగత్య మేమి టనే ప్రశ్నను కూడా ఎవరైనా లేవనెత్తవచ్చు.

డా.రఘురామ్ రాజన్ ప్రపంచ ఉదారవాద రాజకీయ ఆర్థిక విధానాల చోదక బృందంలో ఒకడు. 'జి30' అనే సంస్థలో సభ్యుడు. ఈ సంస్థ, ప్రముఖ (మాజీ) బ్యాంకర్ల, ద్రవ్య పెట్టుబడికి సేవలందించే సలహాదారుల, నిపుణుల బృందం. సెప్టెంబర్ 2013 నుండి 2016 వరకు ఈయన ఇండియా రిజర్వ్ బ్యాంకు గవర్నర్‌గా ఉన్నాడు. 2003-2006 మధ్య కాలంలో డా. రాజన్ అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థలో ముఖ్య ఆర్థిక వేత్తగా, పరిశోధనా సంచాలకునిగా పనిచేశాడు. 'నాకు ఏ విదేశీ పౌరసత్వము లేదు. నేను పక్కా భారతదేశ పౌరుణ్ణి' అని సగర్వంగా ప్రకటించుకున్న వ్యక్తి డా. రాజన్. ఆయన కరణ్ థాపర్‌తో జరిపిన సంభాషణలో కలతచెందిన ఓ భారతదేశ పౌరునిగా, మేధావిగా చాలా ఉద్విగ్నతను ప్రదర్శించాడు. లోతైన విశ్లేషణలు చేశాడు. ఆయన పంథాలో ఆయన, దేశాన్నిపట్టి పీడిస్తున్న అప్రజాస్వామిక ఫాసిస్టు పోకడలపట్ల, అస్తవ్యస్త పాలనపట్ల చాలా ఘాటుగా స్పందించాడు. ఆ విధానాల వల్ల జరుగుతున్న, జరగబోయే నష్టాలను ప్రస్తావించాడు. ఆ విధానాల మూలనీతిని, ఆ నీతిని నెత్తినెత్తుకుని ప్రజలకు కష్టనష్టాల కాష్టాలను రాజేస్తున్న ఇప్పటి దేశ పాలక తిరోగమన నాయకత్వాన్ని ఎండగట్టాడు. నిజాయితీతో మాట్లాడాడు. ఆయన ఏం మాట్లాడేడో ఇప్పుడు చూద్దాం:

1. గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం జిడిపి రేటు మెరుగుపడిందని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. గత సంవత్సరం జిడిపి, - 7.3 శాతంకు కుంచించుకుపోతే, ఈ సంవత్సరం 1.6 శాతం నమోదు చేయడం ఆశాజనకంగా ఉందని, ప్రభుత్వం ఊహించిన దానికన్నా ఫలితాలు మెరుగ్గా ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది కదా! మరి దీనిపై మీ అభిప్రాయామేమిటని కరణ్ థాపర్ అడిగినప్పుడు డా. రాజన్ ఇలా అన్నారు. (రాజన్ సంభాషణల భావాన్ని మాత్రమే ఇక్కడ వ్యాసకర్త రాస్తున్నాడని పాఠకులు గ్రహించాలి):

కొన్ని అంకెలు ఆశాజనకంగా కనిపించవచ్చు. అయినప్పటికీ మొత్తం దృశ్యాన్ని చూడగలగాలి. ముందుగా అనుకోని, ఊహించలేని పరిస్థితులు దాపురించినపుడు వాటి ప్రభావం మూలంగా దేశ ఆర్థిక స్థితి ఒడిదుడుకులను ఎదుర్కోవలసి వస్తుంది. పాజిటివ్‌గా కనబడుతున్న ఈ జిడిపి అంకెలు ప్రజల కొనుగోలు శక్తి పెరగడం వల్ల సంభవించినవి కావు. ప్రభుత్వం ఖర్చు పెంచడం వల్ల వచ్చిన అంకెలివి. ప్రజల కొనుగోలు శక్తి 3 లేక 3.2 వద్ద నిలబడి ఉంది

వారీగా పెట్రోల్ ధర పెంచుతున్నా, ప్రజా నిరసనను బలంగా ప్రదర్శించలేక జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ చతికిలబడి పోయింది. పెరిగిన ఉల్లిపాయల ధరను ఆధారంగా చేసుకొని ఇందిరా గాంధీ నాయకత్వంలో ముందుకు కదిలి అప్పటి జనతా పార్టీ ప్రభుత్వాన్ని పడగొట్టిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉంది. ఇప్పుడు పెట్రోల్ ధర పెరుగుదలను వ్యతిరేకిస్తూ కార్యాచరణకు సిద్ధమయితే కనీసం ఆ పార్టీ అస్థిత్వమయినా నిలబడుతుంది. ప్రభత్వ లోపాలను ఆసరా చేసుకొని అధికారం చేజిక్కించుకోవడానికి భాజాపా అవకాశం కోసం ఎదిరిచూస్తూ అలర్ట్‌గా ఉన్నది. యువతను ఆకర్షించే పనిలో ఒక్కొక్క అడుగు ముందుకేస్తున్నది. తెలంగాణ సమాజం ప్రముఖంగా సెక్యులర్ లక్షణం కలిగినది. ముస్లింలు, క్రైస్తవులు, ఆదివాసీలు, దళితులతో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు సామరస్యంగా జీవించే విశ్వజనీన సంస్కృతి కలిగినది తెలంగాణ. ఈ సంస్కృతిని కాపాడే సిద్ధాంత బలం భాజాపాకు ఉందా అని ప్రజలు తీవ్రంగా ఆలోచించాలి. వామ పక్షాలు విశ్రాంతికి అలవాటు పడ్డాయి. నిరుద్యోగ సమస్యతో సతమతమవుతున్న తెలంగాణను పలకరించడానికి పక్క రాష్ట్రం ఆడ పడుచు రావాల్సి వచ్చింది. వాళ్ల నాయన తెలంగాణకు వెళ్లాలంటే వీసా కావాలా అని అడిగి ఆంధ్ర ప్రాంతం ఓట్లన్నీ దండుకొని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండవసారి ముఖ్యమంత్రి అయ్యాడు. వీసా ఏమీ లేదు డబ్బు సంచులుంటే చాలు అని నవ్వులు చిందిస్తూ తెలంగాణలో మకాం వెయ్యడానికి సిద్ధపడింది ఆ ఆడపడుచు. ఒంటె, గుడారం కథను మళ్లీ గుర్తుతెచ్చుకోవాలి తెలంగాణ ప్రజలు. తెలంగాణ జన సమితి తెలంగాణ సంస్కృతిని జీర్ణించుకొని సమస్యలకు స్పందించే గుణం ఉంది కాని దానికి ప్రజాబలం కరువైంది. సమస్యల సుడిగుండంలోంచి బయట పడాలంటే, తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు నెరవేరాలంటే కింకర్తవ్యమ్ అన్న మీమాంసలో తెలంగాణ సమాజం నేడు ఉన్నది.

(రచయిత జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్) వీ

తప్ప అంతకు మించి మెరుగుపడలేదు. కరోనా రెండవ వెల్లువ, మొదటి వెల్లువకన్నా హెచ్చు ఉపద్రవాన్ని తెచ్చిపెట్టింది. పేద కుటుంబాల కొనుగోలు శక్తిని ఈ 2వ వెల్లువ పూర్తిగా హరించి వేసింది. చిరుద్యోగులను, చిరు వ్యాపారులనే కాక, మధ్య, ఎగువ మధ్యతరగతి కుటుంబాల కొనుగోలు శక్తిని కూడా ఇది దెబ్బకొట్టింది. కరోనా మొదటి వెల్లువలో ఇబ్బంది లేకుండా గట్టెక్కినవారు కూడా రెండవ వెల్లువతో ఆచితూచి ఖర్చుపెట్టే స్థితికి నెట్టబడ్డారు. తిరిగి వీరి కొనుగోలు స్థితిలో మార్పువచ్చి, సరుకుల కొనుగోళ్లుచేసే స్థాయికి చేరుకోనిదే ఆర్థిక వ్యవస్థ పట్టాలు ఎక్కిందని భావించలేం.

2. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) దేశంలో వినియోగదారుల మనోస్థితి 15 శాతానికి దిగజారిందని, నిరుద్యోగుల సంఖ్య ఈ సంవత్సరం మొదటి ఐదు నెలల్లో 25 మిలియన్లకు అంటే 2.5 కోట్లకు చేరుకుందని చెబుతోంది. దీనిపై మీ స్పందన ఏమిటని అడిగితే డా. రాజన్ వెలిబుచ్చిన అభిప్రాయం:

ఈ అంకెలు బాధాకరమైనవే! మొదటి కరోనా వెల్లువప్పుడు ప్రకటించిన లాక్‌డౌన్ అంత నాటకీయంగా లేనప్పటికీ, రెండవ వెల్లువ దేశ ప్రజలపై వేసిన ప్రభావం లోతైనది, విస్తారమైనది, చాలా విషాదమైనది. కరోనా 2వ వెల్లువలో మరణాలపై 'ప్రశ్నమ్' అనే సంస్థ నిర్వహించిన సర్వే ప్రస్తావిస్తూ, సర్వే చేసిన 100 మందిలో 70 మంది తమకు దగ్గరవారినో, లేక తమకు బాగా తెలిసిన వారినో ఒకరిని కోల్పోయినట్లు చెప్పారు.

ఈ అంకెలను బట్టి మరణాల విస్తృతి, పౌరుల కుటుంబాలపై ఆ మరణాలు వేసే ఆర్థిక ప్రభావం అంచనా వేయవచ్చు. న్యూయార్క్ ప్రాంతంలో కరోనా సృష్టించిన కల్లోలానికి, ఇక్కడ జరిగిన ప్రాణ నష్టానికి సారూప్యత ఉంది. ఇక్కడ మరణాలపై పలు సంస్థలు పలు విధాల లెక్కలు ప్రకటిస్తున్నాయి. వాటి మాట ఎలా ఉన్న ఇది వినాశకర పరిణామమనే చెప్పాలి.

ఈ దశలో కరణ్ థాపర్ కలగచేసుకుంటూ ఇదంతా ప్రభుత్వపు బాధ్యతారాహిత్యం వల్ల ఏర్పడ్డ వినాశనమని మీరు అనరా? కరోనా రెండవ వెల్లువపై అనేక సంస్థలు, నిపుణులు ముందస్తు హెచ్చరికలు చేసినప్పటికీ వాటిని పట్టించుకోని ప్రభుత్వం, ప్రధాని మోడీ కరోనా భారతదేశాన్ని ఏమీ చేయలేదని, కరోనాను దేశం నుండి తరిమేసి విజయం సాధించామని ప్రపంచ ఆర్థిక కూటమి (వరల్డ్ ఎకనామిక్ ఫోరం) లో ప్రకటించడం కాదా? అంటే 'మేము ప్రత్యేకం', మేము 'విజయం సాధించాం' అని ప్రగల్భాలు పోవడంగా మీరు భావించరా? అన్నప్పుడు డా. రాజన్ స్పందనను నిశితంగా అర్థం చేసు కోవాల్సి ఉంది.

దీనికి అనేక కోణాలు కనిపిస్తాయి. మౌలిక విషయాలు ఉన్నాయి. జరిగిన అనర్థాన్ని నిర్వచించడానికి మనం పదాలు చాలానే వాడవచ్చు. కరోనా రెండవ దశ వల్ల దేశంలో జరిగిన వినాశనానికి మూల కారణం మట్టుకు ప్రభుత్వ వైఫల్యమే అని చెప్పక తప్పదు. అంతే కాదు, ఈ స్థితిని ప్రశ్నించాల్సిన వాళ్లు ప్రశ్నించకపోవడం కూడా పెద్ద వైఫల్యం. వైఫల్యాలను వైఫల్యాలుగా గుర్తించ నిరాకరించడం మరిన్ని వైఫల్యాలకు దారి తీస్తుంది. వ్యవస్థలో ఈ పోకడను ప్రశ్నించే స్థాయిలో ఉన్నవాళ్లు ఇటువంటి వైఖరిని ప్రశ్నించక పోవడం కూడా ఓ వైఫల్యమే! దేశాన్ని కాపాడడానికి అత్యవసరంగా కావాల్సిన వాక్సిన్లు లేక జనం పిట్టల్లా రాలిపోతుంటే, బాస్! ఏవినాయనా వాక్సిన్లు అని అడిగేవాడు కరువైతే పరిస్థితి ఎలా ఉంటుంది? అదే స్థితి మనముందు ఉంది.

ఇక దేశ ఆర్థిక వ్యవస్థ పుంజుకోవాలన్నా, జనం వీధుల్లోకి రావాలన్నా, వచ్చి సరుకులు కొనాలన్నా ముందు కరోనా కల్లోల స్థితి నుండి బయట పడాలి. అది జరగాలంటే అత్యంత వేగంగా దేశ ప్రజలకు వ్యాక్సినేషన్ ప్రక్రియ పూర్తి కావాలి. అంటే కోట్ల సంఖ్యలో వ్యాక్సిన్లు త్వరితగతిన సమకూర్చాలి. వీటి దేశీయ ఉత్పత్తిని పెంచడం, బయట నుండి రప్పించడం ఆఘమేఘాల మీద జరగాలి. అంటే సకల వనరులను సమీకరించి ఈ వ్యాక్సిన్ ప్రక్రియకు మొదటి ప్రాధాన్యతను ఇచ్చి వేగవంతంగా ముగిస్తే గాని అన్ని ఇతర ఆర్థిక కార్యకలాపాలు దారినపడవు. ఇది జరగకుండా మేము ప్రత్యేకం అని గాని, మేము విజయం సాధించామని గాని చెప్పుకోవడంలో అర్థమేమీ ఉండదు.

ప్రతి దేశం తానో ప్రత్యేకమైన దేశంగా భావించడం అసమంజసమేమీ కాకపోవచ్చు. అయితే ఆ ప్రత్యేకత దానంతట అదే రాదు. దానికి తగ్గ కష్టం, శ్రమ పడాలి. తన ప్రత్యేకతను నిరూపించుకోగలగాలి. ఇక తాను అన్నీ జయించానని అనుకోవడం ప్రమాదకరం. ఏ అభివృద్ధి చెందిన దేశమైనా అలా అనుకుని ఉంటే అది ఉన్నత శిఖరాలను చేరుకోవడంలో వైఫల్యం చెందేది.

ఇక దేశంలో ఉద్యోగాల విషయానికి వస్తే, కరోనా తీవ్రత తగ్గి, జనం బయటపడి బజార్ల బాట పడితే గాని పోయిన ఉద్యోగాలు, పనులు తిరిగిరావు. అది ఎంత వేగంగా జరిగితే ఆ మేరకు ఉద్యోగాలు, పనులు లభిస్తాయి. ఈ కరోనా ఉపద్రవ కాలంలో అనేక చిరు వ్యాపారాలు, చిన్న మధ్య తరగతి పరిశ్రమలు మొత్తానికే మూతపడినవి తిరిగి తెరుచుకుంటాయని భరోసా లేదు. కొత్త మార్పు రావాల్సిందే. ఈ సంక్షోభ కాలంలో పేద వర్గాల వారికి ప్రభుత్వ సత్వర మద్దతు చాలా అవసరం. నిత్యావసర సరుకుల కొనుగోలుకు వారికి నగదు బదిలీ సౌకర్యం పెంచాలి. పట్టణ పేదలకు కూడా 'మనరేగా' వంటి పథకాల అవసరం ఉంది.

ఇది ఒక పార్శ్వమైతే, ప్రతి ఏటా చదువులు ముగించుకుని ఉద్యోగార్థులై ఉద్యోగ బజారులో ప్రవేశించే వారి సంఖ్య ఒక కోటి ఉంటుంది. వీరికి ఉద్యోగాలేవి? మరి వాళ్ల సంగతేమిటి? దేశంలో పటేల్, జాట్ ఉద్యమాలు ఏమి చెబుతున్నాయి? కేవలం వ్యవసాయం వాళ్లను ఇముడ్చుకోలేదు. వాళ్లకి ఉద్యోగాలు కావాలి. ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు లేవు. అవి ఎక్కడా కనిపించడం లేదు. అందుచేత అందరూ ప్రభుత్వ ఉద్యోగాలు కావాలని నినదిస్తున్నారు. మరి వీళ్లకేం జవాబు చెబుతారు? ఇదంతా ఏమి తెలియచేస్తోంది? ప్రభుత్వాల భవిష్య దృష్టి లేమిని, దాని వల్ల ఏర్పడ్డ సంక్షోభాన్ని బయటపెడుతోంది. ఇపుడు కేంద్రంలో గాని, రాష్ట్రాల్లో గాని రాజ్యం చేస్తున్నది పాప్యులిస్ట్ నియంతృత్వ నీతి. అంతేగాని ప్రజా సంక్షేమంతో కూడుకున్న దూరదృష్టి కాదు. అసలు సరైన విజన్ లేనప్పుడు ఏమి ఫలితాలు సాధ్యమౌతాయి?

ఇప్పుడు కరోనా మాటున దాక్కోవాలని చూస్తున్నాము గాని, కరోనాకి పూర్వం నుండే ఈ దేశ ఆర్థిక వ్యవస్థ గాడి తప్పింది. లెక్కల గారడీ వల్ల ఉపయోగమేముంది? నోట్ బందీ వంటి అనాలోచిత, అనైతిక అరాచక చర్యల వల్ల అది మరింత అస్తవ్యస్తమైంది.

నిపుణుల మాటలు పెడచెవిన పెట్టడం, అవతలి వాడు చెప్పే మాటల్లో మంచిని గ్రహించలేకపోవడం, ప్రత్యర్థుల గొంతులు నొక్కేయడం, చర్చను లేకుండా చేయడం అనే అవలక్షణాల మూలంగా దేశానికి చాలా ఆర్థిక అనర్థం జరిగింది. సంక్షోభం ముదిరిపోయింది.

కరోనా పూర్వ వృద్ధిరేటును ఇపుడు అందుకోవాలన్నా చాలా కోర్స్ కరెక్షన్, నడత దిద్దుబాటు జరగాలి. వ్యవస్థ రిపేర్ జరగాలి. అటువంటి చర్యలు చేపట్టకుండా కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజాకర్షక పథకాల నియంతృత్వ పోకడల్లో మునిగి తేలుతుంటే దేశంలో అభివృద్ధి ఎలా సాధ్యపడుతుంది?

దేశానికి ఎన్ని టీకాలు కావాలి? వాటిని ఎలా ఓనకూర్చుకోవాలి? త్వరితగతిన దేశమంతా టీకా ప్రక్రియ ఎలా పూర్తిచేయాలి? వీటిని ఉత్పత్తి చేసే కంపెనీలు ఏమి అడుగుతున్నాయ్? పట్టించుకోవాలి కదా! అలాకాక భారం రాష్ట్రాలపై నెడితే, రాష్ట్రాలు ఎగబడి దేశ – విదేశీ కంపెనీలపై వ్యాక్సిన్ సరఫరాకై ఒత్తిడితెస్తే అవి ధరలు పెంచక ఏమిచేస్తాయి? కంపెనీలకు రాష్ట్రాల ఆర్థిక స్థిగతులు తెలియవా? కేంద్రం చెయ్యాల్సిన పనిని, నిర్వర్తించాల్సిన బాధ్యతను ఈ కల్లోల సందర్భంలో వనరులు లేమితో మూలుగుతున్న రాష్ట్రాలపై నెట్టి చేతులు దులుపుకోవడం వెనుక నీతి సరైనదేనా? వాక్, సభా స్వాతంత్రాలను మృగ్యం చేస్తూ, మన వెనకటి ప్రభుత్వాల్లో విజ్ఞులు నిర్మించి, అందించిన సకల వ్యవస్థలను నిర్వీర్యం చేస్తే ప్రపంచ దేశాల్లో మన ప్రతిష్ఠ సంగతి పక్కకు పెట్టి, అటువంటి చర్యలు మనకు మేలుచేస్తాయా, కీడు చేస్తాయా అని.ముందు మన గురించి మనం ఆలోచించాలి కదా!

విదేశీ పెట్టుబడులు పెట్టేవారు, ఈ దేశంలో వారు పెట్టే పెట్టుబడులకు రక్షణ, వివాదాల పరిష్కార సౌలభ్యత, న్యాయబద్ధత చూస్తారు. ఈ దేశంలో న్యాయవ్యవస్థ స్వతంత్రంగా ఉందా, లేక ప్రభుత్వానికి లొంగిపోయి ఉందా అని చూస్తారు. ఇదివరలో ఇండియా ఓ నమ్మదగ్గ ప్రజాస్వామిక దేశంగా గుర్తింపు పొందింది. దానితో జతకట్టవచ్చని అమెరికాతో సహా ఇతర సంపన్న దేశాలు భావించేవి. ఇప్పుడు ఆ భావన సన్నగిల్లిపోయిందనే చెప్పాలి. నాకు అమెరికాలో అధికారవర్గాలతో మసిలే సందర్భాలు ఉంటాయి. వారంతా ఇదివరలో ఇండియా గురించి వేయని ప్రశ్నలు ఇపుడు తరచూ వేస్తున్నారు. విదేశీ మీడియా వేసే ప్రశ్నలు సరేసరి. వాళ్ల ప్రశ్నలు ప్రతిదినం పెరుగుతూనే ఉన్నాయి. విదేశీ అధికార వర్గాలు, మీడియా వలే పెద్దనోరు ప్రదర్శించకపోవచ్చు. బాహాటంగా ప్రశ్నలు కురిపించకపోవచ్చు. ట్విట్టర్ కార్యాలయంపై దాడిని వారు ఓ సరికొత్త ఉదాహరణగా తీసుకుంటున్నారు.

ఈ దేశంలో అనేక అద్భుతమైన ప్రభుత్వ రంగ సంస్థలు, వ్యవస్థలు నిర్మితమై సత్ఫలితాలనిస్తూ పనిచేస్తున్నాయి. ప్రభుత్వ రంగంలో నిష్ణాతులు, చాలా తెలివితేటలు గలవాళ్లు ఉన్నారు. దీనికి ఇస్రో సంస్థ ఓ మంచి ఉదాహరణ. అక్కడ శాస్త్రజ్ఞులు తక్కువ ఖర్చుతో మంచి ఫలితాలు, విజయాలు సాధించారు.

ఈ దేశంలో ఎన్నో స్వతంత్ర వ్యవస్థలు ఉన్నాయి. ఇదివరలో అవి చాలా స్వతంత్రంగా పెద్దగా రాజకీయ ప్రమేయం లేకుండా పనిచేసి ప్రభుత్వాల పనితీరుపై నిఘా పెట్టేవి. అవి ప్రభుత్వాలు సరైన దారిలో నడిచేందుకు దోహదపడ్డాయి. శేషన్ వంటి గట్టి పట్టుదలగల వారు ఎలక్షన్ కమిషన్ స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడి ఎన్నో సంస్కరణలు తీసుకు రాగలిగారు. ఎన్నికల్లో జరిగే అరాచకాన్ని అరికట్టగలిగారు. అలా చేసినందుకు ఆయనకు ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వలేదు. అడ్డుగా భావించి తొలగించుకున్నారు.

ఆర్‌బిఐ, సిబిఐ, కంట్రోల్ కమిషన్స్ ఆఫ్ ఇండియా ఇలా ఎన్నో సంస్థలు ఇప్పుడు ఎలా ఉన్నాయి? వీటి స్వతంత్ర ప్రతిపత్తిని ప్రభుత్వాలు, ప్రజలు కాపాడుకోవాలి. అవి ప్రభుత్వాలు చేసే తప్పులను ఎప్పటికప్పుడు ఎత్తి చూపి వాటి నడతలో లోపాలుంటే సరిదిద్దుకొమ్మని ఓ చెక్ పెడతాయి. వీటిని వమ్ముచేసుకుంటే సంభవించే విష పరిణామాలను ప్రజలు భరించాల్సి వస్తుంది. అలా జరగకుండా ప్రజలు, బాధ్యులు ప్రశ్నించక భజనాపరులుగా మారిపోతే జరిగే నష్టం అపారం.

ఇక వైద్యం, విద్య విషయాల్లోకి వస్తే మన పరిస్థితి మెరుగైన తీరులో ఏమీలేదు. పట్టణాలు, నగరాల్లో పరిస్థితి ఎలా ఉందో కరోనా విలయం బయట పెట్టింది. ఆసుపత్రులు చాలక, పడకలు దొరక్క ఆసుపత్రుల వరండాల్లో, ముందున్న రోడ్లమీదా రోగులకు వైద్యం అందించారు. ఇహ గ్రామాల సంగతి దుర్భరం. చెప్పాల్సిన పనిలేదు. ఆక్సీజన్ సరఫరా వ్యవస్థ కుప్పకూలి ప్రభుత్వాల నిస్చేష్టతను బయట పెట్టింది. గ్రామాల్లో విద్యారంగ పరిస్థితి దయనీయం. ఉన్నత విద్య లోపభూయిష్టం. వీటన్నిటినీ సరిదిద్దాలంటే ఓ విజన్, సరైన దృష్టి ఉండాలి. మనకు అసలు ఎటువంటి భారతదేశం కావాలో తేల్చుకోవాలి.

వాక్‌సభా స్వాతంత్రాలు లోపించిన చోట చర్చకు, సంప్రదింపులకు, స్వతంత్ర వ్యవస్థల మనుగడ కరువైన చోట ఓ విజన్ ఏర్పడడం కష్ట సాధ్యం. ఓ భవిష్య దృష్టి లోపించిన దేశం చాలా కష్టనష్టాలను ఎదుర్కోవలసి వస్తుంది. దక్షిణ కొరియా దేశం ఒకప్పుడు పేద దేశమే కదా! అయితే అది ఒక విజన్ పెట్టుకుని పనిచేసి ధనిక దేశంగా మారింది.

మనం ఇప్పుడు బంగ్లాదేశ్‌తోనో, వియత్నాంతోనో పోటీపడి వస్తు ఉత్పత్తి రంగంలో కృషి చేయడం మంచిదే. కాదనను. కానీ మనకు ఇతర బలాలు ఉన్నాయి. వాటిని మరింత సానబెట్టి సేవారంగంలో రాణించడం, హైవాల్యూ ద్రవ్యరంగ సేవలు, ఇతర కన్సల్టెన్సీ సేవలు ప్రపంచానికి అందించి బాగా రాణించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. వాటిపై దృష్టి సారించాలి. ఇలా జరగాలంటే మన ఉన్నత విద్యాలయాలు పేరెన్నికగన్న ప్రపంచస్థాయి విద్యా సంస్థలతో భేటీ కట్టాలి. మన నైపుణ్యాల స్థాయి పెంచుకోవాలి. నూతన విద్యా విధానం ఈ దిశగా కొంత ఉపయోగపడవచ్చు.

ఇప్పుడు దేశాన్ని నడుపుతున్నవారు భారత ప్రజా రాసులను సమైక్య దృష్టితో చూడ నిరాకరిస్తున్నారు. నువ్వు వేరు, నేను వేరు అనే గదులు గీస్తున్నారు. మనదేశం భిన్నత్వంలో ఏకత్వం సాధించింది. ఇది ఈ దేశ ప్రజల ఘన విజయం. దానిని చేజార్చుకోవడం బాధాకరం. సమైక్య స్ఫూర్తితో, ప్రజలందరినీ కలుపుకుని ఒకే తాటిపై నడిపించే నాయకత్వం ఇప్పుడు ఈ దేశానికి ఎంతైనా అవసరం. అలా చేయగలిగిన రోజు భారతదేశం తన స్వతంత్రతను, ప్రత్యేకతను నిలుపుకుంటూ ఘన విజయాలు సాధించగలదనడంలో సందేహం లేదు. ఇప్పుడు దేశానికి కావలసింది ఆత్మనిర్భరత కాదు, ఆత్మవిశ్వాసం.

కరణ్ థాపర్‌తో డా. రఘురామ్ రాజన్ జరిపిన ఈ సంభాషణను నేను ఎన్నుకోడానికి రెండు కారణాలున్నాయి. అవిచెప్పి, వాటితో పాటు ఈ సంభాషణపై నా అభిప్రాయం కూడా వెలిబుచ్చి ఈ వ్యాసం ముగిస్తాను.

ప్రజా సంఘాల నిషేధ లక్ష్యం శ్మశాన శాంతి స్థాపన

***పదహారు ప్రజా సంఘాలను చట్టవ్యతిరేకమైనవిగా ప్రకటిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల అప్రజాస్వామికతనూ రాజ్యాంగ వ్యతిరేకతనూ విశ్లేషిస్తున్నారు* ఎన్. వేణుగోపాల్**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో పనిచేస్తున్న పదహారు ప్రజాసంఘాలను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని ఏప్రిల్ 24 పత్రికల్లో వార్తలు వెలువడ్డాయి. ఆ వార్తలకు మూలం అప్పటికి 24 రోజుల కింద విడుదలైనప్పటికీ, ఆ ముందు రోజే పత్రికలకు అందిన ప్రభుత్వ ఉత్తర్వులు. మార్చ్ 30 తేదీతో సాధారణ పరిపాలనా శాఖ విడుదల చేసిన జి. ఓ. నం. 73 అనే ఆ ఉత్తర్వులు, తెలంగాణ ప్రజా భద్రతా చట్టం 1992 కింద "నిషిద్ధ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) అనుబంధ సంస్థలైన పదహారు కొత్త ప్రజా సంఘాలను 2021 మార్చ్ 30 నుంచి ఏడాది పాటు చట్టవ్యతిరేక సంస్థలుగా ప్రకటిస్తున్నట్టు" చెప్పాయి.

"తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టిపిఎఫ్), తెలంగాణ అసంఘటిత కార్మిక సమాఖ్య (టిఎకెఎస్), తెలంగాణ విద్యార్థి వేదిక (టివివి), డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (డిఎస్‌యు), తెలంగాణ విద్యార్థి సంఘం (టివిఎస్), ఆదివాసి విద్యార్థి సంఘం (ఎఎస్‌యు), కమిటీ ఫర్ రిలీజ్ ఆఫ్ పొలిటికల్ ప్రిజనర్స్ (సిఆర్‌పిపి), తెలంగాణ రైతాంగ సమితి (టిఆర్ఎస్), తుడుం దెబ్బ (టిడి), ప్రజా కళా మండలి (పికెఎం), తెలంగాణ డెమోక్రటిక్ ఫ్రంట్ (టిడిఎఫ్), ఫోరం అగెనెస్ట్ హిందుత్వ ఫాసిస్ట్ అఫెన్సివ్ (ఎఫ్ఎహెచ్ఎఫ్ఓ), సివిల్ లిబర్టీస్ కమిటీ (సిఎల్‌సి), అమరుల బంధు మిత్రుల సంఘం (ఎబిఎంఎస్), చైతన్య మహిళా సంఘం (సిఎంఎస్), విప్లవ రచయితల సంఘం (విరసం) అనే నిషిద్ధ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) అనుబంధ సంస్థలైన పదహారు కొత్త సంస్థలు ప్రజలను హింసాత్మక, బెదిరింపు చర్యలకు ప్రోత్సహిస్తున్నాయి, సహకరిస్తున్నాయి. ఈ కింద పేర్కొన్న హింసా చర్యలకు పదేపదే పాల్పడుతున్నాయి" అని ఈ జి. ఓ. లో మొదటి పేరాలో ఉపోద్ఘాతం చెప్పింది.

ఆ తర్వాత వరుసగా ఐదు రకాల "హింసా చర్యల" జాబితా రాశారు. ఆ జాబితాలో,

"1. రాజ్యానికి వ్యతిరేకంగా యుద్ధం చేయాలనే వ్యూహం –

మొదటి కారణం:

ఈ దేశంలో మధ్య, పై, తరగతి ప్రజలు ఏ నూతన ఉదారవాద ద్రవ్య పెట్టుబడిదారీ విధానాలపై ఆశలు పెట్టుకుని ఉన్నారో, ఆ విధానాలు కుప్పకూలి పోకుండా ఉండాలంటే ఉదారవాద ప్రజాస్వామ్యం బతికి బట్టకట్టాలి. వాక్‌సభా స్వాతంత్రాలు, స్వతంత్ర న్యాయ వ్యవస్థ, రాజ్యాంగ విలువలు, వ్యవస్థ పట్టాలు తప్పకుండా చెక్ పెట్టే నిఘా సంస్థలు ఉండాలి. ఎంతో శ్రమించి సాధించుకున్న ప్రభుత్వ రంగం, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగాలు ప్రజల చేజారిపోకూడదు. స్వాతంత్ర్యానంతర తొలి నాలుగు దశాబ్దాల్లో దేశాన్ని నడిపించిన మిశ్రమ ఆర్థిక విధానాలు ఆ కాలానికి అవసరమైన పునాదులు వేసి సత్ఫలితాలను ఇచ్చాయనేది మరువకూడదు. బ్యాంకుల జాతీయకరణ విస్తృత జనారాసులకు చేసిన మేలు మరువకూడదు.

80ల నుండి దశ దిశ మారింది. సరళీకరణ, ప్రపంచీకరణ ప్రవేశించాయి. వాటి మిశ్రమ ఫలితాలు, ఒనగూరిన మంచిచెడులు బేరీజు వేసుకోవాలి. డా. రఘురామ్ రాజన్ పై సంభాషణ ద్వారా ఇదే సందేశం ఇవ్వదల్చాడని నేను భావించాను.

రెండవ కారణం:

ఇప్పుడు దేశ పాలకులు సమైక్య విధానాన్ని తొక్కిపెట్టి, వికృత ఏకీకృత విధానాన్ని, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని ప్రజల నెత్తిన భయపెట్టి, బలవంతంగా రుద్దుతున్నారు. ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాలు, 'ఆధాని ప్రభ' ఈ దుర్నీతికి ప్రబల నిదర్శనలు. ఈ విధానాల వల్ల విస్తారంగా నష్టపోతున్న శ్రామిక రాసులు, మధ్యతరగతి ప్రజలు ఈ విధానాలను వ్యతిరేకించకుండా మౌనంగా ఉండిపోవడమంటే, గొంతు విప్పకపోవడ మంటే అది ఇప్పటి పెద్ద సంక్షోభం అనే చెప్పాలి. రఘురామ్ రాజన్ దీనిపై కూడా హెచ్చరిక చేస్తుండడం గమనించాల్సిన అంశం.

ఇక నా అభిప్రాయం:

పాషాణ హృదయం కన్నా ఉదార హృదయం మెరుగు కదా! గుడ్డి కన్నా మెల్ల మేలు కదా! నినాదాలు, ప్రగల్భాలు కాదు చేతలు, అంతిమ ఫలితాలు కదా ముఖ్యం. ఉన్నది కాపాడుకుంటూ లేనిది సాధించుకోడానికి అవిరళ కృషి సల్పడం విజ్ఞత కదా!

ఆలోచించండి. త్వర త్వరగా అడుగులు వేయండి. చేతులు పూర్తిగా కాలిపోయాక, ఇల్లు తగలబడిపోయాకా పొలికేకలు వేసినా ఉపయోగం ఉండదు. జోష్‌లోకి రండి.

ఇక నాబోటి వాళ్లు ఈ దేశంలో 60 ఏళ్లుగా సోషలిస్టు సమాజ నిర్మాణపు కలలు కంటూనే ఉన్నాం. ప్రజా విప్లవోద్యమాలు విజయవంతమై సమాజంలో నూతన ప్రజాస్వామిక నిర్మాణం జరిగి, సోషలిజం వైపు, కమ్యూనిజం వైపు పయనిస్తుందనే ఆశతోనే జీవిస్తున్నాం. అదో సుదీర్ఘ తీరం. ఆ తీరం చేరే మార్గం కూడా సుదీర్గమే. ఈ లోపు ప్రజలు ఏమి నిలుపుకోవాలో ఆలోచించకపోతే పెను ప్రమాదంలో పడతారు.

(రచయిత శ్రామికనేస్తం సంపాదకులు) వీ

ఎత్తుగడలు డాక్యుమెంట్ ప్రకారం ఈ అనుబంధ సంస్థల కార్యకర్తలు పట్టణ గెరిల్లా చర్యల ఎత్తుగడలను చేపట్టి, వేరు వేరు ముసుగులతో పట్టణ ప్రాంతాలలో తిరుగుతున్నారు.

2. కొత్త ఎత్తుగడలను చేపట్టి తమ కార్యకలాపాలను మరింతగా పెంచుతూ, వివిధ సంస్థలతో చేతులు కలుపుతూ, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వేరువేరు సమస్యలను లేవనెత్తుతూ రెచ్చగొట్టే ప్రకటనలు, సభలు, ప్రదర్శనల ద్వారా సభ్యులను తమ వైపు ఆకర్షిస్తున్నారు.

3. ఈ అనుబంధ సంస్థల కార్యకర్తలు ఛత్తీస్ గడ్ అటవీ ప్రాంతాలలోని మావోయిస్టు నాయకత్వంతో నిరంతర సంబంధాలలో ఉన్నారు, కలుస్తున్నారు. సిపిఐ (మావోయిస్టు) ఆదేశాల మేరకు వీరు బీడు భూముల సమస్యల మీద, అనుబంధ సంఘాల కార్యకర్తలపై రాజ్య నిర్బంధం అనబడే సమస్య మీద వేరువేరు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. వీటితోపాటు భీమా కోరేగాం కేసులో అరెస్టు చేయబడిన విరసం స్థాపకుడు వరవరరావు, ప్రొ. జి ఎన్ సాయిబాబా (శిక్షపడిన తీవ్రవాది), రోనా విల్సన్, తదితర వివిధ అనుబంధ సంఘాల నాయకులను విడుదల చేయాలనీ, ఊపా చట్టాన్ని, వ్యవసాయ చట్టాలను, సిఎఎ/ఎన్ ఆర్ సి వగైరాలను రద్దు చేయాలనీ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు.

4. ఈ అనుబంధ సంఘాల కార్యకర్తలలో కొందరు చట్టబద్ధంగా స్థాపించబడిన ప్రభుత్వాలకు వ్యతిరేకంగా యుద్ధం చేసేందుకు సిపిఐ (మావోయిస్టు) అజ్ఞాత కార్యకర్తలుగా మారుతున్నారు.

5. పైన చెప్పిన పదహారు అనుబంధ సంఘాలు తమ లక్ష్యాలు, ఆశయాలు, సభ్యులు, పనితీరులతో, సిపిఐ (మావోయిస్టు) ఆదేశాల మేరకే ఏర్పడ్డాయి."

ఈ పదహారు సంఘాలూ ప్రజా పాలనలో జోక్యం చేసుకునే ఉద్దేశంతో పని చేస్తున్నాయనీ, సామాజిక జీవనానికి అవసరమైన సరఫరాలనూ సేవలనూ అందించడానికి ఆటంకంగా ఉన్నాయనీ, శాంతిభద్రతలకు భంగకరంగా ఉన్నాయనీ, తద్వారా ప్రజాశాంతికి ప్రమాదకరంగా ఉన్నాయనీ, అందువల్ల వీటిని చట్టవ్యతిరేక సంస్థలుగా ప్రభుత్వం భావిస్తున్నదనీ రెండో పేరా చెప్పింది.

ఈ పదహారు సంఘాల కార్యకలాపాల రీత్యా వీటిని తక్షణమే చట్టవ్యతిరేక సంస్థలుగా ప్రకటించాలని ప్రభుత్వం భావిస్తున్నదని మూడో పేరా చెప్పింది.

అందువల్ల, తెలంగాణ ప్రజా భద్రతా చట్టం, 1992 సెక్షన్ 3 లోని సబ్ సెక్షన్లు 1, 4 ప్రకారం ఒనగూరిన అధికారాలతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ పదహారు సంస్థలనూ రాష్ట్రంలోని 33 జిల్లాలలో చట్టవ్యతిరేక సంస్థలుగా ప్రకటిస్తున్నట్టు నాలుగో పేరా చెప్పింది.

తెలంగాణ రాష్ట్ర గవర్నర్ ఆదేశాల మేరకు, గవర్నర్ పేరు మీద ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ సంతకం చేశారు.

ఈ ఉత్తర్వులు ఏ చట్టం కింద వెలువడ్డాయో కనీసం ఆ చట్ట నిబంధనలను కూడా పాటించకుండా వెలువడినందువల్ల చట్టవ్యతిరేకమైనవి. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల నేపథ్యంలో చూసినప్పుడు అనైతికమైనవి. వెలువడిన సమయం రీత్యా అసందర్భమైనవి. రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నాయి గనుక రాజ్యాంగ వ్యతిరేకమైనవి. మౌలికమైన మానవ నైసర్గిక హక్కులకు, సంఘ జీవితానికి వ్యతిరేకమైన చర్యలను ప్రతిపాదిస్తున్నందువల్ల అప్రజాస్వామికమైనవి.

ఇటువంటి ఉత్తర్వులు జారీ చేయడానికి ప్రభుత్వానికి తెలంగాణ ప్రజా భద్రతా చట్టం 1992 ప్రకారం పూర్తి అధికారం ఉంది గాని, ఉత్తర్వులు జారీ చేయడంలో, వాటిని విడుదల చేయడంలో, ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత పాటించవలసిన పద్ధతులలో ఏ ఒక్క విషయంలోనూ ప్రభుత్వం తాను చెప్తున్న చట్టాన్ని కూడా పాటించలేదు. ఆ చట్టం లోని సెక్షన్ 3 ప్రకారమే ప్రభుత్వం ఏదైనా సంస్థను చట్టవ్యతిరేక సంస్థగా ప్రకటించ దలచుకున్నప్పుడు ఒక నోటిఫికేషన్ ద్వారా ఆ పని చేయవచ్చు. ఆ సంస్థ రిజిస్టర్డ్ సంస్థ అయితే ఆ సంస్థ రిజిస్టర్డ్ కార్యాలయానికి రిజిస్టర్డ్ పోస్టులో ఆ నోటిఫికేషన్ పంపాలి. లేదా ఆ సంస్థ బాధ్యుల చేతికి అందించాలి. వారు లేకపోయినా, అది తీసుకోవడానికి నిరాకరించినా, ఆ రిజిస్టర్డ్ కార్యాలయ గోడకో, తలుపుకో అంటించాలి. ఆ సంస్థ రిజిస్టర్డ్ సంస్థ కాకపోతే, దాని దృష్టికి తేవడానికి ఒక స్థానిక దినపత్రికలో ఆ నోటిఫికేషన్ ను ప్రచురించాలి. అంటే నోటిఫికేషన్ ను పత్రిక రాసిన వార్తగా కాదు, నోటిఫికేషన్ ను యథాతథంగా వాణిజ్య ప్రకటనగా ఇవ్వాలి.

ఆ నోటిఫికేషన్ తమ కార్యాలయానికి అందిన రోజు నుంచి, లేదా తమ కార్యాలయ గోడకు అంటించబడిన రోజు నుంచి లేదా పత్రికలో ప్రకటన అచ్చయిన రోజు నుంచి, ఏది చివరిదైతే ఆరోజు నుంచి రెండు వారాలలోగా ఆ సంస్థ తమ అభ్యంతరాలు తెలియజేస్తూ ప్రభుత్వానికి లేఖ పంపుకోవచ్చు. ఇదే చట్టం సెక్షన్ 5 ప్రకారం ప్రభుత్వం వెంటనే ముగ్గురు న్యాయమూర్తులతో ఒక సలహా మండలిని కూడా ప్రకటించాలి. చట్టవ్యతిరేక సంస్థగా ప్రకటించిన నోటిఫికేషన్ ను, ప్రభుత్వ వాదనలను, సంస్థ వాదనలను విని, విచారణ జరిపే అధికారం ఈ న్యాయమూర్తుల సలహా మండలికి ఉంటుంది. నోటిఫికేషన్ నుంచి ఆరు వారాలలోగా ప్రభుత్వం ఆ సలహా మండలిని నియమించి, సంబంధిత పత్రాలను దాని ముందు ఉంచాలి. ఆ సలహా మండలి అవసరమైతే ప్రభుత్వ పక్షంతో, సంస్థతో మౌఖిక విచారణ కూడా జరిపి తన తుదితీర్పు ప్రకటిస్తుంది. ఈ ప్రక్రియను చట్టమే నిర్దేశించినందువల్ల తుదితీర్పు వెలువడే వరకూ నిషేధం అమలు లోకి రావడానికి అధికారం లేదని అనుకోవచ్చు. కాకపోతే చట్టం ఈ మధ్యంతర కాలం గురించి స్పష్టత ఇవ్వలేదు గనుక ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదలైన తేదీ నుంచే అమలు లోకి వస్తుందని వాదిస్తున్నది.

ఇప్పుడు పదహారు సంఘాల నిషేధం విషయంలో నోటిఫికేషన్ లేదు. ఒకవేళ జి. ఓ. నే నోటిఫికేషన్ అనుకుంటే దాన్ని ఆయా సంఘాల బాధ్యులకు ఇవ్వలేదు. ఈ పదహారు సంఘాలలో రెండు మూడు రిజిస్టర్డ్ సంస్థలు కూడా ఉన్నాయి. వాటి కార్యాలయాలకు రిజిస్టర్డ్ పోస్ట్ లో పంపించడమో, గోడకు అతికించడమో చేయలేదు. అన్నిటికన్నా ఘోరంగా పత్రికలో వెంటనే ప్రకటన ఇవ్వలేదు. జి.ఓ.

విడుదల అయిన 23 రోజుల తర్వాత, ఒక వార్త లాగా పత్రికలకు లీక్ చేశారు. సలహా మండలి నియామకం గురించి ఇది రాస్తున్న సమయం వరకూ ప్రకటన లేదు. (ఇప్పటికి జి.ఓ. వెలువడి ఏడు వారాలు దాటింది, పత్రికల్లో వార్త వెలువడి నాలుగు వారాలు దాటింది). అంటే ఏ రకంగానూ ప్రభుత్వం కనీస చట్టబద్ధతను పాటించలేదు.

నిషేధం విధించడంలో, దాన్ని ప్రకటించడంలో జరిగిన చట్ట ఉల్లంఘనను అలా ఉంచి, అసలు తెలంగాణలో ఈ చట్టానికి నైతికత ఉన్నదా అనే ప్రశ్న కూడా ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఉనికిలోకి వచ్చిన ఈ చట్టపు చరిత్రే హాస్యాస్పదమైనది. రాజీవ్ గాంధీ మొదటి వర్ధంతి రోజున ఏదైనా సంచలనాత్మక ప్రకటన చేయదలచిన అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన రెడ్డి విశాఖపట్నంలో బహిరంగసభలో సిపిఐ ఎం ఎల్ పీపుల్స్ వార్ మీద, రాడికల్ విద్యార్థి సంఘం, రాడికల్ యువజన సంఘం, రైతు కూలీ సంఘం, సింగరేణి కార్మిక సమాఖ్య, విప్లవ కార్మిక సమాఖ్య, ఆల్ ఇండియా రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫెడరేషన్ ల మీద నిషేధం విధిస్తున్నట్టు ప్రకటించారు. ఈ నిషేధం క్రిమినల్ లా అమెండ్ మెంట్ ఆక్ట్ 1908 కింద ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో, ప్రజా రక్షణ చట్టం 1348 ఫసలీ కింద తెలంగాణ ప్రాంతంలో అమలవుతుందని అన్నారు. ఆ రెండు చట్టాలూ అసలు ఉనికిలోనే లేవని, వాటిని సుప్రీంకోర్టు ఎప్పుడో కొట్టివేసిందని, పౌరహక్కుల సంఘం అధ్యక్షులు, న్యాయవాది కె జి కన్నబిరాన్ ముఖ్యమంత్రి ప్రకటనలోని అసంగతాన్ని వెంటనే బహిర్గతం చేశారు. దానితో మల్లగుల్లాలు పడిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెద్దలు, పోలీసు పెద్దలు హడావిడిగా తయారుచేసి జూన్ 21న అమలు లోకి తెచ్చిన కొత్త చట్టమే ఆంధ్రప్రదేశ్ ప్రజా భద్రతా చట్టం 1992.

అప్పటి నుంచి 2014 వరకూ తెలంగాణలో వేలాది మంది ఈ అక్రమ చట్టం కింద నిర్బంధానికి గురయ్యారు. తెలంగాణ ఉద్యమ క్రమంలో మొత్తంగా రాజ్య నిర్బంధం మీద వచ్చిన వ్యతిరేకతలో ఈ చట్టం పట్ల వ్యతిరేకత కూడా భాగమే. అంటే ఈ చట్టాన్ని కొనసాగించకపోవడం తెలంగాణ ప్రజల ఆకాంక్ష. అదే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కర్తవ్యం అయి ఉండవలసింది. కాని 2016 జూన్ 1న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెలువరించిన జి. ఓ. నం. 45 (తెలంగాణ అడాప్టేషన్ ఆఫ్ లాస్ ఆర్డర్ 2016) లో అంతకు ముందరి ఆంధ్రప్రదేశ్ లోని 177 చట్టాలనూ, 12 రెగ్యులేషన్లనూ అక్షరం కూడ మార్చకుండా, పేరులో ఆంధ్రప్రదేశ్ తీసేసి తెలంగాణ అని పెట్టినప్పుడు, ఆంధ్రప్రదేశ్ ప్రజా భద్రతా చట్టం 1992, తెలంగాణ ప్రజా భద్రతా చట్టం 1992 అయిపోయింది! ఇది తెలంగాణ ప్రజా ఆకాంక్షల ప్రకారం, ఉద్యమ క్రమంలో వెల్లువెత్తిన నినాదాల ప్రకారం, "అంతర్గత వలసవాద పాలన అవశేషాలను తొలగించి స్వపరిపాలనను ఏర్పరుస్తాము"ని తెలంగాణ రాష్ట్ర సమితి చేసిన వాగ్దానాల ప్రకారం అనైతికం, అర్థరహితం.

ఇక ప్రస్తుత నిషేధ ఉత్తర్వులు వెలువడిన సమయం చూస్తే, అది మార్చ్ 30 అయినా, ఏప్రిల్ 24 అయినా, దేశమంతటిలోనూ, ప్రత్యేకించి తెలంగాణలోనూ కరోనా వైరస్ రెండో అల భయానకంగా విజృంభిస్తున్న సమయం. ఆస్పత్రుల్లో పడకలు లేక, ఆరోగ్య సౌకర్యాలు లేక, ఆక్సిజన్ అందక, ఆరోగ్య వ్యాపారుల మితిమీరిన లాభాపేక్షతో మనుషులు పిట్టల్లా రాలిపోతున్న సమయం. ఈ భయానక స్థితిలో ప్రజల ఆరోగ్య సంరక్షణ తప్ప మరేదీ ప్రభుత్వానికి ప్రాధాన్యతాంశంగా ఉండడానికి వీలు లేదు. కాని మహా ఘనత వహించిన తెలంగాణ పోలీసు పాలకులు కరోనా బారి నుంచి ప్రజలను కాపాడే పని కన్న భిన్నస్వరాల, ప్రత్యామ్నాయ ఆలోచనల ప్రచారాన్ని అడ్డుకోవడమే తమ ప్రధాన కర్తవ్యంగా భావించారు. తెలంగాణ ప్రజల హక్కులు కాపాడతామనే వాగ్దానాలతో అధికారం లోకి వచ్చిన పాలకులకు ఇంతకన్నా సిగ్గు చేటు పని మరొకటి ఉండదు.

అభిప్రాయాలు కలిగి ఉండడం, వాటిని వ్యక్తీకరించడం, తమ లాంటి అభిప్రాయాలున్నవారితో సమష్టిగా ఆలోచనలు పంచుకోవడానికీ, కార్యాచరణలోకి దిగడానికీ సంఘటిత నిర్మాణాలు రూపొందించుకోవడం మనిషి నైసర్గిక లక్షణాలు, అంటే జన్మహక్కులు. ఆ జన్మహక్కులను రాజ్యం గాని, ఆధిపత్య శక్తులు గాని కొల్లగొట్టకుండా, ఉల్లంఘించకుండా హామీ ఇస్తున్నానని రాజ్యాంగం ప్రకటించింది. భారత రాజ్యాంగ అధికరణం 19 ఈ వాక్సభా స్వాతంత్ర్యాలను, భావ ప్రకటనా స్వేచ్ఛను, సంఘాలు పెట్టుకునే హక్కును, ఎక్కడికైనా ప్రయాణించే హక్కును హామీ ఇచ్చింది. అధికరణం 19 హామీ ఇచ్చిన హక్కుల మీద "సకారణమైన, హేతుబద్ధమైన పరిమితులు, ఆంక్షలు" విధించడానికి మాత్రమే ప్రభుత్వానికి అధికారం ఉంది గాని, మొత్తంగా ఆ హక్కులను రద్దు చేసే అధికారం లేదు. అందువల్ల అసలు తెలంగాణ ప్రజా భద్రతా చట్టమే రాజ్యాంగ వ్యతిరేకమైనది. రాజ్యాంగం హామీ ఇచ్చిన హక్కులను ఆ చట్టాన్ని ఉపయోగించి రద్దు చేయడం రాజ్యాంగ వ్యతిరేకం.

మనిషి సహజంగా సంఘ జీవి. తప్పనిసరిగా సంఘ జీవితంలో మానవ సంబంధాలు ఆలోచనల వినిమయంలో, సంఘర్షణలో అభివృద్ధి చెందుతాయి. ఆట, పాట, మాట, కలయిక నిషేధం అని నిరంకుశ ప్రభుత్వాలు శాసనాలు చేయవచ్చు గాని ఆట, పాట, మాట, కలయిక లేకుండా మనిషి ఉనికే అసాధ్యం. తోటి మనుషులతో ఆట, పాట, మాట పంచుకునే క్రమంలో తప్పనిసరిగా మనుషులు కలుసుకుంటారు, బృందాలవుతారు, సంఘటితమవుతారు, సంఘంగా ఒక నిర్మాణంలోకి వస్తారు. అందుకే రాజ్యాంగం భావప్రకటనా స్వేచ్ఛతో పాటే సంఘాలు నిర్మించుకునే హక్కుకు కూడా హామీ ఇచ్చింది. సంఘాలను నిషేధించడం, వారి ఆట, పాట, మాటలను, రచనను, కార్యాచరణను నిషేధించడం అంటే మనుషులను మనుషులు కాకుండా చేయడమే. అది ఒక అమానవీయ ప్రయత్నం. అప్రజాస్వామిక ప్రయత్నం. నిరంకుశ ప్రయత్నం. అది చట్టబద్ధమైనదిగా, తాత్కాలికంగా సాధ్యమైనట్టుగా, బలప్రయోగంతో, భయోత్పాతంతో అమలైనట్టుగా కనబడ వచ్చు గాని వాస్తవంగా అది ఎక్కువ కాలం సాగదు. సత్యాన్ని చాటే పుస్తకాన్ని నిషేధించగలవు గాని సాక్ష్యంగా బతికే ప్రపంచాన్ని ఏం చేస్తావు అన్న కవి వాక్కు ఐదు దశాబ్దాలుగా గడిచినా అక్షర సత్యంగానే ఉంది.

ఈ స్థూల, తాత్విక, సామాజిక, రాజకీయ, చట్టపరమైన వాదనలు అలా ఉంచి, అసలు జి.ఓ. నం. 73 ఎంత తప్పుల తడకగా తయారయిందో, ఎన్ని అబద్ధాలను వాదనలుగా, ఎన్ని అపోహలను వాస్తవాలుగా ప్రచారం లోకి తెచ్చిందో కూడా చూడాలి.

తాము నిషేధించదలచుకున్న పదహారు సంస్థలను పాలకులు ఏ తేడాలు లేని ఒకే కుప్పగా, అదీ ఒక సాయుధ, అజ్ఞాతవాస, నిషిద్ధ పార్టీ ఆదేశాల ప్రకారం నడిచే సంఘాలుగా చూశారు గాని ఆ ఆలోచనే హాస్యాస్పదం, అవాస్తవం. ఆ పదహారు సంఘాల నిర్మాణాలలో, ఆశయాలలో, కార్యక్షేత్రాలలో, పనితీరులో ఎంతో వైవిధ్యం ఉంది. తమకు భిన్నాభిప్రాయాలు ప్రకటించేవాళ్లూ, తమ రాజకీయ విధానాలను విమర్శించేవాళ్లూ అందరూ ఒకటే అనే జార్జి బుష్ తరహా అజ్ఞానం, అహంకారం ఉన్నవాళ్లు మాత్రమే ఇటువంటి వాదన చేయగలరు. ఈ పదహారు సంఘాల్లో విద్యార్థి సంఘాలు నాలుగున్నాయి. విద్యార్థి రంగం అనే ఒకే కార్యక్షేత్రంలో నాలుగు సంఘాలు ఉన్నాయంటేనే వాటి ఆశయాలలో, పనితీరులో తేడాలున్నాయని అర్థం. అటువంటప్పుడు ఆ నాలుగు సంఘాలూ ఒకే పార్టీ ఆదేశాల మేరకు పని చేస్తున్నాయని ఊహించడానికి అతి తెలివో, అజ్ఞానమో ఉండాలి.

ఈ పదహారు సంఘాలలో ప్రతి ఒక్క దానికీ విభిన్నమైన, విశిష్టమైన స్వభావం ఉంది. ఒకటి ఆదివాసుల సంఘం, ఒకటి మహిళల సంఘం, ఒకటి రైతు కూలీల సంఘం. ఒకటి అసంఘటిత కార్మికుల సంఘం. నాలుగు విద్యార్థి సంఘాలు. ఒకటి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో భాగంగా పుట్టిన సంఘం. ఒకటి తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రజల హక్కుల పరిరక్షణ కోసం అనేక సంఘాలతో కలిసి ఏర్పడిన సమాఖ్య. ఒకటి రచయితల సంఘం, ఒకటి సాంస్కృతిక కార్యకర్తల సంఘం, రెండు రాజ్యాంగ బద్ధమైన హక్కులు సాధించడం కోసం ఏర్పడిన సంఘాలు, ఒకటి హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేక ప్రచారం కోసం ఏర్పడిన సంఘం, ఒకటి రాజ్యహింసలో అమరులైన వారిని స్మరించుకోవడానికి బంధువులూ మిత్రులూ పెట్టుకున్న సంఘం. ఈ వైవిధ్యమే వాటి మధ్య ప్రభుత్వం చెపుతున్న ఏకసూత్రత, ఎవరో ఒకరి ఆదేశాల మేరకు ఏర్పడి పనిచేస్తున్న స్వభావం లేదని చూపుతుంది. ఈ సంఘాలన్నీ వేర్వేరు కాలాల్లో ఏర్పడ్డాయి. వీటన్నిటికీ వేరువేరు ప్రణాళికలున్నాయి. వీటన్నిటికీ ఉమ్మడి స్వభావం ఉండే అవకాశం పాలకుల బుర్రలో తప్ప వాస్తవంలో లేదు.

1970లో పుట్టిన నాటి నుంచీ నక్సల్బరీ రాజకీయాలను, మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానం అనే భావజాలాన్ని మార్గదర్శకంగా పెట్టుకున్నానని విప్లవ రచయితల సంఘం బహిరంగంగానే ప్రకటిస్తున్నది. ఆ సంఘ సభ్యులు తమ రచనల్లో, ఉపన్యాసాల్లో ఆ భావజాలాన్ని వ్యక్తీకరిస్తూనే ఉన్నారు. ఇక 2002 లో పుట్టిన అమరుల బంధు మిత్రుల సంఘం నక్సల్బరీ పంథాలో అమరులైన తమ కుటుంబ సభ్యులను, స్నేహితులను సంస్మరించుకోవడమే తన లక్ష్యమని ప్రకటించుకుంటున్నది. ఈ భావజాలాన్ని కలిగి ఉండడం, సమర్థించడం, వ్యక్తీకరించడం నేరాలు కావు. అసలు నిషిద్ధ మావోయిస్టు పార్టీ సభ్యులు కావడం కూడా దానికదిగా నేరం కాదని, ఏదైనా ప్రత్యేక చర్యలో పాల్గొన్నట్టు సాక్ష్యాధారాలు చూపవలసిందేనని సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. కనుక ఆ ఆరోపణతో ఈ సంఘాలను నిషేధించడం అర్థరహితం, చట్టవ్యతిరేకం. ఇక మిగిలిన పద్నాలుగు సంఘాల ఆశయాలు, లక్ష్యాలు, ప్రణాళికలు, పనితీరు చూస్తే వారి మీద ఆ ఆరోపణ బట్ట కాల్చి మీద వేయడం మాత్రమే.

వీటిలో రెండు సంస్థలు కేవలం రాజ్యాంగం హామీ ఇచ్చిన హక్కుల కొరకు, చట్టబద్ధ పాలన కొరకు, 'చట్టం ఎదుట అందరూ సమానమే', 'బెయిల్ సాధారణం, జైలు అసాధారణం', విచారణలో తేలేవరకూ నిందితులను నిర్దోషులుగా చూడాలి' వంటి న్యాయసూత్రాల కొరకు పని చేస్తున్న సంస్థలు. నిజానికి ఈ అన్ని సంస్థలూ కూడా బహిరంగంగా, ఈ వ్యవస్థలోపల పని చేస్తున్నవే. ఈ వ్యవస్థ పట్ల, ఈ వ్యవస్థలో అమలవుతున్న "ప్రజాస్వామ్యం" పట్ల, రావలసిన మార్పుల పట్ల ఆయా సంఘాలకు ప్రత్యేకమైన అభిప్రాయాలు ఉండవచ్చు. అవే అభిప్రాయాలు ఉన్న సంస్థలూ పార్టీలూ దేశంలోనో రాష్ట్రం లోనో మరెన్నో ఉన్నాయి. అభిప్రాయాలు ఒకటైనంత మాత్రాన ఒక సంస్థకు మరొక సంస్థ అనుబంధ సంస్థ అయిపోదు. ఆ మాటకొస్తే నక్సల్బరీ రాజకీయాలను సమర్థించే, నక్సల్బరీ రాజకీయాలకు తామే వారసులమని చెప్పుకునే పార్టీలూ సంస్థలూ దేశంలో వందకు పైనే ఉన్నాయి. అవన్నీ ఏదో ఒకానొక సంస్థకు అనుబంధ సంస్థలే అని ఏ ఆధారంతో నిర్ణయిస్తారు? ఒకే భావజాలంతో నడిచే, ఒకే భావజాలాన్ని తమ మార్గదర్శకంగా చెప్పుకునే సంస్థలు, పార్టీలు అనేకం ఉన్నాయని సమకాలీన సమాజాన్ని చూస్తే ఎవరికైనా అర్థం అవుతుంది. వాటిలో దేన్ని మాతృసంస్థ అంటారు, వేటిని అనుబంధ సంస్థలని అంటారు? ఆ సంబంధాన్ని ఎలా నిర్ణయిస్తారు? ఇక్కడ ప్రభుత్వం, పోలీసులు ఏది అనుకుంటే అదే చెల్లుతుందని అనడానికి వీలు లేదు. కచ్చితమైన, నిస్సందేహమైన సాక్ష్యాధారాలు అవసరం అవుతుంది. మరీ ముఖ్యంగా ఆ ఆరోపణతో ఒక సంఘాన్ని నిషేధానికి గురి చేస్తున్నప్పుడు, ఆ ఆరోపణను నిరూపించవలసి ఉంటుంది.

చివరిగా, ఈ చట్టం అమలులో ఒక హాస్యాస్పదమైన పరిస్థితి కూడా తలెత్తుతుంది. ముప్పై సంవత్సరాల కింద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిషేధించిన సంస్థలలో ఆల్ ఇండియా రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫెడరేషన్ కూడ ఉండింది. అది అప్పటికే ఒక్క ఆంధ్రప్రదేశ్ లో మాత్రమే కాక అనేక రాష్ట్రాలలో ఉన్న సంస్థ. 1992 జూన్ లో ఆ సంస్థ మీద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిషేధం విధిస్తే, 1993 జనవరిలో ఆ సంస్థ జాతీయ మహాసభలను బొంబాయిలో జరుపుకుంది. ఒక రాష్ట్ర సరిహద్దులోపల నిషిద్ధమైన సంస్థ, సరిహద్దు అవతల తన కార్యకలాపాలు జరుపుకోవచ్చునన్నమాట. సరిగ్గా అలాగే, ప్రస్తుత నిషేధంలో కూడా ఈ సంఘాలలో కొన్ని రెండు రాష్ట్రాలలోనూ, దేశవ్యాప్తంగానూ ఉన్నవి. అటువంటి సంఘాలను రాష్ట్రంలో నిషేధించడం, చట్టవ్యతిరేక సంస్థలుగా ప్రకటించడం అసమంజసం, దాన్ని అమలు చేయడం అసాధ్యం.

ప్రస్తుత నిషేధంలో మరొక తెలివితక్కువ అసమంజసత్వం కూడా ఉంది. విప్లవ రచయితల సంఘం మీద ఇదే చట్టం లోని ఇదే సెక్షన్ కింద 2005 ఆగస్ట్ లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిషేధం విధించింది. చట్ట ప్రకారం ఏర్పాటయిన ముగ్గురు న్యాయమూర్తుల సలహా మండలి (జస్టిస్ టి ఎల్ ఎన్ రెడ్డి, జస్టిస్ ఎస్ నీలాద్రి రావు,

జస్టిస్ ఎ గోపాల్ రావు) ఇరుపక్షాల వాదనలనూ విని, విచారణ జరిపి నిషేధం చెల్లదని ప్రకటించింది. దానితో ప్రభుత్వం నవంబర్‌లో మరొక జి.ఓ. జారీ చేసి నిషేధాన్ని ఉపసంహరించుకోవలసి వచ్చింది. పదహారు సంవత్సరాల తర్వాత అదే చట్టం లోని అదే సెక్షన్ కింద అదే సంఘాన్ని నిషేధించడం అర్థరహితం, చట్టవ్యతిరేకం. సహజ న్యాయ సూత్రాల ప్రకారమైనా, భారతదేశంలో అమలవుతున్న న్యాయశాస్త్రం రీత్యానైనా ఒకే నేరానికి రెండు సార్లు విచారించడం చెల్లదు. ఒకసారి రుజువు కాని నేరాన్ని రెండోసారి విచారించడం చెల్లదు. అసాధారణ సందర్భంలో అలా విచారణకు తీసుకున్నప్పటికీ కొత్త సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టడం అవసరం అవుతుంది. ప్రస్తుత నిషేధపుటుత్తర్వులు ఒక్కటంటే ఒక్కటైనా కొత్త సాక్ష్యాధారాలను చూపలేదు.

ఈ సాధారణ ప్రశ్నలు మాత్రమే కాదు, తెలంగాణ ప్రజా భద్రతా చట్టం సెక్షన్ 3 (2) ప్రకారం “ఒక సంస్థను చట్టవ్యతిరేక సంస్థగా ప్రకటించడానికి తగిన కారణాలు చూపాలి”. అందువల్ల జి.ఓ. లో కొన్ని కారణాలు చెప్పారు గాని అవన్నీ పచ్చి అబద్ధాలు, అర్ధసత్యాలు, ప్రభుత్వపు సొంత అపోహలు, పోలీసుల కట్టుకథలు. పదహారు సంఘాలకూ కలిపి ఉమ్మడిగా ఐదు కారణాలు చూపడమే పెద్ద అసంగతం. కాగా, ఆ ఐదు కారణాలలో ఒక్కటంటే ఒక్కటి కూడా వాస్తవం కాదు. ఈ సంస్థలను చట్టవ్యతిరేక సంస్థలుగా ప్రకటించడానికి అవి కారణాలనడం హాస్యాస్పదం. ఈ సంఘాలు “ఈ క్రింద తెలిపిన హింసాచర్యలకు పాల్పడుతున్నాయి” అని ఆ ఐదు “చర్యల” జాబితా రాశారు గాని, కనీసస్థాయిలో భాష వచ్చిన ఎవరికైనా వాటిలో ఒక్కటంటే ఒక్కటి కూడా “హింసా చర్య” కాదని అర్థమవుతుంది. మామూలు అర్థంలో చర్య అంటే క్రియ. హింసా చర్య అంటే శారీరకంగానో, ఆయుధ సహాయంతోనో గాయపరచడం, ధ్వంసం చేయడం, చంపివేయడం, ప్రాణ నష్టం, ఆస్తి నష్టం వంటి క్రియలు. ఈ ఐదు కారణాలలోనూ ఎక్కడా ఒక్క చోటనైనా ఒక క్రియ లేదు, భావ ప్రచారం మాత్రమే ఉంది. అది “హింసా చర్య” ఎలా అవుతుంది?

ఈ జి.ఓ. లో రాసిన ప్రకారమే మొదటి “హింసా చర్య” పట్టణ ప్రాంతాలలో తిరుగుతుండడం. తిరగడం హింసా చర్య ఎలా అవుతుందో ఈ జి.ఓ. రచయితల మహా మేధావిత్వానికే తెలియాలి. ఈ సంఘాల కార్యకర్తలు పట్టణ గెరిల్లా చర్యల ఎత్తుగడలను చేపట్టారని ఈ పేరా ఆరోపిస్తుంది. ఈ జి.ఓ. రాసిన వారికి “పట్టణ గెరిల్లా చర్యలు” అనే మాటకు అర్థం తెలిసినట్టు లేదు. ఐరిష్ జాతి విముక్తి ఉద్యమంలో ఇరవయో శతాబ్ది తొలిరోజుల్లో ప్రారంభమై లాటిన్ అమెరికన్ ప్రజా పోరాటాల్లో 1960ల్లో విస్తృతంగా ప్రచారంలోకి వచ్చిన ఈ మాటకు చాలా చరిత్ర ఉంది. పట్టణ గెరిల్లా చర్యలు అనే మాటలో బాంబు దాడులు, విధ్వంసాలు, కీలక వ్యక్తుల అపహరణలు, ఆయుధ స్వాధీనాలు, బ్యాంకులపై దాడులు, హత్యలు వంటివి ఉంటాయి. అటువంటి పట్టణ గెరిల్లా చర్యలు 1969-70ల్లో కలకత్తాలో మినహా దేశంలో ఎక్కడా ఎప్పుడూ జరగలేదు. జరిగే అవకాశం కూడా లేదు. ఈ పదహారు సంఘాలలో ఏ ఒక్కటైనా అటువంటి చర్యలకు పాల్పడిన ఉదాహరణ గత ఐదు దశాబ్దాల చరిత్రలో ఒక్కటి కూడ లేదు.

జి. ఓ. చెప్పిన రెండో “హింసా చర్య” “రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వేరు వేరు సమస్యలు లేవనెత్తుతూ రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, సభలు, ప్రదర్శనలు జరపడం.” వీటిలో రెచ్చగొట్టే అనే మాటను పక్కనపెట్టి, మిగిలిన పనులన్నీ రాజ్యాంగబద్ధమైనవి, చట్టబద్ధమైనవి. ప్రతి పౌరుడూ, పౌరురాలూ చేయదానికి హక్కు ఉన్నవి, చేయవలసినవి. పౌరుల సంగతి అలా ఉంచి, కేంద్ర ప్రభుత్వ విధానాలనూ చర్యలనూ ఖండిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలనూ, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలనూ చర్యలనూ ఖండిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్నీ మనం చూస్తూనే ఉన్నాం. అటువంటప్పుడు ప్రజలకు, పౌరులకు ఆ హక్కు ఇంకా ఎక్కువ ఉంటుంది. ప్రకటనలు, సభలు, ప్రదర్శనలు ప్రజల హక్కు. రాజ్యాంగం హామీ ఇచ్చిన హక్కు. ఆ హక్కును వినియోగించుకుంటున్నందుకు నిషేధం విధిస్తామని నిస్సిగ్గుగా చెప్పడం దుర్మార్గం, నియంతృత్వం. ఒకవేళ ఆ ప్రకటనల్లో, సభల్లో, ప్రదర్శనల్లో ఈ జి. ఓ. చెపుతున్నట్టు “రెచ్చగొట్టే” అంశాలుంటే భారత శిక్షా స్మృతి, నేర శిక్షా స్మృతి కింద విచారించడానికి ప్రభుత్వానికి అన్ని అవకాశాలూ ఉన్నాయి. అందుకోసం నిషేధం విధించనక్కర లేదు.

జి. ఓ. చెప్పిన మూడో “హింసా చర్య” ఈ సంఘాల కార్యకర్తలు మావోయిస్టు పార్టీ నాయకత్వంతో సంబంధంలో ఉండడం, కలుస్తూ ఉండడం. వారి ఆదేశాల మేరకు బీడు భూముల సమస్య మీద పని చేయడం. రాజ్య నిర్బంధానికి వ్యతిరేకంగా, ప్రత్యేకించి భీమా కోరేగాం కేసులో అరెస్టయినవారిని విడుదల చేయాలని ప్రదర్శనలు జరపడం, ఊపా చట్టాన్ని, వ్యవసాయ చట్టాలను, సిఎఎ/ఎన్ ఆర్ సి లను రద్దు చేయాలని నిరసన కార్యక్రమాలు చేపట్టడం. ఇలా ఇంత బహిరంగంగా ఈ కారణం చెపితే ప్రజలు నవ్వుకుంటారనే కనీస ఇంగితం కూడా ఈ జి. ఓ. రాసినవారికి లేనట్టుంది. బీడు భూముల వంటి ప్రజా సమస్యల మీద పోరాడడం రాజకీయ పార్టీలూ, సామాజిక సంస్థలూ, కార్యకర్తలూ దశాబ్దాలుగా చేస్తున్నారు. అదేమీ నేరం కాదు. అందుకు ఏదో ఒక పార్టీ ఆదేశించనక్కర లేదు. ఇక అరెస్టులకు, అక్రమ కేసులకు వ్యతిరేకంగా పోరాడడం న్యాయస్థానం లోపలా, బైటా జరగడానికి రాజ్యాంగమే అవకాశం ఇచ్చింది. రాష్ట్రంలో దేశంలో వేలాది కేసుల విషయంలో అవి అక్రమ కేసులు అంటూ న్యాయస్థానం లోపల డిఫెన్స్ న్యాయవాదులు వాదిస్తారు. అవి తప్పుడు కేసులు అంటూ బాధిత సమూహాలు బైట నిరసన ప్రదర్శనలు జరుపుతాయి. పోలీసులు చేసిన ఆరోపణలనూ పెట్టిన కేసులనూ ఎన్నో స్థాయిలలో కోర్టులు కొట్టి వేశాయి. కనుక కేసులకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు జరపడం నేరమూ కాదు, కొత్త విషయమూ కాదు. నిషేధించడానికి కారణమూ కాదు.

అంతకన్నా హాస్యాస్పదం ఊపా, వ్యవసాయ చట్టాలు, సిఎఎ/ఎన్ ఆర్ సి వంటి చట్టాల రద్దును కోరుతూ ప్రదర్శనలు జరపడాన్ని “హింసా చర్య”గా అభివర్ణించడం. ప్రభుత్వాలు చేసే ఏ చట్టాన్నయినా వ్యతిరేకించే, నిరసన తెలిపే అధికారం ప్రజలకు ఉంటుంది. ప్రజల

నిరసనల వల్ల ప్రభుత్వాలు ఎన్నో చట్టాలను రద్దు చేసుకున్న చరిత్ర కూడ ఉంది. సరిగ్గా ఊపాతో సమానమైన టాడా, పోటాల మీద కూడా పెద్ద ఎత్తున నిరసనలు చెలరేగాయి. నిరసనల వల్లనే పది సంవత్సరాల తర్వాత టాడాను కొనసాగించకుండా సహజ మరణానికి వదిలేశారు. తాము అధికారంలోకి వస్తే పోటాను రద్దు చేస్తామని యుపిఎ 2004 ఎన్నికల వాగ్దానంగా ప్రకటించి గెలిచాక నిజంగానే రద్దు చేసింది. కాకపోతే, అదే ప్రభుత్వం 1967 నాటి ఊపాను తవ్వి తీసి, టాడా, పోటాలలోని దుర్మార్గ అంశాలు కూడ జోడించి, ప్రస్తుత ఊపా తయారు చేసింది. అటువంటి చట్టాన్ని వ్యతిరేకించే, నిరసన ప్రదర్శనలు జరిపే, రద్దు చేయమని కోరే అధికారం ప్రజలకు తప్పనిసరిగా ఉంటుంది. ఇక వ్యవసాయ చట్టాల విషయంలోనైతే, ఆ చట్టాలను ఎన్నో రాజకీయ పార్టీలు వ్యతిరేకించాయి, నిరసనలు తెలిపాయి. ఆ చట్టాలను వ్యతిరేకిస్తూ జరిగిన భారత్ బంద్ కు ఈ నిషేధం విధించిన ప్రభుత్వాన్ని నడిపే తెలంగాణ రాష్ట్ర సమితి కూడా మద్దతు తెలిపింది. తర్వాత మాట మార్చినప్పటికీ కొన్నాళ్లు ఆ చట్టాలను రద్దు చేయాలని కోరింది. ఇవాళ్టికీ ఎన్నో రాష్ట్ర ప్రభుత్వాలు, ఎన్నో రాజకీయ పార్టీలు ఆ వ్యవసాయ చట్టాల రద్దు కోరుతున్నాయి. ఆ మూడు వ్యవసాయ చట్టాలు తప్పనిసరిగా వ్యతిరేకించవలసినవే. వాటిని వ్యతిరేకించడం నిషేధించవలసిన విషయం కాదు. ఇక సిఎఎ – ఎన్ ఆర్ సి లకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విస్తారమైన ఆందోళన జరిగింది. ఈ నిరసన "హింసా చర్య" కాకపోవడం మాత్రమే కాదు, పౌరుల తప్పనిసరి కర్తవ్యం. ఆ కర్తవ్యం నెరవేర్చడమే నిషేధించడానికి కారణమని ప్రభుత్వం అంటున్నదంటే ఇది ఎటువంటి నిరంకుశ, అసహన, అప్రజాస్వామిక ప్రభుత్వమో ఎవరికి వాళ్లు అంచనా వేసుకోవలసిందే.

ఇక జి. ఓ. చెప్పిన నాలుగో "హింసా చర్య" ఈ సంఘాల కార్యకర్తలలో కొందరు మావోయిస్టు పార్టీ అజ్ఞాత కార్యకర్తలుగా మారుతున్నారనేది. ఎవరైనా తమకు నచ్చిన సంస్థలో చేరితే అది "హింసా చర్య" ఎలా అవుతుంది? అలా ఒకరో, ఇద్దరో, కొందరో సభ్యులు ఒక సంస్థను వదిలి మరొక సంస్థలో చేరితే అందుకు మొదటి సంస్థ ఎలా బాధ్యురాలవుతుంది? ఈ వ్యక్తిగత ఎంపికను సంఘానికి ముడిపెట్టి దాన్ని ఒక కారణంగా, "హింసా చర్య" గా చూపే చౌకబారు ఆరోపణను చేసినందుకు పాలకులు సిగ్గు పడాలి.

ఇక జి.వో. చెప్పిన ఐదో "హింసా చర్య" ఈ సంఘాలు మావోయిస్టు పార్టీ ఆదేశాల మేరకే ఏర్పడ్డాయనేది, ఈ సంఘాల లక్ష్యాలు, ఆశయాలు, సభ్యులు, పనితీరు ఆ పార్టీ ఆదేశాల మేరకే ఉన్నాయనేది. ఇది మరింత హాస్యాస్పద అంశం. ఎందుకంటే ఈ సంఘాలలో కనీసం సగం మావోయిస్టు పార్టీ పుట్టడానికి దశాబ్దాల ముందు నుంచీ, ఎన్నో సంవత్సరాల ముందు నుంచీ ఉనికిలో ఉన్నాయి. 1970లో పుట్టిన విప్లవ రచయితల సంఘం, 1974లో పుట్టిన పౌరహక్కుల సంఘం, 1995లో పుట్టిన చైతన్య మహిళా సంఘం, 1996 లో పుట్టిన ఆదివాసీ హక్కుల పోరాట సమితి – తుడుం దెబ్బ, 1997లో పుట్టిన ప్రజా కళా మండలి వంటి సంస్థలు 2004 లో ఏర్పడిన సిపిఐ మావోయిస్టు ఆదేశాల మేరకు ఏర్పడ్డాయని ఈ జి.ఓ. చెపుతున్నదంటే పాలకుల హాస్యాస్పదమైన కాలక్రమ అవగాహనకు ఆశ్చర్యపోవడం కన్న చేయగలిగింది లేదు.

మరొకసారి చెప్పాలంటే ఈ కారణాలన్నీ నిజమైన కారణాలే అని వాదన కోసం అంగీకరించినా ఇవేవీ "హింసా చర్యలు" కావు. నిషేధం విధించడానికి కారణాలు కాజాలవు. ఈ సంఘాలు పాల్గొన్న హింసా చర్యలు ఏవైనా ఉంటే, వాటిని నిర్దిష్టంగా పేర్కొంటే, భారత శిక్షా స్మృతి, నేర శిక్షా స్మృతి కింద కేసులు పెట్టడానికి, విచారణ జరపడానికి ప్రభుత్వానికి అధికారమూ అవకాశమూ ఉన్నాయి. అంటే ఇవేవీ నిషేధానికి, చట్టవ్యతిరేక సంస్థలుగా ప్రకటించడానికి సరిపోయేవి కావు.

మరి ఇంత స్పష్టంగా నిషేధం చెల్లదని తేటతెల్లమవుతున్నప్పుడు తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ పాలకవర్గాలు ఈ పనికి ఎందుకు పూనుకున్నాయి? తెలంగాణ ప్రజా ఆకాంక్షలనూ, ఉద్యమ ఆకాంక్షలనూ నెరవేర్చలేకపోయిన తెలంగాణ పాలకులు తమ వైఫల్యాలను ప్రజలకు వివరించే స్వరాలన్నిటినీ మూసివేయదలచారు. తమ నిరంకుశ పాలన గురించి ప్రజలకు నిజాలు చెప్పే గొంతులేవీ ఉండగూడదనుకున్నారు. పార్లమెంటరీ ప్రతిపక్షాల నుంచి ఎంతో మందిని ఆకర్షించి, కొనివేసి, వాటిని బలహీనం చేసి, వాటికి గొంతు లేకుండా చేశారు. ప్రచార సాధనాలన్నిటినీ తమ కుటుంబ పెట్టుబడులతో, తమ సన్నిహితుల పెట్టుబడులతో కొనివేసి పత్రికల్లో, టీవీలో భిన్నస్వరాలు, వాస్తవాలు వినిపించకుండా చేశారు. ఈ నేపథ్యంలోనే ఇక ప్రజలలో పనిచేస్తున్న వివిధ ప్రజా సంఘాలను, ముఖ్యంగా పాలక పార్టీ దుర్మార్గాల గురించి ప్రజలకు వివరించే శక్తి ఉన్న సంఘాలను పని చేయకుండా చేయాలనేది పాలక పార్టీ లక్ష్యం. ఈ సంఘాల మీద, వాటి నాయకత్వం మీద, కార్యకర్తల మీద ఎంత నిర్బంధం ప్రయోగించినా ఎక్కడో ఒకచోట ఏదో ఒక కార్యక్రమం, ఏదో ఒక సభ, ఏదో ఒక ప్రదర్శన, ఏదో ఒక పత్రిక, ఏదో ఒక కరపత్రం ఇంకా సాగుతూనే ఉన్నాయి. అది సాగకుండా చేయాలంటే ప్రత్యామ్నాయ, ప్రజా రాజకీయాల స్వరం వినిపించకుండా చేయాలంటే, కేవలం ప్రభుత్వ బాకా మాత్రమే వినిపించేలా చేయాలంటే ఆ భిన్నస్వరాల ఉనికినే నిషేధించాలి. తెలంగాణలో నిశ్శబ్దం నింపాలి, శ్మశాన శాంతి వ్యాపింపజేయాలి. ఆ శ్మశాన శాంతి నెలకొల్పే ప్రయత్నమే ఈ నిషేధపుటుత్తర్వులు.

అయితే నిజాం ప్రభువుల నుంచి భారత ప్రభుత్వ సైనిక పాలన నుంచి, వెల్లోడి పాలన నుంచి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలన దాకా తెలంగాణ సమాజం ఇటువంటి నిషేధాలనూ నిర్బంధాలనూ ఆంక్షలనూ ఎన్నిటినో చూసింది. ఎదిరించి పోరాడింది. అదునుకోసం వేచిచూస్తూ మౌనంగా భరించింది. అవకాశం వచ్చినప్పుడు లేచి నిలిచింది. తెలంగాణ చరిత్ర నేర్పుతున్న పాఠమిదే. ఆ చరిత్రను పరిశీలించి చూస్తే, ఆ నిరంకుశ పాలకులూ వారి శాసనాలూ మిగలలేదు గాని, తెలంగాణ మిగిలింది. తెలంగాణ ప్రజలు మిగిలారు. ప్రజల ఉద్యమాలు మిగిలాయి. ఇది చరిత్ర చెప్పిన సత్యం. ఇదే చరిత్ర చెప్పనున్న సత్యం.

(రచయిత వీక్షణం సంపాదకులు) వీ

ఆంధ్రప్రదేశ్‌లో ఆస్తి పన్ను పెంపు భారం!

***ఆస్తి పన్నును అర్థ రహితంగా పెంచుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజలపై భారాన్ని మోపుతుందని, హక్కుల పరిరక్షణ కోసం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అంటున్నారు* చిమ్మె జాన్ బర్నబాస్**

కరోనా కష్టాలు తీరక ముందే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై తమ ప్రతాపాన్ని ఏదో ఒక విధంగా చూపుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రజలపై పెట్రోల్ ధరలు పెంచుతూ పోతూ ఉంటే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తానేమీ తక్కువ కాదన్నట్లు ప్రజల నివాసాలపై, ఆస్తి పన్ను రూపంలోను, చెత్త రూపంలోను వసూలు చేయాలని సన్నాహాలు చేస్తూ జీఒలు జారీ చేసింది. అంతేకాకుండా 'చెత్త' సేకరణకు పన్ను రూపంలో ప్రజలపై భారం వేయడం మరీ విడ్డూరంగా ఉంది.

పాత పన్ను విధానంలో ఆస్తి పన్ను ఐదేళ్లకొకసారి సవరించాలని చట్టం చెపుతున్నది. కానీ వివిధ కారణాల వల్ల దాన్ని ఎవరూ పాటించేవారు కాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2002లో నివాస భవనాలకు, 2011లో వాణిజ్య భవనాలకు ఆస్తి పన్ను సవరణ జరిగింది. ఇప్పటికీ అదే పన్నుల విధానం కొనసాగుతున్నది. కొత్త విధానంలోని పన్నుల పెంపులో గరిష్ఠ విధానం అంటూ ఏదీ లేదు. నివాస గృహం కానీ, నివాస స్థలం కానీ రిజిస్ట్రేషన్ విలువలో నిర్దేశించిన శాతానికి చేరుకునే వరకూ పన్ను పెరుగుతూనే ఉంటుంది.

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన తాజా జిఒ ప్రకారం కొత్త పన్ను విధానం ప్రవేశ పెట్టిన తొలి సంవత్సరం ఇప్పుడున్న పన్ను మీద కనీసం 10 శాతం గరిష్ఠంగా 15 శాతం పెరుగుతుంది. రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా నిర్ణయించిన పన్ను మొత్తం ప్రస్తుతం కడుతున్న పన్నుతో పోల్చినప్పుడు 15 శాతం కంటే ఎక్కువ ఉంటే, పెంపుదలను గరిష్ఠంగా 15 శాతానికి పరిమితం చేస్తారు. ఉదాహరణకు ఒక వ్యక్తి తన గృహానికి రు. 1,000 ఆస్తి పన్ను కడుతున్నాడనుకుందాం. రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం అతను కట్టాల్సిన వార్షిక పన్ను రు. 2,000గా తేలినా కూడా తొలి సంవత్సరం రు. 1,150 గానే పన్నును ఖరారు చేస్తారు. అప్పటి నుండి ఏటా 15 శాతం పెంచుతారు.

ప్రస్తుత పన్నుకూ, పెరిగిన పన్నుకూ వ్యత్యాసం 10 - 15 శాతం మధ్య ఉంటే అంత శాతమే పెంచుతారు. ప్రస్తుత పన్నుకూ, పెరిగిన పన్నుకూ వ్యత్యాసం 10 శాతం లోపు ఉంటే కూడా 10 శాతం పెంచేస్తారు. కొత్త పన్ను ప్రస్తుత పన్నుతో సమానంగా ఉన్నా అంతకంటే తక్కువ ఉన్నప్పటికీ ప్రస్తుత పన్నుకంటే 10 శాతం అదనంగా పన్ను వేస్తారు. రెండవ సంవత్సరం నుంచి మొదటి సంవత్సరం చెల్లించిన పన్ను కంటే పెంచాల్సిన పన్ను 15 శాతం కన్నా ఎక్కువగా ఉంటే 15 శాతానికే పరిమితం చేస్తారు. పెంచాల్సి పన్ను 15 శాతం లోపు ఉంటే, ఎంత ఉంటే అంత పెంచుతారు. అనగా అప్పుడది రెండింతలవుతుంది. తొలి సంవత్సరం చెల్లించిన పన్ను, ఈ ఏడాది తాజా రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం లెక్కించిన పన్నుకంటే ఎక్కువ ఉన్నా లేదా సమానంగా ఉన్నా తగ్గించరు. అప్పుడు 2 శాతం పెంచుతారు.

ఈ విధంగా ఏటా కొంత చొప్పున పెంచుకుంటూ వెళ్తే ఏదో ఒకరోజు ఆ సంవత్సరం రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం గణించిన పన్నుకి చెల్లించిన పన్ను సమానమైతే అక్కడి నుండి ఎలాంటి పరిమితులు లేకుండా తర్వాత రిజిస్ట్రేషన్ విలువలు పెరిగిన ప్రతిసారీ అదే దామాషాలో ఆస్తిపన్ను పెంచుకుంటూ వెళ్లాలని జీఓలో పేర్కొన్నారు.

కొత్త భవనాలకు రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం పన్ను వర్తింపజేసే విధంగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కొత్త పన్ను విధానం అమలులోకి వచ్చేసరికి కొత్తగా కట్టిన నిర్మాణాలకు రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగానే పన్నులు వేస్తారు. వారికి పాత పన్ను విధానం వర్తించదు కాబట్టి ఏటా 15 శాతం పెంపుదల అనే విధంగా వీరికి వర్తించదు. రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం నిర్ణయించిన పూర్తి పన్ను ఏటా కట్టాల్సిందే.

ఇప్పటికే ఒక సాధారణ గృహం ఉన్న వ్యక్తి దానిపై అదనంగా ఒక అంతస్థు వేసుకున్నా, గది కట్టుకున్నా కూడా కొత్తగా ఆస్తిపన్ను మదింపు చేస్తారు. అప్పటి నుండి ఆ మొత్తం భవనానికి రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా నిర్ణయించిన పూర్తి పన్నునే వసూలే చేస్తారు. పాత పన్నుపై 15 శాతం పెంపు నిబంధన వర్తించదు.

ఒకవేళ నివాస భవనంగా ఉన్న దానిని వాణిజ్య భవనంగా మార్చుకుంటే ఆస్తిపన్ను కొత్తగా మదింపు చేస్తారు. అప్పటి నుంచి వారు కూడా రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగానే ప్రతి సంవత్సరం పన్ను చెల్లించాలి. అంతేకాకుండా కొత్త విధానం అమలులోకి వచ్చే నాటికి పన్ను మదింపు ప్రక్రియ మొదలై, ఇంకా ఖరారు కాని నిర్మాణాలకు రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా నిర్ణయించిన మొత్తం పన్నునే ఏటా వసూలు చేస్తారు.

ప్రభుత్వం ఆస్తిపన్నును మోసపూరితంగా, అర్థరహితంగా పెంచుతూ ప్రజలపై పెను భారం మోపుతున్నది. రాష్ట్రం మొత్తం మీద రు. 10 వేల కోట్ల ఆదాయం కోసం ప్రజలపై ప్రభుత్వం పన్ను వేయబోతోంది. ఇప్పటికే మద్యం వ్యాపారం ఏరులై పారుతోంది. ఇసుక, భూమి, గనులు అన్నింటినీ ఏదో ఒక రకంగా దోపిడీ వనరులుగా మార్చుకున్న ప్రభుత్వ పెద్దలు ప్రజల పైన మాత్రం పన్నుల రూపంలో వసూళ్లకు పాల్పడుతున్నారు. ప్రభుత్వంలో ఉన్న పెద్దల ఆర్థిక వనరులను పెంచుకోవడానికే ప్రజలపై భారం

మోపుతున్నారు. ప్రభుత్వం ఆదాయం కోసం భూమి, భవనాల రిజిస్ట్రేషన్ విలువలను పెంచుతున్నది. అలా పెంచిన ప్రతిసారి పన్నును కూడా పెంచుతూ పోతున్నది. ఇది ప్రజల సాంఘిక, ఆర్థిక పరిస్థితుల ఆధారంగా చేసిన ప్రక్రియ మాత్రం కాదు.

ప్రభుత్వం తాను అనుకున్నదానిని ప్రజల కళ్లుగప్పి, మున్సిపల్ ఎన్నికలు అయిపోయిన తర్వాత మొత్తం పాలక మండళ్లనన్నింటినీ (తాడిపత్రి మినహా) తన చేతిలోకి వచ్చిన తర్వాత పన్నులను పెంచాలనే నిర్ణయానికి వచ్చింది. వాస్తవానికి ఈ జీఓను 2020 లోనే మున్సిపల్ అధికారుల లేదా నోడల్ అధికారుల పాలనలో ఉన్నప్పుడే నిర్ణయం తీసుకున్నారు. జీఓ ఎంస్ 198 – తేది 24-11-2020 ప్రకారం పన్నులను పెంచే విధానాన్ని అన్ని మున్సిపాలిటీలకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజాభిప్రాయాన్ని ఏమాత్రం కోరకుండా, సామాన్య ప్రజలకు మౌలిక సదుపాయాలను ఏమాత్రం పెంచకుండా, కనీసం వారికి సరైన మంచినీటి సదుపాయం కల్పించకుండా పన్నులను పెంచేయడం అప్రజాస్వామికం. ఒక రకంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో ప్రజలకు ప్రత్యక్షంగా నగదును బదిలీ చేస్తూ అంతకంటే రెండింతలు వివిధ పన్నుల రూపంలో, లేదా మొత్తం నిత్యావసరాల వస్తువులు, సరుకుల ధరలు పెంచడం ద్వారా ప్రజల నుంచి వసూలు చేస్తున్నది. దీనికి భిన్నంగా 'సంక్షేమం' పేరుమీద ప్రజలను భ్రమింపచేస్తున్నది. ఒక చేత్తో నగదును ఇంటింటికీ ఇస్తున్నామని చెప్పుకుంటున్న ప్రభుత్వం మరో చేత్తో దానిని లాగేసుకుంటున్నది. కరోనా కష్టకాలంలో ప్రజలపై భారం మోపుతూ ప్రజలను మరింత దివాళా తీసే విధంగా ప్రవర్తిస్తున్నదీ ప్రభుత్వం.

మున్సిపల్ కౌన్సిలర్లు కూడా ప్రజలపై ఏమాత్రం కనికరం, దయ, జాలీ లేకుండానే ప్రజాభిప్రాయాన్ని గౌరవించకుండా నియంతృత్వ పోకడలతో మున్సిపాలిటీ పాలక మండళ్లలో విధిగా తీర్మానాలు చేసే విధంగా ప్రభుత్వం ప్రవర్తిస్తున్నది. ప్రజలను కేవలం బిచ్చగాళ్లుగా చూస్తున్నది. వారిచ్చినప్పుడు తీసుకుంటూ, అడిగినప్పుడు వసూళ్లకు సహకరించే విధంగా ప్రజలు ఉండాలని ఈ ప్రభుత్వం భావిస్తున్నది. ప్రజలను 'వస్తువులు'గా భావిస్తున్నారు. వారు రాజ్యాంగ బద్ధంగా 'పౌర హక్కులు' కలిగి ఉంటారని, పౌర సేవలకు వారు అర్హులనే భావన ఈ ప్రభుత్వం భావించడం లేదు. మేము అధికారంలో ఉన్నాం కాబట్టి మేం ఏం చేసినా చెల్లుతుందనే భావన ప్రభుత్వ పెద్దలలో ఉన్నది. ఈ జీఓపై ఇప్పటికే ప్రజలలో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమవుతున్నది. అన్ని మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టారు. ప్రజలు ఈ జీఓను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు అయినా లేదు.

ప్రజలకు పట్టణాలలో సరైన మౌలిక వసతులు కల్పించకుండా కేవలం పన్నులు వేయడం ద్వారా వారి మనోభావాలను దెబ్బతీస్తున్నారు. ప్రజలకు సరైన డ్రైనేజీ వ్యవస్థ, ప్రతిరోజూ చెత్త సేకరణ, మురికి కాలువలను శుభ్రం చేయడం, పార్కులు సేదతీరే ప్రదేశాలు నిర్మించడం మున్సిపాలిటీలు చేపట్టడంలో విఫలమయ్యాయి. మళ్లీ ఇప్పుడు కూడా ఇవన్నీ కల్పిస్తామని, పన్నులు కట్టండంటూ జీఓను విడుదల చేశారు. ఇది దుర్మార్గం.

వచ్చే నెల 8 నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో చెత్త సేకరణ కోసం వాహనాల సేకరణ, నిధుల సమీకరణ కోసం అనుమతిచ్చినట్లు దీనిని 'క్లాప్' (క్లీన్ ఆంధ్రప్రదేశ్) గా ముద్దు పేరు పెట్టుకున్నారు. కరోనా విష రోగంతో ప్రజలు ఉపాధి కోల్పోయి, కుటుంబ సభ్యుల ఆరోగ్యం కోసం వేలాది రూపాయలు ఖర్చుచేసుకొని దుర్భర జీవితం గడుపుతున్న ప్రజల పట్ల ఈ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తున్నది. వాహనాల వినియోగానికి ప్రతి ఇంటి నుంచి నెలకు 'రుసుము' వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం విచారకరం.

ఇళ్ల నుంచి వ్యర్థాల సేకరణ, రవాణాకు ఇప్పుడున్న తోపుడు బండ్ల స్థానంలో తొలి దశలో 3,100 డీజిల్ ఆటోలను సమకూర్చనున్నారు. రెండో దశలో 1,700 ఈ-ఆటోలు కేటాయించనున్నారు. వ్యర్థాలను వాహనాలలో సమీపంలోని ఎరువుల తయారీ కేంద్రాలకు తరలిస్తారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న 31 ఎరువుల తయారీ కేంద్రాలతో పాటు కొత్తగా మరో 18 ఏర్పాటు చేస్తున్నారు (ఇంకా కార్యరూపం దాల్చలేదు).

పొడి చెత్త నుంచి విద్యుత్ తయారీకి సంబంధించి విశాఖపట్టణం, గుంటూరులలో రెండు ప్లాంట్‌లు అందుబాటులోకి రానున్నాయని అధికారులు చెబుతున్నారు. ఉత్తరాంధ్రలోని 3 జిల్లాల్లో గల పట్టణ స్థానిక సంస్థల నుంచి పొడి చెత్తను విశాఖ ప్లాంట్‌కు, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో గల పట్టణాల నుంచి పొడి చెత్తను గుంటూరు ప్లాంట్‌కు సరఫరా చేయాలని నిర్ణయించారు. ప్లాంట్‌లు అందుబాటులో లేనిచోట పొడి చెత్తలోని ప్లాస్టిక్, స్టీల్, ఐరన్ ఇతరత్రా వస్తువులను స్థానిక వ్యాపార సంస్థలకు విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అనగా ఈ ప్రభుత్వం 'చెత్త'తో కూడా వ్యాపారం చేయదలచుకున్నది. ప్రజలకు సేవ చేయడానికి 'స్థానిక పరిపాలనా సంస్థ'లను ఏర్పాటు చేయడం రాజ్యాంగం కల్పించిన హక్కు (ఆర్టికల్ 243పి నుంచి 243 జెడ్‌జి). తమను తాము పరిపాలించుకునే హక్కును ప్రజలు కోల్పోతుండడం విచారకరం. తమ హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం అప్రమత్తతతో పోరు సల్పడమే మన కర్తవ్యం కావాలి.

(రచయిత న్యాయవాది, ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

మానవ ఆలోచన భౌతిక సత్యాన్ని గ్రహించగలదా అనేది సైద్ధాంతిక ప్రశ్న కాదు. అది ఆచరణలో తేలే ప్రశ్న. సత్యాన్ని, అంటే, తన ఆలోచనకు సంబంధించిన వాస్తవికతనూ, శక్తినీ, తాను చూసే పార్శ్వాన్నీ మనిషి ఆచరణలోనే రుజువు చేయవలసి ఉంటుంది. ఆలోచన వాస్తవికమైనదా, అవాస్తవికమైనదా అనే వివాదాన్ని ఆచరణ నుంచి వేరు చేస్తే అది కేవలం పండిత చర్చే అవుతుంది.

– కార్ల్ మార్క్స్

రాజ్యాంగ సంస్థలు - పారదర్శకత

***స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థలను ఏర్పాటు చేస్తున్నామంటూనే వాటిని సాధ్యమైనంత వరకు నిష్క్రియాపరం చేస్తూ అవి తమ చెప్పుచేతుల్లోనే కొనసాగాలని పాలకులు కోరుకుంటున్నారని అంటున్నారు* సిఎస్ఆర్ ప్రసాద్**

భారత రాజ్యాంగంలో పొందుపరచబడిన ప్రాథమిక హక్కులు పౌరులందరి వ్యక్తిత్వ వికాసం కోసం ఉద్దేశించబడినవి. నిజానికి మనిషి అనాగరిక దశ నుండి నాగరిక దశలోకి మారే క్రమంలో ప్రారంభమైన నూతన చైతన్యం, ఆలోచనాధారల కారణంగానే స్వేచ్ఛ అనే స్పృహ ప్రారంభమైంది. ఆ స్వేచ్ఛను పొందడానికి అవరోధంగా ఉన్న ఆధిపత్య సాంఘిక నిర్మాణాలకు, రాజ్యానికి వ్యతిరేకంగా వేల సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలు జరిగాయి. ఇవి కొన్ని సందర్భాలలో శాంతియుతంగానూ, మరికొన్ని సందర్భాలలో హింసాత్మక తిరుగుబాట్ల రూపంలోనూ జరిగాయి. ఈ నూతన చైతన్యం పట్ల సహజంగానే ఆధిపత్య శక్తులు – సాంఘిక, మత, రాజకీయ, ఆర్థిక శక్తులు – తీవ్రమైన ద్వేషాన్ని ప్రదర్శించాయి. స్వేచ్ఛ కోసం, హక్కుల కోసం జరిగిన పోరాటాల్ని రక్తపుటేర్లలో ముంచాయి. ఆధునిక కాలంలో నాగరిక దేశాలుగా గుర్తించబడుతున్న ఏ ఒక్కదేశమూ దీనికి మినహాయింపు కాదు. అయినా ఆయా దేశాల పాలకుల పాశవిక నిర్బంధాన్ని తట్టుకుంటూ మానవజీవనం నూతన యుగంలోకి అడుగుపెట్టింది.

పోరాటాల ఫలితంగా తాము సాధించుకున్న స్వేచ్ఛకూ, హక్కులకూ రక్షణ కావాలని డిమాండ్ చేసింది. దాని ఫలితంగానే దేశ రాజ్యాంగాలలో ఈ హక్కులను గుర్తించక తప్పని స్థితి ఏర్పడింది. అయితే అంతటితో కథ పూర్తికాలేదు. కేవలం రాజ్యాంగంలో గుర్తింపు లభించినంత మాత్రాన తమ హక్కులకు రక్షణ పూర్తిగా లభించదని ప్రజలు తెలుసుకున్నారు. రాజ్యాంగంలో ఏమి ఉన్నా, ఏమి లేకపోయినా ఆధిపత్య శక్తులు ఏదో ఒకమేరకు ప్రజల స్వేచ్ఛల మీద, హక్కుల మీద దాడులు చేస్తూనే ఉంటాయి. వాటికి రాజ్యం ప్రత్యక్షంగా, పరోక్షంగా తన మద్దతునిస్తూనే ఉంటుంది. రాజ్య యంత్రాంగం కూడా ఆధిపత్య శక్తులకే వత్తాసు పలుకుతూ ఉంటుంది. ఈ నేపథ్యంలో రాజ్యాంగం వివిధ వర్గాలకు ఇచ్చిన హక్కుల అమలును పర్యవేక్షించడానికి స్వయం ప్రతిపత్తిగల కొన్ని వ్యవస్థలు ఏర్పడాలని కోరుకున్న ప్రజలు తెచ్చిన ఒత్తిళ్ల ఫలితంగా అన్ని దేశాలలోనూ హక్కుల అమలు పర్యవేక్షక సంస్థలు ఏర్పడ్డాయి. అలాంటిదే మనదేశంలో ఏర్పడిన జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్.హెచ్.ఆర్.సి.). దీనితో పాటు జాతీయ ఎస్.సి, ఎస్.టి. హక్కుల కమీషన్, మహిళా హక్కుల కమీషన్, మైనారిటీల హక్కుల కమీషన్ లాంటివి కూడా ఏర్పడ్డాయి. వీటిని పౌరుల ప్రాథమిక హక్కుల పరిరక్షణా సంస్థలుగా గుర్తిస్తారు. అందుకే ఇంగ్లిష్‌లో వీటిని 'వాచ్‌డాగ్స్' అని అంటారు. ఇవి ఏవీ ప్రభుత్వ సంస్థలు కావు. రాజ్యాంగ సంస్థలు. అంటే న్యాయస్థానాలకున్నట్లే వీటికి కూడా స్వతంత్ర ప్రతిపత్తి వుంటుంది. దాన్ని కాపాడడానికి రాజ్యాంగం కొన్ని రక్షణలను కూడా ఇచ్చింది. అలాంటి స్వతంత్ర ప్రతిపత్తి లేనిపక్షంలో ఇవి ఆచరణలో కేవలం కాగితపు పులులలాగే మిగిలిపోతాయి. ఈ వాచ్‌డాగ్ సంస్థలు ఎంత పటిష్టవంతంగా, స్వతంత్రంగా, నిజాయితీగా పనిచేస్తే, దేశంలో హక్కుల, స్వేచ్ఛల అమలు అంత ప్రజాస్వామికమౌతుంది. ఇది రాజ్యాంగ స్పిరిట్. అయితే మారుతున్న ప్రజాభిప్రాయానికనుగుణంగా ఇలాంటి వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నారు గాని, అంతిమంగా ఇవి తమ చెప్పు చేతల్లోనే కొనసాగాలని పాలకులు కోరుకుంటున్నారు. ఇవి నిమిత్తమాత్రంగానే పనిచేయాలని, వ్యవస్థలోని యథాతథ స్థితిని మౌలికంగా ప్రశ్నించే హక్కుల ఉద్యమాల పట్ల ఇవి అనుకూల వైఖరితో వ్యవహరించకూడదని అన్ని దేశాలలోనూ పాలకుల అభిప్రాయం. అందుకే ఇలాంటి సంస్థలను ఏర్పాటు చేస్తూనే సాధ్యమైనంతవరకు వాటిని నిష్క్రియాపరం చేయడానికి ప్రయత్నిస్తున్నారు.

ఈ మధ్యనే మనదేశంలో ఎన్.హెచ్.ఆర్.సి. అధ్యక్షుడిగా మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి అరుణ్ మిశ్రాను కేంద్రం నియమించడాన్ని మనం పరిశీలించాలి. ఈ నియామకం పట్ల పౌరసమాజం నుండి తీవ్రమైన అభ్యంతరాలు వస్తున్నాయి. హక్కుల సంఘాలతో పాటు, రాజకీయ పక్షాలు, మేధావులు అనేకమంది తమ ఆందోళనను, నిరసనను వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయం ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో కుదిరిన 'పారిస్ సూత్రాల'కు విరుద్ధంగా ఉందని అభిప్రాయపడుతున్నారు. ఎన్.హెచ్.ఆర్.సి. అధ్యక్షుడు, సభ్యులను నియమించడానికి రాజ్యాంగం ఒక కమిటీని నియమించింది. ఇందులో ప్రధాని, కేంద్ర హోం శాఖా మంత్రి, లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ డిప్యూటీ ఛైర్‌పర్సన్, పార్లమెంట్‌లో ప్రతిపక్షనాయకుడు ఉంటారు. అంటే సహజంగానే నియామకంలో అంతిమ నిర్ణయంలో మొగ్గు అధికారపక్షం వైపే ఉంటుందన్నమాట. నిజానికి ఈ పద్ధతే లోపభూయిష్టమైనది. ఇలాంటి స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థలలో సభ్యుల నియామకం పారదర్శకంగా నిష్పక్షపాతంగా ఉండాలంటే, ఆ బాధ్యతను సుప్రీంకోర్టు ఏర్పాటు చేసే ఒక నిపుణుల కమిటీకి అప్పగించాలి. ఆ కమిటీలో హక్కుల దృష్టి, స్పర్శ ఉన్న వ్యక్తులకు స్థానం లభించాలి. సమాజంలో ఉన్న వివిధ పీడిత సమూహాలకు ప్రాతినిథ్యం ఉండాలి. జాతి, మత, కుల, భాష, మైనారిటీలతో పాటు అణచివేతకు గురౌతున్న వర్గాల ప్రతినిధులకు కూడా అందులో స్థానం ఉంటేనే అది నిజమైన వాచ్‌డాగ్ లాగా వ్యవహరించగలుగుతుంది. అలాంటి ఏర్పాటు మనదేశంలో లేదు.

ఈ మధ్య జరిగిన ఒక సమావేశంలో జస్టిస్ అరుణ్ మిశ్రాను అధ్యక్షుడు గాను, ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ అధినేత రాజీవ్ జైన్‌ను, జమ్మూ కశ్మీర్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి మహేశ్ మిట్టల్ కుమార్‌ను సభ్యులుగా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నది. ఈ నిర్ణయం పట్ల ఆ కమిటీలో సభ్యుడైన కాంగ్రెస్ నాయకుడు మల్లిఖార్జున ఖార్గే తన అసమ్మతిని తెలియజేస్తూ అభ్యంతరాలను ప్రధానికి లిఖితపూర్వకంగా సమర్పించారు. దేశంలో జరుగుతున్న హక్కుల ఉల్లంఘనలలో బాధితులుగా ఉన్నవారిలో అత్యధికులు దళితులు, ఆదివాసీలు, అభివృద్ధికి దూరంగా నెట్టివేయబడ్డవాళ్లు. వాళ్లకు న్యాయం జరగాలంటే ఆ వర్గాలకు చెందిన వ్యక్తులకు ఎన్.హెచ్.ఆర్.సి.లో ప్రాతినిధ్యం లభించాలని, అలా జరిగినప్పుడే ఆయా మానవ సమూహాలకు న్యాయం జరుగుతుందని అంటూ ఆయన తన నిరసనను తెలియజేశారు.

1991 అక్టోబర్‌లో పారిస్‌లో జరిగిన ఒక అంతర్జాతీయ సమావేశంలో ఆమోదించిన మార్గదర్శక సూత్రాలనే పారిస్ సూత్రాలు అంటారు. వివిధ దేశాలలో ఉండే మానవహక్కుల సంఘాలు పాటించాల్సిన కనీస నాణ్యతా ప్రమాణాలను వీటిలో పొందుపరిచారు. అవి

1. హక్కుల సంఘాలు ప్రభుత్వం నుండి, ఎన్.జి.వోల నుండి స్వతంత్రంగా వ్యవహరించగలగాలి.

2. వాటికి న్యాయ సంబంధమైన, ఆచరణ సంబంధమైన, విధానాల రూపకల్పనలకు సంబంధించిన, ఆర్థిక నిర్వహణకు సంబంధించిన వ్యవహారాలలో పూర్తి స్వయం ప్రతిపత్తి ఉండాలి. అప్పుడు మాత్రమే వాటిల్లో ఉండే సభ్యులు స్వతంత్రంగా ఆలోచించగలుగుతారు, స్వతంత్రమైన నాయకత్వపు సామర్థ్యాన్ని ప్రదర్శించగలుగుతారు. అవి తమ స్వయం ప్రతిపత్తిని ఆచరణలో కాపాడుకోగలుగతాయి. ప్రజల హక్కుల పట్ల నిజమైన వాచ్‌డాగ్స్‌గా పనిచేయగలుగుతాయి.

3. ఈ సంస్థలు సమాజంలో ఉండే బహుళత్వానికి ప్రతిబింబంగా ఉండాలి. అంటే ఆయా సమాజాలలో ఉండే వివిధ వర్గాలు, సామాజిక బృందాలకు వీటిల్లో ప్రాతినిధ్యం ఉండాలి. అప్పుడు మాత్రమే అవి అందరి హక్కులనూ పరిరక్షించగలిగే స్వభావాన్ని కలిగి ఉంటాయి.

4. వీటికి నిర్ణయాలు తీసుకోవడంలోనే కాక, తీసుకున్న నిర్ణయాలను అమలుపరచడంలో కూడా స్వతంత్రమైన అధికారాలు ఉండాలి. అందుకే తనకు అవసరమైన అధికార యంత్రాంగాన్ని తాను రూపొందించుకునే అవకాశం దానికివ్వాలి.

5. ఈ సంస్థలు ఆర్థిక వ్యవహారాలలో కూడా స్వయం ప్రతిపత్తిని కలిగి ఉండి ప్రభుత్వ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడని స్థితి వాటికుండాలి. ఆర్థిక వ్యవహారాలలో అడ్డం పెట్టుకుని ప్రభుత్వాలు ఈ సంస్థలను తనకు అనుగుణంగా పనిచేసేటట్టు ఒత్తిడి చేయడానికి అవకాశం ఉండకూడదు.

6. ఈ సంస్థలు అంతిమంగా ప్రజలకు, ముఖ్యంగా అణగారిన వర్గాల ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. చట్టపరంగానే కాకుండా నైతికపరంగా కూడా ఆ జవాబుదారీతనం ఉండాలి. అలా ఉంటేనే అవి పారదర్శకంగా పనిచేస్తాయి.

ఈ సూత్రాలను భారత ప్రభుత్వం కూడా అంగీకరించింది. కాని ఇప్పుడు ఎన్.హెచ్.ఆర్.సి.కి జరిగిన నియామకాలలో రెండింటిపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమౌతున్నాయి. 1. జస్టిస్ అరుణ్ మిశ్రాను అధ్యక్షుడునిగా చేయడం. ఈయన సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన కాలంలో కొన్ని సున్నితమైన, ప్రధానమైన వివాదాలలో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పులిచ్చారు. అందులో ఒకటి, న్యాయమూర్తి లోయా మరణానికి సంబంధించిన వివాదం. జస్టిస్ లోయా సి.బి.ఐ.కి చెందిన కేసులు పరిశీలించే ప్రత్యేక కోర్టులో న్యాయమూర్తిగా ఉండేవారు. సొహ్రాబుద్దీన్ హత్య కేసును ఆయన అధ్యక్షతన ఉన్న న్యాయస్థానం విచారిస్తూ ఉండగా 2014 డిసెంబర్ 1న ఒక మిత్రుని కుటుంబంలో జరుగుతున్న వివాహానికి హాజరైన జస్టిస్ లోయా ఆకస్మికంగా చనిపోయారు. ఆ మరణం పట్ల ఆయన కుటుంబ సభ్యులు, కొందరు న్యాయమూర్తులు అనుమానాలు వ్యక్తం చేశారు. సొహ్రాబుద్దీన్ హత్యకేసులో ముఖ్య ముద్దాయిగా ఉన్న అమిత్‌షాకు అనుకూలంగా తీర్పు ఇవ్వమని ఆయనపై వచ్చిన ఒత్తిడే ఆయన మరణానికి కారణమని లోయా కుటుంబ సభ్యులు భావించారు. కాని ఈ కేసును విచారించిన అరుణ్ మిశ్రా ఈ అనుమానాలు నిరాధారమని తీర్పు చెప్పారు.

అలాగే హరేన్‌పాండ్యా, సంజీవ్‌భట్‌ల వివాదంలో కూడా ఆయన ప్రభుత్వ అనుకూల తీర్పులు ప్రకటించారు. అలానే ఢిల్లీ నగరంలో రైల్వే లైన్‌ల పక్కన ఉంటున్న మురికివాడల నిర్మూలనకు ఆదేశాలు ఇచ్చిన బెంచ్‌కి ఈయన అధిపతి. ఈ కేసులో దిగువ న్యాయస్థానాలు స్టే మంజూరు చేయరాదని కూడా ఆయన ఆర్డర్ జారీ చేశారు. అదే విధంగా తాను అధ్యక్షత వహించిన ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన బెంచ్, భూముల స్వాధీనానికి సంబంధించిన వివాదంలో ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టులో పునర్విచారణ జరుగుతున్నప్పుడు, ఆ బెంచ్‌కు కూడా ఈయనే అధ్యక్షత వహించారు.

ఇది న్యాయ సాంప్రదాయాలకు విరుద్ధమని వచ్చిన అభ్యంతరాలను కూడా ఆయన తోసిపుచ్చారు. అలానే అడవులలో జీవనోపాధి గడుపుకుంటున్న ఆదివాసీలను బలవంతంగా ఆ ప్రాంతాల నుండి ఖాళీ చేయించాలని ఆదేశాలిచ్చింది కూడా ఈయనే. 2020 జనవరి 20న 24 దేశలకు చెందిన న్యాయమూర్తుల సమావేశంలో జస్టిస్ మిశ్రా ప్రసంగిస్తూ, మోడీ గొప్ప దూరదృష్టిగల నాయకుడని పొగిడారు. పదవిలో ఉన్న ఒక న్యాయమూర్తి ఒక రాజకీయ వ్యక్తిని ఇలా బహిరంగంగా పొగడడం న్యాయ సంప్రదాయాలకు విరుద్ధం.

ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ అధినేత రాజీవ్ జైన్‌ను ఎన్.హెచ్.ఆర్.సి. సభ్యుడిగా నియమించడం పట్ల కూడా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఎన్.హెచ్.ఆర్.సి.కి స్వతంత్రమైన అధికార యంత్రాంగం లేకుండా అది కేంద్ర, రాష్ట్ర పోలీసు శాఖలలో ఉండే అధికారులపైన ఆధారపడడం దాని స్వతంత్ర ప్రతిపత్తికి భంగకరం. ఇలాంటి వాళ్లకి మానవహక్కుల పట్ల పాజిటివ్ దృక్పథం ఉండదు. వాళ్ల ఆలోచన ఎప్పటికీ ప్రభుత్వానికి అనుకూలంగానే

వుంటుంది. ప్రజల సమస్యలని, ఆందోళనలని సాంఘిక ఆర్థిక కోణాల నుండి కాక శాంతిభద్రతల కోణం నుండి మాత్రమే ఆలోచించే మానసిక స్థితి వాళ్లలో పేరుకుపోయి ఉంటుంది. పైగా ఈ అధికారులు కొంతకాలం ఎన్.హెచ్.ఆర్.సి.లో పనిచేసి ఆ తర్వాత మళ్లీ తమ స్వంత డిపార్ట్‌మెంట్‌కి వెళ్లిపోతారు. వాళ్ల దృష్టి ఎప్పుడూ తమ డిపార్ట్‌మెంట్ పక్షానే ఉంటుంది. ఇలాంటి యంత్రంగంతో కూడిన ఎన్.హెచ్.ఆర్.సి. స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా పనిచేసే అవకాశం ఉండదు. అందుకే సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి వై.కె. సబర్వాల్, గతంలో సి.బి.ఐ.లో గాని, పోలీస్ శాఖలో గాని పనిచేసినవారిని ఎన్.హెచ్.ఆర్.సి.లో సభ్యులుగా నియమించరాదని, న్యాయస్థానాల స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడడానికి రాజ్యాంగం కల్పించిన రక్షణలన్నీ ఎన్.హెచ్.ఆర్.సి.కి కూడా వర్తించాలని అన్నారు.

నిజానికి ఎన్.హెచ్.ఆర్.సి.లో సభ్యుల దగ్గర నుండి దానికి సంబంధించిన మొత్తం యంత్రాంగంలో పనిచేసే అధికారుల వరకూ ప్రతి ఒక్కరికీ మానవహక్కుల పట్ల సున్నితమైన, గౌరవప్రదమైన భావన ఉండాలి. అలాంటి భావన కలిగేటట్లు వాళ్లకు శిక్షణ ఇవ్వడం, వాళ్లను సెన్సిటైజ్ చెయ్యడం అవసరం. ఇది నిరంతరం జరగాల్సిన కార్యక్రమం. అనేక విశ్వవిద్యాలయాలలో మానవహక్కుల అంశాలు కోర్సులుగా ఏర్పడ్డాయి. కనీసం అలాంటివి అధ్యయనం చేసినవాళ్లనైనా ఇలాంటి సంస్థలలో ఉద్యోగులుగా నియమించుకోవాలి. వాళ్లకు హక్కుల చరిత్ర, సాంఘిక రాజకీయ ఆర్థిక మూలాలు, హక్కులకు – మానవ చైతన్య అభివృద్ధికి ఉన్న సంబంధం వంటి విషయాలలో నిరంతర శిక్షణనివ్వాలి.

ఇలాంటి హక్కుల పరిరక్షణా సంస్థలలో సభ్యుల్ని నియమించడానికి ప్రభుత్వంతో సంబంధం లేని ఒక స్వతంత్రమైన వ్యవస్థ ఉండాలి. అందులో బహుళత్వ ప్రాతిపదికపైన సభ్యులుండాలి. వాళ్లలో కనీసం సగం మందికి పైగా గతంలో హక్కుల పరిరక్షణా రంగంలో పనిచేసినవాళ్లయి ఉండాలి. ఈ వ్యవస్థ ఎన్.హెచ్.ఆర్.సి.లో సభ్యుల నియామకానికి సంబంధించిన బహిరంగ ప్రకటనను జారీచేసి, అందుకు అవసరమైన అర్హతలు కలిగిన వ్యక్తుల నుండి అప్లికేషన్లు తెప్పించుకోవాలి. అలా అప్లై చేసిన వ్యక్తుల మంచి చెడుల గురించి, వాళ్ల ఆలోచనా ధార గురించి, గత చరిత్ర గురించి బహిరంగ చర్చ జరగడానికి, వాళ్లను ఎన్.హెచ్.ఆర్.సి.లో సభ్యులుగా నియమించడానికి అవసరమైన సమంజసత్వంపై వివిధ వర్గాల నుండి అభిప్రాయాలు వెల్లడికావడానికి అవకాశం కలిగించాలి. అమెరికాలో న్యాయమూర్తుల దగ్గరి నుండి వివిధ కీలమైన పదవులలో వ్యక్తులను నియమించేటప్పుడు వాళ్ల గతంలో ఎలాంటి అభిప్రాయాలు వ్యక్తం చేశారు, వాళ్ల సాంఘిక రాజకీయ భావనలు ఏమిటి అనే విషయాలపైన బహిరంగ చర్చ జరిగిన తరవాతనే వాళ్ల నియామకాలు జరుగుతాయి. వాళ్లు గతంలో బాధ్యతల్లో ఉన్న సమయంలో ఇచ్చిన తీర్పులలో గానీ, చేసిన ప్రకటనలలో గానీ, ప్రకటించిన వ్యాసాలలో గానీ జాత్యహంకారాన్ని సమర్థించారా, స్త్రీల సమానత్వపు హక్కులకు వ్యతిరేకంగా మాట్లాడారా, యుద్ధోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రకటనలు చేశారా, ఆ దేశంలోని కార్పొరేట్ సంస్థలతో వాళ్లకెలాంటి లావాదేవీలున్నాయి వంటి అంశాలన్నింటి పైనా ఎవరైనా తమ అభిప్రాయాలను వ్యక్తం చేసి, వాళ్లు ఆయా పదవులలో నియామకానికి అనర్హులని బహిరంగంగా అభిప్రాయాలు వ్యక్తం చేయడానికి అవకాశం ఉన్నది. మనదేశంలో కూడా ఇలాంటి పద్ధతి అమలైతే తప్ప ఎన్.హెచ్.ఆర్.సి. లాంటి సంస్థలో నియామకాలు పారదర్శకంగా ఉండవు. అవి చివరకు రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారిపోతాయి. అవి అలా మారిపోవడమంటే భారత రాజ్యాంగపు స్పిరిట్‌కు తూట్లు పొడవడమే.

ప్రతివ్యక్తి పైనా కుటుంబం, కులం, మతం, సాంఘిక, ఆర్థిక హోదా, పరిసరాల ప్రభావాలు తప్పనిసరిగా ఉంటాయి. వీటికి తోడు కాలక్రమంలో వాళ్లకు కొన్ని అభిప్రాయాలు కూడా ఏర్పడతాయి. ఖచ్చితంగా ఏదో ఒక భావజాలానికి వాళ్లు అనుకూలంగా మారతారు. ఒక పదవిలో నియమించబడినంత మాత్రాన వీటి ప్రభావాలేవీ లేకుండా వాళ్లు స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా రాజ్యాంగపు స్పిరిట్‌కు అనుగుణంగా పనిచేస్తారనుకోవడం భ్రమ. చొక్కాలు మార్చుకున్నంత తేలికగా భావాలు మారవు. వాళ్లు ఎలాంటి పదవులలో ఉన్నా వాళ్లు తీసుకునే నిర్ణయాలలో తమతమ భావజాలపు ప్రభావం తప్పనిసరిగా ఉంటుంది. ఒక పదవిలోకి రాగానే ఆ వ్యక్తి తన భావజాలాన్ని పక్కనబెట్టి నిష్పక్షపాతంగా, స్వతంత్రంగా వ్యవహరిస్తాడనుకునే దురభిప్రాయం మనదేశంలో చాలా బలంగా ఉంది.

రాజ్యాంగ సంస్థలు రాజ్యాంగం తమకిచ్చిన స్వయం ప్రతిపత్తిని కాపాడుకోవడం ద్వారానే ప్రజల గౌరవాన్ని, మన్ననలను పొందగలుగుతాయి. అవి నామమాత్రంగా మారిపోయి ప్రభుత్వానికి తోకలలాగా వ్యవహరిస్తే సహజంగానే ప్రజలకు ఆ సంస్థల మీద నమ్మకం సడలుతుంది. కాబట్టి పారిస్ సూత్రాలకు అనుగుణంగా స్వతంత్రమైన, పటిష్టవంతమైన, పారదర్శకమైన రాజ్యాంగ సంస్థల ఏర్పాటుకు సంబంధించిన చర్చ మరింత విస్తృతంగా జరగాల్సిన అవసరం ఉన్నది.

(రచయిత విరసం సభ్యులు)

వీ

కరోనా సోకి మావోయిస్టుల మృతి

దండకారణ్యంలో కరోనా సోకి చికిత్స అందక మావోయిస్టు పార్టీ నాయకులు మృతిచెందారు. కరోనా సోకి శోభ్రాయ్ ; కత్తి మోహన్‌రావు అలియాస్ ప్రకాష్ అలియాస్ రామదాదా జూన్ 10న దండకారణ్యంలో గుండెపోటుకు గురై మరణించారు; మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి యాప నారాయణ అలియాస్ జగన్(59) జూన్ 21న; దండకారణ్యంలోని మాడ్ డివిజన్ ఇంద్రావతి ఏరియా కమిటీ సభ్యురాలు భారతక్క అలియాస్ సారక్క జూన్ 22న మృతిచెందినట్లు; శారదక్కలు మరణించినట్లు మావోయిస్టు పార్టీ ఓ ప్రకటనలో తెలిపింది;

చారిత్రిక ప్రజా ప్రతిఘటన సిల్గేర్

ఢిల్లీ రైతుల ఆందోళనను తలపిస్తూ సిల్గేర్‌లో ఆరు వారాలకు పైగా సిఆర్‌పి క్యాంప్‌కు వ్యతిరేకంగా సాగుతున్న ఆదివాసి ఆందోళన పూర్వాపరాలు వివరిస్తున్నారు **ఏమ్లా వాగాలు**

దండకారణ్యంలోని (ఛత్తీస్ గఢ్) దక్షిణ బస్తర్ - పశ్చిమ బస్తర్ (సుక్మా - బీజాపుర్ జిల్లాలు) డివిజన్ సరిహద్దు గ్రామం సిల్గేర్‌లో నూతనంగా ఏర్పడిన కేంద్ర సాయుధ పోలీసు బలగాల క్యాంపు వ్యతిరేక ప్రజా పోరాటం మే 12 నుండి కొనసాగుతోంది. మే 17, 18 నాడు చోటుచేసుకున్న పోలీసుల కాల్పులలో ఐదుగురు స్థానిక మూలవాసీ ప్రజలు ఉయిక పాండు, ఏమ్లా వాగాలు, ఉర్సం భీమాలు, పూనెం సోఫీ, మిడియాం మాసాలు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఉయిక పాండు 14 సంవత్సరాలైనా నిండని మైనర్ బాలుడు. అలాగే వీరిలో మూలవాసీ మహిళ పూనెం సోల్జి నిండు చూలాలు. కాల్పుల సమయంలో ఆమె గాయపడి పరుగెత్తుతూ అడవిలో పడిపోయింది. ఆ పిదప ఆసుపత్రులు, వైద్యులు కరువైన ఆ ప్రాంతంలో సకాలంలో ఎలాంటి వైద్యం అందని దుస్థితిలో ఆమె చనిపోయింది. ఆమెతో పాటు హతమైన గర్భస్థ శిశువును లెక్కిస్తే ఆరు ప్రాణాలను పోలీసుల తుటాలు బలి తీసుకున్నాయి. ఆ పోలీసు కాల్పులలో దాదాపు 20 మంది ప్రజలు గాయపడినారు. మే 13 నుండి జరుపుతున్న పోలీసుల లాఠీచార్జీలో 300కు పైగా మూలవాసీ ప్రజలు గాయపడ్డారు. మొదటిసారి అంటే మే 17 నాడు జరిగిన కాల్పులలో మరణించిన ముగ్గురి శవాలకు మాత్రం పోలీసులు రు. 30 వేలు 'విలువ' చెల్లించారు, కానీ క్యాంపును ప్రతిఘటిస్తున్న ప్రజల అభ్యర్థన మేరకు ఆ ముష్టి డబ్బులు తమకు వద్దంటూ మృతుల కుటుంబీకులు మీడియా సమక్షంలో రు. 30 వేలు వాపసు చేశారు. రక్తసిక్తమవుతున్న సిల్గేర్‌లో గత నెల రోజులుగా చంకపిల్లలతో సహ వేలాది మంది మహిళలు, పురుషులు నూతన పోలీసు క్యాంపు ఎత్తివేతకై పోరాడుతున్నారు.

సిల్గేరు మూలవాసీ ప్రజా ప్రతిఘటనకు దేశ వ్యాప్తంగా వివిధ ఆదివాసీ ప్రజా సంఘాలు, సమూహాలు వ్యక్తులుగా, సంస్థలుగా సంఘీభావం తెలుపుతూ వాట్సప్‌ల ద్వార ముందుకు రావడం; ప్రజాస్వామిక, దేశభక్త, ఆదివాసీ హితైషిలైన వారి నుండి, దిల్లీ రైతాంగ ఉద్యమ నాయకుల నుండి సంఘీభావం తెలపడం, వారంతా పోరాటాన్ని తుదివరకూ కొనసాగించాలనీ తమ అండ ఉంటుందనీ తమ తమ సందేశాలలో తెలపడం పీడిత ప్రజల పోరాటాల పట్ల వారి ఆకాంక్షలకు ఒక బలమైన వ్యక్తీకరణగా ఉంది. ఈ రోజు 'బస్తర్ మే నరసంహార్ బంద్ కరో', 'ఐ స్టాండ్ విత్ బస్తర్' సర్వత్రా ఒక రణ నినాదంగా మారింది. దండకారణ్యంలో తమను అనేక రకాలుగా వేదిస్తున్న, పీడిస్తున్న రాష్ట్ర పోలీసులతో, కేంద్ర సాయుధ పోలీసు జవానులతో ప్రజలు పోరాటాలు జరుపడం ఈ రోజు కొత్తేమి కాదు. దాదాపు గత 20 సంవత్సరాలకు పైగా వారు సంఘటితపడుతూ బస్తర్ వనరులను కార్పొరేటు సంస్థలు దోపిడీ చేయడాన్ని వ్యతిరేకిస్తున్న ఫలితంగా బలగాల మీద బలగాలు వచ్చి అడవులను ఆక్రమిస్తున్నాయి. వారికి వ్యతిరేకంగా ప్రజల పోరాటాలు యేటేటా తీవ్రమవుతున్నాయి.

ఈనాడు సిల్గేర్‌లో జరుగుతున్న ప్రజా పోరాటం కొన్ని ప్రత్యేకతలు సంతరించుకుంది. ఒకవైపు వేలాది మంది ప్రజలు నెత్తురోడుతూనే, కాల్పులలో నేలకొరిగిన ఉద్యమకారుల మరణం పట్ల కన్నీరు కారుస్తూనే, మరోవైపు ధృఢ సంకల్పంతో తమ డిమాండ్ల సాధనకై నేరుగా పోలీసు క్యాంపు ముందు, వారి భారీ తుపాకులు, మందుపాతర నిరోధక వాహనాలు, శిరస్త్రాణాలతో భయం కొలిపే సంఖ్యలో భారీ బందోబస్తుల మధ్య నిలిచి సవాలు చేస్తున్నారు. ఆకాశంలో రొద పెడుతున్న డ్రోన్స్, హెలీకాప్టర్లను లెక్కచేయకుండా నెల రోజులకు పైగా మూలవాసీ ప్రజలు వినూత్న రూపాలలో పోరాడడం దండకారణ్య ఉద్యమ చరిత్రలో ఒక నూతన నమూనాను నెలకొల్పుతోంది.

జూన్ 8 నాడు జరుపతలపెట్టిన సమీక్ష సభకు హాజరవ్వాల్సిందిగా విశాల ప్రజారాసులకు వారి పోరాట సంస్థ పిలుపు నివ్వడంతో ఆ రోజు దాదాపు లక్ష మంది ప్రజలు సిల్గేర్ చేరడం ఒక నూతన రికార్డును సృష్టించింది. ఇంతటి గట్టి పోరాటానికి వారిని అనివార్యం చేసిన పరిస్థితులనూ, కారణాలనూ తెలుసుకోవాలి. అలాగే గత నెల రోజులుగా వారు ఎలాంటి ఆటంకాలను ఎదుర్కొంటూ నిలుస్తున్నారో తెలుసుకోవడం ద్వార వారి వర్తమాన జీవన్మరణ పోరాటం వెనుకగల 'జల్ జంగల్ జమీన్' కోసం సాగుతున్న ఒక అనివార్య బ్రతుకు పోరు అర్థమవుతుంది.

సిల్గేర్ ఒక చిన్న ఆదివాసీ గ్రామం. అక్కడ వందకు పైగా ఇళ్లుంటాయి. వారంతా ఒకే తెగకు చెందిన కోయలు. ఆ ఊరు జనాభా 500 దాటింది. ఆ ఊళ్లో ప్రజలు ఏర్పరచుకున్న జనతన సర్కార్ సహ పలు విప్లవ ప్రజా నిర్మాణాలు- దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘటన్, క్రాంతికారి ఆదివాసీ మహిళా సంఘటన్, చేతనా నాట్య మంచ్, ప్రజా మిలీషియా -ఉన్నాయి. వాటన్నింటికితోడు వారు ఇపుడు తమ ఊళ్లో భారత రాజ్యాంగం ప్రకారం గ్రామసభ నిర్మాణాన్ని కోరుకుంటున్నారు.

పెసా చట్టం ప్రకారం షెడ్యూల్డ్ ప్రాంతాలలో అంటే ఆదివాసుల అడవులలోకి, గ్రామాలలోకి పోలీసు, సివిల్ అధికారులు వెళ్లాలన్నా, అక్కడ ఎలాంటి ప్రాజెక్టులు చేపట్టాలన్నా, అక్కడ గనులు తవ్వాలన్నా, తుదకు పోలీసు క్యాంపులు ఏర్పర్చాలన్నా గ్రామసభల అనుమతి

ఉండి తీరాలి. అలాగే లఘు అటవీ ఉత్పత్తులన్నింటిపై గ్రామసభలకే సంపూర్ణ అధికారాన్ని పెసా పేర్కొంది. పెసా ప్రకారం భూ యాజమాన్య పత్రాలను (పట్టా), తెగ ధృవీకరణ పత్రాలను సైతం గ్రామసభలే మంజూరు చేయాలి. అంతటి శక్తిమంతమైన అధికారాలను గ్రామసభలకు పెసా సమకూర్చింది. అందుకే ఆ చట్టాన్ని యధాతథంగా అమలు చేయడం దోపిడీ వర్గాలకు జీర్ణం కావడం లేదు. ఇది ఒక భౌతిక వాస్తవికత. ఈనాడు సిల్గేరులో కూడ పోలీసు క్యాంపు నెలకొన్న భూమి యజమాని కోర్స భీమా మొదటగా మే 12నాడు పోలీసుల వద్దకు కొంత మంది గ్రామస్తులతో వెళ్లి తన అనుమతి, తమ గ్రామసభ అనుమతి లేకుండా తన భూమిలో, తమ ఊళ్లో అర్ధ రాత్రి బలగాలతో వచ్చి పోలీసులు క్యాంపు వేయడాన్ని ప్రశ్నించాడు. ఆ రోజునుంచి ఈ రోజు వరకు సిల్గేర్‌లోని ప్రజలు అదే స్టాండ్ పై శాంతియుతంగా, చట్టబద్ధంగా పోరాడుతున్నారు. వారికి ఆ ప్రాంతంలోని యావత్రజానీకం అండగా నిలిచారు. వారంతా ప్రధానంగా మూలవాసీ కోయ ప్రజలే!

మే 12 నాడు కేవలం స్థానిక ప్రజలతోనే ప్రారంభమైన క్యాంపు వ్యతిరేక నిరసనలో 13నుండి పరిసర గ్రామాల ప్రజలు వచ్చి కలువడం మొదలైంది. రోజు రోజుకూ నిరసనలో పాల్గొంటున్న వారి సంఖ్య వేలలోకి పెరగసాగింది. యేడాదిలో వారికి నగదు రాబడిని ఇచ్చే అతి కొద్ది రోజుల తునికాకు కోత పనులను సైతం వదులుకొని ఒక రాజకీయ డిమాండ్ పైన వారు కదలసాగారు. సిల్గేర్ చేరుతున్న జన సమూహానికి పోలీసులకు మధ్య రోజూ వాగ్వాదాలు జరుగుతున్నాయి. అడవిలో ఏ ఆదివాసీ తమ చేతిలో కనీసం కర్రనో, విల్లో లేకుండా బయటకు వెళ్లరు. సిల్గేర్ నిరసనలో పాల్గొంటున్న వారిలో కూడ చాలావరకు అవి లేకుండా లేరెవరు. వాటినే సంప్రదాయక ఆయుధాలుగా చెపుతున్నవారూ ఉన్నారు. ఆత్మరక్షణార్థం అవి లేకుండా అడవిలో 'కూర మృగాల' మధ్య వారి జీవితమే గడవదు.

సిల్గేర్‌లో నిరసన తెలుపుతున్న ప్రజలు ప్రతిరోజూ ర్యాలీ రూపంలో వెళ్లి న్యాయసమ్మతంగానే పోలీసులను అక్కడినుండి వెళ్లిపోవాలని కోరుతున్నారు. ప్రతిరోజు పోలీసులు ప్రజలపై తమ లాఠీలకు పని పెడుతునే ఉన్నారు. కొంత మంది గ్రామస్తుల తలలు పగిలినయి. అనేక మందికి ఒంటిపై గాయాలయ్యాయి. అలా పోలీసుల చేతిలో గాయపడిన వారి సంఖ్య మే 17 నాటికి 300 దాటింది. బీజాపూర్, సుక్మా రెండు జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఎస్.పీలు, డీఐజీ సుందరరాజు, మున్నగు ప్రభుత్వ పోలీసు అధికారులు రోజూ సిలేరు వెళ్లి, ప్రజలను వెనక్కి పంపడానికి అనేక పాచికలు విసురుతూనే ఉన్నారు. వాటిలో వారు కొరోనాను బాగా వినియోగించుకున్నారు. కానీ, ప్రజలు మాత్రం వారి న్యాయసమ్మతమైన డిమాండ్ పై దృఢంగా నిలిచి పోలీసు క్యాంపు ఎత్తివేసే వరకు తాము వెనక్కి వెళ్లేదే లేదనీ మీడియా వారు అడిగినా, అధికారులు కోరినా, ఇంకా ఇతరులు ఎవరడిగినా అదే మాట ఖరాకండిగా తేల్చి చెపుతున్నారు. అది వారి జీవన్మరణ సమస్య కాబట్టి అంతకు మించి వారు మరేం చెప్పే పరిస్థితే లేదు.

సిల్గేరులో పోలీసులు నూతనంగా వేసిన క్యాంపును వ్యతిరేకిస్తూ రెండు జిల్లాల ప్రజలు గుంపులు గుంపులుగా తరలి రావడం తెలిసిన స్థానిక మీడియా శక్తులు 13నుండే ఆ స్థలానికి రాకపోకలు చేయడం ప్రారంభమైంది. మీడియాలో వార్తలు వేడెక్కసాగాయి. స్థానిక ఆదివాసీ సామాజిక కార్యకర్త సోనీ సోడితో పాటు బేలా భాటియా, ప్రముఖ ఆర్థిక వేత్త జీన్ డ్రీజ్ లాంటి వాళ్లు కూడ ప్రజల మధ్యకు వచ్చి వెళ్లారు. వారంతా ప్రజల న్యాయ సమ్మతమైన డిమాండ్‌ను సమర్థించారు.

ప్రజలు తమకు పోలీసు క్యాంపు అవసరం లేదంటున్నపుడు జబర్దస్తీగా పోలీసులు ఊళ్లో క్యాంపు వేయడమేంటి? క్యాంపు వద్దనే ప్రజలను పైగా కాల్చి చంపడమేంటి? వారిపై లాఠీలను ప్రయోగించడమేంటి? అలాగే, 25 సంవత్సరాలుగా అమలుకు నోచుకోకుండా పోతున్న ఒక ప్రభుత్వ చట్టాన్నే ప్రజలు అత్యంత శాంతియుతంగా అమలు చేయాలని కోరుతున్నపుడు దానిని ప్రభుత్వం ఎందుకు తక్షణమే ఆమోదించడం లేదు? మరోవైపు గ్రామసభల రజతోత్సవాలను ప్రభుత్వాలు ఘనంగా పాటిస్తున్నాయి. కానీ తమ గ్రామాలలో మూలవాసీ ప్రజలు గ్రామసభలను ఏర్పాటు చేయండని కోరితే వారిని లాఠీలతో బాదుతున్నారు, తూటాలతో కాలుస్తున్నారు. సాధారణ ప్రజల మనసులలో తలెత్తే అతి సాధారణ ప్రశ్నలు ఇవి.

నిజానికి బస్తర్ ఆదివాసీ గ్రామాలలో గ్రామసభలే వాస్తవరూపం ధరిస్తే ఆ ప్రాంతాలలో దోపిడీ ప్రభుత్వాల మాటే చెల్లదనే భయం, ఆ ప్రాంతాల వనరులు తమకు దక్కకుండా పోతాయనే ఆందోళన పాలకవర్గాలను తీవ్రంగా వెంటాడుతోన్నది. కాబట్టి వాటికి సమాధానం ఏంటి? గత ఆరేళ్లుగా షెడ్యూల్డ్ ప్రాంతాలలో జల్ జంగల్ జమీన్ కోసం జరుగుతున్న ప్రజా పోరాటాలే వాటికి సమాధానం చెపుతున్నవి. పెసా హక్కుల కోసం పోరాడుతున్న ప్రజలను అణచడానికి అడవులలోకి పోలీసులు దిగుతున్నారు. పోలీసులకు వ్యతిరేకంగా పోరాడకుండా ప్రజలకు జల్ జంగల్ జమీన్ దక్కడం కల్ల అని తేలిపోయింది. కాబట్టి వారు ఆ పోరాటాలను చేపట్టక తప్పడం లేదు. వారికి చట్ట ప్రకారం అడవులు దక్కాలంటే, వారి పోరాటాలను అడ్డుకుంటున్న శక్తులతో పోరాటానికి దిగాల్సిందే! తమ కోసం తమ అడవులను, ప్రాకృతిక వనరులను దేశం కోసం, దేశ పర్యావరణం కోసం కాపాడుకోవలసిందే! అదే సమాధానం.

నిర్దిష్టంగా చెప్పాలంటే, ఛత్తీస్ గఢ్‌లోని తూర్పు బస్తర్ (కొండగాం), ఉత్తర బస్తర్ (కాంకేర్) లలో 2020 జనవరినుండి ఇప్పటి వరకు పెసా అమలు కోసం ప్రజలు పోరాడుతుంటే పొటాలీ, చిక్పాల్, టేమురుపాల్, తిరియా, వానక్పాల్, కుర్ధాం, బదిగూడెం, వెచ్చపాల్, పూంద్రి ఘాటీ, వెదిరే, దర్భా, జేగుర్, కడియనార్, కడియమెట్ట, బోదిలీ, మాలేం, అడేలి, పావుర్నార్ పూంద్రి, కర్కఘాట్, తుర్ఘుఘాట్, కరెగూడెం, మింపా, తర్రెం, ధర్మవరం, గోరొండ, కోంటా క్యాంపు, సున్నంగూడ, గం, సిల్గేర్ మున్నగు చోట్ల నూతనంగా పోలీసు క్యాంపులను ఏర్పాటు చేశారు. ఇంకెన్నో గ్రామాలలో ఏర్పాటు చేసే ప్లానులతో సిద్ధంగా ఉన్నారు. దానితో వేలాది ప్రజలు ఆ క్యాంపులకు వ్యతిరేకంగా సంఘటితమై రోజుల తరబడిగా పోరాడక తప్పడం లేదు.

పై పరిస్థితులలో పోలీసు ప్రభుత్వ అధికారులు ప్రస్తుత సిల్గేర్ క్యాంపు వ్యతిరేక ప్రజా పోరాటాన్ని సిల్గేర్‌కే పరిమితం చేసి చూడకూడదనీ, దీనితో పాటు బర్రెగూడెంలో ఏర్పాటు చేసిన

క్యాంపును, అలాగే సిల్గేర్ కు వారం రోజుల ముందు జైగుర్, దర్భాలలో ఏర్పాటు చేసిన క్యాంపులను కూడ ఎత్తేయ్యాల్సి ఉంటుందనీ, అదే జరిగితే గత రెండేళ్లలో బస్తర్ డివిజన్లో ఏర్పాటు చేసిన దాదాపు 30కి పైగా క్యాంపులన్నీ ఎందుకు ఎత్తెయ్యరనే ప్రశ్న సహజంగానే ప్రజలనుండి, వారి తరుపున నిల్చిన వారినుండి తలెత్తుతుందనీ, గతంలో సల్వాజుడుంను తప్పు పట్టిన కోర్టులు కూడ పొరపాటున రేపు ఆ రీతినే ప్రజలు వద్దన్న చోట పోలీసు క్యాంపులు ఎందుకు అని ప్రశ్నించవచ్చనీ వీటన్నిటి తార్కిక పరిణామాలన్నీ అంచనా వేసుకొనే ప్రభుత్వ అధికారులందరూ ఒక్కుమ్మడిగా సిల్గేర్ క్యాంపు ఎత్తివేసే ప్రసక్తే లేదని భీష్మించుకున్నారు.

సిల్గేర్ ప్రజా ఉద్యమకారులపై కాల్పులు జరుపడం వెనుకగల ఆర్థిక, రాజకీయ, సైనిక కారణాలను కూడ ఇపుడు తెలుసుకోవాలి. గత 20 సంవత్సరాలకు పైగా బస్తర్‌లో బహుళ జాతుల కార్పొరేషన్ ప్రాజెక్టులు కార్యరూపం తీసుకోవడం లేదు. ఆ అడవులనుండి అమూల్యమైన వనరుల తరలింపుకు వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతూ రూపొందిస్తున్న రైలు, 8 లేన్ల విశాలమైన రోడ్ల నిర్మాణాలు దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ బడ్జెట్ అంచనాలు అతి భారంగా పెరుగుతూ పనులు పూర్తికావడం లేదు. వీటిలో రావుఘాట్ రైల్వే లైన్ ప్రధాన మంత్రి డ్రీమ్ ప్రాజెక్ట్‌లో ఒకటి. యేటేటా విషమిస్తున్న ప్రపంచ, దేశ ఆర్థిక సంక్షోభ పరిస్థితులు అక్కడి వనరుల తరలింపుకు ఆటంకంగా నిలిచిన విప్లవోద్యమాన్ని సమూలంగా అణచివేయడానికి పాలక వర్గాలను వేగిర పెడుతున్నావి. 'ఆర్థిక కార్యకలాపాల కేంద్రీకృత వ్యక్తీకరణే రాజకీయాలని' తెల్సిన వారికి మన దేశంలోని ప్రభుత్వాలు చేపడుతున్న విధానాలు, సవరిస్తున్న చట్టాలు, తీసుకుంటున్న నిర్ణయాలు సులువుగానే అర్థమవుతాయి. 'విశ్వాసం, అభివృద్ధి, శాంతి పరిరక్షణ' (విశ్వాస్, వికాస్ ఔర్ సురక్షా) పేరుతో ఛత్తీస్ గఢ్‌లో 15 సంవత్సరాల తరువాత 2018లో భూపేశ్ బఘేల్ నాయకత్వంలో అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం 2024 వరకు బస్తర్‌ను 'మావోయిస్టు రహిత బస్తర్' గా చేస్తామని ప్రకటించింది. అలాగే, దాదాపు అదే సమయావధిలో 'మావోయిస్టు రహిత భారత్ నిర్మాణం' చేస్తామంటూ 2019 అగస్టులోలోకసభలోనే దేశీయ వ్యవహారాల మంత్రి అమిత్ షా ప్రకటించి ఉన్నాడు. ఈ నిర్ణయం వెనుక 2025లో ఆర్ ఎస్.ఎస్ శత జయంతి వేడుకలు జరుపుకోబోతుండడం మరిచిపోకూడదు. ఎరుపు, కాషాయానికి లేదా బ్రాహ్మణవాదానికీ ప్రజాస్వామ్యానికి చుక్కెదురు అనే విశాలావరణలో నేడు బస్తర్‌లో పోలీసు క్యాంపుల ఏర్పాటు నేపథ్యాన్ని ఆలోచనాపరులు పరిశీలించాలి.

క్రమంగా ప్రజా ఉద్యమంలో పాల్గొనడానికి చేరుకుంటున్న వారి సంఖ్య దాదాపు 30 వేలకు చేరింది. వీరిలో గణనీయమైన సంఖ్యలో చదువుకుంటున్న యువతీ యువకులు ఉండడం విశేషం. దీనిని వారి ఆకాంక్షల వ్యక్తీకరణగానే చూడాలి. అయితే, అడవిలోని అడ్డ దారుల గుండా నడిచి లేదా ట్రాక్టర్లలో వస్తున్న ప్రజలు మాత్రమే సిల్గేర్‌కు చేరుతున్నారు. ప్రధాన రహదారుల గుండా వస్తున్న వారిని పోలీసులు రానీయకుండా ఎక్కడికి అక్కడే కొరోనా సాకుతో నిలిపివేయసాగారు. మే 28 నాటి సంస్మరణ సభకు బయటినుండి ఎవరూ చేరుకోలేక పోవడంతో మే 29నాడు 30 వేల మంది ప్రజలంతా రణ నినాదాల మధ్య కానీ ఖర్చు లేకుండా అమరుల స్మృతిలో అడవిలోని రాళ్లన్నీ పోగేసి దాదాపు 8 ఫీట్ల ఎత్తైన పెద్ద స్థూపాన్ని నిర్మించుకున్నారు. మరోవైపు రెండు జిల్లాలలో అమరుల సంస్మరణలో ప్రజలు గత అనేక సంవత్సరాలుగా నిర్మించుకున్న సిమెంటు స్థూపాల విధ్వంసక కేంపెయిన్‌ను పోలీసులు అదే సమయంలో కొనసాగిస్తున్నారు. అప్పటికే భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) దండకారణ్య ప్రత్యేక జోన్ కమిటీ జూన్ 5నాడు దండకారణ్యం (ఛత్తీస్ గఢ్, మహారాష్ట్ర ఉద్యమ ప్రాంతాలు) బంద్ పాటించాలని ప్రజలకు పిలుపును ఇచ్చింది.

సిల్గేర్ పోలీసు క్యాంపు ఎత్తివేత ప్రజా పోరాటం సద్దు మణగడం లేదనీ చిందులు తొక్కుతున్న ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ బస్తర్ నియోజికవర్గలోకసభ సభ్యుడు దీపక్ బైజ్ (ఆదివాసీ) నాయకత్వంలో ఎనిమిది మంది ఆదివాసీ ఎంఎల్ఏలతో కూడిన తొమ్మిది మంది ప్రతినిధి వర్గం త్వరలో సిల్గేర్ వెళ్లి ప్రజలను కలసి వారి సమస్యలు చర్చిస్తుందనీ ఒక ప్రకటన చేశాడు. స్థానికంగా, ఒకవైపు ప్రజలు క్యాంపు ఎత్తివేత కోసం పోరాడుతుంటే, మరోవైపు పోలీసులు సిల్గేర్‌లో క్యాంపు నిర్మాణ పనులకు పూనుకోసాగారు. ఇది గ్రహించిన ప్రజలు తమ ధర్నా స్థలాన్ని క్యాంపు స్థలం వద్దకే మార్చి వేరు వేరు మార్గాలలో పోలీసులకు చేరుతున్న అన్ని రకాల సప్లైలను అడ్డుకోసాగారు. పోలీసులు ధర్నా స్థలానికి ప్రజలను చేరనీయకుండా అడ్డుకోవడమే కాకుండా వారికి పోరాట సమర్థకులనుండి అందుతున్న తిండి సరుకులను, కూరగాయలను ఆపివేయసాగారు. కానీ, వారికి అది పూర్తిగా సాధ్యం కాలేదు. ప్రజలు తమకు తెలిసిన అనేక అడవి మార్గాలలో యథావిధిగా సరుకులు చేర్చుతున్నారు.

ధర్నాలో పాల్గొనడానికి గ్రామాలనుండి అన్ని కుటుంబాల వారు బ్యాచీల వారిగా ధర్నా స్థలానికి వచ్చి వెళ్లడం కొనసాగిస్తుండడంతో ఇంటి పనులకు అంటే ప్రధానంగా అటవీ ఉత్పత్తుల సేకరణకు, వ్యవసాయ పనులకు కొంత ఇబ్బంది అవుతున్నప్పటికీ ధర్నా నిరాటంకంగానే కొనసాగుతోంది. టీవీ పాత్రికేయులతో ఉద్యమకారులు వినిపిస్తున్న సందేశాలు వారి పోరాట స్ఫూర్తికి అద్దం పడుతున్నాయి. ఢిల్లీలో రైతులు ఎంత ధృడంగా నిలిచి కేంద్ర ప్రభుత్వ సాగు చట్టాలకు వ్యతిరేకంగా తమ ఆందోళనను కొనసాగిస్తున్నారో బస్తర్ మూలవాసీ రైతులు సిల్గేర్‌లో అంతే సమరశీలంగా నిలబడినారంటూ అనేక మంది విలేకర్లు తమ రిపోర్టులలో తెలుపసాగారు. ఢిల్లీ రైతులకు వర్షం ఇబ్బంది కలిగించినట్టే సిల్గేర్‌లో వేసవి వర్షాలు వేలాది మంది ప్రజలకు ఇబ్బంది కలిగించినప్పటికీ, తర తరాలుగా ప్రకృతితో పాటు జీవన సమరం కొనసాగిస్తున్న ఆ ఆదివాసీ ప్రజల పోరాటానికి విఘ్నం కాలేదు. అలాగే ఎప్పటిలాగే 48 డిగ్రీల ప్రచండ తాపాన్ని సైతం వారు భరిస్తూ, తీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కొంటూ, మలేరియా విష జ్వరాలతో సహ జీవనం చేస్తూ వేలాది మంది ప్రజలు ధర్నాలో పాల్గొనడాన్ని బట్టి వారికి వారి మధ్య ఖాకీలు ఉండడం ద్వార వాటన్నిటికన్నా ఆ ప్రమాద తీవ్రత ఎంత ఎక్కువగా ఉంటుందనుకుంటున్నారో మనం ఊహించుకోవచ్చు. కొరోనా సోకిందని తేలితే క్వారంటైన్లో, ఐసోలేషన్లో ఉండవచ్చు కానీ, అడవిలోకి ఖాకీలే వస్తే తట్టుకోవడానికి మార్గమేముంది!

మూలవాసీ బచావో మంచ్ వారు స్థానిక వైద్య సిబ్బందికి, మిథానిన్, మలేరియా కార్యకర్తలకు చేసిన విజ్ఞప్తులతో వారు ఉడుత భక్తిలా ధర్నా స్థలానికి అందిస్తున్న మందుల సహాయం ఎడారిలో ఒయాసిస్సులాతోడ్పడుతోంది. వేలాది మందితో ధర్నా వారాల తరబడిగా కొనసాగుతుండడంతో వారికి తిండి సమస్య ఎదురవుతోందనీ, రానున్న వర్షాకాలంలో ధర్నా కొనసాగించడానికి ప్లాస్టిక్ టెంట్లు కావాలనీ, మందులు కావాలనీ మూలవాసీ బచావ్ మంచ్ అధ్యక్షుడు మిడియాం రఘు విలేకర్ల ద్వారా, సామాజిక మాధ్యమాల ద్వార బహిరంగ విజ్ఞప్తి చేశాడు. ధర్నాకు చేరిన విద్యార్థి యువతీ యువకులలోనుండి ఎంపిక చేసిన వ్యక్తులతో ఒక ఐటీ సెల్‌ను ఏర్పర్చుకున్న వారు తమ ఫోన్ నంబర్లపై, బ్యాంకు అకౌంట్లపై (జన్ ధన్ ఖాతాలు) దాతలు ఆర్థిక హార్దిక సహాయాన్ని అందచేయాలనీ అభ్యర్థించారు.

ఢిల్లీలో ఆరు మాసాలకు పైగా వేలాది మంది రైతులతో ధర్నా కొనసాగిస్తున్న రైతాంగానికి దండకారణ్యంలో నెల రోజులుగా వేల సంఖ్యలో ధర్నా చేస్తున్న పేద ఆదివాసీ ప్రజలకు అవకాశాలలో, అవసరాలలో, ఆర్థిక స్థితి గతులలో, 'రాజకీయ' పలుకుబడిలో హస్తిమశకాంతర తేడాలున్నాయి. కానీ, పోరాట పటిమలో మాత్రం చాలా వరకు సారూప్యత అగుపడుతోంది. వర్గరీత్యా, అనుభవాల రీత్యా చూసినా, సామాజికంగా చూసినా ఆదివాసీ ప్రజలలో బతుకు నేర్పిన తెగింపు మాత్రం కాస్తా అధికం అనే చెప్పొచ్చు.

జూన్ 3వ తేది తమతో సంప్రదింపులకు వచ్చిన ప్రభుత్వ ప్రతినిధి వర్గానికి మూలవాసీ బచావో మంచ్ నాయకులు అత్యంత స్పష్టంగా తమ ముఖ్య డిమాండ్లను వివరించారు. సిల్గేర్ సహ బర్రెగూడెం, దర్భా, జైగుర్లనుండి తక్షణం నూతన పోలీసు క్యాంపులు ఎత్తివేయాలనీ, కాల్పులకు కారకుడైన డీఐజీ సుందరరాజు, భారత నేర శిక్షా స్మృతిలోని సెక్షన్ 302, 307 ప్రకారం తక్షణం ఉద్యోగ బాధ్యతలనుండి తొలగించాలనీ, కాల్పులపై ఉన్నత న్యాయ స్థాన విశ్రాంత న్యాయాధీశు నితో న్యాయ విచారణకు ఆదేశించాలని కోరారు. ప్రతినిధివర్గం సమక్షంలోనే మంచ్ నాయకులు జూన్ 8నాడు ఉద్యమ సమీక్షా సభ జరుగుతుందని ప్రకటించారు. మంచ్ ప్రోగ్రాం కేలండర్ అత్యంత పారదర్శికంగా, పోలీసుల సమక్షంలో ప్రకటితమవుతున్నవి. అవన్నీ ప్రజలకు అందుబాటులో ఉండేలా అంతర్జాలంలోనూ పెడుతున్నారు. అయినప్పటికీ పోలీసు అధికారులకు మాత్రం మనసులలో మెర మెరతో తడవ తడవకు మావోయిస్టులే ప్రత్యక్షమవుతున్నారు. అనేక కల్పిత కథనాలను తయారు చేసి వారు మీడియాకు ప్రకటనలు విడుదల చేస్తూ నవ్వుల పాలవుతున్నారు.

జూన్ 8నాడు బీజాపుర్ జిల్లా కలెక్టర్ మందీ మార్బలంతో సిల్గేర్ కు చేరుకున్నాడు. ప్రజలతో సంప్రదింపులకు వచ్చిన కలెక్టర్ సిల్గేర్ కు కూతవేటు దూరంలో ఉన్న తర్రెం పోలీసు క్యాంపులో మకాం చేశాడు. అక్కడికే మంచ్ నాయకులు రావాలనీ కబురు చేశాడు. సోనీ సోడీ, రాయపురకు చెందిన సామాజిక కార్యకర్తగా పరిచయం చేసుకున్న సరయులు అక్కడికి చేరారు. అనేకమందిని పోలీసులు మధ్య దారులలోనే ఆపుతుండడంతో అడవి దారులు తెలిసిన ఆదివాసీ సోనీసోడి సరయుతో కలిసి ప్రజల సహకారంతో సిల్గేర్ చేరుకోగలిగింది. పోలీసులు రోడ్లపైనే అందరిని ఆపినపుడు తెల్లం బొరయ్య మాత్రం రాజమార్గాన ఎలా రాగలిగాడు! ఆయన ఆపత్కాలంలో ప్రభుత్వ మధ్యవర్తిగా వ్యవహరించేవాడు కాబట్టి మినహాయింపు ఉండి ఉ ంటుంది! మిగితా ఏ ఒక్కరినీ పోలీసు అధికారులు అక్కడ అడుగు పెట్టనీయలేదు.

బేలా భాటియాను కొరోనా పేరు చెప్పి మధ్య దారిలో అడ్డుకుంటే ఆమె పోలీసుల జులుంను ఖండిస్తూ ఉన్నతాధికారులతో చర్చించడానికి రాయపుర్ వెళ్తున్నట్టు మంచ్ నాయకులకు వాట్సప్ సందేశం పంపింది. తెలంగాణనుండి బయలుదేరిన వివిధ సామాజిక కార్యకర్తలను, పలు ఆదివాసీ సంఘాల నాయకులను, మీడియా మిత్రులను మధ్య దారిలోనే పోలీసులు నిలిపివేశారు. సమీక్షా సభకు అన్ని ప్రాంతాలనుండి చేరుకున్న వారి సంఖ్య దాదాపు లక్షకు చేరింది. ఇంకా దంతెవాడ, సుక్మా, బీజాపుర్ జిల్లాలనుండి వస్తున్న ప్రజలను ఎక్కడికక్కడే పోలీసులు అడ్డగించకపోతే ఆ సంఖ్య కనీసం మరో 10 వేలు దాటి ఉండేదనీ మంచ్ నాయకులు ప్రకటించి పోలీసుల చర్యలను ఖండించారు. పోలీసులు అడ్డగించడమే కాకుండా మంచ్ నాయకుడు రఘు మీద వత్తిడి తేవడానికి ఆయన ఊరివాళ్లందరినీ (పర్లాం) అరెస్టు చేసి తమ వద్ద పెట్టుకున్నారు. రెండు రోజుల తరువాత వదిలారు.

కలెక్టర్ పిలుపు మేరకు మంచ్ నాయకులు తుర్రెం క్యాంపుకు వెళ్లి కలెక్టర్‌ను కలిశారు. తెల్లం బొరయ్య, సోనీ సోడి, సరయుల సమక్షంలోనే మంచ్ నాయకులతో కలెక్టర్ సంప్రదింపులు ప్రారంభించాడు. ప్రజా ఆందోళన విరమించాలని కలెక్టర్ పదే పదే కోరుతూ కొరోనా ప్రబలడంతో సహ అనేక అస్త్రాలు వారిపై ప్రయోగించాడు. ఇంత భారీ సంఖ్యలో చేరిన ప్రజలకు కొరోనా సోకితే మీరు బాధ్యత వహిస్తారా అన్నదే కలెక్టర్ ఏకైక ప్రశ్న కానీ, వారు ఆయనకు తమ న్యాయసమ్మతమైన ఉద్యమ డిమాండ్లను అత్యంత ఓపికతో స్పష్టం చేస్తూ ఖాకీలను వెనక్కి పంపిస్తే వేలాది మంది ప్రజలు కొరోనా ప్రమాదానికి గురి కాకుండా సుబ్బరంగా వెనక్కి వెళుతారనీ, మేం కోరని క్యాంపు మా మధ్యకు తెచ్చి పెట్టిన మీరు ఈ లేని పని పెట్టారనీ, ప్రజలకు కొరోనా సోకితే మీరే బాధ్యత వహించాలనీ తేటతెల్లం చేసి అక్కడినుండి మంచ్ నాయకులు నిష్క్రమించారు. కలెక్టర్ వారితో దాదాపు నాలుగు గంటలకు పైగా కాలయాపన చేశాడు. బయట లక్ష మంది జనం వారి నిరీక్షణలో ఉండి బయట ఉన్న నాయకుల ఉపన్యాసాలు వినసాగారు. అప్పటివరకు ధర్నా జయప్రదంగా కొనసాగిందనీ, వాతావరణంలో వస్తున్న మార్పుల నేపథ్యంలో ఇకపై ధర్నా రిలే ధర్నా రూపంలో తక్కువ సంఖ్యలో ప్రజలతో కొనససాగించు కుందామనీ వక్తలు కోరుతున్నారు. ప్రధాన వక్తలు కలెక్టర్‌నుండి విముక్తి పొంది సభాస్థలానికి చేరేసరికి సాయంత్రం 4 దాటడంతో ఆరోజు వారు సభలో పాల్గొనలేక పోయారు. ఆ సమయానికి పోలీసులు రోడ్లపై అడ్డంకులు తొలగించి మీడియా వారిని అనుమతించారు. కానీ, చీకటి పడుతుండడంతో వారు సైతం సభా కార్యక్రమాలను కవర్ చేయలేకపోయారు. ఆ కార్యక్రమం మరుసటి రోజుకు వాయిదా పడింది.

జూన్ 9వ తేదీ నాడు మిగిలిన ప్రజలతో మంచ్ ప్రధాన నాయకత్వం సమావేశమై, ముఖ్యమంత్రితో మాట్లాడాలనే విషయాన్ని

వారికి తెలిపి మీడియాం రఘు, పొట్టావీ సునీత, దూలాల్‌తో పాటు మృతుల కుటుంబాల వారు, క్యాంపు స్థల యజమాని, సోనీ సోడి బీజాపూర్ వెళ్లారు. అక్కడికి బొరయ్యతో పాటు ఆయన మనుషులూ చేరి అక్కడా తమ విచ్ఛిన్నకర కార్యక్రమాలు కొనసాగించారు. ఆయన పరమ విధేయత కలిగిన ప్రజా వ్యతిరేక ప్రభుత్వ వకాల్తాదారు పాత్ర పోషించాడు.

సిల్గేర్‌లో మిగిలిన మంచ్ నాయకులు రిలే ధర్నా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ఆదివాసీ తెగ నాయకుడు బొరయ్య మోసకారితనాన్ని ప్రజల ముందు పెట్టారు. ఎవరు బెదరించినా, ఇంకెవరు ఎలాంటి విచ్ఛిన్నకర చర్యలకు పాల్పడినా తమ ధర్నా కొనసాగుతుందనీ తొమ్మిదేళ్ల క్రితం 'విజ పండుం' రోజు సంప్రదాయబద్ధంగా సమావేశమైన గ్రామ ప్రజలపై జూన్ 28నాడు సార్కెగూడలో జరిగిన నరసంహారాన్ని గుర్తు చేసుకుంటూ 'సార్కెగూడ అమరుల 9వ సంస్మరణ సభ జరుగుతుందని మంచ్ నాయకులు ప్రకటించారు.

మరోవైపు జూన్ 10 నాడు బీజాపుర్ వెళ్లిన మంచ్ నాయకులకు, సోనీ సోడికి అక్కడ ఉండడానికే జిల్లా పంచాయతీ భవన్లో అనుమతి నిరాకరించారు. సరయూనైతే మంచ్ నాయకుల వెంట ఉండడానికి అనుమతించలేదు. ఆ అప్రజాస్వామిక ప్రభుత్వ చర్యను ఆమె తీవ్రంగా ఖండించింది. మంచ్ నాయకులు, సోనీ సోడి అక్కడే చెట్ల కింద విడిది చేశారు. జూన్ 11నాడులోకసభ సభ్యుడు దీపక్ బైజ్ సహ పలువురు ప్రజా ప్రతినిధులు, పోలీసు ఉన్నతాధికారులు మంచ్ నాయకులతో మంతనాలు జరిపారు. వారిని పంచాయతీ భవన్లోకి ఆహ్వానించగా ముందు రాత్రి జరిగిన అవమానంతో వారు నిరాకరించారు. ఆ చెట్ల కిందనే వారు సమావేశమయ్యారు. వారు జూన్ 12 నాడు ముఖ్యమంత్రితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు, కాకపోతే వర్చువల్ అన్నారు. ముఖ్యమంత్రి ఎంతో మందిని నేరుగా కలువంగా లేనిది తమను కలిస్తేనే కొరోనా సోకుతుందనే కుంటివాదనను మంచ్ నాయకులు నిరసిస్తూనే రాయపూర్ వెళితే కొరోనా పేరుతో క్వారంటైన్లోకి నెట్టే ప్రమాదం ఉంటుందని మిత్రులు ఇచ్చిన సలహాను దృష్టిలో పెట్టుకొని అక్కడినుండే మంచ్ నాయకులు, సోనీ సోడి వర్చువల్ సమావేశంలో పాల్గొన్నారు. ఆ సమావేశం సానుకూల వాతావరణంలో, ముఖ్యమంత్రినుండి క్యాంపు ఎత్తివేత సహ పలు ఇతర హామీలతో ముగిసింది. ముఖ్యమంత్రితో పాటు వర్చువల్ సమావేశంలో స్థానిక ఎం.యల్.ఏ., బఘేల్ మంత్రివర్గ సభ్యుడు, ఆదివాసీ నాయకుడు కోవాసి లక్మా (లక్మా దాదీ) కూడ పాల్గొన్నాడు. జూన్ 12నాడు రాష్ట్ర ముఖ్యమంత్రి సిల్గేర్‌లో పోలీసు కాల్పులలో రైతుల మరణం విచారకరమనీ ప్రకటించాడు. అయినప్పటికీ రాజకీయ నాయకుల, ప్రభుత్వ పెద్దల హామీల అమలు వరకు సిల్గేర్‌లో ధర్నా కొనసాగించాలనే సందేశంతో పాటు మంచ్ నాయకులు విడుదల చేసిన మీడియా ప్రకటన సారాంశంలో ఈ విధంగా ఉంది.

సిల్గేర్‌లో ప్రజా ఆందోళన విషయం తనకు కాల్పులు జరిగిన రోజు వరకు తెలియదనీ (!) అందులో ముగ్గురి మరణానికి కారకులైన వారిపై ప్రభుత్వం చర్య తీసుకుంటుందనీ, భూ యజమాని వద్ద పట్టా ఉంటే 10-15 రోజులలోగా క్యాంపు ఎత్తివేస్తామనీ, మంచ్ నాయకులు కోరుతున్న ఆసుపత్రులు, పాఠశాలలే కాకుండా ప్రభుత్వం కోట్లాది రూపాయలతో మంజూరు చేసిన అనేక 'అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయనీ ఏకరువు పెడుతూ మంచ్ నాయకులు వాటికి బాధ్యతపడి ఆ పనులు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కోరడాన్ని ఆమోదిస్తూ, ముందు సిల్గర్‌లో పోలీసు క్యాంపును ఎత్తివేయాలనే తమ డిమాండ్‌ను నెరవేర్చకుండా మరే పని జరుగదనీ మంచ్ నాయకులు స్పష్టం చేసిన విషయాన్ని మీడియాకు రఘు, సునీత తదితరులు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. మంచ్ నాయకులతో పాటు సోనీ సోడి బస్తర్‌లో ప్రజల పక్షాన నిలిచి మాట్లాడుతున్న వారిని పోలీసులు లక్ష్యంగా చేసుకుంటున్నారనీ, దాడులకు పాల్పడుతు ఉన్నారనీ తమ భావ ప్రకటనా స్వేచ్ఛను హరించి వేస్తున్నారనీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే బస్తర్ వ్యాప్తంగా పెసా ప్రకారం గ్రామసభలను ప్రకటించాలనీ కోరారు. మంచ్ నాయకులు స్వేచ్ఛగా బస్తర్ వ్యాప్తంగా ఎక్కడైనా పర్యటించవచ్చని వారికి పోలీసులనుండి ఎలాంటి ప్రమాదం ఉండదనీ ముఖ్యమంత్రి వర్చువల్ సమావేశంలో హామీ ఇచ్చాడు. మెజెస్టీరియల్ దర్యాప్తు కొనసాగుతుందని కూడ తెలిపాడు.

సిల్గేర్‌లో గత 28 రోజుల ధర్నాను సమీక్షించిన మంచ్ నాయకులు, వేసవి కాలం ముగుస్తూ ఋతుపవనాలు ఛత్తీస్ గఢ్ చేరడంతో వాతావరణంలో మార్పులు జరిగి తొలకరి వర్షాలు ప్రారంభం కావడంతో రైతులకు ముమ్మరమైన వ్యవసాయ పనులు మొదలవుతాయి. వాటికి ముందు ఆదివాసీ సంప్రదాయం ప్రకారం గ్రామ గ్రామాన 'వి పండుం' పూర్తి చేసుకోవలసి ఉంటుంది. ప్రజా ధర్నా మూలంగా తునికాకు సేకరణ పనులు చివరలో నిలిచిపోవడం, వారికి కాస్తో కూస్తో దొరికే ఆర్థిక రాబడి కొరవడినప్పటికీ ప్రజలు భరించడం వారి పోరాట పటిమకు సంకేతమన్నారు. పెళ్లిళ్ల సమయంలో జరుగాల్సిన పెళ్లిళ్లను పూర్తి చేసుకోవలసి ఉండడం లాంటి సామాజిక కార్యక్రమాలతో పాటు కొరోనా విజృంభణ ఎలా ఉన్నా ప్రతి యేటా తొలకరి సమయంలో ఎదురయే విషజ్వరాల ప్రమాదాల తీవ్రత నేపథ్యంలో సిల్గేర్‌లో తక్కువ సంఖ్యలో రిలే ధర్నా జరుపుకుందామని నిర్ణయించారు. ప్రజలంతా అందుకు తాము సిద్ధమనీ మిగితా అన్ని సమస్యలకన్నా ఖాకీలు తమ మధ్య ఉండడమే అత్యంత ప్రమాదకరమనీ తెలిపారు.

బీజాపూర్‌లో ముఖ్యమంత్రితో మంచ్ నాయకులు జరిపిన వర్చువల్ సమావేశ వివరాలు వెల్లడించడానికి త్వరలో ప్రజాసభ జరుగుతుందనీ మంచ్ నాయకులు తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయి దానిని జయప్రదం చేయాలని కోరారు. అదే సందర్భంగా మూలవాసీ ప్రజల ప్రయోజనాలకు భిన్నంగా మూల్ ఆదివాసీ సంఘం నాయకుడు బొరయ్య ప్రభుత్వ, పోలీసుల వకాల్తా దారుడిగా వ్యవహరిస్తున్నందున ఇకపై ఆయన సిల్గేర్ ప్రజల మధ్యకు వచ్చే అర్హత కోల్పోయాడనీ తెలుపుతూ, సోదర సంఘాల ప్రజా కార్యక్రమాలనుండి ఆయనను దూరం పెట్టాలని విజ్ఞప్తి చేశారు.

(రచయిత మూలవాసీ స్వాభిమాన మంచ్ కార్యకర్త) వీ

వాక్సిన్ రాజకీయార్థిక అంశాలు

వాక్సిన్ తయారీలో ప్రైవేటు కార్పొరేట్ సంస్థల, బహుళజాతి సంస్థల లాభాల వేటకు దేశాన్ని అప్పగిస్తున్న ప్రభుత్వ విధానాలను వివరిస్తున్నారు **ఆనంద్ గ్రోవర్**

దేశ రాజధాని నుంచి అన్ని ప్రధాన రాష్ట్రాల దాకా, మొత్తం భారతదేశమే ఆక్సిజన్ కొరతతో అతలాకుతలమవుతూ మానవతా వైద్య సంక్షోభంలో చిక్కుకుని ఉంది. ఈ గందరగోళం మధ్య కనబడకుండా కోరలు విప్పుతున్నది కోవిడ్ – 19 వాక్సిన్ పంపిణీ కార్యక్రమం. ఇది అసమానతలకూ, తీవ్రమైన కొరతలకూ, రాష్ట్ర ప్రభుత్వాల మీద గణనీయమైన ఆర్థిక భారానికీ దారితీయనున్న మహా ఉత్పాతం.

కేంద్ర ప్రభుత్వం ఇటీవలనే 'త్వరితగతి కోవిడ్ – 19 వాక్సినేషన్ వ్యూహం' అనే పేరుతో సరళీకృత ధరల విధానాన్ని ప్రకటించింది. ఈ వ్యూహం కింద భారతదేశంలో ఉత్పత్తి అయ్యే వాక్సిన్లలో 50 శాతాన్ని తప్పనిసరిగా కేంద్ర ప్రభుత్వానికి కేటాయించారు. మిగిలిన 50 శాతాన్ని ఉత్పత్తిదారులు రాష్ట్ర ప్రభుత్వాలకు గాని, ప్రైవేట్ ఆస్పత్రులకు గాని, ఇతర సంస్థలకు గాని బహిరంగ మార్కెట్‌లో అమ్ముకోవచ్చు.

సామాజిక రోగ నిరోధక శక్తిని సాధించాలంటే, దేశ జనాభాలో కనీసం 70–85 శాతానికి రానున్న పన్నెండు నెలల్లో వాక్సినేషన్ పూర్తి చేయడం అవసరం. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన వ్యూహం ఆ లక్ష్యాన్ని సాధిస్తుందా, ఆ లక్ష్యానికి తూట్లు పొడుస్తుందా అనేది ప్రశ్న.

వాక్సిన్ల సేకరణ కేంద్ర ప్రభుత్వ బాధ్యత

గత డెబ్బై సంవత్సరాలుగా భారత ప్రభుత్వం సార్వత్రిక రోగ నిరోధక పథకం (యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ – యుఐపి) అనే పద్ధతిని అమలు చేస్తున్నది. దేశం మొత్తానికీ అవసరమైన వాక్సిన్లను ప్రభుత్వ, ప్రైవేట్ ఉత్పత్తిదారుల నుంచి కేంద్ర ప్రభుత్వమే నిధులు ఇచ్చి సేకరిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా దేశంలోని ప్రజలందరికీ ఉచితంగా సరఫరా చేస్తుంది. ఈ పథకం శిశువులలో, చిన్నారులలో మరణాలను, మరణ అవకాశాలను తగ్గించడంలో ఎంత విజయం సాధించిందో ప్రతి ఒక్కరికీ తెలిసిన విషయమే.

అంతే కాదు, అవసరమైన వాక్సిన్లన్నింటినీ కేంద్ర ప్రభుత్వమే సేకరించడం అంటే అటువంటి భారీ పరిమాణపు సేకర్తకు బేరసారాలు ఆడడానికి ఉండే అపారమైన శక్తితో, వాక్సిన్ సరఫరాదారులతో తక్కువ ధర గురించి బేరం ఆడడానికి వీలవుతుంది. కాని ఎటువంటి కారణం చూపకుండానే కేంద్ర ప్రభుత్వం వాక్సిన్లను ఒకేచోట కేంద్రీకృతంగా సేకరించే విధానాన్ని వదిలేసింది. అంటే, ఆ విధానం వల్ల రాగల సదవకాశాలను కేంద్ర ప్రభుత్వం చేజేతులా వదులుకుంది. పైగా వాక్సిన్ సరఫరాదారులతో విడివిడిగా బేరం ఆడేవైపు రాష్ట్ర ప్రభుత్వాలను నెట్టింది. అంటే వేరు వేరు రాష్ట్ర ప్రభుత్వాలు ఒకవైపు తమలో తాము పోటీ పడేట్టు, మరొకవైపు ప్రైవేట్ రంగ సంస్థలతో పోటీ పడేట్టు చేసింది.

ఇప్పటివరకూ ఉన్న కేంద్రీకృత సేకరణ విధానం వల్ల కొనుగోలుదార్ల మార్కెట్‌గా ఉండిన వాక్సిన్ల మార్కెట్‌ను ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ నిర్ణయం అమ్మకందార్ల మార్కెట్‌గా మార్చివేసింది. ప్రస్తుతం ఉన్న ఇద్దరే అమ్మకందార్లు – సీరం ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఇండియా, భారత బయోటెక్ ఈ విధానంతో హేతుబద్ధమైన లాభాల స్థాయి నుంచి విపరీతమైన లాభాల స్థాయికి చేరుతున్నారు.

అలాగే ఈ రెండు సంస్థలూ రాష్ట్ర ప్రభుత్వాలకు అవసరమైనంత పరిమాణంలో వాక్సిన్లను అందజేస్తాయనే హామీ కూడా ఏమీ లేదు. కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చిన కేటాయింపు కోటా తర్వాత వారి దగ్గర మిగిలిన యాభై శాతం వాక్సిన్లను వారు ఎవరు ఎక్కువ ధర ఇస్తే వారికి అనే ప్రాతిపదిక మీద ప్రైవేట్ సంస్థలకు అమ్ముకోవచ్చు. ఇటీవలనే ఒక టివి ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేరళ ఆర్థిక మంత్రి టి.ఎం. థామస్ ఐసాక్ తాము వాక్సిన్లు కొంటామని సీరం ఇన్ స్టిట్యూట్‌కు చేసిన ప్రతిపాదనకు సమాధానమే రాలేదని అన్నారు. మహారాష్ట్ర ఆరోగ్యమంత్రి రాజేష్ తోపే తమ రాష్ట్రానికి మే 25 వరకూ వాక్సిన్ సరఫరా జరిగే అవకాశమే కనబడడం లేదని అన్నారు.

అంతకన్నా ఘోరం, ఈ విధానం తీవ్రమైన అసమానతలకు దారితీస్తుంది. బాగా వనరులున్న రాష్ట్రాలు తమకు అవసరమైన వాక్సిన్లను సంపాదించుకుంటాయి. పేద రాష్ట్రాలు వాక్సిన్లు సంపాదించలేక ఇబ్బంది పడతాయి. సంపన్నులు తమ కుటుంబాలకు సులభంగా వాక్సిన్ వేయించగలుగుతారు. బలహీన వర్గాల ప్రజలు అత్యవసరమైన వాక్సిన్ లేకుండానే గడపవలసి వస్తుంది. అంటే భారత పౌరులలో కొందరికి వాక్సిన్ అందుతుంది, కొందరికి అందదు.

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం దాని రాజ్యాంగ కర్తవ్యానికి వ్యతిరేకం. రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్‌లోని మూడో జాబితాలో 29వ అంశం 'రాష్ట్రాల మధ్య అంటువ్యాధుల వ్యాప్తిని అదుపు చేయడంలో' కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు సహకరించాలని నిర్దేశిస్తుంది. అలాగే, అంతర్జాతీయ న్యాయశాస్త్రం ప్రకారమూ, మన రాజ్యాంగంలోని 14, 21 అధికరణాల ప్రకారమూ కూడా అత్యవసరమైన వైద్య ఆరోగ్య వస్తువులను, సేవలను, సౌకర్యాలను ప్రజలందరికీ ఎటువంటి వివక్ష లేకుండా 'అందుబాటులో సిద్ధంగా ఉంచాలి.' అంటే వాక్సిన్లను సేకరించడం, అన్ని రాష్ట్రాలకూ సమానంగా పంపిణీ చేయడం కేంద్ర ప్రభుత్వ విధ్యుక్త ధర్మం. కాని అది ఇప్పుడు ప్రకటించిన వ్యూహం దాని రాజ్యాంగ కర్తవ్యాలను ఉల్లంఘిస్తున్నది.

మార్కెట్ శక్తులకు వదిలేసిన ధరల నిర్ణయం

కేంద్ర ప్రభుత్వం సేకరిస్తున్న ధరలు ఒక వాక్సిన్ డోస్‌కు ఇటీవలి

నెలల్లో రు. 200 నుంచి రు. 150కి పడిపోయాయి. మరింత కూడా తగ్గవచ్చునని ఊహిస్తున్నారు. కానీ ఈ ప్రయోజనం రాష్ట్ర ప్రభుత్వాలకు, ప్రజలకు మాత్రం అందే అవకాశం లేదు. సుప్రీంకోర్టుకు సమర్పించిన పత్రంలో స్వయంగా కేంద్ర ప్రభుత్వమే ధరలను 'మార్కెట్ శక్తులే' నిర్ణయించాలని వాదించింది. సీరం ఇన్‌స్టిట్యూట్ తయారు చేసిన కొవిషీల్డ్ ఒక డోస్ రు. 300కు, భారత్ బయోటెక్ తయారు చేసిన కోవాక్సిన్ ఒక డోస్ రు. 400కు రాష్ట్ర ప్రభుత్వాలకు అమ్మారు. ప్రైవేట్ సంస్థలకు వీటినే రు. 600కు, రు. 1200కు అమ్మారు. ఈ ధరలన్నీ కూడా అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఏ దేశంలోనైనా ఉన్న ధరల కన్నా చాలా ఎక్కువ. సీరం ఇన్‌స్టిట్యూట్ వాక్సిన్ ఒక డోస్ యూరపియన్ మార్కెట్‌లో రు. 160 (2.15 డాలర్లు) కు, అంతర్జాతీయ వాక్సిన్ అలయన్స్ గవికి రు. 210 (2.10 డాలర్లు)కి, యునైటెడ్ కింగ్‌డమ్‌లో రు. 222 (3 డాలర్లు) కు, అమెరికాలో రు. 297 (4 డాలర్లు) కు అమ్ముతున్నారు. కాని భారతదేశంలో మాత్రం రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేట్ సంస్థలు ఎక్కువ ధర చెల్లించాలని ప్రైవేట్ ఉత్పత్తిదారులు నిర్ణయించారు. అది కూడా కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తున్న ధర కన్నా 200 శాతం నుంచి 800 శాతం ఎక్కువ. అంటే ప్రజల జీవితాలను పణంగా పెట్టి ఆ కంపెనీలు మితిమీరిన లాభాలు దండుకోవడానికి అవకాశం వచ్చింది.

కొవిషీల్డ్‌కు రు. 300, కోవాక్సిన్‌కు రు. 400 ధర నిర్ణయించడం పూర్తిగా ప్రైవేట్ కంపెనీల పని కూడా కాదు, ఆ నిర్ణయానికి కేంద్ర ప్రభుత్వ ఆమోదం సంపూర్ణంగా ఉంది. ఒకే వాక్సిన్‌కు కేంద్ర ప్రభుత్వానికి ఒక ధర, రాష్ట్ర ప్రభుత్వాలకు మరొక ధర వంటి భిన్నమైన ధరల విధానానికి ఎటువంటి సమర్థనా లేదు. ఈ విధానానికి ఉండగల మరొక తీవ్రమైన పర్యవసానం ఏమంటే, రాష్ట్ర ప్రభుత్వాలు గనుక కేంద్ర ప్రభుత్వం చెల్లించే ధర కన్నా రెట్టింపు చెల్లించవలసి వస్తే, ఆ రాష్ట్ర ప్రభుత్వాల విలువైన వనరులను ఇతర అత్యవసరమైన ఆరోగ్య, సామాజిక సంక్షేమ కార్యక్రమాల నుంచి వాక్సిన్ కొనుగోలు వైపు మళ్లించవలసి వస్తుంది. ఇది రాజ్యాంగంలోని 14, 21 అధికరణాలలోని ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే.

తన ధరల విధానాన్ని సమర్థించుకోవడానికి ప్రయత్నిస్తూ సీరం ఇన్‌స్టిట్యూట్ ఒక ప్రకటన చేసింది. 'మొదట నిర్ణయించిన ధర మేం పెట్టిన ముందస్తు పెట్టుబడి మీద ఆధారపడినది. ఇప్పుడిక మా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికీ, మరిన్ని ఎక్కువ డోసుల వాక్సిన్ తయారు చేయడానికీ మేం మరింత పెట్టుబడి పెట్టవలసి ఉంటుంది' అని ఆ కంపెనీ చెప్పింది. అయితే ఈ కంపెనీ వాదన పూర్తిగా తప్పు.

సీరం ఇన్ స్టిట్యూట్ మౌలికంగా ఆక్స్ ఫర్డ్ విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నది. ఆ సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి కోసం ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయానికే భారీగా ప్రభుత్వ నిధులు, సామాజిక ధర్మ సంస్థల నిధులు అందాయి. ఇటీవల యునైటెడ్ కింగ్‌డమ్‌లో జరిగిన ఒక అధ్యయనం ప్రకారం, 'చాడాక్స్ సాంకేతిక పరిజ్ఞాన పరిశోధనలో, అభివృద్ధిలో, ఆ సాంకేతిక పరిజ్ఞానాన్ని సార్స్ - కోవిడ్-2కు అనువర్తింపజేయడంలో ఉపయోగించిన నిధులలో 97.1 శాతం నుంచి 99 శాతం నిధులు ప్రజాధనం నుంచే వచ్చాయి.' ప్రైవేట్ పారిశ్రామిక వేత్తలు పెట్టిన పెట్టుబడి 2 శాతం కన్నా తక్కువ.

ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నుంచి ఆ సాంకేతిక పరిజ్ఞాన లైసెన్స్ పొందిన ఆస్ట్రా జెనెకా అనే కంపెనీ ఆ పరిజ్ఞానాన్ని బదిలీ చేయడానికి సీరం ఇన్‌స్టిట్యూట్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఆ ఒప్పందం లక్ష్యం సీరం ఇన్‌స్టిట్యూట్ వంద కోట్ల డోసుల వాక్సిన్ తయారు చేసి అల్పాదాయ దేశాలకు ఉత్పత్తి వ్యయానికే అమ్ముతుందనేది. అంతే కాదు, అంతర్జాతీయ వాక్సిన్ అలయన్స్ గవి ఈ పనిలో సీరం ఇన్‌స్టిట్యూట్‌కు సహకరించేందుకు గాను 300 మిలియన్ డాలర్ల (రు. 22,000 కోట్ల) సహాయం చేసింది. ఈ నిధులను భారతదేశంలోని దాని ఉత్పత్తి కేంద్రాన్ని అంతర్జాతీయ అవసరాలకు తగినట్టుగా విస్తరించడానికి వినియోగించాలని అంది. ఈ విస్తరణ కార్యక్రమం సజావుగా సాగేందుకు గాను రు. 3,000 కోట్ల డోసుల కొనుగోలుకు భారత ప్రభుత్వం ముందస్తు చెల్లింపులు కూడా చేసింది.

అంటే, ఉత్పత్తి వ్యయానికే వాక్సిన్ అమ్మడానికి అవసరమైన గణనీయమైన సహకారం సీరమ్ ఇన్‌స్టిట్యూట్‌కు అందింది. రు. 150కి ఒక డోస్ అమ్మినా కంపెనీకి లాభాలు వస్తాయని ఎన్‌డి టివికి ఇచ్చిన ఇంటర్వ్యూలో సీరం ఇన్‌స్టిట్యూట్ అధిపతి ఆదర్ పూనావాలా చెప్పారు. అయినా, అంతకన్నా ఎక్కువ ధరలకు రాష్ట్ర ప్రభుత్వాలకు, మరింత ఎక్కువ ధరలకు ప్రైవేట్ రంగానికి అమ్ముకోవడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతించింది.

ఇక భారత్ బయోటెక్ తాను క్లినికల్ ట్రయల్స్ మీదనే రు. 300 కోట్లు ఖర్చు పెట్టానని చెప్పుకుంటున్నది. అది తయారు చేసిన వాక్సిన్ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసర్చ్ (ఐసిఎంఆర్), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (ఎన్ఐవి) వంటి ప్రభుత్వ రంగ సంస్థల సహకారంతో సంయుక్తంగా తయారయింది. భారత్ బయోటెక్ చెప్పుకుంటున్న క్లినికల్ ట్రయల్స్ అన్నీ కూడా ప్రభుత్వ సంస్థల్లోనే జరిగి, మొత్తం ప్రక్రియ త్వరితగతిన పూర్తి అయింది. ఇప్పుడు జూలైకల్లా కేంద్ర ప్రభుత్వానికి 9 కోట్ల డోసుల వాక్సిన్ అందజేయడానికి ముందస్తుగా రు. 1,500 కోట్లు భ్యారత్ బయోటెక్‌కు అందాయి. భారత్ బయోటెక్ ఉత్పత్తి సామర్థ్యం విస్తరించడానికి కేంద్ర ప్రభుత్వం ఈ అసాధారణ నిర్ణయం తీసుకుంది. అయినప్పటికీ భారత్ బయోటెక్ రాష్ట్ర ప్రభుత్వాల నుంచి డోసుకు రు. 400 వసూలు చేస్తున్నది.

సాగుతున్న మహా విపత్తును అడ్డం పెట్టుకుని వాక్సిన్ ఉత్పత్తిదారులు ఇలా ఇబ్బడి ముబ్బడి లాభాలు ఆర్జించడానికి అనుమతించే బదులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఒకే ధరకు అమ్మమనీ, ప్రైవేట్ రంగానికి అమ్మేటప్పుడు ఉత్పత్తి వ్యయం మీద హేతుబద్ధమైన వ్యాపార లాభం (10-15 శాతం) వేసుకుని అమ్మమనీ ఆ ఉత్పత్తిదారులతో కేంద్ర ప్రభుత్వం బేరం ఆడి ఉండవలసింది. అలాగే వాక్సిన్లు వేసేప్పుడు ఆస్పత్రులు ఎంత ధరకు అమ్మాలో గరిష్ఠ పరిమితిని కూడా ప్రభుత్వం నిర్ణయించాలి. ఉత్పత్తిదారులు, ఆస్పత్రులు ఆ నిబంధనలను పాటించకపోతే న్యాయస్థానాలైనా జోక్యం చేసుకుని ఔషధ ధరల (నియంత్రణ) ఉత్తర్వుల ప్రకారం ధరలు నిర్ణయించమని జాతీయ ఔషధ ధరల ప్రాధికార సంస్థ (నేషనల్ ఫార్మాసూటికల్ ప్రైసింగ్ అథారిటీ) ని ఆదేశించాలి.

వాక్సిన్ ఉత్పత్తి సామర్థ్యం పెంచవలసిన అవసరం

మార్చ్ 2021లో రోజుకు 25 లక్షల వాక్సిన్లు వేస్తున్నారని, అది ఏప్రిల్‌లో 42 లక్షలకు చేరిందని, కానీ మే మొదటి వారంలో 18 లక్షలకు దిగిపోయిందని గణాంకాలు చెపుతున్నాయి. నిజానికి ఈ సమయంలోనే భారతదేశం నుంచి ఇతర అభివృద్ధి చెందుతున్న

దేశాలకు వాక్సిన్లు పంపడాన్ని నిషేధించారు. ఆ మేరకు దేశంలో ఎక్కువ వాక్సిన్లు దొరుకుతూ ఉండవలసింది. దేశంలో సామాజిక రోగ నిరోధక శక్తి సాధించాలంటే మొత్తం వయోజన జనాభాలో 70 శాతానికి, అంటే దేశ జనాభా 135 కోట్లలో 90 కోట్ల మందికి వాక్సిన్లు వేయడం కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ బాధ్యత. ఇది రాస్తున్న సమయానికి 15 కోట్ల డోసులు, అవీ ప్రధానంగా మొదటి డోసులు మాత్రమే ఇవ్వడం జరిగింది. ఈ వేగంతో సాగితే, లక్ష్యం సాధించడానికి రెండు సంవత్సరాలు పడుతుంది. అంటే నిస్సందేహంగా, మనం మన వాక్సినేషన్ కార్యక్రమాన్ని ఇతోధికంగా పెంచవలసి ఉంది. ప్రస్తుత వాక్సిన్ల, రానున్న వాక్సిన్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించవలసి ఉంది.

సీరం ఇన్‌స్టిట్యూట్‌కు ప్రస్తుతం నెలకు ఆరు కోట్ల డోసులు ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఉంది. ఈ సామర్థ్యాన్ని నెలకు పది కోట్ల డోసుల ఉత్పత్తి దశకు విస్తరించాలని ఆ కంపెనీ ప్రతిపాదిస్తున్నది. భారత్ బయోటెక్ ఉత్పత్తి సామర్థ్యం నెలకు రెండు కోట్ల డోసులుగా ఉంది, కాని ఏప్రిల్‌లో 80 లక్షల డోసులు కూడా ఇవ్వలేకపోయింది. ఈ ఉత్పత్తిదారులు తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవాలనుకోవడం ఆహ్వానించవలసిందే. అలాగే హాఫ్కిన్ బయోఫార్మాసూటికల్ కార్పొరేషన్, ఇండియన్ ఇమ్యూనలాజికల్స్, భారత్ ఇమ్యూనలాజికల్స్ వంటి కంపెనీలు తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని నెలకు ఆరు కోట్ల డోసుల స్థాయికి పెంచదలచుకున్నాయి.

దేశంలో స్పుత్నిక్ వాక్సిన్‌ను పంపిణీ చేస్తున్న రష్యన్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ నెలకు అయిదు కోట్ల డోసులు ఉత్పత్తి చేయడానికి ప్రణాళికలు వేసుకున్నది. అలాగే రెండు డోసుల బదులు ఒక్క డోస్ స్పుత్నిక్ వాక్సిన్‌ను కూడా భారత్‌లో ప్రవేశపెడుతున్నారు. అయితే దాని ఉత్పత్తి వివరాలు ఇంకా అందుబాటులోకి రాలేదు.

జాన్సన్ అండ్ జాన్సన్ కూడా ఒకే డోస్ వాక్సిన్‌ను ఉత్పత్తి చేసింది గనుక అది కూడా ముఖ్యమైన కంపెనీనే. ఆ వాక్సిన్‌ను మైనస్ 2 డిగ్రీల నుంచి మైనస్ 8 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలో సరఫరా చేయవలసి ఉంటుంది. అది ఒకే డోస్ వాక్సిన్ గనుక ఇతర వాక్సిన్ల కన్నా రెట్టింపు వ్యక్తులకు ఇవ్వడానికి వీలుంది. ఈ కంపెనీ భారత్‌లోని బయోలాజికల్ ఇవాన్స్ కంపెనీతో లైసెన్సింగ్ ఒప్పందం చేసుకుంది. ఈ వాక్సిన్‌కు ఇంకా పరీక్షలు ఏమీ అవసరం లేనప్పటికీ, దీని ఉత్పత్తి సెప్టెంబర్ దాకా ప్రారంభం కాకపోవచ్చు. మొత్తానికి ఈ ఒక్క డోస్ వాక్సిన్‌ను సంవత్సరానికి 50 కోట్ల డోసులు ఉత్పత్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు.

అలాగే నోవోవాక్స్ భారత్‌లో తన వాక్సిన్లు ఉత్పత్తి చేయడానికి సీరం ఇన్‌స్టిట్యూట్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో ఇటీవల జరిగిన సవరణల ప్రకారం సీరం ఇన్‌స్టిట్యూట్ వాక్సిన్ సంబంధిత ముడిసరుకులను కూడా ఉత్పత్తి చేస్తుంది.

ఇవన్నీ కలిపితే కూడా, అందరు ఉత్పత్తిదారులూ పూర్తి సామర్థ్యంతో పనిచేస్తే కూడా, నెలకు ఇరవై ఐదు కోట్ల డోసులు మాత్రమే తయారవుతాయి. అంటే రోజుకు 67 లక్షల డోసులు తయారవుతాయి. ఆ లెక్కన, ఈ మొత్తం ఉత్పత్తిని భారత్‌లోనే వాడినప్పటికీ, సామాజిక రోగనిరోధక శక్తి సాధించడానికి ఒక ఏడాది పైనే పట్టవచ్చు.

పేటెంట్లు, వ్యాపార రహస్యాలు, రహస్య సమాచారం, సాంకేతిక పరిజ్ఞానం సమస్యలు పైన చెప్పిన వాటిలో కొన్ని వాక్సిన్లు, వాక్సిన్ల తయారీకి అవసరమైన సన్నాహకాలు అన్నీ కూడా పేటెంట్ అయి ఉన్నాయి. దురదృష్టవశాత్తూ వాక్సిన్లకు సంబంధించిన మేధో హక్కుల, పేటెంట్ల అవగాహన భారత్‌లో విస్పష్టంగా లేదు. మొట్టమొదట, కొత్త వాక్సిన్ అనువర్తిత ఉపయోగం మీద పెట్టుకునే దరఖాస్తులను 18 నెలల వరకు బహిరంగపరచడానికి వీలు లేదు. ఈ అడ్డంకిని అధిగమించడానికి కోవిడ్–19 సంబంధిత సాంకేతిక పరిజ్ఞానాల దరఖాస్తులన్నిటినీ పద్దెనిమిది నెలలు గడవగానే బహిరంగపరచాలని కంట్రోలర్ ఆఫ్ పేటెంట్స్‌ను ఆదేశించవచ్చు. బ్రెజిల్ ప్రభుత్వం ఇటువంటి నిర్ణయం తీసుకుంది. భారత ప్రభుత్వం కూడా ఆ పనే చేయవచ్చు. తద్వారా పేటెంట్ల అవగాహన, లైసెన్సింగ్ అనుమతుల విషయాలలో సౌలభ్యం ఏర్పడుతుంది.

రెండవది, కొన్ని మౌలిక సాంకేతిక పరిజ్ఞానాల విషయంలో ఆ వాక్సిన్ల తయారీని అభివృద్ధి చేయబోతున్నామని ఎప్పుడో పేటెంట్ దరఖాస్తులు పెట్టుకుని ఉన్నందువల్ల ఇప్పటికీ పేటెంట్ అమల వుతున్నది. ఉదాహరణకు కోవిషీల్డ్ వాక్సిన్ విషయంలో ఆస్ట్రా జెనెకా లైసెన్సుతో సీరం ఇన్‌స్టిట్యూట్ ఉత్పత్తి చేస్తున్నది గాని, భారత్‌లో ఆ సాంకేతిక పరిజ్ఞానాన్ని తమకే పేటెంట్ చేయాలని ఎన్నో దరఖాస్తులు ఉన్నాయి. వారిలో కొందరికి పేటెంట్లు దక్కాయి కూడా. వీరి లైసెన్సులను స్వచ్ఛందంగా గాని, నిర్బంధంగా గాని తొలగించాలి.

జాన్సన్ అండ్ జాన్సన్, ఫైజర్ - బయో ఎన్‌టెక్, మాడర్నా, నోవోవాక్స్ చేసిన అన్వేషణలు తప్పకుండా పేటెంట్ అవుతాయి. వీటిలో ఫైజర్, మాడర్నా ఎన్–ఆర్ ఎన్ఎ వాడుతున్న సాంకేతిక పరిజ్ఞానాలకు మైనస్ 80 డిగ్రీల సెంటీగ్రేడ్ కోల్డ్ చెయిన్ పరిస్థితులు అవసరం అవుతాయి గనుక, వాటిని భారతదేశంలో పెద్ద ఎత్తున వినియోగించడం సాధ్యం కాకపోవచ్చు. అవి ఒకరకంగా భవిష్యత్తు సాంకేతిక పరిజ్ఞానాలు. మిగిలిన సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించే ఉత్పత్తిదార్లు ఎక్కువ మంది భారతదేశానికి అవసరం.

మూడవది, రష్యన్ కంపెనీ తయారు చేసిన స్పుత్నిక్‌ను ఓపెన్ సోర్స్ ప్లాట్ ఫామ్ మీద అభివృద్ధి చేశారు. దాని ఉత్పత్తి లైసెన్సులను చాలా పెద్ద సంఖ్యలో కంపెనీలకు ఇస్తున్నారు. అదే విధంగా కోవాక్సిన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ఆసక్తి ఉన్న ఉత్పత్తిదారులందరికీ బహిరంగంగా అందజేయడం గురించి భారత ప్రభుత్వం ఆలోచించాలి.

పేటెంట్ అవరోధాలను అధిగమించడానికి భారత పేటెంట్ చట్టంలోని సెక్షన్ 100 కింద అధికారిక అనుమతి ఇవ్వడం, సెక్షన్ 92 కింద తప్పనిసరి లైసెన్సింగ్ అనుమతించడం, సెక్షన్ 47 కింద కాంట్రాక్టు ఉత్పత్తికి అనుమతించడం వంటి చర్యలకు ప్రభుత్వం పూనుకోవచ్చు. వాక్సిన్ల విషయంలో ట్రిప్స్ (ట్రేడ్ రిలేటెడ్ ఆస్పెక్ట్స్ ఆఫ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ - ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందాల ప్రకారం ఏర్పాటయిన పద్ధతి) ను పక్కన పెట్టడానికి తాను సిద్ధంగా ఉన్నానని అమెరికా ప్రభుత్వం ప్రకటించింది గనుక భారత ప్రభుత్వం తీసుకునే చర్యలు సులభమే అవుతాయి. అయితే ఈ పక్కన పెట్టడం అనేది కేవలం పేటెంట్ హక్కులు పక్కన పెట్టడంతో మాత్రమే సరిపెట్టగూడదు. అందులో సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, రహస్య సమాచారం, వ్యాపార రహస్యాలు వంటి అంశాలు కూడా భాగం కావాలి. వాక్సిన్ల ఉత్పత్తిని త్వరితగతిన పెంచడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని బహిరంగంగా పంచుకునే విషయంలో ప్రభుత్వం, ప్రత్యేకించి డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా కార్యాలయం సాధ్యమైన అన్ని చర్యలూ చేపట్టాలి.

ప్రజల ఆరోగ్య, ప్రాణ రక్షణ బాధ్యత ప్రభుత్వానిదే

***కోవిడ్ నుండి ప్రజల ప్రాణాలను కాపాడడంలో విఫలమైన పాలకులు ప్రజల్ని తప్పుదోవ పట్టించడానికి చేసిన మోసాలు, వైఫల్యాలపై విచారణ చేపట్టాలని అంటున్నారు* డా. ఎ. తిరుపతయ్య**

కోవిడ్ వ్యాధి ఈరోజు దేశంలో, రాష్ట్రంలో కరాళ నృత్యం చేస్తున్నది. ఏ క్షణం ఎవరి మరణ వార్త వినాల్సివస్తుందో అని భయపడుతూ గడుపుతున్నాం. సంక్షోభాంతం ఎప్పుడో, సాధారణ సామాజిక జీవనం ఎంతమందిమి చూస్తామో తెలియదు. కానీ డబ్బు పిచ్చి, అధికార మదంతో ఉన్నవాళ్ల మత్తు ఇంకా దిగడం లేదు. పాలకవర్గమైతే పూర్తిగా మానవ స్పందనలు కోల్పోయి ఉంది. ప్రజలు చనిపోతూ చేసే హాహాకారాలు వారికి వినిపించడం లేదు. కేంద్రంలో ప్రభుత్వం అనేది ఒకటి ఉందో లేదో, ఉండీ ఇంద్రియ జ్ఞానం కోల్పోయిందో తెలియదు. దేశంలో రెండు మూడు రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం కొంత నిజాయితీగానే తమ పౌరుల రక్షణకు సర్వ శక్తులూ ఒడ్డుతున్నాయి. కానీ మిగతా రాష్ట్రాలు చేతులు ముడుచుకునే ఉన్నాయి. ఇక తెలంగాణ ప్రభుత్వం అయితే ప్రజలను పూర్తిగా మోసం, వంచనకు గురిచేస్తూ మానవ హననానికి కారణం అవుతున్నది.

తెలంగాణ ప్రభుత్వం కోవిడ్ సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో ఏనాడూ చిత్తశుద్ధితో లేదు. ముందస్తుగా ఎటువంటి సన్నాహాలు చేయలేదు. చిత్తశుద్ధి, సన్నాహాలు సంగతి అలా ఉంచి రెండవ వేవ్ ఉధృతి సమయంలో పూర్తిగా మోసం, తప్పుడు విధానాలతో లక్షలాది కుటుంబాల మాన ప్రాణాలను ఈగలు, దోమల స్థాయికి దిగజార్చింది. బర్డ్ ఫ్లూతో కోళ్ల చనిపోయినట్టు మనుషులు చనిపోయారు. యుద్ధానంతరం యుద్ధంలో జరిగిన నేరాలపై విచారణలున్నట్లు కోవిడ్ పై జరిగిన యుద్ధంలో నేరాలకు పాల్పడిన వారిపై విచారణ చేయదలిస్తే రాష్ట్రంలో మొట్టమొదటి ముద్దాయిగా కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఉంటాడు. కేంద్రంలో ప్రథమ ముద్దాయి సహజంగానే నరేంద్ర మోడీ.

తెలంగాణ ప్రభుత్వంలో కెసిఆర్ తప్ప అందరూ కీలు బొమ్మల స్థాయికి దిగజారిన తర్వాత ఆయనే ముఖ్యమంత్రి, ఆచరణలో ఆయనే అన్ని శాఖలకూ అధిపతి. కోవిడ్ సంక్షోభ సమయంలో పాలనలో జరిగే నేరాలన్నీ వారి అసాధారణ మేధస్సుకు తెలియకుండా జరుగేవి కావు. కాబట్టి అందుకు వారినే బాధ్యుల్ని చేస్తూ, ఆయనపై కింది ఆరోపణలపై విచారణ జరగాల్సిన అవసరం ఉంది.

1. కేసులను, మరణాలను కొన్ని రెట్లు తక్కువ చేసి చూపడం

పాలనలో పారదర్శకంగా, జవాబుదారీ తనంతో ఉండడం ప్రభుత్వ విధి. అది వారి విచక్షణకు వదిలివేయబడిన విషయం కాదు. అయితే కెసిఆర్ ప్రభుత్వం అందుకు భిన్నంగా ప్రజలను, విశ్లేషకులను, శాస్త్రీయ సంస్థలను దారుణంగా వంచించింది.

ఏప్రిల్ మధ్య నుండి మే రెండవ వారం వరకు ఒక నెల రోజుల పాటు రాష్ట్రంలో కోవిడ్ ఉధృతి పెరిగింది. ప్రాణ భయంతో ప్రజలు టెస్టింగ్ కేంద్రాల వద్దకు పరుగులు పెట్టారు. రాష్ట్రంలో పాజిటివ్ కేసుల సంఖ్య భారీగా నమోదవుతూ వచ్చింది. ఇలా కేసులు పెరుగుతూ టెస్టుల సంఖ్య పెంచాల్సిన పరిస్థితి వస్తే మానవత్వం ఉన్న పాలకులు ఏం చేస్తారో మనం ఊహించవచ్చు. కానీ కెసిఆర్ తీసుకున్న మొదటి చర్య టెస్టింగ్ కిట్లను మూడోవంతుకు తగ్గించటం. ఒక చిన్న జిల్లాకు అప్పటిదాకా రోజుకు మూడు వేల కిట్లు ఇచ్చినవాళ్లు వాటిని 900లకు తగ్గించారు. ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అంతదాకా రోజుకి 150 కిట్లు ఇచ్చిన వాళ్లు యాభై కిట్లకు మించి ఇవ్వలేదు. అంటే టెస్టులు చేసుకుంటామని రోగ లక్షణాలతో ప్రభుత్వాసుపత్రులకు వచ్చిన వారికి టెస్టులు చేయకుండా వెళ్లగొట్టారు. ఫలితంగా రోగాలు పెరిగాయి, మరింత మందికి అంటుకున్నాయి. కానీ "రాష్ట్రంలో కేసుల సంఖ్య తగ్గు ముఖంలో ఉన్నాయని" సిగ్గులేకుండా ప్రచారం చేసుకుంది ప్రభుత్వం. కేసుల సంఖ్య తగ్గించే వీరి ఘనకార్యాలు ఇంతటితో ఆగలేదు. ప్రతీ టెస్టింగ్ కేంద్రంలో చేసిన తక్కువ టెస్టుల్లోనూ పాజిటివిటీ రేటు (టెస్టులు చేసుకున్న వాళ్లలో పాజిటివ్ వచ్చిన వారి శాతం) ముప్పై నుండి అరవై శాతం వచ్చింది. దాన్ని ఏడు నుండి పది శాతంగా తగ్గించి, ప్రకటించి కోవిడ్ తీవ్రత పెద్దగా లేదని

ముగింపు

కేంద్ర ప్రభుత్వమే వాక్సిన్లను సేకరించి రాష్ట్రాలకు పంపిణీ చేసే జాతీయ రోగనిరోధక పథకం నమూనాకు తిరిగి వెళ్లినప్పుడు మాత్రమే, దేశంలోని ప్రతి ఒక్కరికీ ఉచితంగా వాక్సిన్ వేసినప్పుడు మాత్రమే, భారత పేటెంట్ల చట్టం నిబంధనల కింద అందిన అధికారాన్ని వాడుకుని ఆయా సందర్భాలలో అనుమతులు ఇవ్వడం, తప్పనిసరి లైసెన్సులు ఇవ్వడం, కాంట్రాక్టు ఉత్పత్తి లైసెన్సులు ఇవ్వడం వంటి పనులకు ప్రభుత్వం పూనుకున్నప్పుడు మాత్రమే దేశ ప్రజలందరికీ టీకాలు వేసే కార్యక్రమాన్ని సాఫీగా సాధించగలం. మరొక మహా విపత్తులోకి వెళ్లకుండా ఉండగలం. భారత రాజ్యాంగం 14, 21 అధికారణాల కింద ప్రజలందరి ఆరోగ్య హక్కును వివక్షారహితంగా పరిరక్షించే బాధ్యత తనమీద ఉన్నదని భారత ప్రభుత్వం గుర్తించాలి, ఆ బాధ్యతను నెరవేర్చాలి.

(రచయిత సుప్రసిద్ధ న్యాయవాది)

(https://www.barandbench.com/

మే 9న రాసిన వ్యాసానికి అనువాదం: ఎన్ వేణుగోపాల్) వీ

చేతులు దులుపుకున్నారు. కానీ వాస్తవంగా రాష్ట్రంలో ప్రతి ఇల్లూ ఒక కోవిడ్ బ్రీడింగ్ కేంద్రం అయ్యింది. పోయే ప్రాణాలను నిలబెట్టుకోవటానికి జనం ఇళ్లల్లో నుండి రోడ్డు మీద పడ్డారు. ప్రాణ భయంతో రోదనలు మిన్నంటాయి. కాపాడే దిక్కు కాదుగదా ఏమైంది అని అడిగే పాలకుడు కన్పించలేదు. నెల రోజులుగా రోజుకు కనీసం అయిదారు వందల మంది చనిపోయారు. కానీ మరణాల సంఖ్యను రోజుకు ఇరవై నుండి ముప్పై దాటకుండా చూపుతూ రాష్ట్రంలో 'ట్రెండు బాగుంది' అని ప్రకటించింది ప్రభుత్వం. కానీ వాస్తవంగా ప్రజల్లో పెరుగుతున్న కేసులను, మరణాలను తగ్గించడానికి సరైన ఏ చిన్న ప్రయత్నమూ చేయలేదు.

2. వైద్యుల నియామకం, కొత్త హాస్పిటళ్ల ఏర్పాటు అంతా బూటకం

ఒక సంవత్సర కాలంగా రాష్ట్రంలో కొత్తగా వైద్యులను, సిబ్బందిని నియమించుకుంటూ, ఉన్న వైద్యులను కోవిడ్ డ్యూటీకి సిద్ధం చేస్తూ, కొత్తగా కోవిడ్ హాస్పిటల్లను పెంచుకుంటూ ఎంత గడ్డు పరిస్థితికైనా సన్నద్ధం కావాల్సిన అవసరం, అవకాశం ఎంతో ఉండింది. అటువంటి పని ఏ ఒక్కటీ జరుగలేదు. ఒక్క హైదరాబాద్‌లో గల టిమ్స్ (తాత్కాలిక హాస్పిటల్‌గా మార్చబడిన స్టేడియం) కోసం అందరూ విమర్శిస్తుంటే ఇటీవల కొంత మంది వైద్యులను, సిబ్బందిని మాత్రం తీసుకుని తూతూ మంత్రంగా నడిపిస్తున్నారు. కొన్ని జిల్లాల్లో ఇతర అవసరాల కోసం తీసుకున్న వైద్యులను కోవిడ్ డ్యూటీకి వాడుకుంటున్నారు. అవి తప్ప కోవిడ్ సంక్షోభంపై చెప్పింది, చేసింది అంతా బూటకమే. నామ మాత్రంగా కూడా వైద్యులను, సిబ్బందినీ పెంచకపోవడం వల్ల ఇప్పటికే నడుస్తున్న ఏ హాస్పిటల్ కూడా బలోపేతం కాలేదు. కొత్తగా ఏ ఒక్క సంస్థనూ కోవిడ్ అవసరానికి సిద్ధం చేయలేదు. ముఖ్యమంత్రి కుటుంబానికి మాత్రం యశోద హాస్పిటల్‌ను సిద్ధంగా ఉంచుకున్నారు. ముఖ్యమంత్రి చేసే ప్రకటనలు ఎంత వంచనా పూరితమో అర్థం కావడానికి ఇటీవల కొత్తగా 50 వేల (అక్షరాలా యాభై వేల) మంది డాక్టర్లను కోవిడ్ వైద్యం కోసం తీసుకుంటామని ప్రకటించిన విషయాన్ని పరిశీలిస్తే చాలు. వాస్తవంగా రాష్ట్రంలో అంతమంది వైద్యులే లేరు. రాష్ట్రంలో 2016లో తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి ఏర్పడిన నుండి అందులో రిజిస్టర్ అయిన వైద్యులే పదిహేను వేలు. 2016కు ముందు రిజిస్టర్ అయిన వైద్యులు 40 నుండి 45 వేల మంది. వారిలో వయో వృద్ధులు, విదేశాలకు వెళ్లిన వారు, పై చదువుల్లో ఉన్నవారితో పాటు ఇప్పటికే రాష్ట్రంలో గల వేలాది ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో స్థిరపడ్డవారు ఉంటారు. పరిస్థితి ఇలా ఉండగా యాభై వేల మంది డాక్టర్లను కోవిడ్ వైద్యానికి తీసుకోబోతున్నట్లు ప్రకటించాడు. కేసుల ఉధృతి పెరుగుతుంటే ఏమీ చేయడం లేదనుకుంటారని మే 12న నోటిఫికేషన్ ఇచ్చి దరకాస్తు చేసుకోవడానికి మే 22ను తుది గడువుగా నిర్ణయించారు. ఈ రోజు వరకూ ఆ ప్రక్రియను పట్టించుకున్న పరిపాలకుడు లేడు. ఎంతమంది వైద్యులు వచ్చి చేరారో, మిగతా ఖాళీల కోసం ఏం చేయదల్చుకున్నారో ఎవరికీ తెలియదు. ఆ 'భారీ నియామకం' అంతా వట్టి బోగస్. అంటే నోటికి ఎంత వస్తే అంత చెప్పడం తప్ప ఒక ప్రకటన చేసేముందు కొద్దిపాటి వాస్తవ సేకరణ కూడా లేదు. దాన్ని నిర్లక్ష్యం అనాలో, పరిపాలనా దుర్బలత్వం అనాలో, దళారీ వ్యవహారం అనాలో లేక అన్నీ కలగలిసిన ట్రిపుల్ మ్యూటంట్ అనాలో ముఖ్యమంత్రి గారే చెప్పాలి.

3. సంక్షోభ సమయంలో ప్రభుత్వంలో కదలికే లేదు

కేసులు వేలాదిగా ముంచెత్తుతూ ఉంటే మహారాష్ట్ర ప్రభుత్వం, ప్రత్యేకించి ధారవి లాంటి అతిపెద్ద స్లమ్ ఏరియాను కలిగిన బృహన్ముంబై మున్సిపల్ కార్పొరేషన్, యుద్ధ ప్రాతిపదిక మీద కదులుతూ వార్ రూంల ఏర్పాటుతో భారీ ప్రాణ నష్టం జరగకుండా కాపాడుకుంది. కేరళ రాష్ట్ర ప్రభుత్వం తన ప్రజల ప్రాణ రక్షణకు మించింది మరొకటి లేదన్నట్టు తీసుకున్న చర్యలు ప్రపంచంచే ప్రస్తుతింప బడుతున్నాయి. ఢిల్లీ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లు సైతం కేసుల సంఖ్యను దాయటం అనే చవకబారు ఎత్తుగడకు పోకుండా ప్రజలను ఆర్థిక, ప్రాణ నష్టం నుండి కాపాడడానికి తమ సర్వ శక్తులూ ఒడ్డుతున్నాయి. వారి నుండి నేర్చుకోవడానికి కావాల్సింది ప్రజల పట్ల గౌరవం, వారి ప్రాణ రక్షణకు ఏదయినా చేయాలనే సంకల్పం ఉంటే చాలు. కొత్త శక్తుల్ని సమీకరించుకుంటూ, ఉన్న వాటి నుండి గరిష్ట సేవను పొందడానికి కూడా ఎన్నో వ్యూహాత్మక విధానాలున్నాయి. మన ముఖ్యమంత్రి మాత్రం రాష్ట్రంలో ప్రభుత్వమే ఉనికిలో లేదన్నంత నిర్లక్ష్యంగా వ్యవహరించి రోజూ వేలాది మంది చావుకు కారణమయ్యాడు.

4. ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స, వాటి దోపిడీ, బ్లాక్ దందాపై శూన్య నియంత్రణ

ప్రైవేటు హాస్పిటల్లలో లక్షలాది మంది ప్రజలను అక్షరాలా నిలువు దోపిడీ చేస్తున్నారు. నిజానికి దోపిడీ అనేది చిన్న పదం. ప్రమాదానికి గురైన రైల్లో దొంగలు పడ్డట్లు చేస్తున్నారు. నూటికి తొంభై అయిదు శాతం ప్రైవేటు హాస్పిటల్లకు ఇది వర్తిస్తుంది. వారు వేస్తున్న బిల్లుల కాటుకు బలయ్యే కుటుంబాల ఆర్థిక స్థితి కనీసం పదేళ్లు వెనకకు పోతుంది. 'చికిత్స'లోనూ అనవసరము, అశాస్త్రీయమే ఎక్కువ. ఆపైన బ్లాక్ దందా. దోపిడీ, అరాచకత్వం అప్రతిహతంగా సాగుతున్నా ప్రభుత్వంలో కనీస స్పందన లేదు.. ప్రభుత్వ రంగంలో ఆసుపత్రుల్లేక, బెడ్లు లేక, ఆక్సీజన్ లేక ప్రజలు ప్రాణభయంతో ప్రైవేటు వాడి కత్తికి బలవుతున్నారు. ప్రభుత్వం తానుగా చికిత్స అందివ్వక రోగులను ప్రైవేటుకు పంపుతూ ఈనేరంలో పాలు పంచుకుంటున్నది.

కోవిడ్ సంక్షోభాన్ని ఎదుర్కోవటంలో తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి, చేస్తున్న మోసాలపై పెద్ద ఎత్తున చర్చ జరగాలి. ఆ చర్చ బహుశా ప్రపంచ ఆరోగ్య సంస్థ వరకూ, అంతర్జాతీయ సమాజం వరకూ వెళ్లాలి. ఒక డాక్టర్ తనవద్దకు వచ్చిన రోగి పట్ల వైద్యపరమైన ప్రమాణాలు పాటించకపోతే అతను లేదా ఆమె శిక్షార్హులౌతారు. అలాగే ప్రజలను వంచించే, కనీసం సామూహిక హననానికి కారణమయ్యే పరిపాలకుల వైఫల్యపు, మోసపూరిత, నిర్లక్ష్యపు పాలనపై కూడా కోర్టుల్లో విచారణ జరగాలి. జైలు శిక్షలు ఉండాలి. రాష్ట్రంలో ముఖ్యమంత్రి, కేంద్రంలో ప్రధానమంత్రి ఇటువంటి విచారణలు ఎదుర్కోవటానికి పూర్తిగా అర్హులు.

తామనుభవించే సంక్షోభ తీవ్రతకు కారణం, దాని పరిష్కారంలో ప్రభుత్వానిదే కీలక పాత్ర అనే చైతన్యం ఈ సంక్షోభ సమయంలో కూడా ప్రజల్లో పెరగకపోతే పాలక వర్గాల పాత విధానాల్లో ఎన్నటికీ మార్పు రాదు. ప్రజల ఆరోగ్య రక్షణ పూర్తి బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని, పాలకుల వల్ల ప్రజలకు జరిగే నష్టాలపై విచారణ ఉండాలని డిమాండ్ చేద్దాం.

(రచయిత ప్రధాన కార్యదర్శి, మానవ హక్కుల వేదిక) వీ

ఇక్కడ ఏదీ రహస్యం కాదు

కొత్త ఐటి చట్టం ప్రకారం వ్యక్తిగత గోప్యతకు న్యాయం జరగడం సందేహమేనని, అలాగే దేశద్రోహ చట్టం దురుపయోగం అయినట్టే ఈ చట్టం దురుపయోగం కాదనే గ్యారంటీ ఏమీ లేదని అంటున్నారు కేశవ్

కోల్‌కతాలోని కాలేజీస్ట్రీట్ 'కాఫీహౌస్' మేధావుల అడ్డాకి పేరు. సత్యజిత్‌రాయ్ లాంటి ఎంతోమంది మేధావులు యిక్కడ టీ సేవిస్తూ జాతీయ, అంతర్జాతీయ విషయాలను చర్చించేవారని వింటుంటాం. నేడు యిదే మేధావులు బతికిఉంటే, కాఫీహౌస్ విడిచిపెట్టి, ఏ వాట్సప్ గ్రూపులోనో, ఏ డిస్కార్డ్, క్లబ్‌హౌస్ ఆడియో యాప్‌లలోనో, ఫేస్‌బుక్ లైవ్‌లలోనో వారి ఆలోచనలనూ, వారి రచనలనూ షేర్ చేస్తూ గడిపి ఉండేవారు. డిజిటల్ ప్రపంచంలోని వాట్సప్, ఫేస్‌బుక్, ఇంకాస్తా ముందుకు పెద్ద మనుషుల అరుగుమీద కొస్తే ట్విటర్ ఎంతగా మన జీవితంలో పెనవేసుకున్నాయంటే, ఉదయం నిద్రకళ్ళతో నెట్ ఆన్ చేసి ఎవరు ఎలా పలకరించారో తెలుసుకోకుండా, పరుపు మీద స్మార్ట్‌ఫోన్ పట్టుకొని, చెవుల్లో హెడ్‌ఫోనో, బ్లూటూత్ డివైజో పెట్టుకొని వెనక్కి వాలుతూ ఏ వాట్సపో, ఏ ఫేస్‌బుక్కో స్క్రీన్ కాగితాలను స్క్రోల్ చేస్తూ గడపకుండా దినం ముగిసినట్టు కోట్లకొలది ప్రజలకు తోచదు.

ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ మధ్యకాలంలో ఇటు వాట్సప్, ఫేస్‌బుక్, ట్విటర్‌లాంటి సోషల్‌మీడియా కంపెనీలకీ, అటు భారత ప్రభుత్వానికీ మధ్య వివాదం ఇంతింతై వటుడింతై ఢిల్లీ హైకోర్టు ద్వారాలను తట్టడం వరకూ నడిచింది. ఈ చట్టాలు రాకముందే, తప్పుడు వార్తలు ప్రచారం చెయ్యడంలో ఆరితేరిన కొందరు వాట్సాప్ యూనివర్సిటీ భక్తులు యూజర్లను భయపెట్టేశారు. మనం పంపించే ప్రతి మెసేజీని ప్రభుత్వం చదువుతుందనీ, చూస్తుందనీ!

ప్రభుత్వం కోరుకునేదేమిటి?

కొత్తగా ముస్తాబైన చట్టం సోషల్ మీడియా కంపెనీలకు వర్తిస్తుంది. 26 మే నుండి దేశం మొత్తం మీద అమలు కావలసి ఉండగా ఈ కంపెనీలు కోర్టుని ఆశ్రయించడం వల్ల తాత్కాలికంగా చిన్న బ్రేకు పడింది. ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ (ఇంటర్ మీడియరీ గైడ్‌లైన్స్ అండ్ డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) రూల్స్ 2021 ప్రకారం సోషల్ మీడియా కంపెనీలు ఈ చట్టాల నిబంధనలకు బద్ధులై పనిచెయ్యాలి. ఒక మేసేజీ వీరి ప్లాట్‌ఫాంలో ఫార్వర్డులు కొడుతూ వైరల్‌గా మారి, ఆ మెసేజీ కారణంగా దేశంలో అల్లర్లు, హింస, మూకహత్యలు, చట్ట వ్యతిరేకమైన పబ్లిక్ డిజార్డర్‌కు దారితీస్తే, లేదా మానభంగం, మైనర్లమీద అత్యాచారాలు వాటి వీడియో, ఆడియోలు, మెసేజీలు ఫార్వర్డులు కొడుతుంటే, యికముందు ఆయా కంపెనీలు ఆయా మెసేజీల మూలవ్యక్తి వివరాలను ప్రభుత్వ దర్యాప్తు సంస్థలకు సమర్పించాల్సి ఉంటుంది. ఉదాహరణకు, యిలాంటి మెసేజీలు ఓ రెండు కోట్లమందికి చేరి ఉంటే, ఆ రెండుకోట్ల మందిలో మొదటి వ్యక్తి వివరాలను ప్రభుత్వం కోరుతుంది. ఆయా కంపెనీలు యిందుకోసం గ్రీవెన్సు ఆఫీసర్లను, యితర ఆఫీసర్లను నియమించాల్సి ఉంటుంది. యూజర్ల నుండి వ్యక్తిగతంగా ఫిర్యాదులు వచ్చినా, ప్రభుత్వ పరిశోధన విభాగం వివరాలు కోరుకున్నా ఈ ఆఫీసర్లు సహకరించాల్సిఉంటుంది. ఆలోచన బాగానే ఉంది. ప్రభుత్వం కోరేదాంట్లో అసహజత్వం లేనట్టే ఉంది. యిక, మరో విషయంలో కూడా వివాదం ఉంది. వాట్సప్ తన ప్రైవసీ నియమాలను మార్చేసి, యూజర్ల డాటాను తన సొంత కంపెనీ ఫేస్‌బుక్‌కి అప్పగించడం సహజ న్యాయానికీ, నియమాలకీ విరుద్ధమనీ ప్రభుత్వం వాదిస్తోంది. కొన్ని కోట్లమంది యూజర్ల వ్యక్తిగతమైన డేటాను ప్రైవసీ నియమాలకు విరుద్ధంగా ఫేస్‌బుక్‌కి తరలించడం పట్ల ప్రభుత్వం వ్యతిరేకత తెలియజేస్తోంది.

ముక్కల్ని కలపడం ప్రైవసీకి విరుద్ధం

ముక్కల టెక్నాలజీకు చరమగీతం పాడలేమని వాట్సప్ అంటోంది. వాట్సప్‌లో కొన్ని కోట్లమంది మెసేజీలు రాసుకోవడం, ఆడియోలూ, వీడియోలూ, ఫార్వర్డ్ చేసుకోవడం ఉదయం లేచి బ్రష్ చేసుకున్నంత సాధారణం అయిపోయింది. అయితే, మన ప్రైవసీని కాపాడ్డానికి, చలం అమీర్ తన ప్రియురాలు రాజేశ్వరికి ప్రేమతో పంపిన మెసేజీనీ, ఒక రోగి డాక్టరుకి ఇతరులతో పంచుకోదలచుకోని తన వ్యాధి వివరాలనూ, రిపోర్టులనూ, ఒక మేధావీ, రచయితా, కార్యకర్తా తన మిత్రులతో వ్యక్తిగతంగానో, గ్రూపులోనో పంచుకునే చర్చలనూ – యిలా ఏవైనా ఇతరులు చదవకుండా ఉండడానికి డిజిటల్ టెక్నాలజీ సహాయంతో వాట్సప్ ఈ ఇన్‌ఫర్మేషన్‌ని బేతాళుడు విక్రమార్కుడికి తల వేయి ముక్కలవుతుందని బెదిరించినట్టు వేలకొలది ముక్కలుగా మార్చేస్తుంది. ఫలితంగా, మెసేజీ అందించిన వ్యక్తి, అందుకున్న వ్యక్తి తప్ప మరో మనిషి లేదా వాట్సప్ కంపెనీ కూడా ఈ మెసేజీలు చదవలేదు. ఎందుకంటే, అవి ముక్కలైపోయి ఉంటాయి కాబట్టి! మనం చదువుతున్న వార్తా పత్రికను అవతలి వ్యక్తి చదువుతానని అడిగేటప్పుడు పదివేల ముక్కలు చేసి చింపేసి యిస్తే, అవతలి వ్యక్తి ఎలా చదవలేడో, వాట్సప్ కూడా అదే పనిచేస్తుంది. దీన్నే 'ఎన్‌క్రిప్టెడ్ టెక్నాలజీ' అంటారు. నాణ్యమైన కంపెనీలన్నీ యూజర్ల ప్రైవసీని రక్షించడానికి ఈ టెక్నాలజీ వాడతాయి.

మూల మెసేజీకర్తను పట్టుకోవడమెలా?

వాట్సప్‌లో ఒక మెసేజీ వైరల్ అయ్యేటప్పటికి అది కొన్ని వేల, లక్షల మంది స్మార్ట్‌ఫోన్లలోకి జొరబడి ఉంటుంది. అది తుఫాను వేగంతో కొన్ని లక్షల మందికి చేరి ఏదో మూకహత్యకో, మత

సంఘర్షణకో, మరో పబ్లిక్ డిజార్డర్‌కో దారితీసి ఉండొచ్చు. అయితే యిన్ని వేల, లక్షల స్మార్టఫోన్ల నుండి వెలికితీసి మొట్టమొదట ఆ మెసేజీ లేదా వీడియో పెట్టిన వ్యక్తినో, ఫోను ఓనరునో పట్టుకోవడం సాధ్యంకాని పని అని వాట్సప్ అంటోంది. తాము ఉపయోగించే వేల ముక్కల ఎన్‌క్రిప్టెడ్ మెసేజీల గుండా ఎవరు ఏ మెసేజీ పంపిస్తున్నారో, దాని కంటెంట్ ఏమిటో, ముందుగా పంపించిన వ్యక్తి ఎవరో చెప్పడం సాధ్యం కాదు. అలా చెయ్యాలంటే, ఈ వేల ముక్కల ఎన్‌క్రిప్టెడ్ టెక్నాలజీకి చరమగీతం పాడాలి. ప్రతి మెసేజీని మెటా డాటాబేస్‌లో పదిలపర్చుకోవాలి. ప్రభుత్వానికి ఎప్పుడు ఏ మెసేజీ అవసరమైతే అది క్షణాల్లో యివ్వడానికి! అయితే, యిలా చేస్తే పెనం మీంచి పొయ్యిమీద పడ్డట్టే కదా! ఏ యూజర్ల ప్రైవసీ కోసం ప్రభుత్వం ఆరాటపడుతుందో, అదే యూజర్ల ప్రైవసీ యిలా చేస్తే దెబ్బతింటుందని వాట్సప్ వాదిస్తోంది. ఒక మెసేజీని అందివ్వడానికి మొత్తం మెసేజీలను ఎన్‌క్రిప్ట్ పద్ధతి నుండి బయటికి తీయాలి. యిది యూజర్ల ప్రైవసీకి అఘాతం అని వాట్సప్ అంటుంది. కొత్త ప్రతిపాదనలు అంగీకరిస్తే, జర్నలిస్టులూ, కార్యకర్తలూ, రిస్కులో పడతారని వాట్సప్ భావిస్తోంది.

ప్రైవసీ వెనుక పొంచి ఉన్న మాస్ సర్వెలెన్సు

ఫేస్ బుక్‌ని కలిగి ఉన్న వాట్సప్‌కీ, ప్రభుత్వానికీ మధ్య వివాదాలు డిల్లీ హైకోర్టులో ఉన్నాయి. 26 మే నుండి కొత్త చట్టాలు అమలు కావలసి ఉండగా, మే 25న ఫేస్‌బుక్ కంపెనీ డిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. యిక నిర్ణయించాల్సింది కోర్టులే. కేవలం కొద్దిమంది అరాచకవాదుల్ని పట్టుకోవడమే తమ ఉద్దేశమనీ, సామాన్య ప్రజలకు ఈ విషయంలో ఎలాంటి భయం అవసరం లేదనీ సంబంధిత మంత్రి అంటున్నారు. అయితే, అరాచకవాదుల్ని నిర్వచనం ఎలా చేస్తాం? దేశద్రోహ చట్టం దేశంలో సక్రమంగా అమలు చేస్తున్నామా? ఆవుపేడతో కరోనా తగ్గదని సోషల్ మీడియాలో రాసే విలేకరుల్నీ, సాధారణ ప్రజల్నీ దేశద్రోహ చట్టం కింద జాతీయ భద్రతా చట్టం ఉక్కుపిడికిలి కింద అణచేసే నేపథ్యంలో జీవిస్తున్నాం. న్యాయం న్యాయాదీశుల్నించి పోలీసుల చేతుల్లోకి మెల్లమెల్లగా పయనించే విషమ పరిస్థితుల్ని చూస్తున్నాం. మరి కొత్త ఐటి చట్టాలు దురుపయోగం కావని గ్యారంటీ ఏమిటి? పబ్లిక్ డిజార్డర్‌ని నిర్వచించడమెలా? ఎక్కడో రైతుల ఉద్యమాన్ని సమర్థిస్తూ పలానా వాట్సప్ గ్రూపులో మెసేజీ పెట్టారన్న మిషతో ఎవరినో కావాలనే అరెస్టు చేసే పరిస్థితి రాదంటామా? పైగా, వాట్సప్ విశ్వవిద్యాలయంలో ఫేక్‌న్యూజ్ పండుగలు, బ్రెయిన్ వాషింగ్ మెసేజీలు 2014 నుండే ఎక్కువగా విజృంభించడంలో ఆంతర్యమేమిటి? తమ రాజకీయ ఎత్తుగడలకు అనుగుణంగా ప్రజల మెదళ్లను సిద్ధం చెయ్యడానికోసం బిజెపి ఐటి సెల్ 2014 నుండి ప్రణాళికాబద్ధంగా పని చేస్తోంది. వాట్సప్‌ని విశ్వవిద్యాలయంగా మార్చింది ఎవరో ప్రజలకు తెలీనిది కాదు. ఎన్‌క్రిప్టెడ్ టెక్నాలజీకి గుడ్‌బై చెబితే, యూజర్లు మాస్ సర్వీలెన్సులోకి రారని గ్యారంటీ ఉందా?

డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లతో ప్రైవసీ సమస్య

వాట్సప్ తన వేయిముక్కల ఎన్‌క్రిప్టెడ్ టెక్నాలజీను ఆపెయ్యడంతో మాత్రమే ప్రైవసీ సమస్య ముగిసిపోదు. యింకా ఎన్నో మార్గాల ద్వారా నేడు మన ప్రైవసీకి విఘాతం కలుగుతోంది. మన యింటికి తలుపు వేసుకుని కూర్చుంటాం. మన ప్రైవసీ కోసమని! మన సొంత కాగితాలు జాగ్రత్తగా ఉంచుకుంటాం. చివరికి మన ఫోనుకి కూడా ఏవేవో పాస్‌వర్డులు యిస్తాం. ఎవరూ మన ఫోన్‌లోని కంటెంట్‌ని చూడకూడదని! చదవకూడదని! మరి మనం మన ఫోన్లో హోం స్క్రీను మీద అందంగా అలంకరించుకున్న యాప్‌లు మనతో ఎలా ఆడుకుంటున్నాయో మనం ఏనాడైనా గమనించామా! యిటీవల కోవిడ్ కారణంగా ప్రతి ఒక్కరూ యిళ్ళల్లో బందీలైపోయిన విషాద పరిస్థితిలో ఒకరు మరొకరితో మాట్లాడుకోలేని ఒంటరితనంలో ఆడియో యాప్‌లు ముందుకొచ్చాయి. డిస్కార్డ్, క్లబ్ హౌస్ లాంటి ఆడియో యాప్‌లు ఆ లోపాల్ని భర్తీ చేశాయి. క్లబ్ హౌస్ ప్రపంచం మొత్తం మీద ఇరవై లక్షల డౌన్‌లోడ్లను పెంచుకొంది. యూజర్ల సైకాలజీని గుర్తించి ఎవరు ఎవరితోనైనా మాట్లాడుకోగలిగే సౌలభ్యాన్ని సృష్టించారు. టెక్స్ట్ మెసేజీల వాట్సప్‌ల కంటే యివి బాగా కోవిడ్ ఒంటరితనంలో ఆకట్టుకున్నాయి. అయితే, యిలాంటి వందలకొలది యాప్‌లతో వచ్చే చిక్కేమిటంటే, వీటిని డౌన్‌లోడ్ చేసి ఆన్ చెయ్యగానే, మన ఫొటోల్లోకీ, కెమెరాలోకీ, ఆడియో, వీడియోలోకీ, కంటాక్టు లిస్టులోకి తొంగిచూడటానికి అనుమతిని కోరతాయి. ఎవరిని పడితే వారిని మనం యింట్లోకి రానీయం. కానీ, ఈ యాప్‌ల విషయానికొస్తే, మనం సునాయాసంగా ఒకే కొట్టేస్తాం. అలా కొట్టకపోతే, మనం ముందుకు వెళ్ళే సౌలభ్యం ఉండదు. ఇలా ఈ యాప్‌లు కొన్ని లక్షలమంది యూజర్ల స్మార్ట్ ఫోనులోపలి కాంటాక్టు లిస్టులోకి, ఇమేజీల్లోకి, ఆడియో, వీడియోల్లోకి తొంగిచూస్తాయి. మన ప్రైవసీ ప్రశ్న యిక్కడే వస్తుంది. మన స్మార్ట్‌ఫోనులోంచి ఈ యాప్‌లు మన ప్రైవసీ వ్యవహారాలకు విఘాతం కలిగిస్తూ ఏ వ్యాపార ప్రయోజనాలకు వాడుకుంటున్నాయో ఎవరికీ అర్థం కావడం లేదు. మనకు మాత్రమే సొంతం అయిన, మనకు మాత్రమే ప్రైవసీగా ఉన్న మన స్మార్ట్‌ఫోను లోపలి సంగతులు ఎవరు ఎలా ఉపయోగించు కుంటున్నారో, ఏ వ్యాపార ప్రయోజనాలకు ప్రపంచీకరణలో న్యాయం చేస్తున్నారో మరింత పరిశోధించవలసిన అవసరం ఉంది. కాబట్టి, వాట్సప్ ప్రైవసీ విషయంలో ప్రైవసీ సమస్య ఒక్క వాట్సప్‌తోనే ఆగదు. అసంఖ్యాకమైన యాప్‌ల పరిశ్రమతో ముడిపడి ఉంది. చాలా తెలివిగా వ్యవహరించే వీటన్నిటిని నియంత్రించే పరిస్థితి దేశంలో ఉందా లేదా యింకా స్పష్టం కావడం లేదు. పైగా, వాట్సప్ ఎన్‌క్రిప్టెడ్ టెక్నాలజీ వాడుతోంటే, క్లబ్ హౌస్‌లు యిలాంటి టెక్నాలజీ ఉపయోగించడం లేదు. ప్రతి ఆడియో యిక్కడ రికార్డు అవుతుంది.మరి ప్రైవసీ ఎక్కడుంది? ప్రపంచీకరణలో డేటా అనేది అత్యంత విలువైన సరుకు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రతి సరుకు వ్యాపారమయం అయినట్టే, వ్యాపార ప్రయోజనం కోసం ఉపయోగం అయినట్టే, ఆధునిక యుగంలో డేటా అనేది అతిపెద్ద విలువైన సరుకు. ఈ డేటా సరుకుగా మారి విశ్వవిహంగం చేసే క్రమంలో ప్రైవసీ మాటను ఎవరు పట్టించుకుంటారని? మనం ఫ్లిప్‌కార్డులో ఏ వాషింగ్ మెషిన్ చూసామో అది ఫేస్‌బుక్‌లో మన పేజీలో కనిపిస్తుంది. మనం అమెజాన్‌లో ఏ ప్రింటర్ కొనాలని చూస్తామో అది ఫేస్‌బుక్‌లో మన వాల్‌లో కనిపిస్తుంది. మన యిష్టాలేమిటి, మనం ఏవి కొనాలనుకుంటున్నాం, ప్రతి ఒక్కటీ మన సొంతం కాదు. క్షణాల్లో వ్యాపార సాఫ్ట్‌వేర్ పరిశ్రమ పట్టేస్తుంది. సరుకుల విషయంలోనే కాదు. చివరికి, సైద్ధాంతికంగా, రాజకీయ పరంగా మనం ఏ ఆలోచనలను ప్రతిబింబిస్తున్నామో, క్షణక్షణం ఫేస్‌బుక్‌లాంటి సోషల్ మీడియాలు తెలుసుకుంటున్నాయి. ఒక ప్రత్యేక

ఆహార సంక్షోభం - పాలకుల వైఫల్యమే

భారతదేశంలో దశాబ్దాలుగా ఆకలి సమస్య పరిష్కారం కాకపోవడానికి కారణం తగినంత ఆహారం లేకపోవడం కాదని, ప్రజల పట్ల పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడమేనని అంటున్నారు డా. ఎ. పున్నయ్య

'అన్నపు రాశులు ఒకచోట, ఆకలి మంటలు ఒకచోట, సంపద అంతా ఒకచోట, గంపెడు బలగం ఒకచోట' అన్న కాళోజీ సిరా చుక్కలు అక్షరాలా ప్రతిబింబిస్తున్న వర్తమాన పరిస్థితుల్లో ప్రజల ఆలనా, పాలనా పట్ల పాలకుల అప్రజాస్వామిక ఆశ్రితపక్ష పాత పాలనా విధానాలకు, ప్రభుత్వ నిస్సిగ్గుతానానికి సమాజం నివ్వెరపోతుంది. ఒకవైపు కోవిడ్ సృష్టించిన ఈ ఉత్పాతంలో ఎండిన డొక్కలు, ఆకలి మంటలు ఒకచోట చేరితే ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు యథేచ్ఛగా మద్దతు ఇస్తూ ఆదాయ రాసులన్నీ కుప్పగా కుమ్మరించింది. రాజకీయార్థిక సూత్రాలను అనుసరించి పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో ఏదైనా విపత్తు, సంక్షోభం ఏర్పడినప్పుడు, దాని భారం పూర్తిగా పేద, మధ్యతరగతి శ్రామిక ప్రజలకు సాంకేతికంగా బదిలీ చేయబడుతుంది. ప్రభుత్వం, కార్పొరేట్లు, పెట్టుబడిదారుల ప్రయోజనాలను రక్షించడమే కాక, వారి లాభాలను, సంపదను మరింత పెంచడానికి పరోక్షంగా కృషి చేస్తుంది. నేటి ప్రభుత్వాల లక్ష్యం కూడా పెట్టుబడిదారులను అభివృద్ధి చేయడమే కనుక ప్రతి విపత్తును వారికి ప్రయోజనం చేకూర్చేలా ప్రయత్నిస్తుంది. ఈ సంక్షోభ సమయంలో కోవిడ్ మహమ్మారికి చిక్కిన ఈ దేశ పేద, మధ్యతరగతి దినసరి కూలీలు, శ్రామికులు, వలస కార్మికుల వంటి దేశ సంపదను సృష్టించే బలగమంతా ఉపాధి, ఉద్యోగాలు కోల్పోయారు. అన్నపురాసుల్లన్ని ఈ దేశంలోని గోదాముల్లో ముక్కిపోతుండగా ఆహార సంక్షోభంతో అపారమైన ఆకలిని, అనంతమైన దుఃఖాన్ని అనుభవిస్తున్నారు. పెరిగిన శాస్త్ర సాంకేతిక దిగుబడుల ఉత్పత్తి సమయంలో కూడా ఈ ఆహార సంక్షోభానికి కారకులెవరో, వారి వైపల్యం ఎంతో పరిశీలిద్దాం.

శాస్త్ర సాంకేతికత - పెరిగిన దిగుబడులు

నేటికీ ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో ప్రజలు ఆహార కొరత, పౌష్టికాహార లోపంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. భారతదేశం పురాతన వ్యవసాయ నాగరికతను కలిగి ఉంది. ప్రపంచంలోని ప్రతి నలుగురు రైతులలో ఒకరు భారతీయులు. ఈ దేశంలో అనేక జీవనదులు ప్రవహిస్తున్నాయి. పంటలకు అనుకూలమైన సారవంతపు నేలలు ఉన్నాయి. బ్రిటిష్ పాలకుల దోపిడీ వలన స్వాతంత్ర్యం పొందేనాటికి భారతదేశంలో విపరీతమైన ఆహార కొరత ఉంది. దీనిని

ఎన్నికల్లో కూడా ప్రజల మెదళ్ళను తమ ప్రయోజనాలకు అనుగుణంగా వాష్ చేసే విధంగా ఈ వేదికలు ఉపయోగ పడుతున్నాయనీ వీటి మీద అంతర్జాతీయ స్థాయిలో విమర్శలున్నాయి. దీనికి తోడు రేన్సమ్ వేర్ ల సమస్యలు ఉండనే ఉన్నాయి. ప్రభుత్వ వెబ్ సైట్‌ల మీద పడి డేటా దోచుకోవడం అప్పుడప్పుడూ వింటునే ఉన్నాం.

జియో రాకతో మార్గం సౌలభ్యం

ఒక జీబీ ఇంటర్నెట్ ఒక నెల రోజులు జాగ్రత్తగా వాడుకునే కష్టకాలం నుండి ఎంత కావాలంటే అంత వాడుకోవచ్చని జియో ఉచిత సిమ్‌ల రాకతో భారతదేశం సోషల్ మీడియా రంగం రూపురేఖలు మారిపోయాయి. దీనికోసమే పొంచి ఉన్న స్మార్ట్‌ఫోన్లు లక్షల కోట్ల కొలది భారతదేశంలో కొనుగోలుదారుల మీద పడ్డాయి. సరిగ్గా, యిదే సరయిన సందర్భంగా భావించి, ఫ్లిప్‌కార్టు, అమెజాన్, మైంత్రా లాంటి ఇ-కామర్సు యాప్‌లు రెచ్చిపోయాయి. యిలా జియో, స్మార్ట్‌ఫోన్, ఇ-కామర్స్, కొత్త ఆనందాల కోసం వేచి చూస్తోన్న కొనుగోలుదారుడి బలహీనతలు కలగలిసి ఒక పెద్ద వ్యాపార సామ్రాజ్యాన్ని సృష్టించాయి. కొన్ని విషయాల్లో భారతీయులు ప్రయోజనం పొందారనడంలో సందేహం లేదు. కానీ, అంతకంటె ఎక్కువగా మన దేశ ఆర్థిక పరిస్థితి మీద ప్రభావం పడింది. చిన్న చిన్న దుకాణదారులు, రిటైల్ రంగం దెబ్బతింది. వాట్సప్‌లు, ఫేస్ బుక్‌లు లేనిదే ఉండలేని పరిస్థితి సృష్టించి మన ప్రైవసీని గాలికొదిలేసాయి.

ముగింపుగా

వాట్సప్‌లో వేయి ముక్కల ఎన్‌క్రిప్టెడ్ టెక్నాలజీ ఉన్నప్పటికీ మన ప్రైవసీకి డిజిటల్ ప్రపంచంలో గ్యారంటీ లేదని చూశాం. మరి, ఈ టెక్నాలజీ కూడా మూలవ్యక్తి వివరాలను అందివ్వాలనే నిబంధనలో అంతం అయిపోతే, మన ప్రైవసీకి మరింత విఘాతం కలిగే రిస్కు నుండి తప్పించుకోలేం. ప్రభుత్వం ఎవరి మెసేజీలను ఎప్పుడు ఎలా ఉపయోగించు కుంటుందో, ఎవరు ఎప్పుడు పోలీసు చట్టాల కోరల్లోకి యిరుక్కుంటారో చెప్పడం కష్టం. రచయితలు, కార్యకర్తలు, పౌరహక్కుల, ఉద్యమ కార్యకర్తలు, మేధావులు స్వేచ్ఛగా, సహజంగా ఈ ప్లాట్‌ఫాంలలో సంభాషించుకోగలరా? చర్చ, వాదన, సమీక్ష, ప్రభుత్వ పాలసీల సమీక్ష మొదలైనవి సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలో రాసుకోవడం, చర్చించుకోవడం నేడు మామూలే. మరి కొత్త చట్టాల ప్రకారం, ప్రైవసీకి ఎంతవరకు న్యాయం జరుగుతుందనేది సందేహమే. అలానే దేశద్రోహ చట్టం దురుపయోగమైనట్టే, కొత్త ఐటి చట్టం కూడా దురుపయోగం కాదని గ్యారంటీ ఏమిటి? ప్రైవసీ, సర్వీలెన్సు అనేవి నేడు పౌరులు ఎదుర్కొనే కొత్త సమస్యలు!!

(రచయిత 'పగిలిన పాదాల నెత్తురులో' పుస్తక రచయిత) వీ

అధిగమించడమే పాలకులకు సవాలుగా మారింది. రాను రాను వ్యవసాయ ఉత్పత్తులు పెరగడం వలన మిగులు ఆహార ధాన్యాలను గిడ్డంగులలో నిల్వ ఉంచడమే కాకుండా, సముద్రాల్లో పారవేసిన ఉదంతాలను కూడా భారత్ సొంతం చేసుకుంది.

నేడు కరోనా తాకిడికి రవాణా, నిర్మాణ, పర్యాటకం, ఆతిథ్య రంగాలు సహా అనేక రంగాలు దేశవ్యాప్తంగా స్తంభించిపోయాయి. అన్ని రంగాల పారిశ్రామిక ఉత్పత్తులు కుదేలైనవి. ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న ఈ సంక్లిష్ట, సంక్షోభ సమయంలో ఒక వ్యవసాయ రంగం మాత్రమే దేశాన్ని ఆదుకుంది. ఈ ఏడాది కూడా అన్ని పంటలూ మంచి దిగుబడినిచ్చాయి. ఈ సంవత్సరం మార్చ్ నుంచి జూన్ వరకు ఆహార ధాన్యాల ఉత్పత్తుల ఎగుమతులు 23 శాతానికి పైగా పెరిగాయి. ఈ నాలుగు నెలల్లో రు. 25,552 కోట్ల విలువైన తిండిగింజలు ఇతర దేశాలకు ఎగుమతి చేసినట్లు కేంద్ర వ్యవసాయ శాఖ ప్రకటించింది. మన ఎఫ్‌సిఐ గోదాముల్లో తిండిగింజలు ఇప్పటికే లెక్కకు మిక్కిలిగా పోగుపడ్డాయి. అయినా ఆహార సంక్షోభం, ఆకలి చావులకు కారకులెవరు?

ప్రభుత్వ విధానాల వైఫల్యం

భారత రాజ్యాంగం ఆర్టికల్ 47 ప్రకారం ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్య ప్రమాణాలు మెరుగు పరచడానికి వారికీ పౌష్టికాహారం అందించే బాధ్యతను ప్రభుత్వ ప్రథమ కర్తవ్యంగా భావించాలని నిర్దేశించింది. అందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం 1975లో పిల్లల సమగ్రాభివృద్ధి పథకాన్ని ప్రారంభించింది. 2013లో జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. 2013లో అంత్యోదయ అన్న యోజన పథకం అమలు చేయడం ప్రారంభించింది. అయితే నేటికీ కోట్ల మంది ఎండిన డొక్కలతో పట్టెడన్నం కోసం వలస కార్మికులు, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలు, ఆదివాసీలు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు నిస్సహాయంగా ఎదురుచూస్తున్నారు. అధికారిక గణాంకాల ప్రకారమే 19 కోట్ల మంది ఆకలితో అలమటిస్తుంటే, ఇక అనధికారికంగా ఎంత మంది ఉంటారో ఊహించుకోవచ్చు. ఇక పోషకాహార లోపంతో బాధపడుతున్న వారు కూడా మన దేశంలోనే అత్యధికంగా ఉన్నారు. నేటికీ 6 నుండి 23 నెలల వయసున్న చిన్నారుల్లో కేవలం 9.6 శాతం మందికి మాత్రమే కనీస పౌష్టిక ఆహారం అందుతుంది. మిగతా పిల్లలు పౌష్టిక ఆహార లోపం వల్ల వయసుకు తగ్గ బరువు, ఎత్తు ఉండడం లేదని గ్లోబల్ హంగర్ ఇండెక్స్ ఇటీవల వెల్లడించింది.

ఆహార సంక్షోభం – హంగర్ వాచ్ నివేదిక

ఇటీవల 'హంగర్ వాచ్' సంస్థ దేశవ్యాప్తంగా 11 రాష్ట్రాలలో 3,994 మందిని కలిసి నిర్వహించిన సర్వేలో అనేకమైన కలచివేసే అంశాలు వెలుగులోకి వచ్చాయి. ప్రధానంగా ఈ సర్వే ద్వారా అట్టడుగు వర్గాల ప్రజలలో ఆకలి తీవ్రంగా ఉందని తేలింది. గత సంవత్సరం లాక్‌డౌన్ కాలంలో మెజారిటీ అట్టడుగు వర్గాలు తీసుకునే ఆహార పరిమాణం తగ్గింది. తినే తిండిలో పోషక విలువలు కూడా క్షీణించాయి. లాక్‌డౌన్ విధించిన ఐదు నెలల తర్వాత కూడా ఖాళీ కడుపుతోనే నిద్రకు ఉపక్రమించాల్సిన పరిస్థితిలో మార్పేమీ లేదు. ఆరేడు మాసాల తర్వాత కూడా ఆకలితోనే గడపాల్సి వచ్చిందని సర్వే నివేదిక చెప్తోంది. ఆదాయం లేకపోవడంతో తినడానికి లేక, ఒకవేళ కొద్దిగా ఆహారం కొనుగోలు చేయగలిగినా పోషకాహారం తీసుకోలేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

ప్రజలకు ఆహార లభ్యత, ఆకలి, పోషకాహార లోపం వంటి అంశాలను లెక్కలోకి తీసుకుని ప్రపంచ ఆకలి సూచిని (గ్లోబల్ హంగర్ ఇండెక్స్ – జిఎచ్ఐ) నిర్ధారిస్తారు. ఈ సూచి ప్రకారం 2019 సంవత్సరంలో 117 ప్రపంచ దేశాల్లో భారతదేశం 102 స్థానంలో ఉంది. అంతకు ముందు సంవత్సరం 119 దేశాల్లో మన స్థానం 103 మాత్రమే. మన పక్కనున్న పాకిస్థాన్ (94), బంగ్లాదేశ్ (88), నేపాల్ (73), శ్రీలంక (66) దేశాల కంటే మనం వెనుకబడి ఉండడం విచారకరం. ఇటీవల ప్రపంచంలో ఆకలి సంక్షోభ స్థాయిలో ఉన్న 45 దేశాల్లో భారత్ కూడా ఉందని జిఎచ్ఐ నివేదిక కుండబద్దలు కొట్టింది. ఈ క్రమంలో పాలకులు దీనిని ప్రమాదకర హెచ్చరికగా భావించాలి. అయితే నీతి ఆయోగ్ మాత్రం జిఎచ్ఐ కోసం గణాంకాలు లెక్కించే పద్ధతి కాలం చెల్లిందని, భారత్ పరిస్థితి నివేదికలో చెప్పినదానికంటే బాగుందని సన్నాయి నొక్కులు నొక్కడం గమనార్హం. తాజా లెక్కల ప్రకారం జిఎచ్ఐలో భారత్ స్థానం 102 కాదు 91 అన్నది ఆయన నీతి ఆయోగ్ వాదన. అయితే ఈ విషయంలో ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకర స్థితిలో ఉందని, 2021లో పరిస్థితి మరింత తీవ్రంగా మారనుందని హంగర్ ఇండెక్స్ హెచ్చరించింది. ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాల వలన ఆహార సంక్షోభం దీర్ఘకాల సమస్యగా మారిపోనుందని, దీన్నుంచి బయటపడే అవకాశాలు సన్నగిల్లుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. అయితే 2030 నాటికి ఆకలి సమస్యను అంతమొందించాలని ఐక్యరాజ్య సమితి సూచించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో ప్రధానమైనది. అందులో భాగంగా రైతు పొలంలో పండించే ప్రతి గింజా పేదవాడి నోటికి చేరినప్పుడే జీరో హంగర్ సాధనకు మార్గం సుగమమవుతుందన్న సూచనను పాలకులు నేటికైనా గుర్తించాలి.

భారతదేశంలో ఆకలి సమస్యకు మూల కారణం

భారతదేశంలో దశాబ్దాలుగా ఆకలి సమస్య పరిష్కారం కాకపోవడానికి ప్రధాన కారణం తగినంత ఆహారం లేకపోవడం కాదు. ప్రధానంగా ప్రజల సమస్యల పట్ల చిత్తశుద్ధి, దార్శనికత, నిబద్ధత లేకపోవడం ప్రజలను మోసగించి ప్రభుత్వంలో కొనసాగడం. ఆకలితో ఉన్నవారిని గుర్తించి ఆహారాన్ని అందించలేని దివాలాకోరు ప్రభుత్వ విధానాలు. ప్రపంచ బ్యాంక్ ఆర్థిక విధానాలు కొనసాగించే స్వీయ అస్తిత్వం లేని పాలనా విధానాలు, కార్పొరేట్ లాభాలపై మాత్రమే దృష్టి సారించిన నియోలిబరల్ సంస్కరణలు, రైతుల ప్రాణాలు, జీవనోపాధికి ముప్పు తెచ్చి లోతైన అస్తిత్వ సంక్షోభానికి దారి తీసింది. మానవ జీవనాధారమైన ఆహారాన్ని కూడా లాభాల కోసం చేసే వ్యాపారంగా కార్పొరేట్లు దిగజారడంతో దేశంలో ఆకలి పెరిగింది. ఈ పరిస్థితి వల్ల నేడు భారతదేశంలో ప్రతి నలుగురిలో ఒకరికి ఆకలికి దారితీసే అత్యవసర పరిస్థితి, ప్రతి ఇద్దరు పిల్లల్లో ఒకరు తీవ్రమైన పోషకాహార లోపంతో బాధపడుతున్న సందర్భం ఏర్పడింది.

దశాబ్దాలుగా వైరస్ కారణంగా ప్రబలిన వేలాది అంటు వ్యాధులను నయం చేసుకున్నాం. ఈ దేశాన్ని పట్టి పీడిస్తున్న అనేక దీర్ఘకాలిక, మొండి వ్యాధుల నుంచి బయటపడుతూనే ఉన్నాం. శాస్త్ర విజ్ఞానం అభివృద్ధి చెందుతున్న క్రమంలో ఈ కరోనా విషపు కోరల్లో నుంచి కూడా త్వరలో తప్పక బయటపడగలం అనే దృఢమైన విశ్వాసం ప్రజలందరికీ ఉంది. కానీ ఈ దేశాన్ని దశాబ్దాలుగా పట్టి పీడిస్తున్న ఆకలి నుంచి బయటపడడం సాధ్యమేనా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మన ముందుంది. దేశంలో విజ్ఞాన శాస్త్ర పురోగతి వలన అనేక జటిల సమస్యలు పరిష్కరించబడినవి. భూగోళంపై భారతదేశం అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఆవిర్భవించి నప్పటికీ ప్రభుత్వ విధానాలు, పాలకుల వైఫల్యం వలన నేటికీ అపరిష్కృతంగానే మిగిలింది.

ప్రభుత్వం కోవిడ్-19 ప్రతికూల పరిస్థితులను నియంత్రించడానికి ముందస్తు ప్రణాళికలేని కారణంగా మన ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలోకి నెట్టబడింది. జీవనోపాధి లేకపోవడంతో లక్షలాది మంది పేదరికపు గీతకు దిగువకు నెట్టబడ్డారు. ప్రభుత్వాలు ప్రకటించిన ఉద్దీపన ప్యాకేజీలు కార్పొరేట్లకే తప్ప పేదలకు పట్టెడు మెతుకులు రాల్చలేదు. పాలనా విధానాలు ఇలానే కొనసాగితే సమీప భవిష్యత్తులో ఆకలి తీవ్రస్థాయి నుంచి భీకర స్థాయికి నెట్టబడే ప్రమాదం ఉందని ఈ ఆకలి సంక్షోభం హెచ్చరిస్తుంది.

ప్రభుత్వ తక్షణ కర్తవ్యం

తక్షణమే ప్రభుత్వ గోడౌన్లలో పేరుకుపోయిన ఆహార నిల్వలను కేంద్రం ఉచితంగా పంపిణీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వాస్తవానికి, కేంద్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసి అన్ని రాష్ట్రాలను భాగస్వాములను చేయాలి. బియ్యం, పప్పుధాన్యాలు, పంచదార, నూనెలు వంటి నిత్యావసర సరుకులన్నిటిని పి.డి.ఎస్ ద్వారా ప్రజలకు ఉచితంగా అందించే న్యాయమైన, స్థిరమైన, ఆరోగ్యకరమైన, ఆహార వ్యవస్థలను ప్రభుత్వం సృష్టించాలి.

కానీ ఆధార్ అనుసంధానం చేయలేదన్న సాకుతో ప్రభుత్వాలు సుమారుగా 3 కోట్ల రేషన్ కార్డులను రద్దు చేయడం అంటే వాళ్ల ఆకలి బాధను మరింత పెంచడమే. ఆ అమానవీయ చర్యకు సుప్రీంకోర్టు సీరియస్ కావడం చూశాం. ఇటీవల సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం దీపికా జగత్ రామ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా మధ్య జరిగిన కేసు తీర్పులో అన్ని రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రభుత్వాలకు జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రకారం స్త్రీలకు, బాలింతలకు, చిన్న పిల్లలకు వేడి ఆహారం, ఆహార ధాన్యాల పంపిణీ కోసం ఏర్పాటు చేసిన అంగన్వాడీ కేంద్రాలను పునఃప్రారంభించాలని ఆదేశాలు కూడా జారీ చేసింది. అయినప్పటికీ పేదలకు ఇచ్చే రేషన్ తగ్గించి డబ్బు మిగుల్చుకోవాలనుకుంటున్న కేంద్ర ప్రభుత్వం బడా కార్పొరేట్లకు మాత్రం పన్ను మినహాయింపులు, ఇతర సబ్సిడీలతో పాటు రుణాల రద్దు చేయడం ద్వారా రు. 7,99,354 కోట్ల నష్టాన్ని నెత్తిన వేసుకోవడం దారుణం. అంతేకాకుండా, 2015 - 16, 2018 - 19 మధ్య కాలంలో బడా పారిశ్రామికవేత్తలకు రు. 4,32,584 కోట్ల రుణాలు రద్దు చేసింది. కేవలం రు. 25,659 కోట్లు (10 శాతం) మాత్రమే వారి నుంచి వసూలు చేయగలిగింది. పెద్ద పారిశ్రామికవేత్తలకు గత ప్రభుత్వం రద్దు చేసిన దానికంటే, ఈ ప్రభుత్వం 3 రెట్లు ఎక్కువ రుణాలను రద్దు చేయడం అనేది కారొ. దేశం మొత్తం వ్యవసాయ రుణాలు రద్దు చేసిన దానికంటే 12 ప్రముఖ కార్పొరేట్ల నిరర్థక ఆస్తుల వల్ల ప్రభుత్వ ఖజానాకు రెండు రెట్లు ఎక్కువ నష్టం కలిగింది. కావున ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టపరిచి ప్రజల ప్రాణాలు తక్షణమే ప్రభుత్వం కాపాడాలి.

ముగింపు

కేంద్ర ప్రభుత్వ గణాంకాల ఆధారంగా ఫిబ్రవరి 1 నాటికి కేంద్ర గోదాముల్లో 7.5 కోట్ల టన్నుల ఆహార నిల్వలున్నాయి. ఈ నిల్వల్ని ఈ సంక్షోభ సమయాన సుప్రీంకోర్టు ఆదేశించినట్లు పేదల ఆకలి తీర్చడానికి వాడాలి. కేంద్ర ప్రభుత్వం పేదవారిని గుర్తించి దేశంలో ఎక్కడ ఉన్నా ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఆహార ధాన్యాలు పొందే విధానాన్ని రూపొందించాలి. ప్రజా పంపిణీ వ్యవస్థ, మధ్యాహ్న భోజన పథకం, మహిళా శిశు సంక్షేమం, ఉపాధి హామీ వంటి పథకాల్లోని లోపాలను సరిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లక్షిత ప్రజా పంపిణీ వ్యవస్థ, అంత్యోదయ అన్న యోజన, అన్నపూర్ణ వంటి పథకాలతో దారిద్ర్య రేఖ దిగువన ఉన్న వారందరికీ ఆహార ధాన్యాలను ఉచితంగా పంపిణీ చేయాలి. కరోనా విజృంభణతో విపత్కర పరిస్థితులు నెలకొన్న ఈ సమయంలో అనేక మంది వలస కార్మికులు, నిరుపేదలు తీవ్రమైన కష్టాలు ఎదుర్కొంటున్నారు. కనీసం ఊహించని ఉత్పాతాలు ఎదురైనప్పుడైన నిరుపేద ప్రజలు ఇక్కట్ల పాలు కాకుండా ఉండడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పక్కా ప్రణాళికను రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దేశంలో వ్యవసాయ ఉత్పత్తులను, ఆహార నిల్వలు పెంచడంతో సహా అవి అందరికీ అందుబాటులో ఉండేలా చూడాలి. ప్రతి వ్యక్తీ తన అవసరాలను తీర్చుకునేలా సురక్షిత పౌష్టికాహారాన్ని కొనుగోలు చేసే శక్తిని పెంచాలి. దానివల్ల మానవ వనరులు సంపూర్ణ అభివృద్ధి చెంది అంతిమంగా దేశం ముందడుగు వేస్తుంది.

ఈ విషమ పరిస్థితిలో ప్రభుత్వాలు ప్రజలకు తమ మద్దతును విధిగా కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వ సహకారం, ప్రోత్సాహంతో తగినంత ధాన్యాన్ని ఉత్పత్తి చేసి తిరిగి గోదాములకు సేకరించాలి. గోదాములలోని నిల్వలు ఇలాంటి విపత్కర పరిస్థిలోనే ప్రజలకు ఉపయోగించాలి. సంవత్సరాలుగా ధాన్యం గోదాముల్లో నిల్వ ఉండడంతో ఎలుకలు, చెదలు లాంటి క్రిముల వలన అధిక మొత్తం వృధా అవుతుంది. ఈ అసాధారణ పరిస్థితుల్లో నిల్వలను వినియోగించడం వలన క్షామ పరిస్థితులు మెరుగవుతాయి. ఈ ఆహార సంక్షోభం నుండి, తన వైఫల్యాల నుండి బయటపడాలంటే ప్రభుత్వం తిరిగి వ్యవసాయ ఉత్పత్తిని ప్రోత్సహంతో కొనసాగించాలి. అప్పుడు ప్రజలకు ఉపాధి దొరుకుతుంది. ఆర్థిక వ్యవస్థలోకి ఆదాయాల ప్రవాహం జరిగి ప్రజలకు కొనుగోలు శక్తి పెరుగుతుంది. ఈ విధంగా మార్కెట్లో డిమాండ్ను పునరుద్ధరించవచ్చు. ఫలితంగా ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవనానికి, సుస్థిరతకు దారులు వేయవచ్చు.

(రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలంగాణ విశ్వవిద్యాలయం) వీ

రైతుల ఆదాయాలు ఎందుకు పెరగడం లేదు?

కనీస మద్దతు ధరను నిర్ణయించడంలోని అశాస్త్రీయత, స్వామినాథన్ సిఫారసులను అమలు చేయకపోవడం వంటి కారణాల వల్ల రైతులు నష్టపోతున్నారని అంటున్నారు **కన్నెగంటి రవి, శేరుపల్లి రాజేష్**

నిజానికి, రాజ్యాంగ పరంగా వ్యవసాయ ఉత్పత్తి, విద్య, పరిశోధన, మార్కెట్లు, ధరలు రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని అంశాలు. కాని క్రమంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను హరిస్తూ, విధానాలను రూపొందిస్తున్నది. తమ హక్కుల రక్షణ కోసం పోరాడాల్సిన నిబద్ధతను, నిజాయితీని, ఆత్మగౌరవాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వాలు కోల్పోయాయి.

రాష్ట్ర ప్రభుత్వాల ఈ వైఖరి కారణంగా రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రెండు దెబ్బలను తామే కాచుకోవలసి వస్తున్నది. ముందే అసంఘటితంగా ఉన్న గ్రామీణ రైతులు, తమపై జరుగుతున్న దోపిడీని, దాడిని కనీసం అర్థం చేసుకోలేని స్థితిలో ఉన్నారు. ప్రతిఘటించడం అటుంచి మౌనంగా భరిస్తున్నారు, లేదా నిరాశా నిస్పృహలతో తమ ప్రాణాలనే తీసుకుంటున్నారు. ముఖ్యంగా గ్రామీణ వ్యవసాయదారులు, మరీ ముఖ్యంగా రైతుల పట్ల ప్రభుత్వాల ఈ వైఖరి, వివక్ష ఎలా కొనసాగుతుందో రైతులకు చూపించే ప్రయత్నమే ఈ వ్యాసం ఉద్దేశం.

రైతుల జీవితాలకు దూరంగా జరిగిపోయిన పట్టణ మధ్య తరగతి ప్రజలు, కేవలం అటవీ, గ్రామీణ, ఇతర వ్యవసాయ ఉత్పత్తుల వినియోగదారులుగా మారిపోయారు. అందుకే గ్రామీణ రైతుల, ఆదివాసీల బాధలు విన్నప్పుడు సానుభూతి వ్యక్తం చేయడం తప్ప, నిజంగా గ్రామీణ రైతులు ఎందుకు నష్ట పోతున్నారో అర్థం చేసుకోవడం లేదు. రైతులకు ఎందుకు, ఎక్కడ నష్టం జరుగుతుందో ఈ శ్రేణులకు అర్థం చేయించడం కూడా ఈ వ్యాసం ఉద్దేశం.

రైతు కుటుంబాల ఆదాయాల విషయంలో నివేదికలు ఏమి చెబుతున్నాయి?

2021 మార్చ్‌లో కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి తోమర్ లోక్ సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా, దేశంలో వ్యవసాయ కుటుంబాల తాజా ఆర్థిక స్థితి గతులపై ప్రభుత్వానికి అంచనా లేదని నిస్సిగ్గుగా ప్రకటించారు. 2013లో ఈ విషయంపై నేషనల్ శాంపిల్ సర్వే సంస్థ (ఎన్ఎస్ఎస్ఓ) అందించిన నివేదికలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని కూడా చెప్పారు.

సంఘటిత రంగ కార్మికుల, ఉద్యోగుల స్థితిగతులపై ఎప్పటికప్పుడు పిఆర్‌సి లు, వేజ్ బోర్డులు పనిచేస్తూ నివేదికలు ఇస్తుంటాయి. కానీ అసంఘటిత ప్రజల విషయంలో ప్రభుత్వాలకు అటువంటి పట్టింపు లేదు. 2022 నాటికి వ్యవసాయ కుటుంబాల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని కేంద్రం చెప్పుకుంటున్న సమయంలో తోమర్ లోక్‌సభలో ఈ విషయాన్ని ప్రకటించారని దృష్టిలో ఉంచుకోవాలి. మరి, ఏ గణాంకాల ప్రాతిపదికన రెట్టింపు చేస్తామన్నారో మనకు తెలవదు.

ఒకవేళ ఎన్ఎస్ఎస్ఓ డాటా ఆధారంగా రెట్టింపు చేస్తాం అంటే, 2013లో వ్యవసాయ కుటుంబాల ఆదాయం గురించి ఎన్ఎస్ఎస్ఓ ఏమి తేల్చిందో చూడాలి. ఆయా కుటుంబాలకు ఉన్న భూమి కమతం సైజును బట్టి, ఆయా కుటుంబాల ఆదాయాన్ని అంచనా వేశారు. వేతనాలు/కూలీ డబ్బుల ద్వారా, పంటల సాగు ద్వారా, పశు పోషణ ద్వారా, వ్యవసాయేతర వ్యాపారం ద్వారా ఎంత ఆదాయం వస్తుందో లెక్కించారు.

1. 0.01 హెక్టార్ల లోపు (ఒక గుంట భూమి - 2.5 సెంట్లు) ఉన్న కుటుంబాలకు కూలీ/వేతనంపై 63.6 శాతం ఆదాయం, పంటల సాగు పై 0.7 ఆదాయం, పశు పోషణపై 25.9 శాతం ఆదాయం, వ్యవసాయేతర వ్యాపారం పై 9.8 శాతం ఆదాయం పొందుతున్నారు. ఈ కుటుంబాల మొత్తం ఆదాయం నెలకు 4,561 రూపాయలు.

2. 0.01 నుండీ 0.4 హెక్టార్ల లోపు (ఎకరం లోపు) భూమి ఉన్న కుటుంబాలు కూలీ/వేతనం ద్వారా 57.5 శాతం, పంటల సాగు ద్వారా 16.5 శాతం, పశు పోషణ ద్వారా 15 శాతం, వ్యవసాయేతర వ్యాపారంపై 11.1 శాతం ఆదాయం పొందుతున్నారు. ఈ కుటుంబాల నెలసరి ఆదాయం 4,152 రూపాయలు.

3. 0.41 నుండీ నుండీ 1.0 హెక్టార్ల లోపు (రెండున్నర ఎకరాల లోపు) భూమి ఉన్న కుటుంబాలు కూలీ/వేతనం ద్వారా 38.3 శాతం, పంటల సాగు ద్వారా 40.9 శాతం, పశు పోషణ ద్వారా 12 శాతం, వ్యవసాయేతర వ్యాపారం పై 8.8 శాతం ఆదాయం పొందుతున్నారు. ఈ కుటుంబాల నెలసరి ఆదాయం 5247 రూపాయలు.

4. 1.01 నుండీ 2.0 హెక్టార్ల లోపు (ఐదు ఎకరాల లోపు) భూమి ఉన్న కుటుంబాలు కూలీ/వేతనం ద్వారా 23.5 శాతం, పంటల సాగు ద్వారా 57.3 శాతం, పశు పోషణ ద్వారా 11.1 శాతం, వ్యవసాయేతర వ్యాపారంపై 8.1 శాతం ఆదాయం పొందుతున్నారు. ఈ కుటుంబాల నెలసరి ఆదాయం 7348 రూపాయలు.

5. 2 నుండీ 4 హెక్టార్ల లోపు (భూమి ఉన్న కుటుంబాలు కూలీ/ వేతనం ద్వారా 15.4 శాతం, పంటల సాగు ద్వారా 68.6 శాతం, పశు పోషణ ద్వారా 10.8 శాతం, వ్యవసాయేతర వ్యాపారంపై

5.2 శాతం ఆదాయం పొందుతున్నారు. ఈ కుటుంబాల నెలసరి ఆదాయం 10, 730 రూపాయలు.

6. 4.01 నుండి 10 హెక్టార్ల లోపు (25 ఎకరాల లోపు) భూమి ఉన్న కుటుంబాలు కూలీ/వేతనం ద్వారా 10.3 శాతం, పంటల సాగు ద్వారా 77.6 శాతం, పశు పోషణ ద్వారా 7.6 శాతం, వ్యవసాయేతర వ్యాపారం పై 4.4 శాతం ఆదాయం పొందుతున్నారు. ఈ కుటుంబాల నెలసరి ఆదాయం 19,637 రూపాయలు.

7. 10 హెక్టార్ల పైన (ఇరవై ఐదు ఎకరాల పైన) భూమి ఉన్న కుటుంబాలు కూలీ/వేతనం ద్వారా 3.2 శాతం, పంటల సాగు ద్వారా 86.2 శాతం, పశు పోషణ ద్వారా 6.3 శాతం, వ్యవసాయేతర వ్యాపారం పై 4.3 శాతం ఆదాయం పొందుతున్నారు. ఈ కుటుంబాల నెలసరి ఆదాయం 41,388 రూపాయలు.

8. కమతాల సైజుతో నిమిత్తం లేకుండా అన్ని సైజుల కమతాల సగటు ఆదాయం కూలీ/వేతనం ద్వారా 32.2 శాతం, పంటల సాగు ద్వారా 47.9 శాతం, పశు పోషణ ద్వారా 11.9 శాతం, వ్యవసాయేతర వ్యాపారం పై 8 శాతం ఆదాయం పొందుతున్నారు. ఈ కుటుంబాల నెలసరి ఆదాయం 6426 రూపాయలు.

9. ఈ వివరాలను పరిశీలిస్తే సగటు కమతం 2 హెక్టార్లు (5 ఎకరాలు) లోపు ఉన్న 85 శాతం కుటుంబాల సగటు ఆదాయం నెలకు కేవలం 7348 రూపాయలు మాత్రమే. అందులో పంటల సాగు ద్వారా వస్తున్న ఆదాయం 57.3 శాతం మాత్రమే. అంటే సుమారుగా 4000 రూపాయలన్నమాట.

10. అంటే కేంద్ర ప్రభుత్వం "రెట్టింపు ఆదాయం" గురించి ఎంత మాట్లాడినా, ప్రభుత్వ అంచనాల ప్రకారం 2022 నాటికి పంటల మార్కెట్ ద్వారా రైతులకు అందేది కేవలం నెలకు 8000 రూపాయలు సగటు ఆదాయం మాత్రమే. మిగిలిన అన్ని రూపాలలో ఆదాయాలు కూడా అదే నిష్పత్తిలో పెరిగినా చిన్న కారు రైతుల ఆదాయం చేరేది 14,696 రూపాయలకు మాత్రమే.

11. దీనినిబట్టి పంటలసాగులో పెద్ద ఆదాయాలు లేవనీ, ఈ కుటుంబాలు ఇతర జీవనోపాధులను మెరుగు పరుచుకోకపోతే బతకడం కష్టమనీ అర్థం అవుతోంది కదా

12. పంటల సాగులో రైతులకు ఇంత తక్కువ ఆదాయాలు ఉండడానికి కారణాలు ఏమిటో పరిశీలించాలి. ఆచరణలో రైతు కుటుంబాల ఆదాయం రెట్టింపు అయ్యేలా ప్రభుత్వాల చర్యలు ఉన్నాయా లేదా అన్నది కూడా పరిశీలించాలి. రైతు కుటుంబాల ఆదాయం పెరుగు దలకు ఉన్న ముఖ్యమైన మార్గం రైతుల పంటలకు లాభసాటి ధరలు అందడం, పంటల ఉత్పత్తి ఖర్చులు తగ్గేలా ప్రభుత్వాల చర్యలతో పాటు, విభిన్న సబ్సిడీ పథకాలు అమలు కావడం.

13. 2014 నుండి 2021 వరకూ ఏడేళ్ల పాటు రైతుల పంటలకు కనీస మద్దతు ధరలు పెరిగిన తీరును పరిశీలిస్తే, రైతు కుటుంబాల నికర ఆదాయాలు ఎందుకు పెరగడం లేదో అర్థమైపోతుంది.

శాస్త్రీయత లేని కనీస మద్దతు ధరల (ఎంఎస్‌పి) నిర్ణయాలు:

1. సాగు నీరు అందుబాటులో ఉన్నప్పుడు సాధారణంగా తెలంగాణ రైతులు వరి, పత్తి పంటలనే సాగు చేస్తున్నారు. మిగిలిన పంటలతో పోల్చినప్పుడు సగటు దిగుబడులు ఎక్కువ ఉండడం, మార్కెట్ వ్యవస్థ ఏర్పడి ఉండడం, ప్రభుత్వం కూడా సేకరణలో ఉండడం వల్ల రైతులు ఈ రెండు పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. కానీ నిజంగా ఈ పంటల సాగులో రైతు కుటుంబానికి నికర ఆదాయం ఎంత ఉంటున్నది?

2. 85 శాతం సన్న, చిన్నకారు రైతు కుటుంబాలు అయినప్పుడు (5 ఎకరాల లోపు) వరి సేద్యం మొత్తం ఆదాయంలో ఖర్చులు పోను రైతులకు నికర మిగులు ఎంత ఉంటున్నది చూడాలంటే కేంద్ర వ్యవసాయ శాఖకు అనుబంధంగా పని చేసే వ్యవసాయ ఉత్పత్తుల ఖర్చుల, ధరల నిర్ణాయక కమిషన్ 2021-2022 సంవత్సరానికిగాను 2021 జూన్ మొదటి వారంలో విడుదల చేసిన రిపోర్ట్ ను పరిశీలిస్తే స్పష్టత వస్తుంది.

కనీస మద్దతు ధరలు ఎలా నిర్ణయిస్తారు?

3. దేశ వ్యాపితంగా వివిధ రాష్ట్రాలలో 2017-2018, 2018-2019, 2019-2020 సంవత్సరాలలో పంటల ఉత్పత్తి ఖర్చులను సేకరించే శాఖ, ఆ గణాంకాల ఆధారంగా ఒక హెక్టారుకు మూడు సంవత్సరాల సగటు ఖర్చులను అంచనా వేస్తుంది. హెక్టారుకు సగటు దిగుబడులను కూడా అంచనా వేస్తుంది. వాటి ఆధారంగా కనీస మద్దతు ధరలను నిర్ణయించడానికి ఒక సూత్రాన్ని పాటిస్తుంది. రైతు నేరుగా చెల్లించే ఖర్చుల (ఏ 2) కు, కుటుంబ సభ్యుల శ్రమ (ఫామిలీ లేబర్) కొంత విలువను జోడించి పంట సాగు ఖర్చును నిర్ణయిస్తుంది. దానికి కొంత మొత్తాన్ని కలిపి కనీస మద్దతు ధర సిఫారసు చేస్తుంది. దానిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం కనీస మద్దతు ధరలను ప్రకటిస్తుంది. కారణం ఏదైనా, తెలంగాణ వ్యవసాయ శాఖ సిఏసిపి సంస్థకు 2017-18, 2018-2019 సంవత్సరాల ఉత్పత్తి ఖర్చు లెక్కలనే అంద చేసింది. వాస్తవానికి 2019-2020 సంవత్సరంలో ఉత్పత్తి ఖర్చులు గణనీయంగా పెరిగాయి. కానీ ఆవివరాలు సిఏసిపి ముందు లేవు (సిఏసిపి 2021-2022 ఖరీఫ్ నివేదిక).

4. జాతీయ రైతు కమిషన్ ఛైర్మన్ డాక్టర్ ఎమ్మెస్ స్వామినాథన్ లోతైన అధ్యయనం తర్వాత ఇచ్చిన సిఫారసులలో పంటలకు మద్దతు ధర నిర్ణయించేందుకు ఒక సూత్రాన్ని ప్రతిపాదించారు. దీనిని సి2+ 50 శాతం అంటారు. అంటే సమగ్ర ఉత్పత్తి ఖర్చు కు (ఏ 2 లో మినహాయించిన ఖర్చులను, విలువలను కూడా కలిపి) దానికి 50 శాతం అదనంగా జోడించి కనీస మద్దతు ధరలను నిర్ణయించాలని ఆయన సూచన.

5. ఈ సిఫారసు ప్రకారమే మద్దతు ధరలను చెల్లిస్తామని 2014లో బిజెపి పార్టీ తన ఎన్నికల మానిఫెస్టో లో హామీ ఇచ్చింది. అప్పటివరకూ ఈ సిఫారసు ప్రకారం రైతులకు మద్దతు ధరలు చెల్లించనందుకు కాంగ్రెస్ పార్టీని విమర్శించింది కూడా. కానీ ఎన్నికలై పోయాక ఎన్‌డిఏ ప్రభుత్వం కూడా ఈ సిఫారసును అమలు చేయకుండా పాత పద్ధతిలోనే

(ఏ2 + ఎఫ్ఎల్ + కొంత శాతం లాభం) కనీస మద్దతు ధరలను నిర్ణయిస్తూ వస్తున్నది.

రైతు ఉద్యమం ఏమి కోరుకుంటున్నది?

6. రైతు సంఘాలు ప్రభుత్వాల ఈ వైఖరిని సంవత్సరాలుగా తీవ్రంగా విమర్శిస్తున్నాయి. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం సమగ్ర ఉత్పత్తి ఖర్చుకు, 50 శాతం కలిపి కనీస మద్దతు ధరలను నిర్ణయించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించి, ఆ ధరలు అందరికీ లభించేలా చూడాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. గత మూడు సంవత్సరాలుగా, మరీ ముఖ్యంగా గత 6 నెలలుగా ఢిల్లీ కేంద్రంగా జరుగుతున్న రైతు ఉద్యమం మూడు చట్టాల రద్దుతో పాటు, దీనినే ప్రధాన డిమాండ్‌గా నినదిస్తున్నది. ఈ సిఫారసు అమలు కాకపోవడం వల్ల రైతులు ప్రతి సంవత్సరం ఎన్ని వేల కోట్లు నష్ట పోతున్నారో కూడా రైతు ఉద్యమం ప్రభుత్వం ముందు, సమాజం ముందు ఉంచింది.

7. కానీ ఈ విమర్శలను, రైతుల ఆందోళనలను ఏ మాత్రం పట్టించుకోకుండా, 2021-2022 సంవత్సరానికి కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధరలను చూస్తే, ఈ ప్రభుత్వాలకు రైతుల పట్ల, వారి జీవితాల పట్ల ఎంత నిర్లక్ష్యం ఉందో స్పష్టమవుతుంది. కార్పొరేట్ కంపెనీలకు రైతులను బలి చేయడానికే, ఎంఎస్‌పి విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇలా వ్యవహరిస్తున్నది. తాను సేకరించే కొన్ని పంటలకు మాత్రమే ఎంఎస్‌పి అందిస్తూ, మిగిలిన పంటలను అనివార్యంగా రైతులు తక్కువ ధరలకే అమ్ముకునేలా ప్రభుత్వం చేస్తున్నది.

వరి పంట ఉత్పత్తి ఖర్చు ఆధారంగా 2021 కనీస మద్దతు ధరల పరిశీలన:

అంఅఖ నివేదికలో వరి పంట సమగ్ర ఉత్పత్తి ఖర్చు (సి 2) జాతీయ సగటు క్వింటాలుకు 1,839 రూపాయలుగా ప్రకటించారు. వరి పంట సాగు ఖర్చు (ఏ 2) 1,078 రూపాయలుగా, కుటుంబ సభ్యుల శ్రమ విలువ క్వింటాలుకు 241 రూపాయలుగా, మొత్తం (ఏ 2+ ఎఫ్ఎల్) 1,319 రూపాయలుగా నిర్ణయించారు. దీనికి మరో 641 రూపాయలు లాభం కలిపి ఏ- గ్రేడ్ వరి ధాన్యానికి ఎంఎస్‌పి 1,960 రూపాయలుగా నిర్ణయించారు. సాధారణ వరి ధాన్యానికి 1940 రూపాయలుగా నిర్ణయించారు. వాస్తవానికి అన్ని పంటలకు ఏ 2 + ఎఫ్ఎల్ పై 50 శాతం కలుపుతున్నామని కేంద్రం చెప్పుకుంటున్నప్పటికీ, వరి ధాన్యానికి అంత కూడా కలపలేదు. మరో 18 రూపాయలు తక్కువే కలిపారు.

1. వరి సేద్యానికి తెలంగాణలో సమగ్ర ఉత్పత్తి ఖర్చు (సి 2) క్వింటాలుకు 2738 రూపాయలు అవుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ సిఏసిపి కోసం నివేదిక పంపింది. సిఏసిపి నివేదిక ప్రకారం తెలంగాణలో సమగ్ర ఉత్పత్తి ఖర్చు1,698.50 రూపాయలు. ఏ 2 : క్వింటాలుకు 987 రూపాయలుగా, ఏ 2 + ఎఫ్ఎల్ : క్వింటాలుకు 1,178 రూపాయలుగా ప్రకటించింది. అంటే జాతీయ సగటు కంటే తెలంగాణలో చాలా తక్కువ ఖర్చు సిఏసిపి చూపిస్తున్నదని అర్థం.

2. సిఏసిపి సంస్థ తెలంగాణలో ఎకరానికి 2,049.20 కిలోల సగటు ధాన్యం దిగుబడి వస్తుందని ప్రకటించింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ అంచనా ఎకరానికి 2,040 కిలోలు.

3. సిఏసిపి ప్రకటించిన కనీస మద్దతు ధరల ప్రకారం ఒక ఎకరం వరి రైతుకు నికరంగా ఎంత మిగులుతుంది? సిఏసిపి అంచనా ప్రకారం సాగు ఖర్చు (ఏ 2 +ఎఫ్ఎల్) 1319 రూపాయలు. ప్రకటించిన కనీస మద్దతు ధర 1960 రూపాయలు. నికర మిగులు క్వింటాలుకు 641 రూపాయలు. అంటే ఎకరానికి 12, 820 రూపాయలు. అదే సిఏసిపి ప్రకటించిన సమగ్ర ఉత్పత్తి ఖర్చు సి 2 ప్రకారం లెక్క వేస్తే (1960 ? 1698) క్వింటాలుకు మిగిలేది 262 రూపాయలు. అంటే ఎకరానికి 20 క్వింటాల్లు పండితే నికరంగా మిగిలేది 5240 రూపాయలు. అంటే 5 నెలల పంట కాలానికి ఒక ఎకరం రైతుకు మిగిలే నికర ఆదాయం ఇదన్నమాట. అంటే నెలకు 1000 రూపాయలు. ఈ వెయ్యి రూపాయల కోసం వరి రైతు ఇంత కష్టపడి పంట పండించాలి? ఇంత కష్టపడి మార్కెట్ చేసుకోవాలి? అర్థం అవుతుందా ప్రభుత్వానికీ, సమాజానికీ? ఒకవేళ రైతు కనీస మద్దతు ధరకు కాకుండా, తక్కువ ధరకే వ్యాపారులకు అమ్ముకుంటే, మొత్తంగా మిగిలేది నష్టమే.

4. కేంద్ర ప్రభుత్వం స్వామినాథన్ సిఫారసుల ప్రకారం కనీస మద్దతు ధరలను ప్రకటిస్తే క్వింటాలుకు 2,547 రూపాయలు కనీస మద్దతు ధరగా ప్రకటించి ఉండాల్సింది. కానీ అలా ప్రకటించకుండా క్వింటాలుకు 1,960 రూపాయలుగా ప్రకటించింది. దాని వల్ల ప్రతి క్వింటాలు పై రైతుకు 587 రూపాయల నష్టం వాటిల్లు తున్నది. అంటే ఎకరానికి సగటున 20 క్వింటాళ్ల లెక్కన చూసినా ఎకరానికి రైతుకు 11,740 రూపాయలు నష్టం వస్తుంది. ఈ లెక్క ప్రకారం సన్నకారు రైతులు (2.5 ఎకరాలు) 29,350 రూపాయలు నష్ట పోతున్నారు. చిన్న కారు రైతులు (5 ఎకరాలు) 58,700 రూపాయలు నష్టపోతున్నారు.

5. రాష్ట్రంలో రెండు సీజన్లలో రైతులు ఒక కోటి ఎకరాలలో వరి సాగు చేస్తే రైతులు స్వామినాథన్ కమిషన్ ప్రకారం మద్దతు ధరలు అందక నష్టపోయేది సంవత్సరానికి 11,740 కోట్ల రూపాయలు.

6. రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలుకు సమగ్ర ఉత్పత్తి ఖర్చు (సి 2) 2,738 రూపాయలుగా అంచనా వేసింది. దీని ప్రకారం స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం కనీస మద్దతు ధర క్వింటాలుకు 4,107 రూపాయలుగా నిర్ణయించాలని కూడా కేంద్రానికి ఉత్తరం రాసింది. అయితే కేంద్రం ఈ లేఖను బుట్ట దాఖలా చేసి తాను అనుకున్న పద్ధతిలోనే కనీస మద్దతు ధరలను ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా లేఖ రాసి చేతులు దులుపుకుని, మౌనంగా ఉంటున్నది. తానే చెబుతున్నట్లుగా ఉత్పత్తి ఖర్చులు ఎక్కువై రైతులు నష్టపోతున్నారు. ఈ నష్టం కూడా చాలా ఎక్కువ. రాష్ట్ర సమగ్ర ఉత్పత్తి ఖర్చులను, మద్దతు ధరలతో పోల్చినప్పుడు ప్రతి క్వింటాలుపై వరి రైతుకు 778 రూపాయలు నష్టం వస్తుంది. అంటే ఎకరానికి 20 క్వింటాళ్ల లెక్కన చూసినా మొత్తం నష్టం 15,560 రూపాయలు. సన్నకారు రైతు 38,900 రూపాయలు, చిన్నకారు రైతు 77,800 రూపాయలు నికరంగా నష్ట పోతున్నారు.

(మిగతా వచ్చే సంచికలో...)

(రచయితలు రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు, పరిశోధక విద్యార్థి)

ఆరోగ్య హక్కు పన్నులు కట్టే వారికేనా?

సిద్దిఖ్ కప్పన్ అనారోగ్య బెయిల్ వాదనలలో కూడ ప్రభుత్వ వైఖరి ఎంత దుర్మార్గంగా ఉన్నదో వివరిస్తున్నారు

వి. జనార్దన్

కేరళ జర్నలిస్టు సిద్దిఖ్ కప్పన్‌ను ఏప్రిల్ 30న ఢిల్లీలోని ఆల్ ఇండియా మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌కు మార్చారు. ఆయన ప్రస్తుతం 2020 అక్టోబర్ నుంచి యుఎపిఎ చట్టం కింద ఉత్తర ప్రదేశ్‌లోని మధుర జిల్లా జైల్లో ఉన్నారు. తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. కొన్ని రోజుల క్రితం జైల్లోని సెల్‌లో బాత్రూంలో పడి స్పృహ కోల్పోతే మధుర కె.ఎం. మెడికల్ వైద్య శాలకు మార్చారు. అక్కడ జరిపిన పరీక్షల్లో ఆయనకు కొవిడ్-19 పాజిటివ్ అని తేలింది. దానిపై ఆయన భార్య నేరుగా సుప్రీంకోర్టులో ఆయన ఆరోగ్యం విషమంగా ఉందని అందుకని ఢిల్లీలోని ఎయిమ్స్‌కు గాని, రామ్ మనోహర్ లోహియ ఆసుపత్రికి గాని మార్చి చికిత్స చేయించాలని పిటీషన్ వేసింది. అంతకు ముందే కేరళ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ ఆయనను ఉత్తర ప్రదేశ్ ఎన్ఐఎ యుఎపిఎ కింద అరెస్ట్ చేయడం అక్రమమని, ఆయనపై కేసు క్వాష్ చేయాలని లేదా ఆయనను బెయిల్‌పై విడుదల చేయాలని రిట్ పిటీషన్ వేశారు. ఏప్రిల్ 27వ తేదీన రెండు పిటీషన్లు కూడా చీఫ్ జస్టిస్ రమణ ముగ్గురు జడ్జీలతో కూడిన బెంచ్ ముందుకు విచారణకు వచ్చాయి. తాజాగా ఆయనకు కొవిడ్-19 పాజిటివ్ వచ్చిందని తెలిసి కేరళ నుంచి 11 మంది ఎంపిలు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఆయనను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తూ లేఖ రాశారు. ప్రధాన న్యాయమూర్తి సిద్దిఖ్ కప్పన్ భార్య పిటీషన్‌ను మాత్రమే విచారణకు స్వీకరించి ఆయనను ఎయిమ్స్‌కు గాని, లోహియా ఆసుపత్రికి గాని, ఢిల్లీలో మరేదైనా ప్రభుత్వ ఆసుపత్రికి గాని తరలించి చికిత్స చేయించి స్వస్థత చేకూరాక మళ్లీ జైలుకు తరలించవచ్చునని ఉత్తర్వులు ఏప్రిల్ 28న ఇచ్చారు. ఆ మేరకు మధుర జైలు అధికారులు ఆయనను ఎయిమ్స్‌కు ఏప్రిల్ 30న తరలించారు.

ఇంతకి ఈ సిద్దిఖ్ కప్పన్ ఎవరు? ఆయన ఉత్తర ప్రదేశ్‌కు ఎందుకు పోయాడు? యుపి ప్రభుత్వం ఎన్ఐఎ యుఎపిఎ కింద ఆయనను ఎందుకు అరెస్ట్ చేసింది? దేశంలో ఏ పౌరుడైనా దేశమంతటా ఎక్కడైనా తిరగడానికి స్వేచ్ఛ ప్రాథమిక హక్కు అయినప్పుడు యుపిలో కేరళ జర్నలిస్టు ప్రవేశించగానే ఎన్ఐఎ వంటి కుఖ్యాతి వహించిన సంస్థ అంతకన్నా అప్రజాస్వామికమైన యుఎపిఎ కింద ఎందుకు అరెస్ట్ చేసినట్లు? ఆరు నెలలైనా బెయిల్ కూడా లేకుండా మధురలోని ఒక జిల్లా జైలులో ఏ వసతులు లేని చోట ఎందుకు అమానుషంగా బంధించినట్లు? ఎన్నో వ్యాధులతో బాధపడుతూ కరోనా సోకిన తన భర్తను ఆసుపత్రి జైలు వార్డులో మంచానికి గొలుసులతో కట్టేశారని ఆయన భార్య తన పిటీషన్‌లో పేర్కొన్నది.

ఉత్తర ప్రదేశ్‌లోని హత్రాస్‌లో ఒక దళిత యువతిపై ఆ గ్రామంలోని అగ్ర వర్ణాల యువకులు సామూహిక అత్యాచారం జరిపి పోలీసుల కాపలాలో కుటుంబానికి తెలియకుండా కిరోసిన్ పోసి అర్ధరాత్రి తగులబెట్టిన వార్త, ఆ రిపోర్టు రాయడానికే వెళ్లినందువల్ల ఇప్పటికే తగినంతగా మీడియాలో, సోషల్ మీడియాలో ప్రచారమైంది గనుక మళ్లీ ఆ వివరాలలోకి వెళ్లనక్కర లేదు.

ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి గోరఖ్‌పూర్‌లోని ఒక పీఠాధిపతిగా తన పేరు యోగి ఆధిత్యనాథ్‌గా ప్రకటించుకున్నాడు. గోరఖ్‌పూర్‌లోని ఆ పీఠాన్ని సందర్శించుకోవడానికైనా, కుంభమేళాలో మునగడానికైనా దేశమే కాదు, ప్రపంచంలోని ఏ భక్తుడైనా స్వేచ్ఛగా వెళ్లవచ్చు. కాని దేశాన్ని, మానవీయ సమాజాన్ని కుదిపేసిన హత్రాస్ దళిత యువతి సామూహిక అత్యాచార, హత్యా ఘటన, అమానవీయంగా చట్ట విరుద్ధంగా పోలీసులే దహనం చేయించిన ఘటన గురించి రాయడానికి మాత్రం దేశంలోనే ఢిల్లీ నుంచి ఒక కేరళ జర్నలిస్టు పోవడానికి వీల్లేదు. ఆ తర్వాత కేరళలో ఎన్నికల ప్రచారానికి దేశ ప్రధాని, హోం మంత్రి సరేసరి. యుపి ముఖ్యమంత్రి యోగి ఆధిత్యనాథ్ కూడా వెళ్లి మత విద్వేషాలు రగిలించవచ్చు. ఆయననైనా మోడీ అమిత్‌షాలైనా అందుకే వెళతారు.

సుప్రీంకోర్టు కప్పన్ భార్య పిటీషన్ మాత్రమే స్వీకరించి ఢిల్లీలోని ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించడానికే పరిమితమై కూడా వెంటనే చేపట్టకుండా మధుర జైలు నుంచి, ఆసుపత్రి నుంచి అతని ఆరోగ్య రిపోర్టులు కూడా తెప్పించుకున్నది. అప్పుడు గాని విచారణ చేపట్టలేదు. ఆ విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా యుపి ప్రభుత్వం తరపున వాదించిన తీరు ప్రజల ప్రాథమిక హక్కుల పట్ల, వాటిలోని జీవించే హక్కులో భాగమైన ఆరోగ్యం పట్ల తీసుకున్న వైఖరి ఎంత దారుణంగా ఉందో చూడండి.

సిద్దిఖ్ కప్పన్ 2018లోనే ఆగిపోయిన తేజస్ పత్రిక విలేఖరి అని ఆయన ఐడెంటిటీ కార్డులో ఉందని, కనుక ఆయన జర్నలిస్టే కాదని చెప్పడానికి ప్రయత్నించాడు. అయినా ఆయన కోసం కేరళ వర్కింగ్ జర్నలిస్టులు వేసిన పిటీషన్‌ను అంత ప్రాముఖ్యత ఇచ్చి చేపట్టాలా అని ప్రశ్నించాడు. అందుకు ప్రధాన న్యాయమూర్తి ఇప్పుడు తాను ఆయన భార్య పిటీషన్‌ను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నానని, అండర్ ట్రయల్స్‌కు కూడా అన్ని ప్రాథమిక హక్కులు, అందులో జీవించే హక్కులో భాగమైన ఆరోగ్య హక్కు ఇమిడి ఉన్నదని చెప్పాడు. కప్పన్ నిషేధిత సంస్థ అయిన పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా సభ్యుడు అన్నాడు సొలిసిటర్ జనరల్. అది ఢిల్లీలో నిషేధింపబడిందా అని అన్నాడు ప్రధాన న్యాయమూర్తి. కేంద్ర ప్రభుత్వం దాన్ని నిషేధించే ఆలోచనలో ఉన్నదని సొలిసిటర్ జనరల్ జవాబిచ్చాడు. నిషేధింపబడిన సంస్థ పైనా చట్టరీత్యా ఉరిశిక్ష పడినా, ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఉరితీస్తారు కదా. పరిపూర్ణ ఆరోగ్యం ఉన్నప్పుడే చట్టరీత్యా విధించిన ఉరిశిక్ష కూడా అమలవుతుంది కదా. ఉరిశిక్ష

పడిన వ్యక్తి జైలు నుంచి తప్పించుకొని పారిపోతుండగా పోలీసులు కాలికి కాల్పులు జరిపి పట్టుకొని ఆసుపత్రిలో విఐపి చికిత్స చేయించి ఆరోగ్యం చేకూరినాకనే ఉరితీసిన ఉదంతాన్ని చట్టాలను వెక్కిరించడానికి రావిశాస్త్రి ఒక కథగా రాశారు కదా. అన్నింటికన్నా మించి అండర్ ట్రయల్ అయినా, శిక్షపడిన వారైనా జైలులో ఉన్నంత కాలం ఆ ఖైదీకి జీవించే హక్కు హరించబడుతుందా? అండర్ ట్రయల్‌కే కాదు శిక్షపడిన వారికి కూడా ఆరోగ్య హక్కు జైలులో ప్రాథమిక హక్కు కాకుండా పోతుందా? జైలులో ఉంచిన ఆవరణ దాటి స్వేచ్ఛగా తిరిగే హక్కు (రైట్ టు మొబిలిటి) తప్ప ఏ ప్రాథమిక హక్కు రద్దుకాదు కదా. నిషేధింపబడిన సంస్థ సభ్యుడు లేదా సొలిసిటర్ జనరల్ దృష్టిలో, కేంద్ర ప్రభుత్వం దృష్టిలో నిషేధించవలసిన సంస్థ సభ్యుడు అయితే మానవ సమాజానికి, దేశానికి నిషిద్ధుడన్నమాట. అతని ప్రాణానికి ఏ విలువ లేదన్నమాట.

సొలిసిటర్ జనరల్ అంతకన్నా విచిత్రమైన వాదన మరొకటి చేశారు. అదేమంటే నిజాయితీపరులైన ట్యాక్స్ పేయర్స్ అందరూ ఎంత తీవ్ర వ్యాధులకైనా యుపిలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నారు కదా, ఈ నిషిద్ధ సంస్థ సభ్యునికి యుఎపిఎ కింద ఎన్ఐఎ అరెస్ట్ చేసిన వ్యక్తికి ఇంత ప్రత్యేక సౌకర్యాలు కావలసి వచ్చాయా అని అడిగాడు. ఇది చాల ఆశ్చర్యకరమైన, అసంబద్ధమైన వాదన.

మెడికల్ జూరిస్ ప్రుడెన్స్ (వైద్య న్యాయ తత్వశాస్త్రం) ఏం చెప్తుందంటే గాయపడి గాని, వ్యాధితో గాని ఆసుపత్రుకి వచ్చిన ఏ వ్యక్తికి, చివరకు మనిషే కానక్కరలేదు, ఏ ప్రాణికి అయినా చికిత్స చేయడమే వైద్యుడి విధి, ధర్మం. ఆ వ్యక్తుల నిజాయితీలో వాళ్లు కట్టే పన్నుల స్థాయి, నిర్దోషులా, నేరస్థులా అన్నవి వైద్య పరిఘణనలోకి రావు.

గాయం, వ్యాధి మాత్రమే ప్రమాణం కాని నిజాయితీ, నిర్దోషిత్వం ప్రమాణం కాదు. ఆసుపత్రులు ఇక నుంచి ఆధార్ కార్డు వలె ఇన్‌కమ్ ట్యాక్స్ ప్యాన్ కార్డు అడగాల్సి ఉంటుందని సొలిసిటర్ జనరల్ సూచిస్తున్నాడు. అయినా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కోట్లాది మంది వ్యవసాయ కూలీలు, కాంట్రాక్టు లేబర్, వలస కూలీలు, ఇంకెందరో ఆదాయపు పన్ను పరిధిలోకి రారు. వాళ్లు పన్ను చెల్లించనక్కరలేని నిజాయితీ పరులు. పన్నులు మాత్రమే కాదు అప్పులు కూడా వేల వేల కోట్లు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన వాళ్లు, మాఫి చేయించుకున్న వాళ్లు, తప్పుడు లెక్కలు చూపిన వాళ్లు ఎవ్వరూ బహుశా ఈ సొలిసిటర్ జనరల్ దృష్టికి వచ్చి ఉండరు. ఎందుకంటే వాళ్లెవరూ యుపిలోనే కాదు ఢిల్లీలో కూడా ఎయిమ్స్ వంటి ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోరు. వాళ్లకు సొంతంగా ఆసుపత్రులే ఉంటాయి. లేదా వాళ్లు ఈ దేశంలోనో, విదేశాల్లోనో నక్షత్రాల ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుంటారు. ప్రభుత్వంలో ఉన్న రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు ప్రజల దృష్టికి రావడానికి చేనేత వస్త్రాలు, ఖాదీ ధరించినట్లుగా (కాషాయం వచ్చాక యోగి ఆధిత్యనాథ్ వంటి వాళ్లకు ఇప్పుడు ఆ నియమం కూడా లేదు) ప్రధాని మొదలు కొందరు అధికారులు ఎయిమ్స్‌లో వాక్సిన్ వేయించుకోవడం వంటివి చేయవచ్చు కాని, మధ్యతరగతికి, దిగువ మధ్యతరగతికి కూడా 'రానుర కొడుకో సర్కారు దవాఖానకు' అనే పరిస్థితికి ప్రైవేట్ రంగంలో ఆరోగ్య వైద్య రంగాలను ప్రోత్సహించి ప్రభుత్వమే ప్రజల్ని నెట్టింది.

సామాన్యులకు లేని ప్రత్యేక సౌకర్యం ఈ ఖైదీకా అని కాకుండా ట్యాక్స్ పేయర్స్‌కు లేని ప్రివిలేజ్ అని సొలిసిటర్ జనరల్ అడగడం కేంద్ర ప్రభుత్వం చూపుకు నిదర్శనం. అలగా జనం కాదు. ఆధార్ కార్డు ఉన్నవాళ్లు కూడా ప్యాన్ కార్డు ఉన్నవాళ్లు మాత్రమే ఆర్యులని వాళ్లు కూడా భిన్నాభిప్రాయాలు కలిగినవారు కాకూడదని స్పష్టమవుతున్నది.

అయితే ఇటువంటి వాదనలు కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ మొదటి సారే చేశాడని కాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరపున వాదించే ప్రాసిక్యూషన్ లేదా సొలిసిటర్, అడ్వకేట్ జనరల్ అంతా ఇదే ధోరణిలో మాట్లాడాల్సి ఉంటుంది. ముఖ్యంగా వ్యక్తులకు, ప్రజలకు ఉండే వాక్‌సభా స్వాతంత్ర్యాల గురించి చర్చ సుప్రీంకోర్టులో, హైకోర్టులో ఆర్టికల్ 32, ఆర్టికల్ 2226, ఆర్టికల్ 19లను ప్రస్థావిస్తూ వచ్చినప్పుడు ఇట్లా అడ్డంగా కొందరికి ఈ హక్కులు లేవని చెప్పడానికి ప్రభుత్వాలు ఈ వైఖరి తీసుకుంటున్నాయి. సిద్దిఖ్ కప్పన్ – ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ నిర్బంధ వైఖరి సందర్భం కనుక కప్పన్ విషయంలోనే కాదు సామాజిక మాధ్యమాల మీద చిన్న వ్యాఖ్య చేసినా కూడా కేసులు పెట్టి ప్రాసిక్యూర్ చేస్తామనే ప్రకటనలు ముఖ్యమంత్రి చేశాడు. సువో మోటోగా సుప్రీంకోర్టు కొవిడ్ – 19 గురించి పిఐఎల్ మీద చేసిన సూచనల్లో అన్ని రాష్ట్రాల డిజిపీలకు అంటే ప్రభుత్వాలకు ఈ వైఖరి సరైంది కాదని సుప్రీంకోర్టు చెప్పాల్సి వచ్చింది. సామాజిక మాధ్యమాల్లో భిన్నమైన అభిప్రాయం ప్రకటించినంత మాత్రాన కేసులు పెట్టి బెదిరించి నిర్బంధించనక్కరలేదని, కొవిడ్-19 సందర్భంగా పిట్టల్లా రాలిపోతున్న సందర్భంలో తమ మనోభావాలను వ్యక్తం చేయడానికి ఎదో ఒక వేదికను ఎంచుకోవడం నేరం కాదని జస్టిస్ చంద్రచూడ్ బెంచి సూచించింది. అటువంటి చర్యలేవైనా తమ దృష్టికి వస్తే తాము చర్య తీసుకోవాల్సి ఉంటుందని కూడా చెప్పింది. ముఖ్యంగా ప్రభుత్వం వలెనే ఆలోచించని వారందరూ ప్రభుత్వానికే కాదు జాతికి, దేశానికి శత్రువులని కనుక వాళ్లు అన్ని హక్కులు కోల్పోతారని, భారత పౌరులుగా వాళ్లు రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులను పరిరక్షించమని న్యాయస్థానాలను ఆశ్రయించే హక్కు వాళ్లకు లేదనే వైఖరిని కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్నది. ఈ ధోరణి ఇందిరా గాంధి ఎమర్జెన్సీ ప్రకటించిన కాలం నుంచి ఏదో రూపంలో కొనసాగుతున్నది. ఎమర్జెన్సీ చట్టబద్ధంగానే పార్లమెంట్‌లో శాసనం ద్వారానే జీవించే హక్కు తప్ప వాక్‌సభా విశ్వాస హక్కులను రద్దుచేసి తాను నిర్బంధించిన డిటెన్యూను కోర్టుకు కూడా పోవడానికి వీలులేని అధికారాన్ని కైవసం చేసుకున్నది. చివరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎమర్జెన్సీలో జీవించే హక్కు కూడా రద్దువుతుందా అని అడిగితే అటార్నీ జనరల్ మొదట అవునని ఆ తర్వాత ఆ మాట వెనక్కి తీసుకున్నాడు. 1951 ఎ.కె. గోపాలన్ అరెస్టు కాలం నుంచి అమలవుతున్న ప్రివెంటివ్ డిటెన్షన్ మీసా మొదలుకొని వేరు వేరు రూపాల్లో అమలవుతున్నది. ఇంకా టాడా, పోటాల కాలం నుంచి ఆరోపణలను రుజువు చేసే బాధ్యత ఇన్వెస్టిగేటింగ్ ఏజెన్సీ, ప్రాసిక్యూషన్ మీద కాకుండా ముద్దాయిల మీద ఉండడం సహజ న్యాయానికి విరుద్ధమని పోరాటాలు జరిగి వెనక్కి తీసుకున్నాక ఇప్పుడు సిఆర్‌పిసికే 1967లో చేసిన సవరణ ప్రకారం అప్రజాస్వామికమైన యుఎపిఎ తెచ్చి ఆరోపణలే నేరమైనట్లు ముందస్తు బెయిల్ లేకుండా చేయడమే కాకుండా విచారణ దాకా కూడా బెయిల్ ఇవ్వని స్థితిని కల్పించింది. ముఖ్యంగా ఈ అప్రజాస్వామిక చట్టాన్ని అన్ని రాష్ట్రాలు, కేంద్రం అసమ్మతి తెలిపే వాళ్ల మీద హక్కుల కార్యకర్తల మీద ప్రయోగిస్తున్నాయనడానికి సిద్దిఖ్ కప్పన్ కేసు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్న దాఖలా. అంతకన్నా తీవ్రమైంది భీమా కోరేగాం ఎల్గార్ పరిషత్ కేసు.

(రచయిత సామాజిక కార్యకర్త) వీ

ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడమే దేశ ద్రోహమా?

ప్రభుత్వాలు అమలుపరుస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్నవారిని దేశ ద్రోహులంటూ జైళ్లలో నిర్బంధిస్తున్నా, కోర్టు తీర్పులను ధిక్కరిస్తున్నా న్యాయస్థానాలు నోరు మెదపడం లేదంటున్నారు అన్వేషి

ప్రభుత్వ విధానాలను తప్పు పడితే అది 'రాజ ద్రోహ' మవుతుందా? కేంద్ర ప్రభుత్వాన్ని, ప్రధాన మంత్రి మోడీని విమర్శిస్తే అది దేశ ద్రోహ మవుతుందా? ఇప్పుడు ప్రతి భారత పౌరుడు ఎక్కుపెట్టాల్సిన ప్రశ్నలివి. అసలు రాజేమిటి? ద్రోహమేమిటి? ఇప్పుడు రాజు లెక్కడున్నారు! ఇది ప్రజాస్వామ్యమా లేక రాచరిక యుగంలో ఉన్నామా! ఇంగ్లీష్‌లో సెడిషన్ అన్న పదానికి మన తెలుగు పండితులు చేసిన అనువాదం "రాజద్రోహం", కొంత స్పృహ వచ్చింతర్వాత "దేశ ద్రోహం" అని కూడా అన్నారు. ఇప్పటికీ చాలా పత్రికలు, రాజకీయ నాయకులు అలవాటుగా 'రాజా ద్రోహం' అనే మాటనే వాడుతున్నారు. అది మన భావ దాస్యానికి చిహ్నం. నిజానికి సెడిషన్ అంటే రాజ ద్రోహము కాదు దేశ ద్రోహం అంతకంటే కాదు. సెడిషన్ అంటే ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించడం. సెడిషన్ అన్న పదానికి ఇంగ్లీష్ నిఘంటు ప్రకారం 'భాష ద్వారా గాని, ప్రవర్తన ద్వారా గాని చట్ట ప్రకారం ఎన్నికయిన ప్రభుత్వాన్ని వ్యతిరేకించమని ఇతరులను ఒప్పించే ప్రయత్నం చెయ్యడం'. ఈ నేరం రుజువయితే శిక్ష జరిమానాతో సహా జీవిత కాలం ఖైదీ లేదా మూడు సంవత్సరాల జైలు శిక్ష, దానితో జరిమానా కూడా.

2010, జనవరి 1 నుండి 2020, 31 డిసెంబర్ వరకు దేశంలో ఒక దశాబ్ద కాలంలో 10, 938 మంది పై ఈ నేరం మోపబడింది. పౌరులు ప్రభుత్వ విధానాలను విమర్శించినందుకు 816 వ్యాజ్యాలు నమోదయ్యాయి. వీటిల్లో 96 శాతం కేసులు 2014లో భారతీయ జనతా పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత నమోదయిన వ్యాజ్యాలే. ఆశ్చర్యకరమయిన విషయమేమిటంటే నేరం మోపబడిన వారు దాదాపు 11 వేల మంది అయితే, అందులో 2000 వేల మంది పేర్లను మాత్రమే పేర్కొన్నారు. మిగతా అంతా 'ఇతరులు'. అంటే ఎవరినయినా ఎప్పుడయినా ఆ కేసులలో ఇరికించవచ్చు. కోర్టులకు సమర్పించిన నిందితుల జాబితాలలో ప్రతిపక్ష పార్టీల నాయకులు, విద్యార్థులు, జర్నలిస్టులు, రచయితలు, విద్యావేత్తలు ఉన్నారు. ఇందులో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పై విమర్శనాత్మక వ్యాఖ్యలు చేసారని 149 మంది పై, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను విమర్శించారని 144 మంది పై ఆరోపణలు ఉన్నాయి. 2010 నుండి 2014 వరకు అధికారంలో ఉన్న యుపిఏ (యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయెన్స్) ప్రభుత్వ హయాంతో పోల్చుకుంటే 2014 నుండి 2020 వరకు నరేంద్రమోడీ పాలనలో ప్రతి సంవత్సరం ఈ రకమయిన వ్యాజ్యాలు 28 శాతం కంటే తక్కువ కాకుండా నమోదవుతున్నాయి. పౌరసత్వ సవరణ చట్టం – 2019కి వ్యతిరేకంగా నిరసన తెలిపిన 3,700 మంది పౌరులను బిజెపి పాలిత వివిధ రాష్ట్రాలలో అరెస్ట్ చేసి సెడిషన్ చట్టాన్ని వారిపై ప్రయోగించారు. పుల్వామా దాడి జరిగిన తర్వాత 42 మందిని, ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో దళిత యువతి సామూహిక హత్యాచారం తర్వాత 22 వ్యాజ్యాలలో ఆ రాష్ట్ర ప్రభుత్వ నిర్వాకాన్ని ప్రశ్నించిన జర్నలిస్టులను, పౌరులను ఈ చట్టం కింద నిందితులను చేశారు. బీహార్ రాష్ట్రంలో 2014 కంటే ముందు దేశద్రోహ వ్యాజ్యాలు మావోయిజానికి వ్యతిరేకంగా, నకిలీ నోట్ల దందాలో పాలుపంచుకున్న వాళ్ల మీద ఉండేవి. 2014 తర్వాత ఈ చట్టం కింద మెజారిటీ కేసులు పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకించిన వారిపై, మూక హత్యలను తెగనాడిన ప్రముఖుల (సెలిబ్రిటీలు) పై, ప్రభుత్వ విధానాలపై అసహనం వ్యక్తపరచిన మేధావుల పై, ఇంకా పాకిస్తాన్ అనుకూల నినాదాలు చేశారని ఆరోపించబడ్డ వారి పై నమోదు అయ్యాయి. "ముంచుకొస్తున్న అసహనం పట్ల, దేశంలో పెరుగుతున్న అశాంతి పట్ల తాము ఎంతో మనో వేదనకు గురవుతున్నామని" పత్రికా ప్రకటన చేసిన ప్రఖ్యాత సినీ నటుడు అమీర్ ఖాన్, ఆయన సహచరి కిరణ్ రావు పై మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ఆరోపిస్తూ బీహార్‌లోని ఒక పోలీస్ స్టేషన్‌లో 2015లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మూక హత్యలను ఖండిస్తూ ప్రధాన మంత్రి మోడీకి లేఖాస్త్రం సంధించిన 'నేరా'న్ని తప్పు పడుతూ సినీ నిర్మాత మణిరత్నం, చరిత్ర కారుడు రామచంద్ర గుహ, సినీ నటి అపర్ణసేన్ తదితరులు 49 మంది పై సెడిషన్ కేసు దాఖలు చేశారు. (ఆ తర్వాత పెల్లుబికిన నిరసన కారణంగా పోలీసులు కేసును ఉపసంహ రించుకున్నారు). చేతిలో పోస్టర్లు పట్టుకోవడం దగ్గరనుంచి సామాజిక మాధ్యమాలలో పోస్టింగ్‌లు పెట్టడం వరకు, వ్యక్తిగతంగా మెసేజ్‌లు ఇచ్చుకున్న సంఘటనలు కూడా సెడిషన్ కింద పరిగణించబడ్డాయి బిజెపి పాలనలో. ఈ వివరాలు 'ఆర్టికల్ 14 న్యాయం, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం' అన్న పోర్టల్ వారు లోతైన అధ్యయనం తర్వాత ఇటీవల వెలువరించిన వెబ్‌సైట్‌లో నిక్షిప్తమయి ఉన్నాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో వారి గణాంకాలు వీటిని ధ్రువ పరుస్తున్నాయి. వీటితో పాటు, నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో వారు 2016 నుండి 2019 మధ్య కాలంలో సెడిషన్ కేసులలో 165 శాతం వృద్ధి రేటు నమోదయిందని కూడా వెల్లడించింది.

భారత శిక్షా స్మృతిలో అధికరణం 24ఏ అనేది బ్రిటిష్ సామ్రాజ్యవాదులు 151 ఏళ్ల క్రితం భారతీయులకు వ్యతిరేకంగా రూపొందించిన శాసనం. భారత రాజ్యాంగానికి రూపురేఖలు దిద్దుతున్నపుడు రాజ్యాంగ సభలో జరిగిన చర్చలలో చాలా మంది సభ్యులు దీనిని వ్యతిరేకించారు. భావ ప్రకటనా స్వేచ్ఛకు ఈ చట్టం

విఘాతం కలిగిస్తుందని, బ్రిటిష్ వారు తెచ్చిన ఈ నియమం కొనసాగిస్తే స్వాతంత్రానికిక అర్థం లేదని సభ్యులు వాదించారు. ఆ వాదనను పరిగణనలోకి తీసుకొని రాజ్యాంగంలో దీనికి చోటు కల్పించలేదు. కానీ ఆ తర్వాతి పరిణామ క్రమంలో దీనిని భారత శిక్షా స్మృతిలో చేర్చారు.

భారత స్వాతంత్ర పోరాటంలో పాల్గొంటున్న జాతీయ నాయకులకు, విప్లవకారులకు వ్యతిరేకంగా, వారిని అణిచివేయ్యడానికి బ్రిటిష్ ప్రభుత్వం 1870లో అమలులోకి తెచ్చిన చట్టం ఇది. వహాబీ ఉద్యమానికి నాయకత్వం వహించిన వారిని ఈ చట్టం కింద అరెస్ట్ చేశారు. అప్పటి జాతీయ నాయకులు బాలగంగాధర తిలక్, మోహన్ దాస్ కరంచంద్ గాంధీని దేశద్రోహం ఆరోపణలపై అరెస్ట్ చెయ్యడానికి ఇదే చట్టాన్ని ఉపయోగించారు. 'ఎంగ్ ఇండియా' పత్రికలో గాంధీ రాసిన మూడు వ్యాసాలను ఆయన ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరిస్తున్నాడన్న ఆరోపణలకు సాక్ష్యంగా చూపారు. "పౌరుల స్వేచ్ఛా స్వాతంత్రాలను అణిచివేయడానికి రూపొందించి భారత శిక్షా స్మృతిలో చేర్చబడ్డ అధికరణం ఇది" అని గాంధీ వ్యాఖ్యానిస్తూ "ఈ చట్టం కింద నేరం మోపబడి నేను అరెస్ట్ కావడం వల్ల నా తోటి దేశ భక్తులలో నేను ఎక్కువ గౌరవం పొందిన వాడినయ్యానని భావిస్తున్నాను' అని గర్వంగా చెప్పుకున్నాడు. 'ఇది అత్యంత నిందార్హమయిన చట్టం. దీన్ని ఎంత త్వరగా వదిలించుకుంటే అంత మంచిది' అని అప్పటి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ వ్యాఖ్యానించాడు. కానీ ఈ నియమాన్ని శిక్షా స్మృతి నుండి తొలగించ లేకపోయాడు. 2019 భారత పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికలలో తాము ఎన్నికయితే ఈ చట్టాన్ని రద్దు చేస్తామని కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల ప్రణాళికలో ప్రకటించింది. ఆ వాగ్దానాన్ని ఎగతాళి చేస్తూ మోడీ "అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ ఎంత నీచానికయినా దిగజారడానికి సిద్ధంగా ఉంది" అని అన్నాడు. "తాము మళ్లీ అధికారంలోకి వస్తే దేశద్రోహ చట్టాన్ని మరింత పదునుగా చేసేందుకు సవరణలు తీసుకు వస్తాము" అని మరొక బిజెపి అగ్ర నాయకుడు రాజానాథ్ సింగ్ ఆ ఎన్నికలలోనే ఒక ప్రచార సభలో ప్రకటించాడు. భారత శిక్షా స్మృతిలోని సెక్షన్ 124ఏ పట్ల అధికార భారతీయ జనతా పార్టీ ఆలోచనా సరళి ఎలా ఉందో తెలుసుకోవడానికి ఇంతకంటే ఉదాహరణలు ఏం కావాలి?

భారత శిక్షా స్మృతిలోని సెక్షన్ 124ఏ పై ఇప్పుడు దేశంలో తారాస్థాయిలో చర్చ జరుగుతున్నది. దీనికి కారణం జూన్ (2021) ప్రారంభంలో సుప్రీం కోర్టు ఇచ్చిన ఒక తీర్పు. కరోనా కట్టడిలో మోడీ ప్రభత్వం ఘోరంగా విఫలమయ్యిందని, గత సంవత్సరం విధించిన లాక్‌డౌన్ దేశంలో మహా విషాదాన్ని మిగిల్చిందని ప్రముఖ పాత్రికేయుడు వినోద్ దువా తన యు ట్యూబ్ ఛానల్ ద్వారా చేసిన వ్యాఖ్యానం పై బిజెపి నేత ఒకరు ఫిర్యాదు చేస్తే హిమాచల్‌ప్రదేశ్ పోలీసులు ఆయన పై దేశ ద్రోహం కేసు బనాయించారు. తదుపరి పరిణామాలలో సుప్రీం కోర్టు ఆ కేసును కొట్టి వేస్తూ కొన్ని వ్యాఖ్యలు చేసింది. ధర్మాసనంలోని న్యాయమూర్తి జస్టిస్ డి. వై. చంద్రచూడ్ తీర్పు ప్రకటనలో భాగంగా "సెడిషన్ (దేశ ద్రోహం అని పిలువబడే నేరం) పరిమితులు ఏమిటో నిర్వచించాల్సిన సమయం ఆసన్నమయింది" అని వ్యాఖ్యానించారు.

ఈ వ్యాఖ్యను దేశంలో అందరూ హర్షించారు. కానీ, ఇలాంటి వ్యాఖ్యలు చెయ్యడం సుప్రీం కోర్టుకిది మొదటిసారి కాదు. 1962లోనే కేదార్ నాథ్ సింగ్‌కు బీహార్ రాష్ట్రానికి మధ్య జరిగిన వివాదంలో సుప్రీం కోర్టు కీలకమయిన వ్యాఖ్యలు చేసింది. ప్రభుత్వాన్ని "పరుషమయిన పదాలతో విమర్శించడం" లేదా "పదునయిన పదజాలాన్ని ఉపయోగించి ప్రభుత్వాన్ని తప్పుపడుతూ ఉపన్యసించడం" లేదా "రచయితలు తమ రచనలో శక్తివంతమయిన పదాలతో ప్రభుత్వ విధానాలను తెగనాడడం" దేశద్రోహం కిందకు రాదని ఆనాడే 60 ఏళ్ల క్రితమే సుప్రీం కోర్టు స్పష్టంగా సెడిషన్ చూట్టానికి నిర్వచనం ఇచ్చింది. తన తీర్పును విశదీకరిస్తూ అత్యున్నత ధర్మాసనం " హింసను ప్రేరేపించే విధంగా, సంఘంలో శాంతిని భగ్నం చేసే ఉద్దేశ్యంతో చేసే విచ్ఛిన్నకర చర్యలు, సంఘంలో రుగ్మతను పెంచే భావనతో చేసే పనులు" మాత్రమే సెడిషన్ కిందకు వస్తాయి అని ఉటంకించింది. ఈ తీర్పులోని సారాన్ని పలుమార్లు న్యాయస్థానాలు ప్రభుత్వానికి, పోలీసులకు గుర్తు చేశాయి. 1980వ దశకంలో ఆనాటి ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ హత్యకు గురయిన తర్వాత కొన్ని గంటల వ్యవధిలో బల్వంత్ సింగ్ అనే యువకుడు ఒక బహిరంగ మార్కెట్‌లో "ఖలిస్థాన్ జిందాబాద్", "ఖల్సా పరిపాలిస్తుంది", "హిందువులు పంజాబ్‌ను వీడి వెళ్లిపోవాలి"అని నినాదాలు ఇస్తే పోలీసులు అతనిపై సెడిషన్ కేసు నమోదు చేశారు. 1995లో ఈ విషయంలో తీర్పునిస్తూ సుప్రీం కోర్టు కేవలం నినాదాలివ్వడం నేరం కాదని, ఆ నినాదాల వల్ల ఎవరూ ప్రభావితం చెంది ఎలాంటి హింసకు పాల్పడలేదని, రెండు సార్లు నినాదాలిస్తే విచ్ఛిన్నయిపోయేంత బలహీనమయిన స్థితిలో దేశం లేదని వ్యాఖ్యానిస్తూ బల్వంత్ సింగ్‌ను నిర్దోషిగా నిర్ణయించింది. కుడంకుళం నిరసన సందర్భంగా ఎస్.పి. ఉదయ కుమార్ పై సెడిషన్ కేసు నమోదు చేశారు తమిళనాడు పోలీసులు. ఈ వ్యాజ్యంలో కూడా 2016లో తీర్పునిస్తూ సుప్రీం కోర్టు కేదార్ నాథ్ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన మార్గ దర్శకాలను గుర్తుచేస్తూ ఉదయ్‌కుమార్ విషయంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారని చీవాట్లు పెట్టింది. నిరసన హక్కు, ఉగ్రవాద కార్యకలాపాల నడుమ ఉన్న విభజన రేఖను చెరిపేస్తే ప్రజాస్వామ్యానికి అంతకంటే హాని ఇంకొకటి ఉండదని 2020 ఢిల్లీ అల్లర్లలో అరెస్ట్ అయి ఉపా (యుఏపిఏ) కేసును ఎదుర్కొంటున్న ఢిల్లీ విశ్వవిద్యాలయ విద్యార్థినిలు దేవాంగన కలితా, నటాషా నర్వాల్, జామియా మిలియా ఇస్లామియా విద్యార్థి ఆసిఫ్ ఇక్బాల్ తన్హాలకు బెయిల్ మంజూరు చేస్తూ 2021, జూన్ 15న ఢిల్లీ హై కోర్టు గొప్ప తీర్పు నిచ్చింది. ప్రభుత్వ విధానాలకు భిన్నంగా ఆలోచించడం దేశద్రోహమయితే రాజ్యాంగం నిర్వచించిన భావ ప్రకటనా స్వేచ్ఛకు, ప్రాథమిక హక్కులకు రక్షణ ఎక్కడ?

సుప్రీం కోర్టు 1962లోనే భారత శిక్షా స్మృతిలోని అధికరణం 24 ఏకు కేదార్ నాథ్ వ్యాజ్యంలో స్పష్టమయిన నిర్వచనం ఇచ్చినప్పుడు, మళ్లీ 2021 జూన్‌లో దేశ ద్రోహం అంటే స్పష్టంగా నిర్వచించుకోవడానికి ఇది తగిన సమయం అని సుప్రీం కోర్టు అనడంలో అర్థం ఏమిటి? అని ప్రముఖ పాత్రికేయుడు కరణ్ థాపర్ ప్రశ్నిస్తున్నాడు. అవును నిజమే కదా! సుప్రీం కోర్టు ఇన్ని సార్లు కేదార్ నాథ్ కేసులో ఇచ్చిన తీర్పును గుర్తు చేసినా ప్రభుత్వాలు ఎందుకు పెడచెవిన పెడుతున్నాయి? సుప్రీం కోర్టు నిర్వచించడానికి ఇది తగిన సమయం అనడం కంటే, సుప్రీం కోర్టు ఆదేశాలను పాటించని ప్రభుత్వాలపై కోర్టు ధిక్కరణ నేరం కింద తప్పు పట్టవచ్చు కదా? వీ

(రచయిత రిటైర్డ్ లెక్చరర్)

సాకులు సబబేనా?

ప్రభుత్వం ప్రతి సంవత్సరం లోటు బడ్జెట్‌ను పూడ్చుకోవడానికి ప్రభుత్వ రంగ సంస్థల్లోని వాటాలను అమ్ముతూ నష్టాల సాకులు చెబుతోందని అంటున్నారు ఆర్. లక్ష్మి

వివిధ ప్రభుత్వ రంగ సంస్థల ఆదాయం 2017-18లలో 20 లక్షల 33 వేల కోట్లు కాగా, వాటిలో 1 లక్షా 59 వేల 635 కోట్ల లాభాలు ఉన్నాయి. వివిధ రకాల పన్నుల చెల్లింపుల రూపంలో - 3 లక్షల 50 వేల 52 కోట్ల రూపాయలు చెల్లించాయి. విదేశీ మారక ద్రవ్యం రూపేణా రు. 86 వేల 980 కోట్లు సమకూర్చాయి. డివిడెండ్ల రూపంలో రు. 76 వేల 578 కోట్లు చెల్లించాయి.

దేశంలో 366 పబ్లిక్ రంగ సంస్థలు ఉన్నాయి. వాటిలో నష్టాలలో ఉన్నవి కేవలం 43 మాత్రమే. అదీగాక ఈ సంస్థలన్నింటికీ వేల కోట్ల విలువ చేసే ఆస్తులు ఉన్నాయి. సంస్థల విస్తరణ నిమిత్తం ముందు చూపుతో ప్రజల నుండి సేకరించిన/సమీకరించిన ఆస్తులవి.

2009 వరకు బిఎస్ఎన్ఎల్ లాభాలలో ఉంది. లెక్కలేనన్ని స్థిరాస్తూలూ ఉన్నాయి. అయినా ఆధునికీకరింపబడలేదు. బ్యాంకుల నుండి రుణాలు మంజూరు కాలేదు. '4.జి' కేటాయింపులు జరగలేదు. ప్రభుత్వ రంగ కమ్యూనికేషన్ వ్యవస్థను నిర్లక్ష్యం చేసి, ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించినట్లు అయింది.

నిధులు లేకున్నా అప్పుచేసి కొత్త విమానాలు కొనవలసి రావడంతో 'ఎయిర్ - ఇండియా' 58,000 కోట్ల రూపాయల అప్పుల్లో కూరుకుపోవడం జరిగింది. ప్రైవేట్ రంగానికి ఇచ్చిన ప్రోత్సాహకాలలో సగం ఇచ్చినా పిఎస్‌యులకు ఈ దుస్థితి దాపురించేది కాదన్నది నిష్టుర సత్యం.

ఇటీవలి వరకు ఐఒసిలో 52.18 శాతం, బిపిఎల్‌లో 53.29 శాతం, గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియాలో 52.64 శాతం, పవర్ గ్రిడ్ కార్పొరేషన్‌లో 55.37 శాతం ప్రభుత్వం పెట్టుబడి ఉండేది. సగానికి మించి పెట్టుబడులు ఉన్న కారణంగానే అవన్నీ ప్రభుత్వ రంగ సంస్థల హోదాలో ఉన్నాయి.

కంపెనీల చట్టంలోని క్లాజు '45' ప్రకారం 51 శాతం వాటా ఉన్నా అవి పబ్లిక్ సెక్టార్ యూనిట్స్‌గానే పరిగణించబడతాయి. ప్రైవేట్ రంగంలో 50 శాతం తక్కువ వాటా ఉన్నప్పటికీ యాజమాన్య హక్కు ఉంటుంది గనుక అదే విధంగా ప్రభుత్వం వాటా 50 శాతం తగ్గినప్పటికి ప్రభుత్వం యాజమాన్యం హక్కును కలిగి ఉండేలా కంపెనీ చట్టంలో సవరణ తేవాలన్న ఆలోచనతో మొదలైన పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ మెల్లగా ఇంతింతై - వటుడింతై అన్నట్లు ఇప్పుడు 'అమ్మివేస్తాం' అన్నంతవరకు వచ్చింది. నిధుల సమీకరణకై మొదలైన పెట్టుబడుల ఉపసంహరణ ప్రతిపాదన రూపాంతరం చెంది ఈ రకంగా పరిణమించింది.

నిజానికి నిధుల కొరతయే సమస్య అయితే పలు ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. కేవలం 1 శాతం ఆస్తిపన్ను విధిస్తే సాలీనా 5 లక్షల 60 వేల కోట్ల రాబడి వస్తుందని, వారసత్వపు పన్ను విధిస్తే 9 లక్షల 3 వేల కోట్ల రాబడి వస్తుందని ప్రముఖ ఆర్థిక వేత్త ఒకరు సూచించిన విషయాన్ని ఇక్కడ గుర్తుచేసుకోవాలి.

ఆర్థిక నిపుణుల మాటలకూ మన్నన లేదు

ఆర్థిక సంస్కరణల ఆద్యుడు, దార్శనికుడు, మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మివేయాలన్న ఆలోచన సరైనది కాదని ఖరాఖండీగా చెప్పారు. అవి ప్రజలకు సంబంధించినవి, ఆ ఆస్తులను అమ్మే హక్కు ప్రభుత్వానికి లేదని, ప్రభుత్వం కేవలం ట్రస్టీ మాత్రమేనని తేల్చి చెప్పారు.

15వ ఆర్థిక సంఘం చైర్మన్ ఎన్.కె. సింగ్, రిజర్వ్ బ్యాంక్ గవర్నర్లుగా చేసిన ముంద్రా, రఘురామ్ రాజన్ వంటి వారు నష్టాలతో ఉన్నంత మాత్రాన అమ్మకానికి పూనుకోవడం సరైన పరిష్కారం కాదని అభిప్రాయపడ్డారు. పెట్టుబడులను ప్రోత్సహించడం ఒక్కటే ఏకైక మార్గమన్న వాదనను మార్ ఫిషర్ వంటి వైద్ధావులు సైతం వ్యతిరేకించారు.

కాని బడ్జెట్ లోటును పూడ్చుకోవడానికి ప్రతి సంవత్సరం ప్రభుత్వ రంగ సంస్థలలోని వాటాలను అమ్ముతూ పోవడం మామూలు అయిపోయింది. కాని అమ్ముకుంటూ పోతే వాటాలు ఎన్నాళ్లు ఉంటాయి? అదీకాక ఈ అమ్మకాల వల్ల ప్రభుత్వం ఆశించిన ఆదాయం రావడం లేదన్నది అనుభవాలు చెపుతున్నాయి. కారణం ప్రభుత్వం అమ్మ చూపుతున్న వాటాలకు ఉన్న విలువలు కొనుక్కోవడానికి ఎవరూ ముందుకు రాకపోవడం, ఆ కారణంగా అయినకాడికి అమ్మి వచ్చినదానితో సరి అనుకోవడం పరిపాటి అయింది. 2003లో బాల్కోలో రు. 5,000 కోట్ల విలువైన వాటాలను ప్రభుత్వం 55 కోట్లకు కారుచౌకగా అమ్మివేసింది. బాల్కోలో 51 శాతం వాటా పోయింది. అదీ రు. 4,049 వేల కోట్ల నష్టంతో. అటువంటి అనుభవాలనుండైనా పాఠాలను నేర్చుకొనే స్థితిని ప్రభుత్వ పెద్దలు ఏనాడో దాటిపోయారు. ఆర్థిక సంస్కరణలు ప్రారంభం నాటి నుండి నిన్న మొన్నటి వరకు ఈ పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ ద్వారా ప్రభుత్వాలు సంపాదించినది రు. 3 1/2 లక్షల కోట్లకు మించదు. కాని ఈ క్రమంలో అనేక పి.ఎస్.యులలో ప్రభుత్వం వాటా 51 శాతానికి పడిపోయింది. 25కి పైగా పి.ఎస్.యులు పూర్తిగా మూతబడ్డాయి. మరో 25కి పైగా పి.ఎస్.యులు విలీనాలకు, లేదా అమ్మకాలకు గురికాబడ్డాయి.

మరొకవంక ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించడానికి అత్యుత్సాహంతో రాయితీలు, భూములు అప్పజెప్పడం జరుగుతోంది. కార్పొరేట్ పన్నులను తెగ్గోస్తూ వస్తుండడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడడంలో ఆశ్చర్యం ఏముంది? ఆ నష్టాన్ని సంస్థలను అమ్మి పూడ్చుకోవాలని చూడడం మొదలు పెడితే ఆ ఆదాయం ఎన్ని

బెంగాల్‌లో వామపక్ష పరాజయాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

బెంగాల్‌లో వామపక్షాల ఓటమికి కారణాలను అన్వేషించే క్రమంలో 1977 కు ముందరి స్థితిని, అనంతర పరిణామాలను వివరిస్తున్నారు **కొండూరి వీరయ్య**

బెంగాల్‌లో దీర్ఘకాలంగా నిద్రాణంగా ఉన్న విచ్ఛిన్నకర శక్తులకు నేడు తృణమూల్ కాంగ్రెస్ ఒక వేదికగా మారింది. దాంతో ఇప్పటి వరకూ బెంగాల్‌లో కనిపించని అస్తిత్వ వాదాలు, తిరోగమన వాదాలు నేడు మనకు కనిపిస్తున్నాయి. ఈ శక్తులు బెంగాల్ గత మూడున్నర దశాబ్దాలుగా సాధించిన రాజకీయ సుస్థిరతనూ, ప్రజాతంత్ర చైతన్యాన్నీ, ఆర్థిక ఫలాలనూ ధ్వంసం చేస్తున్నాయి. వీటికి జాతీయస్థాయిలోని ప్రగతి నిరోధక శక్తులు చేదోడు వాదోడుగా నిలుస్తున్నాయి.

నేడు పశ్చిమబెంగాల్ రాజకీయ పరిణామాలు కేవలం వామపక్ష శ్రేయోభిలాషుల దృష్టినే కాదు మొత్తం ప్రపంచ దృష్టినాకర్షిస్తున్నాయి. వరుసగా ఏడు సార్లు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ దుందుభి మోగించి వరుసగా మూడుసార్లు పరాజయం చవిచూడటానికి దారితీసిన పరిస్థితుల గురించి అటు వామపక్ష అభిమానుల్లోనూ ఇటు రాజనీతి శాస్త్రజ్ఞుల్లోనూ ఎన్నో ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రత్యేకించి తాజాగా ముగిసిన ఎన్నికల్లో శాసనసభలో కనీస ప్రాతినిధ్యానికి కూడా నోచుకోకపోవటం వామపక్ష శ్రేణులను నిర్వేదానికి గురిచేసిన సందర్భం. ఇదే అదనుగా తీసుకుని వామపక్ష వ్యతిరేకులు దుష్ప్రచారానికి ఒడిగడుతున్నారు. దేశ రాజకీయాల్లో వామపక్షాలకు స్థానం లేదని నిర్ధారించే ప్రయత్నం చేస్తున్నారు. బెంగాల్‌లో వామపక్ష ప్రభుత్వం సాధించిన విజయాలను చిన్నవి చేసి చూపే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. దానికి తోడు నేడు దేశంలోనూ, బెంగాల్‌లోనూ మూడొంతుల మంది ఓటర్లు 70 దశకం తర్వాత పుట్టిన వారు కావటంతో అంతకు పూర్వపు రాజకీయ సామాజిక పరిస్థితులేమిటి, ఏ పరిస్థితుల్లో బెంగాల్ ప్రజలు వామపక్ష సంఘటనకు పట్టం కట్టారు, దానికి ముందు రాష్ట్రం కాంగ్రెస్ పాలనలో ఏ విధంగా నష్టపోయింది అన్న విషయాల గురించి తెలుసుకునే అవకాశం లేదు. బెంగాల్ పరిణామాలను అర్థం చేసుకోవడానికి నాలుగు కోణాల్లో ప్రయత్నం చేయాలి. 1. బెంగాల్‌లో వామపక్ష సంఘటనను అధికారానికి తెచ్చిన నాటి పరిణామాలు. 2. జాతీయ రాజకీయాల్లో వస్తున్న మార్పుల నేపథ్యంలో బెంగాల్ వామపక్ష సంఘటన ప్రభుత్వం విజయాలు, పరాజయాలు, 3. దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రారంభించక ముందు, ప్రారంభించిన తర్వాత నిర్దిష్ట అభివృద్ధి నమూనాలు ప్రతిపాదించి అమలు చేయడంలో ఉన్న అవకాశాలు, పరిమితులు. 4. బెంగాల్ రాజకీయాల్లో సంఘపరివారం వ్యూహం, స్థానం, 5. వామపక్ష సంఘటనను అధికారానికి తేవడంలోనూ, తదనంతర పరిణామాల్లోనూ వామపక్ష సంఘటనకు నాయకత్వం వహించి సిపిఎం ఎత్తుగడలు, నిర్మాణం పోషించిన పాత్ర. ఈ ఐదు అంశాలు దేనికదే పూర్తి నిడివితో విశ్లేషించాల్సిన అంశాలు. అందువల్ల ఈ వ్యాసంలో మొదటి అంశాన్ని, స్థూలంగా 60-70 దశకాల నాటి దేశ రాజకీయ పరిస్థితిని, ప్రత్యేకించి బెంగాల్ రాజకీయ చిత్రాన్ని పాఠకుల ముందుంచే ప్రయత్నమే ఈ వ్యాసం.

నేపథ్యం

స్వాతంత్ర్యానంతర తొలి రెండు దశాబ్దాలు నెహ్రూ ప్రత్యక్ష పర్యవేక్షణలో అమలు జరిగిన అభివృద్ధి వ్యూహానికి గల పరిమితులు అనతికాలంలోనే వెల్లడయ్యాయి. రాజ్యాంగం అందరికీ అందించిన హక్కులు, అవకాశాలను ప్రజలు సంపూర్ణంగా అనుభవించే పరిస్థితి లేకపోయింది. ప్రజా సమీకరణే ప్రధాన వ్యూహంగా స్వాతంత్రోద్యమంలో పని చేసిన కాంగ్రెస్, అధికారానికి వచ్చిన తర్వాత హక్కుల సాధనకు ప్రజా సమీకరణకు బదులు అధికార యంత్రాంగంపై ఆధారపడే స్థితికి మారింది. దాంతో దానిపై భ్రమలు తొలగిపోవడానికి ప్రజలకు అట్టే కాలం పట్టలేదు. తొలి దశాబ్దంన్నర కాలంలో ప్రభుత్వం అమలు జరిపిన పలు విధానాలు, అభివృద్ధి వ్యూహాల పర్యవసానంగా పాలక సంకీర్ణంలోని వర్గ పొందికలో పెద్ద ఎత్తున మార్పులు వచ్చాయి.

నెహ్రూ రూపొందించిన అభివృద్ధి వ్యూహం ప్రధానంగా ప్రభుత్వ పెట్టుబడి, దాన్ని వినియోగించేందుకు తెరమీదకు వచ్చిన ప్రణాళిక

సంవత్సరాలు సమకూర్చుకోగల అవకాశం ఉందో కూడా వెనకా ముందరా ఆలోచించుకోవాలి.

ప్రభుత్వ రంగంలోనైనా, ప్రైవేట్ రంగంలోనైనా పరిశ్రమలకు లాభ, నష్టాలు రెండూ బొమ్మ బొరుసు వంటివి. పరిశ్రమ కుదేలైపోవడం, మళ్లీ పుంజుకోవడం వంటి ఒడిదుడుకులు చాలా సహజం. సంస్థ మనుగడలో లాభ నష్టాల వంటి తాత్కాలిక అంశాలు కాక సుదీర్ఘమైన ప్రస్థానంలో అవి సమకూర్చుకున్న ఆస్తులు, ఆ ఆస్తుల విలువలో వచ్చే మార్పులు, రిజర్వ్ నిధుల వంటి అంశాలెన్నో కీలక పాత్ర పోషిస్తాయి.

గుజరాత్‌లో సంక్షోభంలో ఉన్న పరిశ్రమలను తగిన చర్యలు చేపట్టడం ద్వారా లాభాల బాట పట్టించామని మోడీ ఒకప్పుడు గర్వంగా చెప్పుకున్నారు. యుపిఎ-1 హయాంలో విశాఖపట్టణంలోని బి.ఎచ్.పి.వి. సహా మరికొన్ని ప్రభుత్వ రంగ సంస్థలు నిలదొక్కుకోగలగడమే కాక, బలం పుంజుకోవడం కూడా ఇటీవలి చరిత్రే.

అధిక నైపుణ్యాలున్న వారిని ఎక్కువ వేతనాలు చెల్లించైనా కీలక స్థానాలలో నియమించడం ద్వారా సంస్థలను నిలబెట్టుకోవడమే కాకుండా, లాభాల బాట పట్టించవచ్చున్న పి.జె. నాయక్ కమిటీ సూచనలను ఇక్కడ ప్రస్తావించడం సందర్భోచితంగా ఉంటుంది. వీ

(రచయిత ఫ్రీలాన్స్ జర్నలిస్టు)

వ్యవస్థలపై ఆధారపడి ఉంది. స్వాతంత్ర్యానంతరం తక్షణమే రూపొందించిన ఈ అభివృద్ధి నమూనాలో, అభివృద్ధి ఫలాల్లో అందరికీ భాగస్వామ్యం ఉండాలన్న లక్ష్యం ఎంతో కొంత ఉండేది. తొలుత నెహ్రూ తన అభివృద్ధి నమూనా చుట్టూ కాంగ్రెస్‌లోని భిన్న వర్గాలను సమీకరించగలిగారు. ఈ అభివృద్ధి వ్యూహం మేరకు వేగవంతమైన పారిశ్రామిక విధానానికి సమాంతరంగా గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ సంస్కరణలూ అమలు జరగాల్సి ఉంది. కానీ రాష్ట్ర ప్రభుత్వాల్లో నిర్ణయాత్మక పాత్ర పోషించిన ధనిక రైతాంగం, దానికి నాయకత్వం వహిస్తున్న రాష్ట్రస్థాయి కాంగ్రెస్ నేతృత్వం ఈ వ్యవసాయ సంస్కరణలకు మోకాలడ్డింది. దాంతో 60వ దశకం తర్వాత దేశవ్యాప్తంగా వ్యవసాయ సంస్కరణలకూ, దానికి పర్యాయపదంగా నిలిచిన భూసంస్కరణల చట్టాలకూ కాంగ్రెస్ నాయకత్వం తూట్లు పొడిచింది. ఈ సమయంలోనే నెహ్రూ అస్తమించారు. కాంగ్రెస్ నాయకత్వం క్రమంగా తిరోగామి వాసుల చేతుల్లోకి మారింది. దాంతో పాటే అప్పటివరకూ అమల్లో ఉన్న కేంద్ర రాష్ట్ర సంబంధాల్లోనూ, కాంగ్రెస్‌లోనే జాతీయ నాయకత్వం రాష్ట్ర నాయకత్వం మధ్య ఉండే సంబంధాల్లోనూ సమతౌల్యత దెబ్బతిన్నది. నెహ్రూ హయాంలో ప్రధాన దృష్టి జాతీయ రాజకీయాలపై ఉండటంతో రాష్ట్రస్థాయి నాయకత్వానికి రాష్ట్రస్థాయి అవసరాల నేపథ్యంలో రాజకీయ విధివిధానాలు రూపొందించటంలో అవసరమైనంత స్వేచ్ఛ, స్వతంత్రత ఉండేవి. నెహ్రూ తర్వాత పార్టీ పగ్గాలు, ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన ఇందిరాగాంధీ హయాంలో ఈ స్వేచ్ఛ కరువైంది. జాతీయ స్థాయిలోనూ, రాష్ట్రస్థాయిలోనూ కాంగ్రెస్ నాయకత్వం అస్తిత్వాన్ని కోల్పోయి ఇందిరాగాంధీ భజన బృందంగా మారింది. జాతీయ రాజకీయాల్లో వికాసపరమైన చర్చల స్థానంలో వ్యక్తి కేంద్రంగా చర్చలు మొదలయ్యాయి. కాంగ్రెస్‌లో అంతర్గత సుస్థిరతే దేశానికి సుస్థిరత అన్న ప్రచారం ముందుకొచ్చింది. ఈ మార్పు ఒక్క పార్టీ నిర్మాణానికే పరిమితం కాలేదు. దేశం అనుసరించాల్సిన ఆర్థికాభివృద్ధి విధానం పెద్దఎత్తున ఒడిదుడుకులకు లోనైంది. అధికారంపై పట్టు కాపాడుకునేందుకు సామాజిక న్యాయం ప్రాతిపదికను అప్పటి వరకూ అనుసరిస్తూ వచ్చిన విధానాల స్థానంలో ఎకామడేటివ్ విధానాలు తెరమీదకు వచ్చాయి. పారిశ్రామికాభివృద్ధిలో రెండో పంచవర్ష ప్రణాళిక చూపించిన మార్గంనుండి ప్రభుత్వం వైదొలగింది. వ్యవసాయ సంస్కరణల్లో భూసంస్కరణలకు వీళ్లు పెద్ద పీట వేయటం ద్వారా గ్రామీణ నిరుద్యోగం, ద్రవ్యోల్బణం తగ్గించటం, పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన రిజర్వు వనరులు సృష్టించటానికి బదులు సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ద్వారా వ్యవసాయ ఉత్పాదకత పెంచటం ప్రభుత్వ లక్ష్యంగా మారింది. సమగ్రాభివృద్ధి లక్ష్యంగా కాక నిర్దిష్ట ఓటు బ్యాంకులను సంఘటితం చేసుకోవటం ఆర్థిక విధానాల లక్ష్యంగా మారింది. ఈ ఓటు బ్యాంకు ఆధారంగా అధికారానికి వచ్చిన కాంగ్రెస్ ఇందిరాగాంధీ నేతృత్వంలో ప్రజాస్వామ్యం లూటీకి పాల్పడింది. ఈ పరిస్థితుల్లో రాజ్యాంగం కనీస హామీ ఇచ్చిన ప్రజాస్వామ్య భారతాన్ని పరిరక్షించుకునేందుకు ప్రత్యామ్నాయ రాజకీయ ఉద్యమం అవసరమైంది.

స్వాతంత్ర్యానంతరం బెంగాల్ రాజకీయ చిత్రం

దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పుల కారణంగానే బెంగాల్‌లో కూడా వ్యవసాయరంగంలో వర్గాల ఏర్పాటు, సంఘటితం కావటం భూసంస్కరణలతో పూర్తి అయింది. మిగిలిన రాష్ట్రాల మాదిరిగా ఆధిపత్య కులం గానీ, ఆధిపత్య కులాల చేతుల్లో భూ కేంద్రీకరణ గానీ బెంగాల్‌లో లేవు. దాంతో రాష్ట్రవ్యాప్తంగా వైవిధ్యభరితమైన భూ సంబంధాలు, వర్గ సంకీర్ణాలు తెరమీదకు వచ్చాయి. ఆధిపత్య కులం కేంద్రంగా సామాజిక సమీకరణాలు లేకపోవటంతో రాజకీయ పార్టీలు వర్గం ప్రాతిపదికన ప్రజలను సమీకరించటానికి మార్గం సుగమం అయింది. స్వాతంత్ర్యపోరాట కాలంలో కూడా విప్లవ భావాలకు బలమైన పునాదులు కలిగిన బెంగాల్ స్వాతంత్ర్యానంతరం ఆ ప్రత్యేకతను నిలుపుకొంది. బలమైన వామపక్ష ఉద్యమానికి కేంద్రంగా మారింది. స్వాతంత్ర్యానంతరం దేశ విభజన నేపథ్యంలో రాష్ట్రాభివృద్ధికి అవసరమైన మౌలిక వనరులు, విశాలమైన భూభాగం దాటి తూర్పు పాకిస్తాన్ దేశం కావటం, దేశ విభజన నేపథ్యంలో బెంగాల్‌కు నిర్వాసితుల ముప్పు ఎదురవడానికి కారణం కాంగ్రెస్ అనుసరించిన విధానాలే అన్న అభిప్రాయంతో బెంగాల్‌లోని విద్యాధికులు కాంగ్రెస్‌కు దూరమయ్యారు. జమీందార్ రద్దువంటి చర్యలతో రైతాంగం లబ్ధి పొందినా పైన పేర్కొన్న చారిత్రక కారణాల వల్ల బెంగాల్‌లో కాంగ్రెసు పార్టీ నిలదొక్కుకునేందుకు పరిమిత అవకాశాలే వచ్చాయి. మిగిలిన రాష్ట్రాల్లో లాగా స్వాతంత్ర్యానికి ముందు బెంగాల్‌లో కాంగ్రెస్‌పార్టీ ఏ స్థాయిలోనూ ప్రభుత్వంలో చలామణి కాలేదు. అన్ని పరిమితులు ఉన్నప్పటికీ స్వాతంత్ర్యానంతరం తొలి దశాబ్దన్నరకాలంలో దేశవ్యాప్తంగా ఉన్న సానుకూల పవనాల నేపథ్యంలో బెంగాల్‌లో సైతం కాంగ్రెస్ పార్టీ అధికారానికి రాగలిగింది.

1960ల నాటి నుండీ రాష్ట్రంలో కాంగ్రెస్ పతనం ప్రారంభమైంది. ఇందిరాగాంధీ నేతృత్వంలో ఈ పతనం సంపూర్ణమైంది. అధికారాన్నీ, పార్టీపై పెత్తనాన్నీ కాపాడుకోవటానికి ఇందిరాగాంధీ ప్రజాస్వామిక పద్ధతులను గాక నిరంకుశ, ప్రజాస్వామ్య విరుద్ధపద్ధతులు అవలంబించటంతో అప్పుడే ఆవిర్భవిస్తున్న మేధావి వర్గం కాంగ్రెస్‌కు దూరమైంది. నిర్మాణపరంగా చూసుకుంటే బిసి రాయ్, రాతుల్యాఘోష్ వంటి వారు బెంగాల్ పిసిసిపి నాయకత్వం వహించినపుడు వారి స్వతంత్ర పని విధానానికి నెహ్రూ ఇచ్చినంత అవకాశం ఇందిరా గాంధీ ఇవ్వలేదు. దానికి తోడు బలమైన స్థానిక నాయకత్వానికి వ్యతిరేకంగా మరో గ్రూపును తయారు చేయటం, దాన్ని ప్రోత్సహించటం ద్వారా రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్ నాయకత్వం ముఠాకుమ్ములాటల్లో మునిగి తేలేలా చేయటం, అదను చూసుకుని నమ్మిన బంట్లను పార్టీ అధ్యక్షులు చేయటం అన్న ఇందిరాగాంధీ విధానం రాష్ట్ర కాంగ్రెస్‌లో మరింత కుమ్ములాటలకు దారి తీసింది. వెరసి రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్ వైఫల్యంతో 1967 నాటికి రాజకీయ శూన్యం ఏర్పడింది. జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో వచ్చిన చీలికలో అప్పుడే తెరమీదకు వచ్చిన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పూర్తిస్థాయిలో ఈ శూన్యాన్ని పూరించేందుకు సిద్ధమయ్యే పరిస్థితి లేకపోయింది. రాష్ట్ర రాజకీయ రంగంలో సిపిఐ(ఎం) తిరుగులేని శక్తిగా అవతరించటానికి, కాంగ్రెస్ వైఫల్యంతో ఏర్పడిన శూన్యాన్ని పూరించి రాజకీయ అస్థిరత స్థానంలో సుస్థిరత సాధించటానికి రాష్ట్రానికి దాదాపు దశాబ్దాలకు పైగా సమయం పట్టింది. ఈ దశాబ్దకాలంలో జాతీయస్థాయిలో కాంగ్రెస్ ప్రజాదరణ కోల్పోవటం, కాంగ్రెస్‌లో చీలికలు రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేశాయి.

దశాబ్దకాలపు అస్థిరత

1960 దశకం నాటికి కాంగ్రెస్ దేశవ్యాప్తంగా ప్రతికూల పవనాలు ఎదుర్కోవాల్సి వచ్చింది. నెహ్రూ ప్రారంభించిన అభివృద్ధి విధానాల

నుండి వైదొలగటం, ఆర్థిక సంక్షోభం, ఆహార సంక్షోభం, కాంగ్రెస్ సంస్థాగత కారణాలు, చైనా-భారత్ యుద్ధం ఈ ప్రతికూల పవనాల వేగాన్ని పెంచాయి. వివిధ రాష్ట్రాల్లో ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తుల వైపు నడవటం ప్రారంభమైంది. తమిళనాడులో డి.ఎం.కె. కేరళలో సిపిఐ(ఎం) ఈ దిశగా దేశానికి దారి చూపాయి. పశ్చిమబెంగాల్‌లో కాంగ్రెస్ పతనం మిగిలిన చోట్ల కంటే మరింత వేగంగా జరిగింది. బెంగాల్ కాంగ్రెస్‌లో తొలితరం నేతలు అంతరించిన తర్వాత వారి స్థానాన్ని పూరించే స్థాయికి ఏ నేతా ఎదగలేదు. బిసి రాయ్, అతుల్య ఘోష్ వంటి నేతలు పార్టీకి రాష్ట్రవ్యాప్త యంత్రాంగాన్ని రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు. 1962లో బిసి రాయ్ మరణం తర్వాత బెంగాల్ కాంగ్రెస్‌లో ముఠా కుమ్ములాటలు పెచ్చరిల్లాయి. జాతీయ స్థాయిలో 1967లో కాంగ్రెస్ ఓటమి చవిచూస్తే బెంగాల్‌లో అంతకు ఐదేళ్ల పూర్వమే కాంగ్రెస్ చీలిపోయి బలహీనపడింది. ఓటమి పాలయింది. తద్వారా రాజకీయ అస్థిరతకు లోనైంది బెంగాల్.'

1968-1971 మధ్య కాలంలో రాష్ట్రంలో ఏర్పడిన రెండు సంకీర్ణ ప్రభుత్వాలూ ప్రధానంగా వర్గ సంకీర్ణాలు. ఒకవైపున బూర్జువా, భూస్వామ్య వర్గానికి ప్రాతనిథ్యం వహించే పార్టీలూ మరోవైపున ఈ శక్తులను వ్యతిరేకించే వామపక్ష పార్టీలు సంకీర్ణ ప్రభుత్వంలో కీలక భాగస్వాములు కావటంతో వాటి మధ్య సమన్వయం కొరవడటం, వర్గ సామరస్యం లోపించటం సహజమైంది. అయితే ఈ సమన్వయ లోపానికి వర్గ దృక్పథంతో కూడిన విధానాలు అనుసరించాలని వామపక్షాలు నిర్ణయించటం కారణం. ఈ విధానాలతో వామపక్షాలు ప్రజలకు మరింత దగ్గరయ్యాయి. 71 ఎన్నికలకు ముందు వామపక్షాలు మూడింట ఒకవంతు ఓట్లు సాధించేవని పైన చెప్పుకొన్నాము. అప్పట్లో వామపక్షాల ప్రజాకర్షణ శక్తికి ఏర్పడ్డ పరిమితులను ఈ రెండు సంకీర్ణ ప్రభుత్వ ప్రయోగాల ద్వారా వదిలించుకో గలిగాయి. రాష్ట్రంలో వర్గ సమీకరణాలు మారి, శ్రమజీవులందరూ ఒక పక్షంగానూ, దోపిడీ దారులందరూ మరో పక్షంగానూ చీలిపోయిన వాతావరణం నెలకొంది. సంకీర్ణంలోని భాగస్వాములు తమ బలాన్ని పెంచుకునేందుకు ఒకరిని మించి ఒకరు ఎత్తులు వేసుకున్నారు. ప్రజా ప్రయోజనం, శ్రామికవర్గ ప్రయోజనం, ప్రజాస్వామిక విలువల పరిరక్షణ, రాజ్యాంగం హామీ ఇచ్చిన కనీసహక్కులు ప్రజలకు అందుబాటులోకి తేవటమే లక్ష్యంగా ఎంచుకున్న భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) అందుకనుగుణంగా ప్రజాసమీకరణ, తద్వారా వర్గ శక్తుల పొందికలో మార్పు సాధనే లక్ష్యంగా ఈ కాలంలో పోరాటాలు చేసింది. ఈ కాలంలో జరిగిన పారిశ్రామిక ఆందోళనల్లోనే జ్యోతిబసు లయన్ ఆఫ్ ది సమ్మర్ (మండువేసవిలో గర్జించే సింహంగా) పేరు పొందాడు. ఎక్కడ ఏ చిన్న సమస్య తలెత్తినా పార్టీ అక్కడ ప్రత్యక్షమయ్యే స్థితికి పార్టీ సభ్యులు, శ్రేయోభిలాషుల పునాది విస్తరించింది. ఈ కాలంలోనే సిపిఐ(ఎం) భారతదేశంలో విప్లవానికి కార్మిక, కర్షక మైత్రి పునాది అన్న పార్టీ కార్యక్రమ సారాంశాన్ని ఆచరణలో పెట్టింది.

ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో బలమైన శక్తిగా ఉన్న సిపిఐ(ఎం) ప్రధాన ప్రతిపక్షంగా ఎదిగింది. ప్రజలముందు రాజకీయ ఆర్థిక ప్రత్యామ్నాయాన్ని ఉంచింది. 77కు ముందు జరిగిన అన్ని ఎన్నికల్లోనూ వామపక్ష పార్టీలు మూడింట ఒకవంతు ఓట్లు సంపాదించుకుని కీలకమైన శక్తిగా ఉన్నాయి. ప్రజాందోళనల ద్వారా వామపక్షాలు, ప్రత్యేకించి సిపిఐ(ఎం) ప్రజలకు మరింత దగ్గరైంది. ఈ కాలంలో రాష్ట్రంలో అస్థిరతతో పాటు అణచివేత కూడా కాంగ్రెస్ చేతిలో కీలక సాధనంగా మారింది. స్వేచ్ఛా పిపాసులైన బెంగాల్ ప్రజలు ఈ అణచివేతను తీవ్రంగా వ్యతిరేకించారు. తొలిసారి రాష్ట్రంలో 1967లో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. ఈ సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) వివిధ వర్గాల ప్రజలకు చేరువయ్యేందుకు వీలుగా హోంశాఖతో పాటు వ్యవసాయ శాఖ, కార్మికశాఖ వంటి మంత్రిత్వ శాఖలు చేపట్టింది. ఈ కాలంలోనే రాష్ట్ర ప్రభుత్వం తొలిసారి శాంతిభద్రతల సమస్యను రెండు రకాలుగా విభజించింది. ఒకటి వర్గపోరాటాలు, రెండోది వ్యక్తిగత విషయాలు, చట్టాల ఉల్లంఘన, దోపిడీలు, ఆరాచకత్వానికి సంబంధించిన శాంతిభద్రతల సమస్య జ్యోతిబసు నేతృత్వంలోని హోంశాఖ శాంతిభద్రతల సమస్యలపై తీవ్రంగా స్పందించేది. కాని వర్గపోరాటాల విషయంలో జోక్యం చేయడానికి పరిమితులు విధించింది. తద్వారా రాజ్యాంగ యంత్రం వర్గ పోరాటాల విషయంలో తటస్థం ప్రదర్శించేలా చేయగలిగింది సిపిఐ(ఎం) నేతృత్వంలోని ప్రజాతంత్ర ఉద్యమం. బహుశా ప్రపంచంలోనే ఇది వామపక్షాలకు కొత్త అనుభవం. జాతీయ స్థాయిలో రాజ్యాంగ యంత్రం వర్గ ఉద్యమాల పట్ల అణచివేత వైఖరి అనుసరిస్తూ ఉండగా ఒక నిర్దిష్ట ప్రాంతంలో మాత్రం రాజ్యాంగ యంత్రం వర్గ పోరాటాల పట్ల తటస్థ ధోరణి అనుసరించేలా చేయగలగడం ఆ ప్రాంత వామపక్ష ఉద్యమం సాధించిన ప్రత్యేక విజయంగా చెప్పుకోవాలి.

బెంగాల్‌లో వర్గ పోరాటాలను రాజ్యాంగ యంత్రం జోక్యం పరిధి నుండి మినహాయింపు చేయటం ద్వారా పాలనా వ్యవస్థలో ఏర్పడింది. మాన్యాన్ని భర్తీ చేయటానికి ప్రజా ఉద్యమాలను సిపిఐ(ఎం) సాధనంగా మల్చుకొంది. ఈ విధమైన ఎత్తుగడ ప్రజలకు తక్షణ ప్రయోజనాలూ, ఉద్యమానికి ఫలితాలూ చూపించటంతో మరింత మంది ప్రజానీకం అధ్యయనంలోకి ప్రవేశించేలా ప్రోత్సహించింది. అదేసమయంలో ప్రజా ఉద్యమం స్థానికంగా పాలనా యంత్రాంగం పాత్ర కూడా పోషిస్తూ ముందుకు సాగింది. వర్తమాన దేశంలో నిర్దిష్ట ప్రాంతంలో రాజ్యాంగ యంత్రాన్ని బలహీనం చేసి ప్రజా ఉద్యమం ఆ స్థానం ఆక్రమించుకోవటం అన్నది బెంగాల్ ప్రయోగంలోనే సాధ్యమైంది. దానికి ముందు తెలంగాణా సాయుధ పోరాట కాలంలో పరిమిత ప్రాంతంలో ఈ ప్రయోగాన్ని అమలు చేసింది కమ్యూనిస్టు పార్టీ.

ఈలోగా 1971లో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధం, బంగ్లాదేశ్ ఆవిర్భావంతో జాతీయస్థాయిలో వెల్లువెత్తిన ప్రజాదరణతో కాంగ్రెస్ ఇందిరాగాంధీ నేతృత్వంలో తిరిగి అధికారానికి వచ్చింది. బ్యాంకుల జాతీయీకరణ, రాజభరణాల రద్దు వంటి చర్యలతో పాటు 71లో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధం, దాని నేపథ్యం, సిద్ధించిన విజయం కూడా జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అస్థిరతను ఒక కొలిక్కి తెచ్చింది. ఇందిరా గాంధీ కాంగ్రెస్ పార్టీకి తిరుగులేని నేతగా మారారు. నెహ్రూ మరణం తర్వాత జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌కు ఈ విధమైన ఆదరణ లభ్యం రావటం ఇదే మొదటిసారి కావటంతో ఇందిరా గాంధీ కోటరీకి కన్నుమిన్నూ గాననీ పరిస్థితి ఏర్పడింది. 71లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ప్రత్యేకించి బెంగాల్‌లో ప్రజాస్వామిక విలువలకు పాతర వేశారు. చివరకు ఎన్నికల్లో పాలకపార్టీ అనుసరించిన అప్రజాస్వామిక చర్యలకు నిరసనగా జ్యోతిబసు సైతం ఎంఎల్ఏ పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. దీర్ఘకాలంగా బెంగాల్‌లో వామపక్షాల ఎదుగుదలను అడ్డుకోవాలని

కాంగ్రెస్ చేసిన అన్ని ప్రయత్నాలు విఫలం కావటం, జాతీయ స్థాయిలో పెరిగిన ప్రజాదరణ దన్నుతో వచ్చిన అధికారాన్ని సక్రమంగా ప్రజోపయోగ చర్యలకు వినియోగించటానికి బదులు బంధుప్రీతికి, అధికార దుర్వినియోగానికి, రాజకీయ నిరంకుశత్వానికి ప్రతిపక్షాల ఏరివేతకు కాంగ్రెస్ ఉపయోగించుకొంది. ఈ దుర్బుద్ధి మరింత విస్తరించి చివరకు దేశాన్ని అత్యవసర పరిస్థితి వైపు నెట్టింది. ఈ కాలంలో సుస్థిరమైన సంకీర్ణం ఏర్పడేందుకు అవకాశం లేకపోయింది. పాలనా యంత్రాంగం రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన సామాజిక ఆర్థిక అంశాలపై దృష్టి కేంద్రీకరించే సామర్థ్యాన్ని కోల్పోయింది.

వర్గపోరాటాలు

రాజకీయ అస్థిరతతో, పాలనా యంత్రాంగం వైఫల్యంతో కకావికలైన బెంగాల్‌లో వర్గపోరాటాలు పుంజుకున్నాయి. సంకీర్ణ ప్రభుత్వాల నేతృత్వంలో అమలు జరిగిన భూసంస్కరణల ఫలాలు పరిరక్షించుకునే క్రమంలో రాష్ట్రంలో ప్రతి గ్రామం వర్గపోరాట వేదికగా మారింది. రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వాలను రద్దుచేసిన ప్రతిసారీ కేంద్రం రాష్ట్రపతి పాలన విధించింది. రాష్ట్ర పాలనా పగ్గాలు చేపట్టింది. రాష్ట్రంలో జరుగుతున్న పోరాటం అప్పటి వరకు సాధించిన విజయాలను సంఘటితంచేసుకోవటానికి అన్న విషయాన్ని అర్థం చేసుకోలేని పార్టీలోని కొన్ని శక్తులు నక్సల్బరీ ప్రాంతంలో పార్టీని ధిక్కరించి సాయుధ చర్యలకు పాల్పడటంతో నక్సలైట్ ఉద్యమం ఆవిర్భవించింది. రాష్ట్రంలో అస్థిరతను మరింత పెంచి పోషించటంలో నక్సలైట్ ఉద్యమం తనవంతు పాత్ర పోషించింది. పైగా ఈ ఉద్యమం ప్రారంభం అయిన కొద్దికాలానికే సిపిఐ(ఎం)ను తన ప్రధాన శత్రువుగా ఎంచుకొంది. నేడు ఒరిస్సా, బీహార్, జార్ఖండ్ సరిహద్దు ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకుని మావోయిస్టులు బెంగాల్‌లో కార్యక్రమాలు వెలసినట్లే నాడు నక్సలైట్లు భౌగోళిక వెసులుబాటును ఆసరాగా తీసుకున్నారు. దేశవ్యాపితంగా అత్యవసర పరిస్థితి కింద ప్రజల హక్కులు నలిగిపోతుంటే నక్సలైట్లు బెంగాల్‌లో కాంగ్రెస్‌తో కలిసి వామపక్షాల ప్రత్యేకించి సిపిఐ(ఎం) కార్యకర్తలను ఊచకోత కోయటం ప్రారంభించింది. ఈ పరిణామమే ఆధునిక బెంగాల్‌లో అర్థఫాసిస్టు పాలనగా రికార్డులకెక్కింది. ఈ కాలంలో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బెంగాల్‌ను దారిలోకి తెచ్చుకునేందుకు అనేక చర్యలు చేపట్టింది. అందులో రెండు ముఖ్యమైన పరిపాలనాపరమైన మార్పులున్నాయి. ఒకరి ప్రభుత్వం అనుసరించే అణచివేత విధానం రాజ్యాంగ పరిమితులకు బయట ఉంటుందని ప్రకటించటం. ఇందులో భాగంగా పోలీసులు ఏ పరిస్థితుల్లో కాల్పులకు పాల్పడినా దానిపై న్యాయవిచారణ ఉండదని ప్రకటించటంతో ఉద్యమాలపై పోలీసులు విరుచుకుపడటానికి తెర తీసినట్లైంది. రెండోది గూఢచారి విభాగానికి నక్సలైట్ సమస్య పరిష్కార బాధ్యతలు అప్పగించటం, కేంద్రం నక్సలైట్ అన్నపదానికి ఇచ్చిన నిర్వచనం చాలా విస్తృతమైనది. రాష్ట్రంలో ప్రధాన రాజకీయ స్రవంతిలో పని చేస్తున్న వామపక్షాలు, సిపిఎం కార్యకర్తలకు కూడా వర్తించే విధంగా మార్చి వీరందరినీ ఏరివేసే బాధ్యత గూఢచర్య విభాగానికి అప్పగించారు. ఈ విధంగా పోలీసులకు అదుపు లేని అణచివేత అధికారాలు ఇవ్వటం, నేరస్థులు, రాజకీయ నేరస్థుల మధ్య గీతను చెరిపేయటం ద్వారా అర్థఫాసిస్టు పాలనకు తెరతీసింది. ఇందిరా గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కర్తవ్యాన్ని తన భుజస్కంధాలపై వేసుకున్న వ్యక్తి సిద్ధార్థ శంకర్ రే.

ఈ కాలంలో జరిగిన మారణ హోమం గురించి తెలుసుకునేందుకు మచ్చుకు రెండు ఉదాహరణలు ప్రస్తావించుకుంటే సరిపోతుంది. 1972లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పెద్దఎత్తున రిగ్గింగు, అక్రమాలకు పాల్పడి విజయం సాధించిందని అప్పట్లో టైమ్స్ ఆఫ్ ఇండియా కలకత్తా విలేకరిగా ఉన్న పజల్ బసు విపులంగా రాశారు. ఎన్నికలకు ముందు, తర్వాత కిరాయి గూండాలతో మారణ హోమం సృష్టించి ప్రతిపక్ష పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులను హతమార్చిన తీరునుకూడా టైమ్స్ఆఫ్ ఇండియా సవివరంగా చిత్రీకరించి పజల్ బసు మాటల్లో అరవయ్యో దశకం చివర్లో రాష్ట్రం చవిచూసిన హింస కంటే ఈ కాలంలో చవిచూసిన హింస మోతాదులోనూ, బీభత్సంలోనూ అధికంగా ఉందని అభిప్రాయపడింది. శంకర్ ఘోష్ అనే రచయిత చేపట్టిన అధ్యయనంలో ఈ కాలంలో ఒక్క బీర్‌భూమి జిల్లాలోనే కనీసం రోజుకు మూడునాలుగు రాజకీయ హత్యలు జరిగాయని నిర్ధారించారు. 1971 జూన్‌లో రాష్ట్రపతి పాలన విధించిన కొద్ది నెలల్లోనే కాశీపూర్ -బాదానగర్ ప్రాంతంలో నక్సలైట్లన్న నెపంతో 150 మంది యువకులను పోలీసులు ఊచకోత కోశారు. ఘోష్ అప్పట్లో హిందూస్తాన్ స్టాండర్డ్ పత్రిక ప్రతినిధిగా ఈ విషయాన్ని వెలుగులోకి తెచ్చారు. పట్టపగలే ఈ ప్రాంతంలో శవాలు, చేతులు, కాళ్లు తెగిన మొండాలు చెల్లా చెదరుగా పడి ఉన్నాయని రాశారు. ఈ శవాలను, మొండేలను పోగుచేసి పట్టపగలే అందరూ చూస్తుండగా రిక్షాల్లో తీసుకెళ్లి హుగ్లీ నదిలో విసిరేశారని తెలిపారు. ఘోష్ మాటల్లోనే, “ఈ కాలంలో రాష్ట్రంలో భయోత్పాతం తారాస్థాయికి చేరింది. రాత్రుళ్లు యువకులైన వారెవ్వరూ ఇళ్లల్లో ఉండే పరిస్థితి లేకపోయింది. పోలీసు లాకప్‌కు వెళ్లని నడివయస్కులు లేరంటే ఆశ్చర్యం లేదు” ఇదీ, ఇందిరాగాంధీ కనుసన్నల్లో బెంగాల్‌లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన తీరు. ఈ రకమైన హత్యాకాండతో పాటు 60వ దశకం చివర్లో సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో జరిగిన భూసంస్కరణలను కాంగ్రెస్ నేతృత్వంలోని రాష్ట్రపతిపాలన తిరగదోడటం ప్రారంభించింది. దాంతో పాటు బెంగాల్‌లో నెలకొన్న రాజకీయ అస్థిరత నేపథ్యంలో పెద్దఎత్తున పెట్టుబడులు వలస పోయాయి. పారిశ్రామిక రంగం కుదేలైంది. ఈ కాలంలో మొత్తంగా ప్రభుత్వ పరిపాలనా యంత్రాంగమే పక్షవాతం సోకిన మాదిరిగా మారిపోయింది.

బెంగాల్‌లో సుస్థిరత సాధించిన వామపక్ష ప్రభుత్వం

ఈ నిర్బంధాన్ని వ్యతిరేకించి ప్రజాతంత్ర ఉద్యమానికి ఊపిరిలూదింది సిపిఐ(ఎం). కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజాస్వామిక వ్యవస్థ ఖూనీకి వ్యతిరేకంగా రాష్ట్రంలోనే కాక దేశవ్యాప్తంగా ప్రజాతంత్ర శక్తులను సమీకరించి ప్రజాస్వామ్య పరిరక్షణా ఉద్యమాన్ని నిర్మించింది. భారత కమ్యూనిస్టుపార్టీ మార్క్సిస్టు. ఈ ఉద్యమాన్ని బెంగాల్ ప్రజలు ఆదరించారు సమర్థించారు. మద్దతిచ్చారు. ఉద్యమంలో ప్రత్యక్ష, భాగస్వాములయ్యారు. ప్రత్యేకించి 1971-77 మధ్యకాలంలో భూమిహక్కు కోల్పోయిన పేద, మధ్యతరగతి రైతులందరూ ప్రజాస్వామిక పరిరక్షణ పోరాటానికి బాసటగా నిలిచారు. దీనికి తోడు 1971 పూర్వం ఐక్య సంఘటన ప్రభుత్వాల్లో వచ్చిన అనుభవాల ఆధారంగా సిపిఎం తన నిర్మాణాన్ని పటిష్టం చేసుకొంది. ఏ వర్గాల్లో పార్టీ విస్తరణ బలహీనంగా ఉందో ఆయా వర్గాలను పార్టీ పరిధిలోకి తెచ్చుకోవటానికి ప్రత్యేక కృషి జరిగింది. ఈ కాలంలో ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ నిర్మాణాన్ని పటిష్టపర్చుకునేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నాలు జరిగాయి.

తద్వారా యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో పాల్గొనటం ద్వారా తాను చేపట్టిన ప్రజానుకూల విధానాల ద్వారా ప్రభావితులైన వర్గాలను నిర్మాణంలో సంఘటితం చేసుకోవటానికి పార్టీ ప్రాధాన్యత ఇచ్చింది. దీంతోపాటు దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ అప్రతిష్ట పాలుగావటం, దేశవ్యాప్తంగా జరిగిన ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో సిపిఐ(ఎం) నిర్వహించిన పాత పార్టీ విశిష్టత పెరగటానికి దోహదం చేసింది. వెరసి 1977 ఎన్నికల్లో 35.8 శాతం ఓట్లతో సిపిఐ(ఎం) రాష్ట్ర రాజకీయాల్లో ఏకైక బలమైన శక్తిగా అవతరించింది. మిగిలిన వామపక్షాలకు వచ్చిన ఓట్లు శాతాన్ని పరిగణనలోకి తీసుకొంటే పోలైన ఓట్లలో 50 శాతం పైగా ఓట్లు సాధించేశక్తి సంపాదించింది. వామపక్ష సంఘటన, స్వతంత్ర భారతదేశంలో మెజారిటీ ఓట్లతో ప్రభుత్వం ఏర్పడటం ఇదే ప్రథమం. నెహ్రూ నేతృత్వంలో ఏర్పడిన ప్రభుత్వాలకు కూడా సీట్లు ఎక్కువ వస్తేవచ్చాయి గానీ ఓట్లు 40 శాతానికి మించి దక్కలేదు. ఈ విధంగా బెంగాల్ వామపక్ష సంఘటన ప్రభుత్వం పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో విలక్షణమైన రికార్డు సృష్టించింది. తద్వారా రాష్ట్రంలో మూడు దశాబ్దాల పాటు కనిపించని రాజకీయ సుస్థిరతను వామపక్ష సంఘటన పాలన తెరతీసింది. ప్రజాస్వామిక రాజ్యాంగం పరిధిలో ప్రత్యామ్నాయ ప్రభుత్వాలు మనుగడ సాగించవచ్చని ఈ ప్రయోగం రుజువు చేసింది.

77 ఎన్నికల తర్వాత పరిపాలనా వ్యవస్థను పట్టాల మీదకు తేవటం, రాజకీయహింసను కట్టడి చేయటం వామపక్ష ప్రభుత్వ తక్షణ ప్రాధాన్యతలుగా మారాయి. రాజకీయ సుస్థిరత, బూర్జువా ఆర్థిక వ్యవస్థ పరిధిలో ఆర్థికాభివృద్ధి, భూసంస్కరణల అమలు వామపక్ష సంఘటన ప్రభుత్వ పాలనా కర్తవ్యాలుగా మారాయి. మిగిలిన రాష్ట్రాల్లో ప్రభుత్వాలు చేసే వాగ్దానాల అమలు స్థాయి కంటే బెంగాల్‌లో వామపక్ష సంఘటన ప్రభుత్వం చేసిన వాగ్దానాల అమలు స్థాయి ఎక్కువగా ఉండటాన్ని అప్పట్లో రాజకీయ పరిశీలకులందరూ గుర్తించారు. శక్తివంతమైన పార్టీ యంత్రాంగం ఉండటంతో ప్రభుత్వ విధానాల ఫలాల విషయంలో న్యాయబద్ధమైన లబ్ధిదారుల ఎంపిక సాధ్యం అయింది.

దీర్ఘకాలం అధికారంలో ఉండటంతో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల్లో ప్రభుత్వం పట్ల, పార్టీ పట్ల ఆశాభావం సహజంగానే ఎక్కువగా ఉంది. వీరి ఆకాంక్షలను చేరుకునేలా వ్యవహరించే బాధ్యత ప్రభుత్వంపైనా, పార్టీపైనా పడింది. ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో రాష్ట్రాల ఆర్థిక వనరులు బలహీనపడటంతో రాష్ట్ర ప్రభుత్వాలు గతంలో వలె అత్యధిక ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే శక్తి సామర్థ్యాలు బలహీనపడ్డాయి. ప్రత్యేకించి దీర్ఘకాలంగా పెట్టుబడుల వలసను చవిచూసిన బెంగాల్‌లో ఈ సమస్య మరింత పెద్దదిగా కనిపించటం సహజం. ఉన్న పరిమితుల్లోనే వామపక్ష సంఘటన సాధించిన విజయాలు, అందించిన సేవలను ప్రజలు విశ్వసించారు, ఆహ్వానించారు. ప్రముఖ రాజకీయశాస్త్ర నిపుణుడు అతుల్ కోహ్లీ మాటల్లో "మిగిలిన రాష్ట్రాల్లో పార్టీలు, ప్రభుత్వాలతో పోల్చి చూసినపుడు బెంగాల్‌లో సిపిఎం పార్టీ ప్రభుత్వం చేసే వాగ్దానాలు చిన్నవైనా సాధించిన విజయాలు పెద్దవి. ప్రత్యేకించి సామాజికంగా బలహీనవర్గాలకు వామపక్ష సంఘటన ప్రభుత్వం అందించిన సేవలు ఏరాష్ట్రంలో ఏ ప్రభుత్వమూ అందించలేదు. అందులో ముఖ్యమైనది భూమిపై హక్కు కల్పించటం. ఇది గ్రామీణ ప్రజల ఆదాయవనరులు పెంచింది. తద్వారా పార్టీ, ప్రభుత్వం, ప్రజల మధ్య విడదీయరాని సాన్నిహిత్యం ఏర్పడింది" అని వ్యాఖ్యానించడం గమనించాల్సిన విషయం.

ప్రజాతంత్ర వ్యవస్థలను మరింత వేళ్లూనుకునేలా చేయటంలో బెంగాల్ దేశానికే ఆదర్శంగా నిలిచింది. మొదటిసారిగా మూడంచెల పంచాయితీరాజ్ వ్యవస్థను అమలు చేయటంతోపాటు పంచాయితీలకు అధికారాలు, ఆర్థిక వనరులు కూడా బదలాయించి ప్రజాతంత్ర ప్రజాస్వామిక వ్యవస్థను ఉనికిలోకి తెచ్చింది. ప్రభుత్వ ఫలాలు నేరుగా ప్రజలకు చేరేలా చేయడంలో స్వశక్తులైన ఈ పంచాయితీరాజ్ వ్యవస్థలు ముఖ్యమైన సాధనంగా పని చేశాయి. అదేసమయంలో గ్రామీణ ప్రాంతాల్లో సైతం రాజకీయ చైతన్యాన్ని హక్కుల గురించి ప్రశ్నించగలిగే ప్రజాతంత్ర చైతన్యాన్ని అందించటంలో వామపక్ష సంఘటన అమలు జరిపిన పంచాయితీరాజ్ సంస్కరణలు కీలకపాత్ర పోషించాయి. అతుల్‌కోహ్లీ మాటల్లోనే "ఈ రకమైన పంచాయితీరాజ్ సంస్కరణల పట్ల కేంద్ర ప్రభుత్వం అమలు జరుపుతున్న అనేక సంక్షేమ పథకాలు – ఉదాహరణకు పనికి ఆహార పథకం వంటివి–మిగిలిన రాష్ట్రాల్లో కంటే బెంగాల్‌లోనే సమర్థవంతంగా అమలు జరిగింది"

ఈ పరిస్థితుల్లో దేశాన్ని ఉప్పెనలా చుట్టుముట్టిన ఆర్థికసంస్కరణల భావజాలం ఇటువంటి ప్రత్యామ్నాయ అభివృద్ధి విధానాలను అవలంబించే ప్రభుత్వాలకు మరింత కష్టకాలం తెచ్చిపెట్టాయి. దశాబ్దన్నరకాలంగా అమలు జరుపుతూ వచ్చిన సంపద పునఃపంపిణీ విధానాలను కొనసాగించటం క్లిష్టంగా మారింది. ఈ కాలంలోనే ఒక రాజకీయ పార్టీగా కాంగ్రెస్ వైఫల్యం అత్యవసర పరిస్థితి కాలంలో ప్రారంభమై 90వ దశకం చివరి నాటికి తారాస్థాయికి చేరింది. తొలుత రాష్ట్రాల్లో ఈ వైఫల్యం వ్యవస్థీకృతమైంది. క్రమంగా రాజీవ్‌గాంధీ అనంతర కాలంలో ఈ వైఫల్యం అఖిల భారత స్థాయికి విస్తరించింది. ఈ స్థానాన్ని పూరించేందుకు వివిధ రాష్ట్రాల్లో వివిధ రకాల శక్తులు తలెత్తాయి.

మహారాష్ట్రలో మతోన్మాద శివసేన రాజకీయ రంగంలో ప్రధాన శక్తిగా అవతరించగా దక్షిణాది రాష్ట్రాల్లో ప్రాంతీయబూర్జువా వర్గాలకు ప్రాతినిధ్యం వహించేపార్టీలు బలం పుంజుకున్నాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో అస్తిత్వ రాజకీయాలు కాంగ్రెస్ వైఫల్యంతో ప్రేరణ పెచ్చరిల్లాయి. ఈ కోవకు చెందిందే బెంగాల్‌లో తృణమూల్ విజృంభణ. బెంగాల్‌లో సుదీర్ఘకాలం రాజకీయ నేతృత్వం కోల్పోయిన పాలక వర్గానికి తృణమూల్ ఆవిర్భావంతో ఓ ఆయుధం దొరికినట్లైంది. దీర్ఘకాలంగా నిద్రాణంగా ఉన్న విచ్ఛిన్నకర శక్తులకు తృణమూల్ వేదికగా మారింది. వర్గచైతన్యం ఆధారిత రాజకీయాల స్థానంలో ఇప్పటివరకూ బెంగాల్‌లో కనిపించని అస్తిత్వవాదాలు తిరోగమన వాదాలు నేడు మనకు కన్పిస్తున్నాయి.

మూడున్నర దశాబ్దాల వామపక్ష పాలనలో అసెంబ్లీలో అడుగు పెట్టలేకపోయిన బిజెపి దశాబ్దపు తృణమూల్ పాలనలో ప్రధాన ప్రతిపక్షం స్థాయికి చేరింది. ఈ శక్తులు బెంగాల్ గత మూడున్నర దశాబ్దాలుగా సాధించిన రాజకీయ సుస్థిరతను, ప్రజాతంత్ర చైతన్యాన్ని, ఆర్థిక ఫలాలను ధ్వంసం చేస్తున్న వైనం మన కళ్ల ముందు కనిపిస్తోంది. అస్థిరతతో కూడిన రాష్ట్రాన్ని అభివృద్ధి పట్టాలెక్కించిన వామపక్ష పాలన వైఫల్య సాఫల్యాలను ఈ చారిత్రక పరిణామాల నేపథ్యంలో అంచనా వేయడం, ప్రత్యామ్నాయాలు ప్రతిపాదించడం మరోప్రస్థానానికి దారులు వేయగలుగుతుంది. నడిపించటానికి దేశవ్యాప్తంగా అన్ని ప్రజాతంత్ర శక్తులు తమవంతు మద్దతు అందించాల్సిన సమయం ఆసన్నమైంది.

(రచయిత జర్నలిస్టు) వీ

తత్వశాస్త్ర ప్రాథమిక ప్రశ్నలు

***మతం ప్రాతిపదికగా ఉండే ప్రాపంచిక దృక్పథానికి, తత్వశాస్త్ర ప్రాపంచిక దృక్పథానికి చాలా వ్యత్యాసం ఉంటుందని అంటున్నారు* యు.ఎ. ఖారిన్**

(...గత సంచిక తరువాయి భాగం)

ఈ ప్రపంచం ఎట్లా ప్రారంభమయింది, దీని మూలమేమిటి, సారమేమిటి, మనుష్య జాతి ఆరంభం ఎట్లా జరిగింది, మనిషి జీవితం మూలం ఏమిటీ, మానవుని చైతన్యం, జీవిత సారం ఏమిటీ, మానవుని జీవితానికి అర్థం ఏమిటీ అన్నవి ఏ తత్వశాస్త్రానికయినా సాధారణంగా ఎదురయ్యే ప్రశ్నలు. ఈ ప్రశ్నలకు సమాధానం వెతికే ప్రయత్నం చేశారు తత్వవేత్తలు. తత్వ శాస్త్రాన్ని ఇంగ్లిష్‌లో 'ఫిలాసఫీ' అని అంటారని మనందరికీ తెలుసు. ఫిలాసఫీ అన్న పదాన్ని మొట్టమొదటి సారి గ్రీకు తత్వవేత్త పైథాగరస్ వాడాడు. ఆ పదానికి అర్థం 'వివేచనా శక్తిపట్ల ప్రేమ" అని చెపుతారు. తత్వశాస్త్ర సిద్ధాంతాలు ప్రస్తావనకు వచ్చినప్పుడు భారతీయ భాషలలో 'దర్శనం' అన్న పదం తరుచుగా వాడబడుతూ ఉంటుంది. ఈ 'దర్శనం' అన్న పదం 'దృష్టి' అన్న పదం నుండి వచ్చింది. 'దృష్టి' అంటే చూపు. కాబట్టి, ప్రపంచాన్ని చూసే దృష్టి కోణం, ప్రపంచం అంటే ఏమిటో, అందులో మానవ ఉనికి అర్థం వెతకడం – వీటిని తత్వశాస్త్రం అనవచ్చు.

తత్వశాస్త్రం వేసే ప్రశ్నలకు వివరణ అంతా బాహ్య ప్రపంచం తో మనిషికి ఉన్న సంభందం, వస్తుగత వాస్తవాలతో కూడిన మానవుని చైతన్యాన్ని వివరించడం లోనే ఉంటుంది. ఈ విషయమే తత్వ శాస్త్రానికి ప్రాథమికమయినది. వేల సంవత్సరాల క్రితం ప్రజలకు వారి శరీర నిర్మాణం గురించి ఏమీ తెలియదు, ముఖ్యంగా వారికి వచ్చే కలల గురించి ఏ వివరణా వారికి తోచేది కాదు. అయినప్పటికీ, మనిషి శరీరంలో ఒక నిర్దుష్టమయిన ఆత్మ ఉంటుందని, మనిషి మరణంతో అది ఆ శరీరాన్ని విడిచి వెళ్లిపోతుందని ఒక భావన వారిలో ఉద్భవించింది. మనిషి ఆలోచన, ఇంద్రియ జ్ఞానము శరీర భాగాలు చేసే కార్యకలాపాల వల్ల కాక ఆత్మ జరిపే చర్యల వల్లనే రూపుదిద్దు కుంటాయని కూడా ఒక భావన వారిలో మొలకెత్తింది. ఈ ఆత్మకు బాహ్య ప్రపంచంతో ఉన్న సంబంధం గురించి కూడా ఆ కాలంలో ప్రజలు తప్పనిసరిగా ఆలోచించి ఉంటారు. సంక్షిప్తంగా ఫిలాసఫి అంటే పదార్థానికి చైతన్యానికి మధ్య ఉన్న సంబంధం గురించి స్పషంగా నిర్వచించబడిన భావం ఆధారం చేసుకొని సిద్ధాంత పరంగా క్రమబద్దీకరించబడిన ప్రాపంచిక దృక్పథం. ప్రథమ ప్రాధాన్యత కలిగినది ఏది, ఆలోచనా లేక అస్తిత్వమా? తత్వశాస్త్రానికి సంభందించి ప్రాథమికమైన ప్రశ్నకు ఇది సాధారణ సూత్రీకరణ. దీనికి కొంత సంకుచితంగా, అదే సమయంలో కొంత ఎక్కువగా ఈ విధంగా సూత్రీకరణ చేయవచ్చు: ఈ ప్రపంచాన్ని భగవంతుడు సృష్టించాడా, లేక ఈ ప్రపంచం ఎప్పట్నుంచో ఉనికిలో ఉందా? అదే సమయం లో, చుట్టూ ఉన్న ప్రపంచాన్ని గురించిన మన భావాలకు, ఆ ప్రపంచానికి (అంటే దేవుడు సృష్టించాడు అని అనుకుంటున్న ప్రపంచానికి) సంబంధం ఏమయినా ఉందా, లేదా మరొక విధంగా చెప్పాలంటే 'అసలు ఈ ప్రపంచం మనకు అర్థమవుతుందా? ఇది ఉనికికి ఆలోచనకు మధ్య ఉన్న సంబంధానికి మరొక కోణం.

ఫిలాసఫీకి సంబంధించి ప్రాథమిక ప్రశ్న:

ఆలోచనకు, ఉనికికి మధ్య సంబంధం – చైతన్యానికి ప్రకృతికి మధ్య సంబంధం.

	మొదటి అంశం	రెండవ అంశం
దేనికి ప్రథమ ప్రాధాన్యత:	పదార్థమా లేక చైతన్యమా?	ఈ ప్రపంచాన్ని అర్థం చేసుకోవడం సాధ్యమా?

మనిషి దృక్పథానికి ఉన్న ప్రత్యేకతలు, తన ఉద్దేశ్యంలో తన ఉనికికి అర్థం, సామాజిక ప్రక్రియతో తన సంబంధం, తాను చేసే పనుల లక్ష్యం–తత్వశాస్త్రానికి సంబంధించిన ప్రాథమిక ప్రశ్నకు సమాధానాలుగా ఇవన్నీ ముందే నిర్ణయింపబడతాయి. తత్వశాస్త్రం ఏ విధంగా ఉపయోగపడుతుందో తన అభిప్రాయంగా పురాతన భారతీయ రాజకీయ పరిశీలనాత్మక సిద్ధాంత గ్రంథం 'అర్థశాస్త్ర' ఈ విధంగా చెపుతుంది: "తత్వశాస్త్రం కష్టసమయాల్లో చైతన్యాన్ని పటిష్టపరుస్తుంది, సంతోషాన్నికలగచేస్తుంది, అలాగే తార్కికంగా ఆలోచించడానికి, మాట్లాడడానికి, కార్యాచరణకు సిద్ధం కావడానికి తగు శక్తినిస్తుంది." దీనికి భిన్నంగా తత్వశాస్త్రం అసలు సమస్యకు మరో రకంగా సమాధానం చెప్పిన సిద్ధాంతాలు కూడా ఉన్నాయి. అవి జీవితంలో మనిషి స్థానాన్ని మరొక కోణంలో సూత్రీకరించాయి. ఆత్మ వలననే అన్ని విషయాలు స్ఫూర్తి పొందుతాయని భావించేవారు సహజంగానే ఈ ప్రపంచంలోని చెడును, బాధలను, అవస్థలను నిర్మూలించాలంటే నైతిక ప్రవర్తన సరిగా ఉండడమే ఏకైక మార్గం అని భావిస్తారు, అలాగే కర్మ సిద్ధాంతాన్ని నమ్మడమే శాశ్వతమయిన నైతిక నియమమం అని కూడా నమ్ముతారు. తన గురించి తాను అన్వేషించడం, తన గురించి తెలుసుకోవడమే మనిషి ఉనికికి అర్థం అనీ, మోక్షం పొందడం ప్రధానమని, ఆ విధమయిన తత్వశాస్త్రం కట్టడి చేస్తుంది. సామాజిక చర్యలను అంగీకరించదు.

దీనికి భిన్నంగా, అసమానతలకు, అణిచివేతకు సామాజిక కారణాలను ప్రజలు తెలుసుకొని కొత్త సామాజిక సంబంధాలు నెలకొల్పే దిశగా నిర్ణయాత్మక పోరాటం చేపట్టడం జరగాలంటే మానవుని ఉనికియే ప్రాథమికమని, మానవుని ఉనికిలో సంభవించే మార్పులను కనుగొనే అవకాశాలను గుర్తించడం ప్రధానంగా ఉన్న తత్వ విచారం మనుగడలో ఉంది. మనిషి తన ఉనికికి నిజమయిన

అర్థం సామాజిక అసంబద్ధతలకు వ్యతిరేకంగా సమిష్టి పోరాటం కొనసాగించడం, సమాజ ప్రగతికి అవసరమయిన ఆలోచనలను, ఆదర్శాలను అవగతం చేసుకొని వాటిని ఆచరించడం అనే అంశం కూడా దీనిలో అంతర్లీనంగా ఉంది.

ఈ రకంగా తత్వశాస్త్రం యొక్క ప్రాథమిక సమస్యను సమగ్రంగా విశ్లేషించినప్పుడు తత్వశాస్త్రంలోని కొన్ని ధోరణులు సమాజంలోని వర్గ సంఘర్షణపట్ల ఏ విధంగా పక్షపాత వైఖరి అవలంబిస్తున్నాయో తేటతెల్లం అవుతుంది.

అస్థిత్వానికి, ఆలోచనకు మధ్య ఉండే సంబంధం ఏమిటి అన్న ప్రాథమిక ప్రశ్నకు సమాధానం ఇచ్చే విధానాన్ని బట్టి తత్వవేత్తలను రెండు సమూహాలుగా విభజించవచ్చు. ఆ రెండు సమూహాలలో ఒక దానిని భౌతిక వాదమని, మరొక దానిని భావ వాదమని పేర్కొంటారు. ప్రకృతి, పదార్థము – ఈ రెండూ ప్రాథమికమని, ఆ తదుపరియే చైతన్యం అని, పదార్థం నుండి చైతన్యం ఉత్పన్నమవుతుందని, చైతన్యం పదార్థానికి చెందినదని భౌతికవాదులు భావిస్తారు. అందుకు భిన్నంగా ప్రకృతికి ముందే చైతన్యం ఉండేదని, ఒక శక్తి ఈ ప్రపంచాన్ని సృష్టించిందని భావవాదులు వాదిస్తారు. ప్రకృతి శాస్త్రాల ఆధారంగా రూపొందించిన భౌతిక శాస్త్ర సిద్ధాంతాలు భగవంతుని ఉనికిని నిరాకరిస్తాయి, నాస్తిక వాదాన్ని పూర్తిగా సమర్థిస్తాయి. మరొక ప్రక్క, భావవాదం మతంతో అవినాభావ సంబంధం కలిగి ఉండి, మత భావనను సైద్ధాంతికంగా సమర్థిస్తూ, మతం ఉనికిని నిరూపించే ప్రయత్నం చేస్తూ ఉంటుంది.

ఈ రోజుల్లో వస్తున్న తత్వశాస్త్ర సూత్రాల నిజమైన అర్థం గ్రహించాలంటే తత్వశాస్త్రం అంటే ఏమిటి అన్న ప్రాథమిక ప్రశ్నకు వాటి సమాధానం ఏమిటో తెలుసుకోవడం అవసరం. ఉదాహరణకు అస్థిత్వ వాదం, వ్యక్తి వాదం, నయా ప్రత్యక్ష అనుభవ వాదం లేదా నయా అనుకూల వాదం, బహుళత్వ వాదం, ఇంకా అనేక పేర్లతో, పండిత ప్రకర్ష భాషలో అనేక ముసుగులు కప్పుకొని ఆధునిక భావవాదం ప్రదర్శితమవుతున్నది. ఈ ఆధునిక కాలంలో తత్వశాస్త్రం ప్రాథమిక ప్రశ్నకు కాలం చెల్లిపోయిందని, భౌతిక వాదానికి – భావ వాదానికి మధ్య అంతరం మాయమై పోయిందని కొంతమంది బూర్జువా తత్వవేత్తలు చెపుతూ ఉంటారు. అది నిజమా? అన్నింటికీ మించి, సామాజిక చైతన్యంలో గణనీయమైన అంశంగా తత్వశాస్త్రం ఎల్లప్పుడూ సామాజిక అస్థిత్వంలో ప్రతిఫలిస్తూ ఉంటుంది. వైవిధ్యంతో కూడిన సామాజిక సంబంధాలు ఉనికిలో ఉన్న సమాజంలో అభ్యుదయకర శక్తుల అభిరుచులు, తిరోగమన వాదుల ఆసక్తులు, అలాగే దోపిడీదారుల ప్రయోజనాలు, దోపిడీకి గురవుతున్న వారి ప్రయోజనాలు పరస్పరం విరుద్ధంగా ఉంటాయి. పరస్పర విరుద్ధమైన వర్గాలు తమ తమ ప్రయోజనాల కోసం పడిన ఘర్షణ చరిత్రలోని వివిధ దశలలో తత్వశాస్త్ర భావ సంఘర్షణలో కూడా ప్రతిఫలించింది. సమాజ అభ్యుదయాన్ని కాంక్షించే శక్తులు, అభ్యుదయకర సామాజిక వర్గాల ప్రతినిధులు భౌతికవాద విజ్ఞానాన్ని అభివృద్ధి చేశాయని చరిత్ర చెపుతున్నది. జ్ఞాన శూన్యత, మూఢ నమ్మకాలను అధిగమించి, శాస్త్రీయ పరిజ్ఞానాన్ని విస్తరింపజేస్తూ, సాంఘిక సంబంధాలలో మార్పులకై, ఉత్పత్తి శక్తుల అభివృద్ధికై తమ వంతు కృషి చేస్తున్న అభ్యుదయకర సామాజిక శక్తుల ప్రాపంచిక దృక్పథాన్ని, ఆ శక్తుల భావజాలాన్ని భౌతికవాదం వ్యక్తపరుస్తుంది. ఆకాలంలో అమలులో ఉన్న సామాజిక క్రమాన్ని సజీవంగా ఉంచడం కోసం, మత సంబంధమైన విశ్వాసాలను పరిరక్షించడం కోసం ప్రయత్నించే తిరోగమన వర్గాల, సామాజిక సమూహాల భావజాలంగా చాలా సందర్భాలలో తత్వశాస్త్రంలో భావవాదం ఉపయోగపడింది. బూర్జువా వర్గం, శ్రామిక వర్గం అన్న రెండు ప్రధాన వర్గాలు, వాటి ప్రయోజనాలు పరస్పరం విరుద్ధం కాబట్టి, వివిధ రూపాల్లో అవి సంఘర్షిస్తూనే ఉంటాయి. ఆ ఆధునిక కాలంలో భౌతిక వాదానికి, భావ వాదానికి మధ్య వైరుధ్యం పై రెండు వర్గాల ప్రయోజనాల మధ్య ఉండే బేధాన్ని వ్యక్తీకరిస్తూ ఉంటుంది.

అందుకని, భౌతిక వాదం/భావ వాదానికి, వర్గ సంఘర్షణకు మధ్య ఉన్న సంబంధాన్ని అతి సరళీకృతం చేయకూడదు. భౌతిక వాదము, భావ వాదము ఎల్లప్పుడూ వేటితో సంబంధం లేకుండా వాటికవే 'స్వచ్ఛం'గా ఉంటాయని అనుకోవడం చాలా పొరపాటు. కొంత మంది తత్వవేత్తలు ప్రకృతికి సంబంధించిన భౌతికవాద అంశాలకు సమాజ గతికి సంబంధించిన ఆదర్శవాద భావాలను జోడిస్తారు. ఆధ్యాత్మికం, భౌతికం – రెండూ విభిన్నమైనన అంశాలు. స్వతంత్రంగా ఉనికిలో ఉన్న ఈ రెండు సిద్ధాంతాలను లేదా రెండు ప్రత్యేకమైన అంశాలను, పరస్పర విరుద్ధమైన రెండు ప్రాపంచిక దృక్పథాలను కలిపే ప్రయత్నం చేసిన ద్వంద్వ సిద్ధాంత ప్రయోగాలు కూడా ఉన్నాయి. చాలా మంది బుర్జువా మేధావులు ప్రస్తావిస్తున్న బహుళత్వ సిద్ధాంతం కూడా పరస్పరం విభేదించే అభిప్రాయాలను న్యాయసమ్మతం కాని విధంగా జతపరుస్తుంది. చాలా (రెండు కంటే ఎక్కువ) అంశాల, విషయాల పునాదిగా విశ్వం ఏర్పడిందని దీని సమర్థకులు భావిస్తారు. నిజానికి, వీరు భౌతిక వాదానికి భావ వాదానికి, తార్కికానికి పురాణానికి, వాస్తవానికి అవాస్తవానికి మధ్య ఉన్న భేదాన్ని తొలగించి మాట్లాడతారు. విశ్లేషణాత్మకంగా పరిశీలిస్తే తత్వశాస్త్రంలో బహుళ వాదం, ద్వంద్వ వాదం వలె, భావవాద గుణం కలిగిన సిద్ధాంతమే.

మొదటి అంశం: ఏది ప్రాథమికం – పదార్థమా లేక చైతన్యమా?

1. చైతన్యంతో సరిపోల్చినప్పుడు పదార్థమే ప్రాథమికమవుతుంది. (ఇది భౌతిక వాదం).

2. పదార్థం, చైతన్యం – ఈ రెండూ మౌలికమైన అంశాలు, ఒక దానితో మరొకదానికి సంబంధం లేకుండా దేనికదే ఉనికిలో ఉంటాయి. (ఇది ద్వద్వ వాదం 'రెనె డెస్కార్ట్స్').

3. చైతన్యమే ప్రధానం. చైతన్యం లేకుండా స్వతంత్రంగా పదార్థానికి మనుగడ లేదు (ఇది భావ వాదం).

శాస్త్రీయ భౌతికవాద తత్త్వం ఒక ఏక రూప సిద్ధాంతం. అంటే ప్రపంచం అనే భావనకు పదార్థమే ప్రాథమికం అనే సిద్ధాంతానికి అనుకూలంగా ఉంటుంది. చైతన్యమే ప్రధానం అన్న సిద్ధాంతాన్ని గుడ్డిగా నమ్మేవారు, భావవాద తత్వశాస్త్ర సిద్ధాంతానికి, జీవితానికి మధ్య ఉండే వైరుధ్యాన్ని విస్మరించిన వ్యక్తులే అని చెప్పవచ్చు.

భౌతిక వాదానికి, భావ వాదానికి మధ్య ఉండే విభేదాన్ని దృష్టిలో ఉంచుకొని, ఎవరైనా ఒక తత్వవేత్త ఏదైనా సిద్ధాంతాన్ని ప్రతిపాదించినపుడు, ఆ సిద్ధాంతం ఆయన ఏ వర్గానికి చెందిన వాడో ఆ వర్గ ప్రయోజనం ఆశించి దానిని ప్రతిపాదించాడనో, ఆయన రాజకీయ భావాలకనుగుణంగా ఆ సిద్ధాంతం రూపొందిందని నమ్మడం సరైనది కాదు. ఏది ఏమైనప్పటికీ, తత్వశాస్త్రంలో విభిన్న సిద్ధాంతాలను

నమ్మే సమూహాల మధ్య స్పష్టమైన విభజన రేఖ ఉన్నది. మానవ సాంస్కృతిక చరిత్రలో దీనిని నిరూపించడానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. అంతిమంగా శత్రు వర్గాల, ప్రతికూల సామాజిక శక్తులకు సంబంధించిన భావజాలాల, పోకడల వ్యక్తీకరణయే భౌతిక వాదానికి, భావ వాదానికి మధ్య ఘర్షణ అని భావించవచ్చు.

ఈ సందర్భంలోనే, ప్రాక్ పశ్చిమ నాగరికతలు సూత్ర బద్ధంగానే వేరువేరు అన్న సూత్రీకరణ ఎంతో తప్పుడు భావన అని గుర్తు చేయడం సముచితంగా ఉంటుంది. ఈ ధోరణి కవిత్వంలో కూడా గోచరిస్తుంది. రుద్యార్డ్ కిప్లింగ్ ఈ విధంగా రాస్తాడు:

తూర్పు తూర్పే, పశ్చిమం పశ్చిమమే!
దేవుని దివ్య ఆస్థానంలో
భూమి ఆకాశాలు వినమ్రంగా
నిలుచుని ఉండేంతవరకు
ఈ రెండూ ఎప్పుడూ కలవవు...

బూర్జువా మేధావులు, మరీ ముఖ్యంగా పశ్చిమ దేశాలకు చెందిన వాదానికే పూర్తి ప్రాముఖ్యతనిచ్చిందని అభిప్రాయ పడ్డారు. డ్యూస్సెల్డార్ఫ్ (వెస్ట్ జర్మనీ) లో 1978లో నిర్వహించిన 'ప్రపంచ తత్వశాస్త్ర సమ్మేళనం'లో కొంత మంది భారతీయ మేధావులు, హేతువు భూమికగా తర్క శాస్త్ర ఆధారాలతో ఉండే పూర్తి శాస్త్రీయ పద్ధతి తూర్పు తత్వశాస్త్ర సారానికి అనుకూలంగా ఉండదన్న ఈ అభిప్రాయం పశ్చిమ యూరోప్ సంస్కృతికి సంబంధించిందని వాదించారు. ఇది ఏకాగ్రతతో కూడిన ఆలోచన కంటే హేతుబద్ధమైన విజ్ఞానానికి, అనుసంధానం కంటే ఆలోచనకు అస్తిత్వాన్ని వ్యతిరేకించడానికి, పురాతన సాంప్రదాయాల, ఆచారాల పరిరక్షణ కంటే మార్పుకు అనుకూలంగా ఉందని వాదించారు. ఉదాహరణకు భారతీయ తత్వవేత్త ఆర్. పణ్ణికర, సైన్స్‌తో దగ్గర సంబంధం కలిగిన పునాదుల మీద ఆధారపడ్డ ఆధునిక నాగరికత సాంస్కృతికంగా ఎదగడానికి ఏకైక మార్గం కాదు అని తన అభిప్రాయం వెలిబుచ్చాడు. వస్తువు, విషయానికి మధ్య ఉన్న భేదంపై, సంధి మార్గాన ఏర్పడే విజ్ఞానంపై ఆధారపడి పాశ్చాత్య హేతువాదం మనగలుగుతున్నదని, దానికి భిన్నంగా తూర్పు

భౌతిక వాద సిద్ధాంతం అభివృద్ధిలో ముఖ్యమైన దశలు

కాలం	సిద్ధాంతం	ప్రతిపాధించిన వారు	వ్యక్తీకరించిన వర్గ ప్రయోజనాలు
క్రీ.పూ. 6–3 శతాబ్దాలు	యాదృచ్ఛిక, అమాయక గతితార్కిక భౌతికవాదం	ఫేలిస్, డెమోక్రిటస్ హెరాక్లిటస్, ఎపిక్యురస్	బానిస సమాజపు ప్రగతిశీల శక్తులు
క్రీ.శ. 17–18 శతాబ్దాలు	అధిభౌతిక భౌతికవాదం	బేకన్, లాక్, స్పినోజా	తలెత్తున్న బూర్జువా వర్గం
క్రీ.శ. 19 శతాబ్ది	విప్లవ ప్రజాస్వామిక వాదుల భౌతికవాదం	బెలిన్స్కీ, హెర్జెన్, చెర్నిషెవ్స్కీ	విప్లవ రైతాంగం
క్రీ.శ. 19–20 శతాబ్దాలు	గతితార్కిక, చారిత్రక భౌతికవాదం	మార్క్స్, ఎంగెల్స్, లెనిన్	కార్మికవర్గం

వారు, ప్రాక్ పశ్చిమ తాత్విక అంశాల మధ్య ఉన్న మౌలికమైన ప్రత్యేకతలను నిర్ధారిస్తాయని చెప్పబడిన వివిధ 'మానవ మానసిక అభివృద్ధి సూచికల'ను తప్పుగా విభేదిస్తారు. మొదటిది అంటే తూర్పు దేశాల తాత్విక సందేశంలో మార్మికత, సృజనాత్మక అంతర దృష్టి ప్రధానంగా ఉంటాయని, నిష్క్రియత్వం, ప్రకృతిలో ఐక్యం కావాలన్న బోధనలు ఉంటాయని వారు నమ్ముతారు. దీనికి భిన్నంగా పశ్చిమ దేశాల తత్వం తార్కికంగా, క్రియాశీలకంగా, విమర్శనాత్మక ఆలోచనకు తావిస్తూ ప్రకృతిని తమకనుకూలంగా మార్చుకునే ప్రత్నంలో ఉంటుందని భావిస్తారు.

భారతీయ తత్వశాస్త్రానికి సంబంధించి, ఆధునిక బూర్జువా పండితులు దైవ శక్తిని నమ్ముతారు. మనిషి విముక్తి తన అంతః ప్రపంచంలోకి వెళ్లిపోవడంలోనే ఉంటుందని, మానసిక సామర్థ్యం కంటే సుప్త చేతనావస్థ ఉత్తమమైనదని భావిస్తారు. ఈ విధమైన అవగాహన వలన చాలా మంది భారతీయ మేధావులు, పశ్చిమ దేశాలకు చెందిన మేధావులు భారత తత్వశాస్త్ర చరిత్రలో పశ్చిమ దేశాల లాగా భావ వాదానికి, భౌతిక వాదానికి ఘర్షణ లేదని భావిస్తారు. భారతీయ తత్వశాస్త్రం ఎప్పుడూ ఆధ్యాత్మికతతోనో లేదా మార్మికతతోనో నిండి ఉంటుందని అంటే ఆ విధంగా అది భావ దేశాల విజ్ఞానం మానవ విముక్తికి దారితీసే ప్రత్యక్ష విజ్ఞానంపై ఆధారపడి ఉంటుందని, అందుకని పాశ్చాత్య విజ్ఞానం కంటే తూర్పు దేశాల విజ్ఞానం గొప్పదని తాను భావిస్తున్నట్టు చెప్పాడు.

ప్రాక్ పశ్చిమ నాగరికతలు రెండూ విభిన్నమైనవన్న వాదన నిజానికి మానవ జాతి ఆధ్యాత్మిక ప్రస్థానాన్ని పూర్తిగా పక్కదారి పట్టించింది. ఈ కోణం నుండి ఆలోచించినప్పుడు భారతదేశ తత్వశాస్త్రం చరిత్ర అంతా సమాజంలో జరిగే సాంఘిక, ఆర్థిక పరిణామాలతో గాని, వర్గ సంఘర్షణతో గాని సంబంధం లేకుండా కేవలం ఆధ్యాత్మిక ప్రపంచంలో విచ్చుకున్న భావాల కూడలి లాగా అనిపిస్తుంది. రెండింటిలో ఉన్న భిన్నత్వాన్ని మాత్రమే చూసే వారు భారతీయ తత్వవేత్తలందరు మతం కోణంలోనే విషయాలను తెలుసుకున్నారన్న పొరపాటు అభిప్రాయాన్ని కలిగి ఉంటారు. అయితే, భారతీయ తత్వశాస్త్రంలోని వివిధ ఆలోచనలు, ధోరణులు తత్వశాస్త్రం ప్రాథమిక ప్రశ్నలకు వాటి జవాబులు ఆధారంగా కాకుండా వాటికి వేదాలతో ఉన్న సంబంధాన్ని బట్టి వాటి మధ్య ఉన్న తేడాను గుర్తిస్తారు. (వేదం ప్రాముఖ్యతను గుర్తిస్తే అవి 'సాంప్రదాయ బద్ధం'గా ఉన్నాయని, గుర్తించకపోయే సాంప్రదాయానికి వ్యతిరేకమని భావన). ఈ విధమైన ఆలోచనా ధోరణి భౌతిక వాదానికి భావ వాదానికి, చరిత్రలో అభ్యుదయ పోకడలకు తిరోగమన వాదానికి మధ్య ఉండే ఘర్షణ

తీవ్రతను తగ్గించి చూపుతుంది. ఇంకా కొంత మంది ప్రాచీన భారతదేశంలో భౌతిక వాదానికి అసలు మూలాలే లేవని కూడా వాదిస్తారు. అయితే, భారతదేశ తత్వశాస్త్ర చరిత్రలో గాని లేదా ఇతర దేశాలలో గాని ఆధ్యాత్మిక విషయాలలో భౌతిక వాదం యాదృచ్ఛికమో, అనివార్యమో కాదు, అది వారి వారి సంస్కృతీ సాంప్రదాయాలలో విడదీయరాని ముఖ్యమైన అంశం. 'భౌతిక వాదం భారతదేశంలో శతాబ్దాల తరబడి బోధించబడుతూ ఉండింది, కొన్ని కాలాలలో ప్రజలపై బలమైన ప్రభావం కలిగి ఉండింది.' (జవహర్ లాల్ నెహ్రూ రాసిన 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' పుస్తకం లోంచి).

హేతుబద్ధంగా కాకుండా మార్మికతతో ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాయని చెప్పబడుతున్న తూర్పు దేశాల తత్వశాస్త్రాలు, హేతువుతో కూడి, తర్కబద్ధమైన ఆలోచనతో ఉంటాయని చెప్పబడుతున్న పశ్చిమ దేశాల తత్వశాస్త్రాలకు వ్యతిరేకమని అనుకోవడం పొరపాటు. 'హేతుబద్ధమైన' పశ్చిమ దేశాల ఆలోచన తూర్పు దేశాలకు తెలియని సరైన ఫలితాలనిచ్చే శాస్త్రాల ఆవిర్భావానికి తోడ్పడుతుందని తలపోయడం తప్పు. గణిత శాస్త్రం భారతదేశంలో అద్భుతమైన రీతిలో అభివృద్ధి చెందింది. పైథాగరస్ పేరుతో అందరికీ తెలిసిన గణిత శాస్త్ర సిద్ధాంతం గ్రీకు దేశంలో పుట్టక ముందే చాలా ఏళ్ల క్రితమే భారతదేశంలో కనుగొనబడింది. గొప్ప శాస్త్రజ్ఞుడు ఆర్యభట్ట (క్రీ.శ. 5వ శతాబ్దం) ఖగోళ శాస్త్రంలో, గణిత శాస్త్రంలో అనితర విజయాలు సాధించాడు. భారతీయ శాస్త్రజ్ఞులు దశాంశ కాలిక్యులస్ వ్యవస్థలో పలు అంశాలను ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దారు, త్రికోణమితి మూల సూత్రాలను కనిపెట్టారు, 'శున్యం' అన్న భావనను కనిపెట్టింది, దాని విలువను సూచించింది భారతీయ శాస్త్రజ్ఞులే. రసాయన శాస్త్రంలో, భౌతిక శాస్త్రంలో అనేక కొత్త సంగతులను ఆవిష్కరించారు భారతీయ శాస్త్రవేత్తలు.

మరొక ప్రక్క పశ్చిమ దేశాల తత్వవేత్తలు భారతదేశ తాత్వికుల వలె మనిషి అంతర్గత ప్రపంచం పట్ల ఆసక్తి కనపరచారు. ఉదాహరణకు, ప్రసిద్ధి గాంచిన గ్రీకు తత్వవేత్తల నీతి వాక్యం – 'నిన్ను గురించి నీ బాగా తెలుసుకో' అన్నది.

కాబట్టి తత్వశాస్త్రంలో, సాధారణ భాషలో చెప్పాలంటే, ఆధ్యాత్మిక సంస్కృతిలో తూర్పు పడమర దేశాలు ఒకటికొకటి వ్యతిరేకం అనుకోవడం పొరపాటు. 1980లో ఎల్.ఐ. బ్రెజెనెవ్ భారత పర్యటనకు వచ్చినప్పుడు భారత, రష్యా ప్రజల మధ్య సాంస్కృతిక సహకారం ప్రాముఖ్యతను గురించి నొక్కి చెప్పాడు. 'ప్రపంచంలో గొప్ప సంస్కృతి కలిగిన ఈ రెండు దేశాలు అద్భుతమైన మేధ కలిగిన ఆలోచనాపరులను, రచయితలను, కళాకారులను, శాస్త్రజ్ఞులను సృష్టించింది' అని వక్కాణించాడు.

అన్ని దేశాలు తమ సాంస్కృతిక అభివృద్ధి కోసం సారూప్యత కలిగిన విధానాలనే అవలంబిస్తాయి. చివరన పదార్థ ఉత్పత్తిలోని సాధారణమైన క్రమబద్ధతలో వాటి సారూప్యత బయటపడుతుంది. భారత తత్వవేత్తలు కూడా పాశ్చాత్య తత్వవేత్తలు ఏ అంశాలనైతే అధ్యయనం చేశారో, ఏ ప్రశ్నలకైతే సమాధానాలు వెతికే ప్రయత్నం చేశారో వాటి గురించే మధన పడ్డారు. అంటే, వివిధ సాంస్కృతిక సందర్భాలలో, వివిధ దేశాలలో వెలువడిన తత్వశాస్త్ర సిద్ధాంత గ్రంథాలన్నీ ఒకే రకంగా ఉంటాయని అర్థం కాదు. ఆయా దేశాల చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయాలు మొదలైనవి ఆ సిద్ధాంత గ్రంథాల సారాంశాలపై ప్రభావం కలుగజేస్తాయి. ఏది ఏమైనప్పటికీ, వివిధ తాత్విక సిద్ధాంతాలు ఏ పరిస్థితులలో తుది రూపం దిద్దుకున్నాయో ఆ సూత్రాలను పరిగణనలోకి తీసుకోవడం అవసరం.

(యు.ఏ. ఖారిన్ రచించిన 'ఫండమెంటల్స్ ఆఫ్ దయలెక్టిక్స్' పుస్తకంలో మూడవ అధ్యాయం)

('గతితార్కిక మౌలిక సూత్రాలు' పుస్తకం నుండి)

(అనువాదం : రాజేంద్రబాబు అర్విణి)

వీ

కాళీపట్నం రామారావు

ప్రసిద్ధ సాహితీ వేత్త కాళీపట్నం రామారావు(97) శ్రీకాకుళంలోని తన స్వగృహంలో జూన్ 4న కన్నుమూశారు. ఆయన పూర్తి పేరు కాళీపట్నం వెంకట సూర్యరామ సుబ్రహ్మణ్యేశ్వరరావు. కారా మాస్టారుగా ప్రసిద్ధులు. 1924 నవంబర్ 9న శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం మురపాక గ్రామంలో జన్మించారు. ప్రాథమిక విద్యను మురపాకలో ఆ తరువాత శ్రీకాకుళంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో చదివారు. అనారోగ్య కారణాల వల్ల పదో తరగతి చదువు కొనసాగలేదు. తిరిగి స్వగ్రామం చేరుకొని రామకృష్ణ గ్రంథాలయంలోని పుస్తకాలు చదువుతూ ఏడాది గడిపారు. రచనలు చేయడానికి బీజం పడింది ఇక్కడే. ఆయన తొలి కథ ముద్దు అది ఎక్కడా అచ్చు కాలేదు. ఒకటి రెండు పద్యాలు కూడా రాసినా... ప్రధానంగా వచన ప్రక్రియల గురించే అధ్యయనం చేశారు. శ్రీకాకుళంలో ఎస్ఎస్ఎల్‌సి పూర్తి చేసి భీమిలిపట్నంలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా శిక్షణ, సెయింట్ అంథోనీ పాఠశాలలో ఉపాధ్యాయునిగా 1948లో చేరారు. 1970 నుంచి 1972 వరకు విప్లవ రచయితల సంఘం వ్యవస్థాపక సభ్యునిగా కొనసాగారు. 'ప్లాటు ఫారం మీద' 1943లో 'చిత్రగుప్త' పత్రికలో తొలిసారి అచ్చయిన కథ ఇదే. 'వీసంలో అయితే గియితే', 'వెనుక చూపు నిజమే అయితే', 'భాయిజాన్' వంటి కథలు 1949–50 మధ్య కాలంలో రాశారు. 1966–67 మధ్యకాలంలో రాసిన 'నేనెందుకు', 'తీర్పు', 'యజ్ఞం', 'మహదాశీర్వచనం' కథలు ఆయనకు మంచిపేరు తెచ్చాయి. 1967–70 మధ్య కాలంలో 'వీరుడు–మహావీరుడు', 'భయం', 1970–72లో 'శాంతి', 'చావు', 'జీవధార', 'కుట్ర' మొదలైన కథలు ప్రచురించారు. ఆయన రాసిన రచనలు తక్కువే అయినా తెలుగు సమాజంలో ఒక సంచలనమే. ఇందులో యజ్ఞం కథ ఒకటి. 'యజ్ఞం' కథ రాసి ఐదు దశాబ్దాలు గడిచినా, అందులో చిత్రీకరించిన రాజకీయార్థిక పరిస్థితులు ఇప్పటికీ ఉన్నాయి. శ్రీకాకుళంలో 1997లో కథానిలయం ఏర్పాటు చేశారు. అందులో 800 కథల పుస్తకాలున్నాయి. 450కి పైగా పత్రికా శీర్షికలు, 20,500 సంచికలు, 11,576 పుస్తకాలు, 414 సంకలనాలు, 2213 సంపుటాలు, 105 వ్యాస సంకలనాలు, 67 ఆత్మ కథలు, 97 పరిశోధన పత్రాలు, 95 జీవిత చరిత్రలు, 45 ఇతర భాషల్లో ముద్రితమైన తెలుగు అనువాదాలున్నాయి. 1910–2010 వరకు వివిధ పత్రికల్లో వచ్చిన కథలు కథా నిలయంలో లభ్యమవుతున్నాయి.

దగాపడ్డ పాలస్తీనా

అస్తిత్వం కోసం పెనుగులాడుతున్న పాలస్తీనాపై విస్తరణ కాంక్షతో నిరంతరంగా ఇజ్రాయిల్ చేస్తున్న దురాక్రమణ దాడులను నిరసించాల్సిన ప్రపంచ దేశాలు స్పందించకపోవడం విషాదకరమని అంటున్నారు బి. రామకృష్ణ

సినిమాలలో చూపినట్లుగా గగనతలంలో రయ్యి రయ్యిమనే రాకెట్లు, గ్రాఫిక్స్‌తో భ్రమాపూరిత మాయాలోకంలోకి తీసుకెళ్లినట్లు బాంబుల మోతలు, శిథిలమవుతున్న బహుళ అంతస్తుల భవనాలు, కారు చీకట్లలో దూసుకెళ్లే మిరుమిట్లు గొలిపే కాంతి పుంజాలు, పగలే చీకట్లను తలపించే దట్టమైన నల్లటి పొగలు ఇలాంటివెన్నో 2021 మే 10 నుండి 11 రోజుల పాటుగా టీవీలలో ప్రసారం అయ్యాయి. ఇవన్నీ కూడా ఇజ్రాయిల్, పాలస్తీనాలోని గాజాల మధ్య జరిగిన సాయుధ దాడులు. సామరస్యంగా కలిసిపోకుండా ఆధిపత్యంతో, దురహంకారంతో రగులుతూ, చోటిచ్చిన వారి చోటునే కబలించిన దురాక్రమణ దారులకు, మాతృ భూమి కోసం తపిస్తున్న వారికి మధ్య రగులుతున్న కారుచిచ్చు. నూరేళ్లకు పైగా పరంపరలుగా జరుగుతున్న పరిణామాల సూచిక ఇది.

ఇజ్రాయిల్ జరిపిన మిస్సయల్ దాడుల్లో పాలస్తీనాలోని గాజాలో ఉన్న ఒకే ఒక కోవిడ్ టెస్టింగ్ ల్యాబ్, రెండున్నర లక్షల మందికి తాగునీరు అందించే వాటర్ ప్లాంట్, బహుళ అంతస్తుల భవనాలు, మీడియా కార్యాలయాలు ఉన్న భవనాలు ధ్వంసం అయ్యాయి. 250 మందికి పైగా ప్రజలు మరణించారు. అందులో 70 మంది వరకు మహిళలు, చిన్నారులు ఉన్నారు. చాలా వరకు విద్యుత్, నీటి సరఫరా ఆగిపోయింది. రోడ్లపై కూలిన భవనాల శిథిలాలు పేరుకుపోయాయి. ప్రస్తుత ఇజ్రాయిల్ దాడులతో గాజా ఓ పదేళ్లు వెనక్కి వెళ్లినట్లయింది. ఈ నష్టంతో పోల్చుకున్నప్పుడు గాజా నుండి ఇజ్రాయిల్ వైపు హమాస్ చేసిన రాకెట్ల దాడి వలన జరిగిన నష్టం చాలా తక్కువేనని తెలుస్తున్నది.

ప్రస్తుత దాడులకు కారణాలు:

తూర్పు జెరుసలేంను ఇజ్రాయిల్ 1967లో ఆక్రమించింది. అక్కడ క్రమ క్రమంగా పాలస్తీనా కుటుంబీకులను ఆ ప్రాంతం నుండి ఖాళీ చేయించడానికి నిరంతరం ఇజ్రాయిల్ ప్రయత్నం చేస్తూ వస్తున్నది. అందులో భాగంగానే యూదు కుటుంబాలకు స్థిర నివాసాలను ఏర్పాటు చేసింది ఇజ్రాయిల్ ప్రభుత్వం. ఈ నివాసాలలో ప్రస్తుతం రెండు లక్షల ఇరవై వేలకు పైగా ఇజ్రాయిలీలు నివసిస్తున్నారు. తూర్పు జెరూసలేంలోని అల్ అక్సా మసీదుకు సమీపంలో ఉన్న షేక్ జరా ప్రాంతంలోని పాలస్తీనా కుటుంబాలను ఖాళీ చేయించే పనిని మే నెల మొదటి వారంలో ఇజ్రాయిల్ అధికారులు చేపట్టారు. ఈ ఖాళీలను పాలస్తీనీయులు వ్యతిరేకిస్తూ అడపా దడపా నిరసనలు తెలపుతున్నారు. వీటిని యూదు ఛాందస జాతీయవాదులు, ఇజ్రాయిల్ పోలీసులు, భద్రతా బలగాలు అడ్డుకుంటున్నారు. 1948 నుండి జోర్డాన్ ప్రభుత్వ సహకారంతో నిర్మించబడ్డ ఇళ్లల్లో నివసిస్తున్న పాలస్తీనా కుటుంబాలను ఇజ్రాయిల్ ప్రభుత్వం ఖాళీ చేయించే ప్రయత్నాలకు వ్యతిరేకంగా నిరసనలు తీవ్రంగా వచ్చాయి.

అదే సమయంలో 'జెరుసలెం డే' సంబరాలకు (అధికారిక రాష్ట్ర వేడుకలు) ఇజ్రాయిల్ అధికారులు అనుమతి ఇచ్చారు. 1967లో తూర్పు జెరూసలేంను ఆక్రమించుకుని (1948లో పశ్చిమ జెరూసలేంను ఆక్రమించుకున్నారు) జెరూసలేం పునరేకీకరణ జరిగిందంటూ దానికి సంకేతంగా మే నెలలో ఇజ్రాయిలీలు జెరూసలేం డేను జరుపుతారు. ఈ సందర్భంగా ఇజ్రాయిలీలు నిర్వహించిన ర్యాలీలో డెత్ ఫర్ అరబ్స్ (అరబ్బులకు చావే గతి) అనే నినాదాలు చేశారు. ఊరేగింపు తీయడమే కాకుండా అందులో రెచ్చగొట్టే నినాదాలు చేయడం ద్వారా ఉద్రిక్తతలు పెరిగి, జెరుసలేం పాతనగరంలో యూదులకు, పాలస్తీనీయులకు మధ్య గొడవలు జరిగాయి.

తూర్పు జెరూసలేంకు ముఖద్వారంగా చెప్పబడే డెమాస్కస్ గేటు దగ్గర రంజాన్ దినాలలో ముస్లింలు సామూహికంగా కలుసుకుంటారు. సమావేశమవుతుంటారు. వీటిని అడ్డుకోవడం కోసం అక్కడ ఇజ్రాయిల్ అధికారులు బారికేడ్లను నిర్మించారు. ఈ చర్య పాలస్తీనీయన్లలో తీవ్ర నిరసనలకు కారణమయింది. ఇవన్నీ ఒకవైపు జరుగుతున్న సందర్భంలో 2021 మే 7న అల్ అక్స్ మసీదులో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలపై ఇజ్రాయిల్ పోలీసులు, భద్రతా బలగాలు స్టెన్ గ్రెనేడ్లతో, రబ్బరు బుల్లెట్లతో, లాఠీలతో దాడులు చేశాయి. ఈ దుర్ఘటనలో వందలాది మంది ముస్లింలు గాయపడ్డారు. వారితో పాటు కొందరు పోలీసులకు కూడా గాయాలయ్యాయి. అల్ అక్స్ మసీదులో పెద్ద ఎత్తున ముస్లింలు గుమిగూడడం ఎప్పటి నుండో ఇజ్రాయిలు బలగాలకు సహించదు. వీరంతా ఒక చోట చేరితే ఎటువంటి నిరసనలను చేపడతారోనని వారి భయం.

ఘర్షణలు జరుగుతున్న ఆయా ప్రాంతాల నుండి ఇజ్రాయిల్ రక్షణ బలగాలు వెనక్కి రావాలని గాజా నుండి హమాస్ హెచ్చరికలు జారీ చేసింది. వెనక్కి రాకపోతే ఇజ్రాయిల్‌పై రాకెట్ దాడులు చేస్తామని అల్టిమేటం ఇచ్చింది. అయినా ఫలితం లేకుండా పోయింది. చివరకు 2021 మే 10న గాజా పట్టి నుండి హమాస్ మిలిటరీ దళాలు ఇజ్రాయిల్ భూ భాగంపై స్థానికంగా తయారు చేసుకున్న దేశవాళీ రాకెట్లతో దాడులు చేశాయి.

కాల్పుల విరమణ:

కాల్పుల విరమణకు హమాస్ ముందుకు రాగా ఇజ్రాయిల్ సుముఖత చూపలేదు. ఇరువర్గాల మధ్య కాల్పుల విరమణకు సంబంధించి ఐక్యరాజ్య సమితిలో తీర్మానం చేయించాలని చైనా వంటి దేశాలు ప్రయత్నించగా అమెరికా సుముఖత చూపకపోవడంతో అది కుదరలేదు. గాజాలోని అనుకున్న లక్ష్యాలను ధ్వంసం చేయాలన్నది ఇజ్రాయిల్ ఆంతర్యం. అది జరిగేదాకా అమెరికా అధ్యక్షుడు బైడెన్

తాత్సారం చేశాడని అనుకోవచ్చు. పైగా ఇజ్రాయిల్‌కు తనను తాను రక్షించుకునే హక్కు ఉందని అమెరికా అధ్యక్షుడు ప్రకటిస్తాడు. మరోవైపు పాలస్తీనియన్‌లకు తమను తాము రక్షించుకునే హక్కు ఉంటుందనే విషయాన్ని విస్మరిస్తాడు. మరోవైపు రెండు ప్రాంతాల మధ్య ఉద్రిక్తతలు తగ్గాలని, శాంతి నెలకొనాలని అంటాడు. ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుతో బైడెన్ నాలుగైదు సార్లు ఫోన్‌లో మాట్లాడి కాల్పుల విరమణ జరుగుతుందని ప్రకటిస్తాడు. చివరకు ఈజిప్టు, అమెరికాల ప్రోద్బలంతో కాల్పుల విరమణ 2021 మే 21న జరిగింది.

బెంజమిన్ నెతన్యాహూ ప్రయోజనాలు:

ఈ మొత్తం ఘర్షణల వెనుక ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు స్వార్థ ప్రయోజనాలు ఉన్నాయి. ఇజ్రాయిల్ ఎన్నికలలో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో గత రెండు సంవత్సరాల కాలంలో నాలుగు సార్లు ఎన్నికలు జరిగాయి. 12 ఏళ్లుగా ప్రధానమంత్రిగా ఉన్న నెతన్యాహుపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయి. తాను కాకుండా ఇతరులు అధికారం చేపడితే ఈ ఉచ్చు బిగిసే అవకాశం ఉన్నది. వీటి నుండి బయటపడాలంటే తాను అధికారంలో ఉండాలి. అందుకోసం ఎన్నికల్లో గెలవాలి. ఇజ్రాయిలీల పక్షం నిలబడ్డానని చెప్పడం కోసం పాలస్తీనీయన్‌లపై దాడులు అవసరం అయ్యాయి. తమ రాజకీయ ప్రయోజనాల కోసం, సంపదలు పోగుచేసుకోవడం కోసం ఇజ్రాయిల్ పాలక వర్గాలు పాలస్తీనీయులపై విద్వేషాన్ని రగుల్చుతుంటాయి.

అమెరికా పాత్ర:

అమెరికా మొదటి నుండి కూడా ఇజ్రాయిల్ పక్షమే వహిస్తున్నది. ఇజ్రాయిల్‌తో ఆయుధాల పరంగా వాణిజ్య వ్యాపారాలు జరుపుతున్నది. 1980లో ఇజ్రాయిల్ జెరూసలేంను తన రాజధానిగా ప్రకటించుకుంది. ఐక్యరాజ్య సమితి దీన్ని చట్టవ్యతిరేకం అంటున్నదే కానీ, ఇజ్రాయిల్‌ను కట్టడి చేయలేకపోతున్నది. 2017 డిసెంబర్‌లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏకంగా ఇజ్రాయిల్‌లోని టెలి అవెన్‌లో ఉన్నటువంటి తమ రాయబార కార్యాలయాన్ని జెరూసలేంలో ప్రారంభిస్తూ, జెరూసలేంను ఇజ్రాయిల్ రాజధాని అని ప్రకటించాడు. జెరూసలేంను ఇజ్రాయిల్ రాజధానిగా గుర్తించిన మొట్టమొదటి దేశం అమెరికా. అంతేకాకుండా ఇజ్రాయిల్ ఆక్రమించుకున్న పాలస్తీనా ప్రాంతమంతా కూడా ఇజ్రాయిల్‌దే నని ప్రకటించాడు. ఈ సందర్భంలో అమెరికాలో ఐదో వంతు పైగానే యూదులు ఉన్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

అరబ్ ప్రాంతంలోని విస్తారమైన చమురు నిల్వలపై పట్టు సాధించడం కోసం అమెరికా గాని, ఇతర ఆధిపత్య సామ్రాజ్యవాద దేశాలు గాని అరబ్ దేశాలను నయానో భయానో మచ్చిక చేసుకోవడం కాదని ఎదురు తిరిగితే దాడులు, యుద్ధాలు చేస్తుంటాయి. అందులో భాగంగానే అరబ్బు దేశాల మధ్య అనైక్యతను సృష్టిస్తుంటాయి. తొలుత పాలస్తీనా వైపు నిలబడ్డ అరబ్ దేశాలు తర్వాత దూరం జరుగుతూ ఇజ్రాయిల్, అమెరికాలతో అంగీకారానికి వచ్చాయి. ఫలితంగా పాలస్తీనా ఒంటరిగా మిగిలిపోయింది. దీనికి ప్రస్తుతం ఇరాన్, టర్కీ సహాయకారులుగా ఉన్నాయి.

మారిన భారత్ వైఖరి:

పాలస్తీనా ప్రజల హక్కుల కోసం మాట్లాడిన భారత విదేశాంగ విధానం మొన్నటి దాడుల సందర్భంలో మారిపోయింది. ఇజ్రాయిల్, గాజాల మధ్య పరస్పర దాడులు ఆపాలని అంటూనే గాజా నుండి జరుగుతున్న రాకెట్ దాడులు ఆందోళన కలిగిస్తున్నాయనీ, పాలస్తీనా రాజధానిగా తూర్పు జెరుసలేం అనే మాటను ఎత్తకుండా శాంతి గురించి మాట్లాడడం జరిగింది. ఇది మోడీ ప్రభుత్వం ఇజ్రాయిల్ వైపుకు మొగ్గు చూపిస్తున్నదనే విషయాన్ని స్పష్టం చేస్తున్నది. ఇవాళ భారత్‌కు ఇజ్రాయిల్ నుండి సైనికపరంగా శాస్త్ర సాంకేతిక సహకారం, శిక్షణలు, ఆయుధాలకు సంబంధించిన వ్యాపార లావాదేవీలు ఉన్నాయి. భారత్‌లో జరిగే ప్రజా ప్రతిఘటనలను, ప్రత్యామ్నాయ సాయుధ పోరాట రాజకీయ శక్తులను అణచి వేయడానికి కావాల్సిన నైపుణ్యాలకు సంబంధించిన సహాయ సహకారాలు ఇజ్రాయిల్ నుండి అందుతున్నాయనేది అసత్యం కాదు.

దగాపడ్డ పాలస్తీనా:

పాలస్తీనా, ఇజ్రాయిల్ మధ్య నిరంతర సంఘర్షణలు, ఉద్రిక్తతలు, అనేక సాయుధ ఘర్షణల లోతుల్లోకి వెళితే దగాపడ్డ పాలస్తీనా ఆవిష్కృతం అవుతుంది. నిలువెల్లా గాయాలతో, గెంటివేతలతో, అవమానాలతో, అభద్రతతో, అమానవీయతలతో శతాబ్ద కాలంగా అలమటిస్తున్నది పాలస్తీనా. చిరుగులు పడి ఛిద్రాలతో దయనీయమైన, కడు హీన దృశ్యం నేటి పాలస్తీనా. తమ ప్రాంతానికి తామే పరాయి వారై, చిందరవందర చేయబడి, చెల్లాచెదురై పేదవాని కోపం పెదవికి చేటు అన్నట్లుగా ఎదురుతిరిగిన ఎన్నోసార్లు అన్యాయాలకు, హింసలకు, దౌర్జన్యాలకు గురవుతున్నది పాలస్తీనా.

చరిత్రలో పాలస్తీనా – బ్రిటన్ పాత్ర:

మొదటి ప్రపంచ యుద్ధం (1914 –1918) కంటే ముందు పాలస్తీనా ఒట్టోమన్ సామ్రాజ్యంలో భాగంగా ఉండేది. 1914 ఒట్టోమన్ గణాంకాల ప్రకారం అక్కడ ముస్లింలు (80 శాతం), అరబ్ క్రైస్తవులు (10 శాతం) కలిసి 90 శాతం పైగా ఉన్నారు. యూదులు 10 శాతం కంటే తక్కువగా ఉన్నారు. 1945 వరకు వచ్చేసరికి ముస్లింలు, క్రైస్తవులు కలిసిన జనాభా 68 శాతం (ముస్లింలు 60 శాతం, క్రిస్టియన్లు 8 శాతం), యూదుల జనాభా 31 శాతం ఉన్నది. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందున్న పాలస్తీనా మొత్తం భూభాగాన్ని పరిగణలోకి తీసుకొని చూసినట్లయితే అప్పుడు 80 శాతంగా ఉన్న ముస్లింలు నేడు దాదాపు 41 శాతానికి, అప్పుడు 10 శాతం ఉన్న యూదులు నేడు దాదాపు 53 శాతంకు చేరుకున్నారు. వెస్ట్ బ్యాంక్‌లోని కొన్ని ప్రాంతాలు, గాజాను కలిపి నేడు పాలస్తీనాగా చెప్పబడుతున్న భూభాగం దాదాపు 12 శాతం గాను, ఇజ్రాయిల్ భూభాగం దాదాపు 90 శాతం గాను ఉంది.

మొదటి ప్రపంచ యుద్ధానికి పూర్వం నుండి యూదుల వలసలు పాలస్తీనాకు జరుగుతున్నాయి. జియోనిస్టు సిద్ధాంత ప్రభావంతో ఇవి మరింత ముమ్మరంగా సాగాయి. యూదులు, క్రిస్టియన్‌లు, ముస్లింలతో కూడియున్న స్థానిక పాలస్తీనీయన్‌ల, వలస వచ్చిన యూదుల మధ్య విభజన అప్పుడప్పుడే ఏర్పడడం మొదలయ్యింది. మొదటి ప్రపంచ యుద్ధంలో ఒట్టోమన్ సామ్రాజ్యంను గెలవడం కోసం బ్రిటన్ ప్రభుత్వం అటు పాలస్తీనీయన్‌ల ఇటు యూదుల మద్దతు కోసం ప్రయత్నించింది. పాలస్తీనాలో యూదులకు ప్రత్యేక దేశం ఏర్పాటుకు మద్దతుగా బ్రిటన్ జియోనిస్ట్ ఫెడరేషన్ అధ్యక్షుడు లార్డ్

రిత్స్ చైల్డ్‌కు బ్రిటన్ విదేశాంగ మంత్రి బాల్ఫోర్ 1917 నవంబర్ 2న లేఖ రాశాడు. దీనిని బాల్ ఫోర్ ప్రకటన అంటారు. దీంతో పాలస్తీనాలో యూదులకు ప్రత్యేక దేశం ఏర్పాటుకు సాధికారత లభించింది. ఈ ప్రకటనను 1919 లోనే పాలస్తీనీయన్లు తీవ్రంగా వ్యతిరేకించారు. మరోవైపు పాలస్తీనా స్వతంత్ర దేశంగా ఏర్పడడానికి సహకరిస్తామని అరబ్బులతో బ్రిటన్ అంగీకారానికి వచ్చింది. ఈ ఇద్దరికీ తెలియకుండా యుద్ధం గెలిచాక ఏయే ప్రాంతాలను ఎవరెవరు పంచుకోవాలని ఫ్రాన్స్‌తో రహస్య అంగీకారానికి వచ్చింది. ఇలా బ్రిటన్ మోసపూరితమైన అంగీకారాలను చేసుకున్నది.

మొదటి ప్రపంచ యుద్ధంలో ఒట్టోమాన్ సామ్రాజ్యం ఓడిపోయి కనుమరుగైంది. అందులోని పాలస్తీనా ప్రాంతం నానాజాతి సమితి ద్వారా బ్రిటన్ పాలన కిందకు వచ్చింది. పాలస్తీనా1919 నుండి 1948 మే 15 వరకు బ్రిటన్ నియంత్రణలో ఉంది. ఈ కాలంలో ప్రజాస్వామ్య పాలన కోసం, పాలస్తీనీయన్ల స్వతంత్ర, సార్వభౌమాధికారం కోసం పోరాటాలు జరిగాయి. 1935 తరువాత యూదుల వలసలపై పరిమితి కోసం, వాటిని అడ్డుకోవడం కోసం పాలస్తీనీయన్‌లు ఆందోళనలు చేశారు. ఇవి బేఖాతరు చేయబడ్డాయి. యథేచ్ఛగా యూదుల వలసలు జరుగుతూ వచ్చాయి. పాలస్తీనా భూభాగంపై ఒత్తిడి పెరుగసాగింది. యూదులు ఇక్కడ భూములను కొనడం, వాటిపై యాజమాన్య హక్కులను పొందడం, వలసలుగా వచ్చేవారి కోసం ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. వీరు వ్యాపార సంస్థలను, విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. శాస్త్ర సాంకేతికతలను, వాణిజ్య వ్యాపార నైపుణ్యాలను తమ వెంట తీసుకొని వచ్చారు.

యూరప్‌లో యూదుల బహిష్కరణలు – పాలస్తీనాకు వలసలు:

జర్మనీలో హిట్లర్ 1934లో అధికారంలోకి వచ్చాక యూదులపై ద్వేషం తారాస్థాయికి చేరుకున్నది. ఆస్ట్రియాలో పుట్టిన హిట్లర్‌కు 1932 వరకు జర్మని పౌరసత్వమే లేదు. జర్మనీలో 1934 నుండి 1945 వరకు హిట్లర్ మరణించే వరకు అధికారంలో ఉన్న కాలంలో యూదులపై నానా బీభత్సం, దారుణమైన మారణకాండను అమలు చేశాడు. దాదాపుగా అరవై లక్షల మంది యూదులను అతి కిరాతకంగా చంపించి యూదు జాతి హననం (జెనోసైడ్) చేసే ప్రయత్నం చేశాడు. ప్రపంచంలో ఇంత భారీ స్థాయి ఘోరమైన హత్యాకాండ మరొకటి ఉండదు. ఇది కూడా యూదుల వలసలకు కారణమయ్యింది.

బైబిల్‌ను అనుసరించి క్రీస్తు యూదుల కుటుంబంలో జన్మించాడు. ఆయనను యూదుల రాజు సిలువ చంపేశాడు. క్రీస్తును యూదులు హింసించారని వారిపై క్రైస్తవులు తీవ్రమైన వ్యతిరేకత పెంచుకున్నారు. యూదులకు వ్యతిరేకంగా క్రైస్తవుల్లో రకరకాల వ్యతిరేక భావాలు చరిత్రలో ఉన్నాయి. యూరప్‌లోని వివిధ ప్రాంతాల నుండి యూదుల బహిష్కరణలకు ఇది ఒక కారణంగా చెబుతారు.

ప్రధానంగా యూదులు తొలినాళ్ల నుండి వర్తక సంచార జీవులుగా, వ్యాపార వర్గంగా ఉండేవారు. పలు ప్రాంతాల్లోని సామాజిక ఆర్థిక, అసమానతలు, వ్యవస్థాగత, ఫ్యూడల్ వ్యవస్థ వైఫల్యాల వల్ల తలెత్తిన అసంతృప్తులు కూడా యూదుల పైకి మళ్లడం జరిగింది. అది యూదులపై వ్యతిరేకతకు కారణం అయింది. అలా యూదులు అణచివేతలకు, వివక్షతకు, హింసలకు, హత్యలకు గురైన పీడితులే. యూదులపై క్రైస్తవుల, నాజీల, ఐరోపాలోని పలు ప్రాంతాల నుండి వ్యతిరేకతలు, వివక్షతలు, హింసలు వారిని ప్రపంచం నలుమూలలకు వలసలుగా, శరణార్థులుగా వెళ్లేలా చేశాయి. ఆ తర్వాత చాలా వరకు ఆయా దేశాల్లో పౌరులుగా మారారు. అందులో భాగంగా యూదులు తమకంటూ ప్రత్యేక దేశం కావాలనుకుని పాలస్తీనాకు చేరుకోవడం పథకం ప్రకారమే జరిగింది.

చరిత్రలో 11 నుండి 16వ శతాబ్దాలలో యూరప్‌లోని ఎన్నో రాజ్యాల నుండి యూదులు బహిష్కరణలకు, వివక్షతలకు, హింసలకు గురయ్యారు. వారు ఇతర ప్రాంతాలకు పొట్ట చేత పట్టుకొని పోవాల్సిన దుస్థితిలోకి నెట్టి వేయబడ్డారు. 1881–84లో ప్రత్యేకించి రష్యా రాజ్యంలోని ఈ బహిష్కరణల నేపథ్యంలో యూదులకు ప్రత్యేక దేశం ఉండాలనేది (జియోనిస్ట్ ఉద్యమం) ముందుకు వచ్చింది. 1896లో ఆస్ట్రో హంగేరియన్ జర్నలిస్ట్ అయినటువంటి థియోడర్ హెర్జల్ యూదులకు ప్రత్యేక దేశ అవసరాన్ని వివరిస్తూ కరపత్రాన్ని రాశాడు. దీంతో జియోనిస్ట్ సిద్ధాంతం ప్రముఖంగా ప్రచారంలోకి వచ్చింది. ఇందుకోసం పాలస్తీనాను ఎంచుకున్నారు. ఒకప్పుడు తమ దైవం 'యహ్వే' ఈ ప్రాంతాన్ని తమకు వాగ్దానం చేశాడని యూదుల విశ్వాసం. ఈ ప్రాంతంలోనే క్రీ.పూ. 950లో తమ దేవుడికి యూదుల రాజు సోలమన్ గుడి కట్టించాడని యూదుల విశ్వాసం. దానిని బాబిలోనియన్‌లు కూల్చివేశారని, ఆ తర్వాత ఎంతో కాలానికి రెండోసారి మరో యూదుల రాజు తిరిగి గుడి కట్టించాడని, దాన్ని రోమన్ చక్రవర్తి కూల్చివేశాడని అంటారు. ఆ గుడి స్థలం నేడు జెరూసలేంలోని టెంపుల్ మౌంట్ అని అంటారు. ఆ స్థలంలోనే క్రీ.శ. 632లో మహమ్మద్ ప్రవక్త మరణించిన తర్వాత ఏడవ శతాబ్దంలో అల్ అక్స్ మసీదు, డోమ్ ఆఫ్ ది రాక్‌లను నిర్మించారని అంటారు.

యూదుల, క్రైస్తవుల, ముస్లింల పవిత్ర స్థలంగా జెరూసలేం:

సౌదీ అరేబియాలోని మక్కా, మదీనాల తర్వాత అల్ అక్స్ మసీదు ముస్లింలకు ప్రపంచంలోనే అతి పవిత్రమైన మూడవ ప్రాంతం. ఇక్కడ మహమ్మద్ ప్రవక్త చివరిసారిగా ప్రార్థన చేసి దాని పక్కనే ఉన్న డోమ్ ఆఫ్ ది రాక్ ప్రాంతం నుండి స్వర్గానికి పయనమయ్యాడని ముస్లింల విశ్వాసం. ప్రస్తుతం అల్ అక్స్ మసీదులో ముస్లింలకు మాత్రమే ప్రార్థన చేసే వీలుంది. యూదులు ఈ మసీదుకు బయట ఒక సరిహద్దు గోడ దగ్గర మాత్రమే ప్రార్థనలు చేసుకోవచ్చు. దీనినే వెయిలింగ్ వాల్ అంటారు. దేవుడు లోకాన్ని సృష్టించేటప్పుడు తొలి రాయిని ఇక్కడే వేశాడని యూదులు నమ్ముతారు. ఈ గోడ దగ్గరే అబ్రహం తన కొడుకు ఇస్సాకును దేవుని ఆజ్ఞ మేరకు బలి ఇచ్చే ప్రయత్నం చేయగా దేవుడు ఈ పనిని అడ్డుకుంటాడు. అలా అది యూదులకు పవిత్రమైన స్థలం. అల్ అక్స్ మసీదుకు చేరువలోనే క్రిస్టియన్లకు అతి పవిత్రమైన హోలీసపుల్కే చర్చి ఉన్నది. ఈ ప్రాంతంలోనే ఏసుక్రీస్తును శిలువ వేశారని, ఇక్కడే ఆయన తిరిగి పునరుత్థానం చెందాడని క్రైస్తవుల విశ్వాసం.

ఐక్యరాజ్య సమితి విభజన ప్లాన్ – ఇజ్రాయిల్ ఏర్పాటు:

పాలస్తీనాను రెండుగా అరబ్, యూదు రాజ్యాలుగా విభజించాలని ఒకసారి, ఒకటిగానే ఉండాలని మరోసారి చెబుతూ బ్రిటన్ ఎటూ తేల్చలేక పోయింది. పాలస్తీనా విభజనపై ఐక్యరాజ్య సమితి 1947లో ఒక తీర్మానం చేసింది. దాని ప్రకారం అరబ్ స్టేట్, జ్యూయిష్ స్టేట్, సిటీ ఆఫ్ జెరూసలేం అనే మూడు భాగాలుగా చేసింది. దీని ప్రకారం అరబ్ స్టేట్ విడివిడిగా మూడు ముక్కలతో కూడి ఉంటుంది. అంతర్జాతీయ ప్రాంతంగా సిటీ ఆఫ్ జెరూసలేం ఐక్యరాజ్య సమితి

నిర్వహణలో ఉంటుంది. ఈ ప్రతిపాదనను పాలస్తీనీయన్‌లు తోసిపుచ్చారు. మొత్తం పాలస్తీనాగానే ఉండాలన్నారు. ఈ విభజన ప్లాన్‌ను జ్యూయిష్ స్టేట్ సమర్థకులు అంగీకరించారు. 1948 మే 14న తమను తామే స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్నారు. దానికి ఇజ్రాయిల్ అని పేరు పెట్టారు. అప్పటిదాకా ఇజ్రాయిల్ అనే ప్రాంతం గాని, దేశం గాని లేదు.

ఇజ్రాయిల్ దురాక్రమణలు:

ఇజ్రాయిల్ స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్న తర్వాత పాలస్తీనా భూభాగ పరిధులు ప్రశ్నార్థకమైనవి. దీన్ని వ్యతిరేకిస్తూ లెబనాన్, సిరియా, ఈజిప్ట్, జోర్డాన్‌లతో కూడిన అరబ్ దేశాల కూటమి ఇజ్రాయిల్‌పై యుద్ధాన్ని ప్రకటించాయి. ఈ యుద్ధంలో ఇజ్రాయిల్ గెలిచింది. ఐక్యరాజ్య సమితి ప్రకటించిన అరబ్ స్టేట్‌లోని భూభాగాలను, పశ్చిమ జెరూసలేంను ఆక్రమించుకుంది. తద్వారా 78 శాతం భూభాగాన్ని తన ఆక్రమణలోకి తెచ్చుకుంది. ఇక పాలస్తీనాకు మిగిలింది 22 శాతం భూభాగం మాత్రమే. ఇజ్రాయిల్ దాడుల వలన 7.6 లక్షల పాలస్తీనీయన్‌లు తమ స్వంత ప్రాంతాల నుండి వేరై వెస్ట్ బ్యాంక్, గాజా అలాగే పక్క దేశ భూభాగాలల్లో శరణార్థులుగా తల దాచుకున్నారు.

1967లో అరబ్ లీగ్, ఇజ్రాయిల్‌ల మధ్య రెండవ సారి యుద్ధం జరిగింది. ఇది ఆరు రోజుల్లోనే ముగిసింది. మళ్లీ ఇజ్రాయిల్ గెలిచింది. ఈ యుద్ధంలో తూర్పు జెరూసలేంతో పాటు మరిన్ని భూభాగాలను ఆక్రమించుకుని దాదాపుగా 90 శాతం భూభాగాన్ని తన నియంత్రణలోకి తెచ్చుకుంది. 1948-1967 కాలంలో తాను ఆక్రమించిన పాలస్తీనా ప్రాంతాల్లో పాలస్తీనీయన్‌లను ఖాళీ చేయించడం, యూదులకు స్థిర నివాసాలను నిర్మించడం చేస్తూ వచ్చింది. తమ స్వంత ప్రాంతాల నుండి పారిపోయిన, శరణార్థులుగా వెళ్లిన పాలస్తీనీయన్‌ల భూములను, ఇండ్లను స్వాధీనం చేసుకుని వలస వచ్చిన, వస్తున్న యూదులకు కేటాయిస్తూ పోయింది ఇజ్రాయిల్. 1967 తర్వాత ఈ ప్రక్రియ మరింత వేగవంతమైనది. వెస్ట్ బ్యాంక్, తూర్పు జెరూసలేంలలో 250కి పైగా ఇజ్రాయిల్ సెటిల్‌మెంట్లను ఏర్పాటు చేసింది. ఇవన్నీ కూడా పాలస్తీనీయన్ల భూభాగాలను దురాక్రమించడమే. వీటిల్లో 6.2 లక్షల ఇజ్రాయిలీలు నివసిస్తున్నారు. వీటి ఫలితంగా వెస్ట్ బ్యాంక్‌లోని పాలస్తీనీయన్ల ప్రాంతాలు చిరుగులు పడ్డట్టుగా మారింది.

ప్రస్తుత పాలస్తీనా:

ప్రస్తుతం వెస్ట్ బ్యాంక్‌లో పాలస్తీనా, ఇజ్రాయిల్ ప్రాంతాలు చిన్న చిన్న దీవులుగా పక్క పక్కనే ఉంటాయి. 1993లో పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్ (పిఎల్ఒ), ఇజ్రాయిల్‌కు మధ్య జరిగిన ఓస్లో ఒప్పందం

పాలస్తీనా నేషనల్ అథారిటీ (పిఎన్ఎ) అంటారు. వెస్ట్ బ్యాంక్‌లో 18 శాతం ప్రాంతం పాలస్తీనా నేషనల్ అథారిటీ పాలనలో, 22 శాతం ఇజ్రాయిల్, పాలస్తీనా నేషనల్ అథారిటీల ఉమ్మడి ఆజమాయిషీలో, 60 శాతం ప్రాంతం ఇజ్రాయిల్ ప్రత్యక్ష ఆజమాయిషీ కింద ఉన్నది. విసిరేయబడినట్లుగా నలభై, యాభై కిలోమీటర్ల దూరంలో నున్న వెస్ట్ బ్యాంక్, గాజాలుగా ప్రస్తుతం పాలస్తీనా కనిపిస్తుంటది. వెస్ట్ బ్యాంక్‌లో పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్‌కు చెందిన సెక్యులర్ లిబరల్‌గా చెప్పబడే 'ఫతాహ్' ఆధీనంలో పాలస్తీనా నేషనల్ అథారిటీ పాలన చేస్తున్నది. గాజాలో ఇస్లామిక్ సంస్థ హమాస్ ఆధీనంలో పాలన జరుగుతున్నది. పాలస్తీనా ఐక్యరాజ్య సమితిలో సభ్యత్వం కోసం 2011లో దరఖాస్తు చేసుకొన్నది. సభ్యత్వం లభించలేదు కాని, అబ్జర్వరీ స్టేట్‌గా ఐక్యరాజ్య సమితి సమావేశాలలో పాలస్తీనా నేషనల్ అథారిటీగా పాల్గొనవచ్చు. ఐక్యరాజ్య సమితిలో 1949లో ఇజ్రాయిల్‌కు సభ్యత్వం లభించింది. ఇజ్రాయిల్ జనాభా దాదాపు 94 లక్షల వరకు ఉంటుంది. పాలస్తీనా జనాభా దాదాపు 51 లక్షలు. అందులో వెస్ట్ బ్యాంక్ దాదాపు 31 లక్షలు, గాజా దాదాపు 21 లక్షలు. గాజా పట్టీ అనేది 41 కిలోమీటర్ల పొడవు, 6 నుండి 12 కిలోమీటర్ల వెడల్పు ఉన్న చిన్న ప్రాంతం. గాజాకు మూడు వైపులా ఇజ్రాయిల్ ఆవరించి ఉంటుంది. చాలా తక్కువ ప్రాంత సరిహద్దుగా ఈజిప్టు ఉన్నది. మరోవైపు మధ్యధరా సముద్రం ఉన్నది. గాజా సమీప మధ్యధరా సముద్ర ప్రాంతం ఇజ్రాయిల్ ఆధీనంలోనే ఉంది. ఇజ్రాయిల్ దాడులను ఎదుర్కోవడానికి గాజాలో హమాస్ సొరంగాలను నిర్మించింది. ప్రస్తుత దాడుల్లో ఇజ్రాయిల్ ఈ సొరంగాల ధ్వంసం లక్ష్యంగా బాంబులు వేసింది. ఇజ్రాయిల్‌తో సరిహద్దు పొడవు 51 కిలోమీటర్లున్న ఈ గాజా పట్టి నుండే గత మే నెలలో ఇజ్రాయిల్ పైకి రాకెట్ దాడులు జరిగాయి.

అంతర్జాతీయ విషాదం:

ఈ చారిత్రక నేపథ్యంలో పాలస్తీనీయన్‌లకు ఇజ్రాయిలీయులకు (మొత్తం అనలేం గానీ అత్యధికులు) మధ్య శతాబ్ద కాలం పైగా జరుగుతున్న ఘర్షణల ఒకరిదేమో దురహంకారం, దురాక్రమణ, రౌడీయిజం. మరొకరిదేమో తమ మాతృ భూమిని నిలబెట్టుకోలేని అసహాయత్వం నుంచి నిలువ నీడ కోసం, గౌరవప్రదమైన జీవితం కోసం, స్వతంత్ర దేశం కోసం పోరాటం. ఇజ్రాయిల్ తన మిలటరీ శక్తిని అతి శక్తివంతంగా తీర్చిదిద్దుతూ, పాలస్తీనా ప్రాంతాన్ని క్రమక్రమంగా ఆక్రమించుకుంటూ అక్కడి ప్రజల పౌర ప్రజాస్వామిక హక్కులను నిర్దాక్షిణ్యంగా అణచి వేస్తూ పోతున్నది. ఇంత దారుణం జరుగుతున్నప్పటికీ అంతర్జాతీయ సమాజం ఏమీ చేయలేకపోవడం విషాదకరం.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

వచ్చే సంచికలలో...

- కరోనా కల్లోలమా - కనక వర్షమా - చుంచు శ్రీశైలం
- కొన్ని కోనాల్లో గాంధీ... లెనిన్! - దివి కుమార్
- విప్లవ హింస - ఒక విశ్లేషణ - యానిస్ ఇక్బాల్
- భావ ప్రకటనా స్వేచ్ఛకు ఉచ్చు బిగిస్తున్న కేంద్రం - పబ్బతి వెంకటేశ్వర్లు

చిలే, పెరూ ప్రజా విజయాలు

ప్రపంచీకరణ విధానాలకు వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ ఆర్థిక వ్యవస్థ కోసం ప్రజలు వ్యక్తం చేస్తున్న ఆందోళనలకు చిలే, పెరూ ఎన్నికల ఫలితాలు నిదర్శనమని అంటున్నారు సంతోష్

2021 మే 16 చిలేకు ఒక చారిత్రక దినం. నాలుగు దశాబ్దాల తర్వాత ప్రజలు తమ రాజ్యాంగాన్ని తామే రాసుకుంటామని దాదాపు రెండు సంవత్సరాలుగా (2019 అక్టోబర్ నుంచి 2021 మే) పోరాడుతున్నారు. 155 స్థానాలతో కూడిన రాజ్యాంగ పరిషత్‌కు జరిగిన ఎన్నికల్లో ప్రస్తుత అధ్యక్షుడు పినేరాకి 37 స్థానాలు మాత్రమే దక్కాయి. దీనికి నేపథ్యం రెండవ ప్రపంచ యుద్ధం ముగిశాక 1946లో చిలేలో అతివాద నినాదాలతో అధికారంలోకి వచ్చిన గాబ్రియేల్ గొంజాలెజ్ విడేలా, జార్జ్ అలెస్సాండ్రీ రోడ్రిగ్వేజ్ ఆ తర్వాత 1952లో అధికారంలోకి వచ్చిన కార్లోస్ ఇబిజ్ డెల్ కాంపో సామ్రాజ్యవాద అమెరికా అనుకూల విధానాలనే అనుసరించారు. 1970 నవంబర్ 3న కవి, వైద్యుడు, సోషలిస్టు అయిన సాల్వడార్ అయెండే అధికారంలోకి వచ్చాడు. ఉత్తర అమెరికాకు పెరడుగా భావించే లాటిన్ అమెరికా దేశాలల్లో ఒకటైన చిలేలో ప్రపథమంగా ఎన్నికైన కమ్యూనిస్టు ప్రభుత్వం. ఈయన అధికారంలోకి రాగానే తగరపు గనులను జాతీయం చేశాడు. విద్యను విస్తరించడానికి, కార్మిక వర్గం జీవితాలు మెరుగుపడడానికి చర్యలు తీసుకున్నాడు.

అలెండే ప్రజానుకూల నిర్ణయాలను సహించలేని పెట్టుబడిదారులు, అమెరికా సామ్రాజ్యవాదులు సిఐఎ మద్దతుతో జనరల్ ఆగష్టో పినోషె సైన్యంతో అధ్యక్ష భవనంపై 1973 సెప్టెంబర్ 11న దాడి చేశాడు. హోరా హోరిగా జరిగిన కాల్పుల్లో అలెండే మరణించాడు. పినోషె తనకు తానే అధ్యక్షుడుగా ప్రకటించుకున్నాడు, నియంత 'ఆగష్టో పినోషె 1980లో నూతన రాజ్యాంగాన్ని ఆమోదించాడు. ఈ రాజ్యాంగం సామ్రాజ్యవాద విధానాలకు అనుకూలమైనది. అధ్యక్ష తరహా పాలన పద్ధతి ప్రవేశపెట్టాడు. ప్రభుత్వ, పాలనపరమైన కీలక పదవులన్నింటిని తన బంధు మిత్రులకు కట్టబెట్టారు. 1990 వరకు 80 వేల మందిని జైళ్లలో నిర్బంధించాడు, వేలాది మందిని హత్య చేయించాడు. పినోషెట్ 18 సంవత్సరాలు క్రూరమైన నియంతృత్వ పాలన అమలు జరిపాడు.

ప్రపంచీకరణ విధానాలను మొదటగా అమలు చేసిన దేశం చిలే. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేశారు. అభివృద్ధి పేరుతో లక్షలాది ఎకరాల భూమిని ప్రజల నుంచి లాక్కొని కార్పొరేట్లకు కట్టబెట్టారు. దీని ఫలితంగా కొద్దిమంది పెట్టుబడిదారుల ఆస్తులు, లాభాలు అనూహ్యంగా పెరిగాయి. రైతుల, కార్మికుల జీవితాలు చితికిపోయాయి. నిరుద్యోగం, పేదరికం పెరిగింది. ఆర్థిక అంతరాలు తీవ్రమయ్యాయి. ప్రజా తిరుగుబాటు వల్ల 1990లో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడింది. నూతన రాజ్యాంగం అమలులోకి వచ్చింది. అయినా ఎవరు అధికారంలో ఉన్న ప్రపంచీకరణ ఆర్థిక విధానాలనే అమలు చేశారు. ప్రజావసరాలు పట్టించుకోలేదు. నిరుద్యోగం, పేదరికం పెరిగింది. సామ్రాజ్యవాద దోపిడీకి గల అవకాశాలు అలాగే మిగిలి ఉన్నాయి. ప్రస్తుత చిలే అధ్యక్షుడు పినేరా సంపన్న బిలియనీర్లలో ఒకడు.

2019 అక్టోబర్ 14న పినేరా ప్రభుత్వం మెట్రో రైలు చార్జీలు బాగా పెంచడంతో పెరిగిన చార్జీలకు వ్యతిరేకంగా విద్యార్థులు ప్రారంభించిన ఉద్యమానికి అన్ని తరగతుల ప్రజానీకం నుంచి మద్దతు లభించడంతో కొద్ది రోజుల్లోనే అది ఒక మహోద్యమంగా మారింది. మొదట ఈ ఉద్యమాన్ని బలప్రయోగం ద్వారా అణచివేయాలని ప్రభుత్వం భావించింది. ప్రభుత్వ నిర్బంధం పెరుగుతున్న కొద్దీ ప్రజల ఉద్యమం తీవ్రమయింది. ఉద్యమాన్ని అణచివేయడానికి పినేరా ప్రభుత్వం అక్టోబర్ 18న ఎమర్జెన్సీని విధించింది. నిరసనకారులను ఎదుర్కోవడానికి మిలిటరీని దింపింది. శక్తివంతమైన అంతర్గత శత్రువులను (ప్రజలను) ఎదుర్కోవడానికి ప్రకటించిన యుద్ధం ఇది అని ఆయన ప్రకటించాడు. ప్రజా ఉద్యమం ప్రభుత్వం ముందు స్పష్టమైన డిమాండ్లను ఉంచింది. గృహ నిర్మాణం, విద్య, వైద్య వ్యవస్థను ప్రభుత్వమే పటిష్టంగా నిర్వహించాలని, తగ్గించిన పెన్షన్లను పునరుద్ధరించాలని, గిరిజన తెగల హక్కులను కాపాడాలన్నది ప్రజల నినాదాలుగా మారాయి. గౌరవప్రదంగా బతకడం, స్థిరమైన ఉపాధి, మహిళలకు పురుషులతో సమాన హక్కులు, ఇతర సామాజిక ప్రయోజనాలు ప్రజా డిమాండ్లుగా ముందుకొచ్చాయి.

నిరసనకారులను పినేరా గుండాలు, నేరగాళ్లు, పనిలేని అవారాజనం అంటూ నిందించాడు. సైన్యం క్రూరమైన అకృత్యాలకు తెగబడింది. మహిళలపై అత్యాచారాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. సాయుధ దళాలు పేల్చిన పెల్లెట్లు కళ్లలోకి పోయి వేలాది మంది చూపు కోల్పోయారు. సైన్యం అకృత్యాలు పెరిగిపోతుండడంతో కార్మికులు, ఉద్యోగులు, శ్రామికులు, విద్యార్థులు, బుద్ధిజీవులు ఉద్యమంలో కలువడంతో ఉద్యమ స్వరూపం మారింది. ఉద్యమకారుల ఆలోచనలు మారాయి. ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం కాదని, రాజ్యాంగం ప్రజలు రాసుకున్నది కాదన్న చైతన్యం ప్రజల్లో పెరిగింది. భారీ నిరసనల దాటికి ప్రభుత్వం వెనక్కి తగ్గి మెట్రో చార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోక తప్పలేదు. అయినా, ఉద్యమం చల్లారలేదు. దీంతో పినేరా ప్రభుత్వం మరికొన్ని రాయితీలు ప్రకటించక తప్పలేదు.

ఉద్యమం తీవ్రమవుతున్నకొద్దీ ప్రజల్లో చైతన్యం పెరిగింది. ఆలోచనల్లో పరిపక్వత వచ్చింది. ప్రభుత్వ దమనకాండకు, ప్రజల దుర్భర జీవితాలకు వ్యవస్థలో అపసవ్యతలు కారణమని గుర్తించారు. సామ్రాజ్యవాద దోపిడీ ప్రపంచీకరణ ఆర్థిక విధానాలను

రూపుమాపకుండా వ్యవస్థలో సామరస్యం, సౌభాగ్యం నెలకొనదని ప్రజలు గ్రహించారు. సమస్యలకు అసలు కారణం మార్కెట్ శక్తుల ఆధీనంలోని ప్రపంచీకరణ ఆర్థిక విధానాలూ, వాటిని కాపాడుతున్న రాజ్యాంగమేనని ప్రజలు అర్థం చేసుకున్నారు. రాజ్యాంగాన్ని మార్చుకుంటే తప్ప ప్రజానుకూల ఆర్థిక విధానాలు అమలు జరుపడం సాధ్యం కాదని ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేశారు. ఈ క్రమంలోనే 1980లో పినోషెట్ రూపొందించిన రాజ్యాంగం రద్దు కావాలని, కార్పొరేట్ల దోపిడీ అంతం కావాలన్న డిమాండ్ ముందుకొచ్చింది.

రాజ్యాంగాన్ని తిరిగి రాయాలన్న డిమాండ్ యాదృచ్ఛికంగా వచ్చిన డిమాండ్ కాదు. చాల కాలంగా దీనిపై ప్రజల్లో చర్చ జరుగుతోంది. ప్రజలు వీధుల్లోకి వచ్చి కృతనిశ్చయంతో పోరాడారు. దీంతో వారిలో భయంతో పాటు ఊగిసలాట ధోరణులన్నీ పోయాయి. తెగించి పోరాడేతత్వం అలవడింది. ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలకు గురిచేసినా లెక్క చేయకుండా మొక్కవోని దీక్షతో వారు ఉద్యమించారు. అంతిమంగా ఈ ఉద్యమం రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు జరుగాలన్న అంశంపై ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య పోరాటంగా రూపుదాల్చింది. ప్రభుత్వం ప్రస్తుత జాతీయ అసెంబ్లీ సభ్యులే రాజ్యాంగ రచన చేపడతారని చెప్పగా, ప్రజలు అందుకు ససేమిరా అన్నారు. రాజ్యాంగ పరిషత్‌కు ఎన్నుకునే ప్రతినిధుల ద్వారానే నూతన రాజ్యాంగ రచన జరగాలని పట్టుబట్టారు. ఈ విషయాన్ని రిఫరెండమ్ ద్వారా నిర్ణయించాలన్నారు. ప్రభుత్వం దీనికి అనివార్యంగా అంగీకరించాల్సి వచ్చింది. నూతన రాజ్యాంగాన్ని రూపొందించే బాధ్యత ఎన్నికైన రాజ్యాంగ పరిషత్‌కే అప్పగించాలన్న డిమాండ్‌కు ప్రజల నుంచి అపూర్వమైన మద్దతు లభించింది. ప్రభుత్వం 2019 నవంబర్‌లో రాజ్యాంగ మార్పుకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతామని అంగీకరించింది.

ప్రభుత్వానికి ఉద్యమకారులకి మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం 2020 ఏప్రిల్‌లో నూతన రాజ్యాంగ రచనకు పూనుకోవాలా, వద్దా అన్న ఒకే పదంతో ప్రజాభిప్రాయ సేకరణ జరగాల్సి ఉంది, కానీ కొవిడ్ కారణంగా అది వాయిదా పడింది. పలు వాయిదాల అనంతరం 2020 అక్టోబర్ 25న ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. రాజ్యాంగాన్ని తిరిగి రాయడానికి 78 శాతం ప్రజలు 'అవును' అని ఓటు వేశారు. దీంతో నియంతృత్వ యుగ రాజ్యాంగానికి వీడ్కోలు, ఆధునిక ప్రజాస్వామ్యానికి స్వాగతం పలుకుతూ ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ వీధుల్లో నృత్యాలు చేశారు. పాటలు పాడారు. అయితే రాజ్యాంగ రచన ఎలా జరగాలి, రాజ్యాంగ పరిషత్‌లో సభ్యులు ఎవరుండాలి, అనే అంశం పైన సుదీర్ఘ చర్చ అనంతరం రాజ్యాంగ పరిషత్ సభ్యులను ప్రజలే నేరుగా ఎన్నుకోవాలని నిర్ణయించుకున్నారు. 2021 ఏప్రిల్ 11న 155 మంది రాజ్యాంగ పరిషత్ సభ్యులను ఎన్నుకోవడానికి ఎన్నికలు జరుపాలని నిర్ణయించారు. వీరిలో మహిళలకు సమస్థానం కల్పించాలని, అందులో 17 స్థానాలు స్థానిక జాతులకు రిజర్వు చేయాలని నిర్ణయించారు. 2021 మే 15, 16 తేదీలలో రాజ్యాంగ రచనా పరిషత్ కోసం జరిగిన ఎన్నికల్లో ఆ దేశ ప్రజలు సభ్యులను ఎన్నుకున్న తీరు ఆశ్చర్యం కలిగిస్తోంది. రాజ్యాంగ రచనా ఎవరి కోసం జరుగాలని ఆశిస్తున్నారో సభ్యుల ఎంపిక ద్వారా స్పష్టం చేశారు.

కొత్త రాజ్యాంగ సభలోని 155 స్థానాల్లో 65 స్థానాలు స్వతంత్రులే గెలిచారు. వీరంతా నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకులు. మధ్యేవాద, కమ్యూనిస్టు కూటములూ గణనీయమైన సీట్లు గెలుచుకున్నాయి. మొత్తంగా సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా పోరాడిన శక్తులే 117 స్థానాల్లో విజయం సాధించి కొత్త రాజ్యాంగ సభను ఆక్రమించుకున్నాయి. ఆర్థిక అసమానతలకు, కార్పొరేట్ దోపిడీకి మారుపేరైన చిలేలో పేదల పక్షాన, వారి ఆశలూ ఆకాంక్షలకు అనుగుణంగా రాజ్యాంగ రచన చేయవలసిన బాధ్యత వీరిపై ఉన్నది. ప్రస్తుత అధ్యక్షుడు పినేరా నేతృత్వంలోని మితవాద వామోస్ పార్టీ ముప్పై ఏడు సీట్లకు పరిమితం కావడంతో, సభకు నాయకత్వం వహించగలిగే అవకాశాన్ని కోల్పోయింది.

ప్రపంచంలో అతిపెద్ద రాగి ఉత్పత్తిదారుగా ఉన్న తమ దేశంలో, ఆర్థిక అసమానతలు పెరిగిపోవడానికీ, దేశం సర్వవిధాలా కునారిల్లిపోవడానికీ పినోషెట్ రాజ్యాంగమూ, ఆయన అనుయాయుల తదనంతరపాలనేనని ప్రజల నమ్మకం. నియంత జనరల్ ఆగష్టో పినోషెట్ 1980లో అమలులోకి తెచ్చిన అమానవీయ, పెట్టుబడిదారీ అనుకూల రాజ్యాంగం స్థానంలో శ్రమజీవుల, పేదల మెరుగైన భవిష్యత్తుకు హామీనిచ్చే రాజ్యాంగం కావాలని చిలే ప్రజలు ఓటు ద్వారా స్పష్టం చేశారు. సామాన్యుల చదువు, ఆరోగ్యం, సంక్షేమాలకు ఏ మాత్రం పూచీపడని పినోషెట్ రాజ్యాంగం పెట్టుబడిదారుల, బడా వ్యాపారుల దోపిడీకి ద్వారాలు తెరిచింది. ఒకపక్క నిరుద్యోగం, పేదరికం తాండవిస్తుంటే, మరోపక్క ఏటా కొత్త శతకోటీశ్వరుల అవతరణ ప్రజల కళ్లముందే సాగిపోతున్నది. ఈ పరిస్థితులను వారు భరించలేకపోయారు. ఈ కారణంగానే అధికారంలో ఉన్నవారికి కొత్త రాజ్యాంగాన్ని రాసే అవకాశం ఇవ్వకుండా, లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్‌కు వ్యతిరేకులనూ ఎన్నుకున్నారు. ఈ రాజ్యాంగ పరిషత్ కొత్త రాజ్యాంగ ముసాయిదాను ఏడాదిలోగా తయారుచేయాల్సి ఉంది. రాజ్యాంగ రచన పూర్తి అయ్యాకా, దాని ఆమోదం కోసం మళ్లీ ప్రజాభిప్రాయం కోరతారు.

రాజ్యాంగ పరిషత్తుతో పాటు గవర్నర్లు, మేయర్లు, కౌన్సిలర్ల స్థానాలకు కూడ జరిగిన ఎన్నికల్లో సంప్రదాయ మితవాదులను తుడిచిపెట్టారు. అసమానతలను కరోనా మరింతగా స్పష్టంగా చూపి కళ్లు తెరిపించింది. కొత్త రాజ్యాంగ పరిషత్‌లో పురుషుల కంటే మహిళలే ఎక్కువ. మూలవాసులకూ ప్రాధాన్యం దక్కింది. సభ్యుల సగటు వయసు కూడా నలభై ఐదేళ్లే ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కొత్త రాజ్యాంగం రూపొంది, వారి పోరాటాలకు, త్యాగాలకు విలువా గౌరవం దక్కుతాయని ఆశిద్దాం. రాజ్యాంగ రచనా పూర్తికాగానే రాజ్యాంగం ఆమోదించాలా? లేదా అని మళ్లీ ప్రజాభిప్రాయ సేకరణ చేస్తారు. ఆ తర్వాతనే చట్టసభల ఏర్పాటు జరుగుతుంది. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది. ఒక కొత్త సమాజాన్ని కలగంటున్న క్షతగాత్రి చిలే అనుకున్నట్లు విజయం సాధిస్తే నిజంగా అది నియంతలపై, ప్రజా వ్యతిరేక ప్రపంచీకరణ ఆర్థిక విధానాలపై పోరాడే ఎన్నో దేశాలకు స్ఫూర్తిదాయకం కానుంది. మొత్తంగా ఈ విజయం ద్రవ్య పెట్టుబడి గుత్తాధిపత్యానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న ప్రజా ఉద్యమాలకు ఒక దిక్సూచిగా నిలుస్తుంది.

ఎన్నికైన రాజ్యాంగ పరిషత్తు ప్రతినిధులు నూతన రాజ్యాంగాన్ని రూపొందించేటప్పుడు ప్రపంచీకరణ విధానాలపై తమ ఆగ్రహాన్ని

ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోవాలని చిలే ప్రజలు కోరుకుంటున్నారు. విద్య, ఆరోగ్య, గృహ సదుపాయాలకు రాజ్యం గ్యారంటీ ఇచ్చేలా రాజ్యాంగం పూచీపడాలన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. మహిళలకు సమానత్వ హక్కు, గర్భస్రావ హక్కు, హుందాగా జీవించే హక్కు, సమాన పనికి సమాన వేతన హక్కు, వేతనాలను నిర్దిష్ట కాలావధిలో ఎప్పటికప్పుడు సవరించే హక్కు, శ్రమ జీవులకు సామాజిక భద్రత హక్కు మున్నగు వాటికి కొత్త రాజ్యాంగం పూచీ పడుతుందన్న ఆశతో ప్రజలు ఉన్నారు. ఈ అంశాలతో బాటు చిలే సమాజం బహుళత్వం స్వభావాన్ని, మూలవాసులను గుర్తించి, వారి హక్కులకు గ్యారంటీ ఇచ్చే పని కూడా కొత్త రాజ్యాంగం చేయాలని వారు కోరుకుంటున్నారు. అంతకన్నా ముఖ్యంగా పెట్టుబడిదారులకు, ఇతర దోపిడీ వర్గాలకు అనుకూలంగా ఉన్న ప్రస్తుత రాజకీయ వ్యవస్థను మొత్తంగా సంస్కరించాలని, మానవ హక్కులను హరించేందుకు ఎలాంటి అవకాశం లేని, ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం కావాలని కోరుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే మెరుగైన భవిష్యత్తుకు గ్యారంటీ ఇచ్చే రాజ్యాంగం కావాలని వారు కోరుకుంటున్నారు. ఆ ఉద్దేశ్యంతోనే యువ సభ్యులను ఎక్కువగా ఎన్నుకున్నారు.

రాజ్యాంగ పరిషత్‌కు ఎన్నికైన ప్రతినిధుల మనోగతాలను తెలుసుకునేందుకు చిలే లోని మీడియా సంస్థ ఇటీవల ఓ సర్వే నిర్వహించగా మరికొన్ని ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి. అధ్యక్షుని అధికారాలను కుదించాలని 86.8 శాతం మంది అభిప్రాయపడ్డారు. ఏక సభతో కూడిన పార్లమెంటుకు 51 శాతం మంది మద్దతు తెలిపారు. న్యాయవ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలన్న ప్రతిపాదనతో 65 శాతం మంది ఏకీభవించారు. నీరు అందరికీ అందుబాటులో ఉండేలా చూడడం, నీటివనరుల పరిరక్షణ, పంపిణీని పరిగణించి రాజ్యాంగంలో వీటిని పొందుపరచాలని 91.6 శాతం మంది కోరుకుంటున్నారు. అందరికీ మంచి ఆవాసం కల్పించేందుకు రాజ్యాంగం పూచీ పడాలని 60 శాతం మంది పేర్కొన్నారు. స్త్రీలకు పురుషులతో సమంగా వేతనాలు ఉండాలని, చిలేని బహుళత్వంతో కూడిన దేశంగా ప్రకటించాలని 73 శాతం మంది పేర్కొన్నారు.

పెరూ అధ్యక్షుడుగా పాఠశాల ఉపాధ్యాయుడు :

గత మూడు సంవత్సరాలుగా ఆర్థిక సంక్షోభం, కొవిడ్ విలయ తాండవం మరోవైపు రాజకీయ అవినీతి పెరూ ప్రజల జీవితాలను ఛిద్రం చేసింది. ప్రస్తుతం అధ్యక్ష అభ్యర్థిగా పోటీ చేసిన కైకో సంపన్న వర్గాల ప్రతినిధి, ప్రైవేటీకరణ విధానాల ప్రతినిధిగా అధ్యక్ష ఎన్నికల బరిలో దిగింది. ఈమెకు అవినీతి ఆరోపణలతో జైలు పాలయిన చరిత్ర ఉంది. ఆమె తండ్రి అల్బర్టో పూజిమోరి పాతిక మంది హత్యా నేరాలతో, ఆర్థిక అవినీతి కేసులో 25 సంవత్సరాల శిక్ష అనుభవిస్తున్నాడు. పెరూలో గత మూడు సంవత్సరాల్లో నలుగురు అధ్యక్షులు మారారు. గత అధ్యక్షులు 10 మందిలో ఏడుగురు అవినీతి ఆరోపణలపై శిక్షకు గురైనారు మిగతా వారు దర్యాప్తు ఎదుర్కొంటున్నారు. అంటే, ఆ దేశం ఎదుర్కొంటున్న రాజకీయ కల్లోలాన్ని ఊహించుకోవచ్చు. రాజకీయ, ఆర్థిక, సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న పెరూలో గత మూడు సంవత్సరాలలో పెడ్రో పాబ్లో కుజిన్‌స్కి 2018లో రాజీనామా చేయడంతో ఉపాధ్యక్షుడిగా ఉన్న మార్టిన్ విజికారా బాధ్యతలు స్వీకరించాడు. అతగాడిని 2020లో అభిశంసించి పదవి నుంచి తొలగించారు. తరువాత పార్లమెంట్ స్పీకర్ మెరినో బాధ్యతలు స్వీకరించిన వారంలోగానే జనం నిరసన కారణంగా రాజీనామా చేశాడు. తరువాత ఫ్రాన్సిస్కో సగస్తీని పార్లమెంట్ ఎన్నుకుంది.

పెరూ అధ్యక్ష ఎన్నికల్లో మితవాద అభ్యర్థిని పెరువియన్ మాజీ అధ్యక్షుడు అల్బెర్టో పుజిమోరి కుమార్తె కైకో పుజిమోరి, పెరూ ఉచిత పార్టీకి చెందిన సోషలిస్టు అభ్యర్థి, మార్క్సిస్టు లెనినిస్టు పార్టీ సభ్యుడు, రైతుబిడ్డ, పాఠశాల ఉపాధ్యాయుడు పెడ్రో కాస్టిల్లో మధ్య నువ్వా-నేనా అన్నట్లు పోటాపోటీగా జరిగిన సమరంలో స్వల్ప ఆధిక్యతతో కాస్టిల్లో గెలుపొందారు. ఆయనకు 50.13 శాతం ఓట్లు లభించగా, కైకో పుజిమోరి 49.87 శాతం ఓట్లు పొందారు. రాజధాని లిమా ఇతర పట్టణ ప్రాంతాల్లో ఆమెకు మోజారిటీ లభించగా, రైతుబిడ్డ అయిన కాస్టిల్లోకు గ్రామీణ ప్రాంతాలు భారీగా ఓటు చేశాయి. పర్యవసానంగా పట్టణ ఓట్ల ఆధిక్యతతో తాను గెలిచాననుకున్న పుజిమోరి ఓటమి పట్ల దిగ్భ్రాంతి చెందారు, నిరాశకు లోనయ్యారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ లాగా ఓట్ల లెక్కింపు చివరలో మోసం జరిగిందని ఆరోపిస్తున్నారు. అయితే ఎలాంటి ఆధారాలు చూపలేక పోయారు.

పెరూ రాజ్యాంగం ప్రకారం అధ్యక్ష పదవికి అవసరమైతే రెండు దశల్లో ఎన్నికలు జరుగుతాయి. తొలిదశలోనే 50 శాతానికి మించి ఓట్లు తెచ్చుకుంటే రెండవసారి ఎన్నిక అవసరం ఉండదు. లేనట్టయితే తొలి దశలో మొదటి రెండు స్థానాలలో ఉన్న అభ్యర్థుల మధ్య అంతిమ పోటీ జరుగుతుంది. దీని ప్రకారం ఏప్రిల్ 11న జరిగిన తొలిసారి ఎన్నికలలో 18 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. వీరిలో మార్క్సిస్టు భావజాలంతో పనిచేస్తున్న ఉచిత పెరూ పార్టీ అభ్యర్థి పెడ్రో కాస్టిల్లో 18.92 శాతం ఓట్లతో ముందుండగా ద్వితీయ స్థానంలో పాపులర్ ఫోర్స్ పార్టీకి చెందిన కైకో పుజిమోరికి 13.41 శాతంతో రెండవ స్థానంలో నిలిచారు. పార్లమెంట్‌లోని 130 స్థానాలకు గాను 27 బహుళ నియోజక వర్గాల నుంచి ప్రతినిధులను దామాషా ప్రాతిపదికన ఎన్నుకుంటారు. మొత్తంగా ఐదు శాతం పైగా ఓట్లు సాధించడం లేదా ఒక నియోజకవర్గంలో ఏడుగురు ప్రతినిధులు గెలిచినా దేశం మొత్తంలో దామాషా ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తారు. ఈ మేరకు 20 పార్టీలు పోటీపడగా పది పార్టీలు ఐదు శాతానికి పైగా ఓట్లు సాధించి పార్లమెంటులో ప్రవేశం పొందాయి. ఫ్రీ (విముక్త) పెరూ పేరుతో రంగంలోకి దిగిన కొత్త పార్టీ 13.4 శాతం ఓట్లు పొంది 37 స్థానాలతో పెద్ద పార్టీగా ఎన్నికైంది.

రెండవసారి జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తి అయినప్పటికి ఫలితాన్ని ఎన్నికల అధికారులు అధికారికంగా ప్రకటించలేదు. పుజిమోరి 49.87 శాతం, కాస్టిల్లో 50.13 శాతం ఓట్లు సాధించారు. పుజిమోరి కంటే కాస్టిల్లో 44 వేల ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. ఎన్నికల ఫలితాలపై న్యాయస్థానాలు వివాదాలు పరిష్కరించడానికి వారాలు పట్టవచ్చు. పుజిమోరి అధ్యక్షులుగా ఎన్నిక కానట్లయితే ఆమెపై ఉన్న అవినీతి ఆరోపణలు ఎదుర్కోవలసి ఉంటుంది. అందువల్ల ఎన్నికల్లో లోపాలు జరిగాయని, కొన్ని ఓట్లు రద్దు చేయాలని, తిరిగి

ఎన్నికలు నిర్వహించాలని రకరకాల వాదనలతో న్యాయ స్థానాలకు ఆమె వెళ్తుంది. పెరూ రాజధాని లీమాలో కార్పొరేటు న్యాయవాదులు ఎన్నికల తీరు సక్రమంగా లేదని ఇప్పటికే ఎన్నికల సంఘానికి ఏ ఆధారాలు లేకుండానే ఫిర్యాదు చేశారు. మరోవైపు కాస్టిల్లో గెలిస్తే విదేశీ రుణం తీర్చదని, బ్యాంకులను, గనులను జాతీయం చేస్తాడని ద్రవ్య పెట్టుబడి సంస్థలు ప్రచారం చేస్తున్నాయి. ఓట్ల లెక్కింపులో అక్రమాలు జరిగినందున ఫలితాన్ని తాను అంగీకరించేది లేదని కైకో ప్రకటించినందున పరోక్షంగా ఓటమిని అంగీకరించినట్టు పరిగణిస్తున్నారు.

పెరూ ఎన్నికల సంస్థ ప్రకటించిన తుది ఫలితాల మేరకు కాస్టిలోకి 50.127 శాతం ఓట్లు రాగా, ఆయన ప్రత్యర్థి కైకో పుజిమోరికి 49.893 శాతం ఓట్లు లభించాయి. వంద శాతమూ ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత వెల్లడైన ఈ ఎన్నికల ఫలితాలతో పుజిమోరి ఓడిపోయారని స్పష్టమైంది. అయితే మితవాద అభ్యర్థి అయిన కైకో ఈ ఎన్నికల ఫలితాన్ని అంగీకరించడం లేదు. ఎన్నికల ఫలితాలను సవాలు చేయడానికి ఆమె దేశంలోనే అత్యుత్తమైన న్యాయవాదులను నియమించుకున్నారు. పుజిమోరి బృందం 134 పిటిషన్లను దాఖలు చేసింది. మరో 811 పిటిషన్లు దాఖలు చేయడానికి సిద్ధంగా ఉన్నాయి. కాస్టిలోకి మద్దతుదారుల్లో కీలకమైన వారైన దేశీయ కమ్యూనిటీల ఓట్లను చెల్లనివిగా చేసేందుకు మొత్తంగా రంగం సిద్ధం చేస్తున్నారు. వర్ణ వివక్షతో కూడిన చట్టపరమైన వ్యూహాన్ని అమలు చేసేందుకు లీగల్ ఆర్మీ పనిచేస్తోంది. కాగా, తమ విజయానికి వచ్చిన ఢోకా ఏమీ లేదన్న ధీమాతో పెడ్రో కాస్టిలో వర్గం ఉంది. భయాలు వెంటాడుతున్నాయి. మరి ప్రజలు వాటిని ఓడిస్తారో లేదో చూడాలి.

ఎన్నికల పరిశీలకులుగా ఉన్న లాటిన్ అమెరికా దేశాల సంస్థ సభ్యులు ఎన్నికల అవకతవకలపై ఎలాంటి ఫిర్యాదులూ చేయలేదు. పది సంవత్సరాల కాలంలో మూడవసారి కూడా ఓడిపోతుండడంతో కైకో నిరాశతో ఇలాంటి ఆరోపణలకు దిగారని విమర్శలు వచ్చాయి. వామపక్ష నేత కాస్టిలో అధికారానికి వస్తే మార్కెట్ శక్తుల ఆధిపత్యంలోని వ్యవస్థను మార్చివేస్తారనే ఆందోళన అమెరికాలో వ్యక్తమైంది. పట్టణ ప్రాంతాల నుంచి తొలుత లెక్కింపు ప్రారంభమైంది. ఎనభై ఆరుశాతం ఓట్ల లెక్కింపు వరకు మితవాద అభ్యర్థిని కైకో పుజిమోరి 52 శాతానికి పైగా ఓట్ల మెజారిటీతో కొనసాగారు. అప్పటి నుంచి గ్రామీణ ప్రాంతాల ఓట్ల లెక్కింపు ప్రారంభం కావడంతో 93 శాతానికి చేరగానే ఇద్దరి ఓట్లు సమం అయ్యాయి. ఆ తర్వాత కాస్టిల్లో ఓట్లు పెరగడం ప్రారంభమైంది.

దేశం ఆర్థిక మాంద్యంలో ఉంది. నిరుద్యోగం, పేదరికంతో ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు. పెరూ ప్రజారోగ్య వ్యవస్థ డొల్లతనాన్ని 3 కోట్ల 30 లక్షల జనాభా గల దేశంలో కరోనా వల్ల 1,84,000 మంది ప్రాణాలు కోల్పోవడం దారుణమైన పరిస్థితిని వెల్లడిస్తోంది. అందువల్ల పరిస్థితులను చక్కదిద్దడం కొత్త అధ్యక్షునికి విషమ పరీక్ష. ఈ ఎన్నికల్లో వామపక్షాలు పూర్తిగా ఐక్యం కాలేదు. మితవాద కూటమికి ప్రత్యామ్నాయంగా చివరి వరకు నిర్దిష్టమైన కార్యక్రమం, కార్యాచరణ లేదు. సోషలిస్టు అభ్యర్థి కాస్టిలో చివరకు కూటమినైతే ఏర్పాటు చేయగలిగారు గానీ ఉమ్మడి కార్యక్రమమంటూ లేదు. తన భాగస్వాముల్లో విశ్వాసం నింపడం, ఆర్థిక వ్యవస్థలో పేదలకు అనుకూల మార్పుల కొరకు కనీస ఉమ్మడి కార్యక్రమం రూపొందించడం ఇప్పుడు ఆయన ముందున్న కర్తవ్యం.

ప్రపంచీకరణ విధానాలను వ్యతిరేకిస్తే సామ్రాజ్యవాద శక్తులు కుట్రలకు పాల్పడిన ఉదంతాలు లాటిన్ అమెరికా (బొలీవియా, వెనిజులా)లో మనం చూసే ఉన్నాం కనుక ప్రజలను అప్రమత్తంగా ఉంచాలి. అవసరమైతే వీధి పోరాటాలకు సిద్ధంగా ఉండాల్సి ఉంటుంది. లాటిన్ అమెరికా దేశాలను అస్థిరపరచడం సామ్రాజ్యవాద అమెరికా దినచర్య. అందువల్ల అమెరికా పట్ల అప్రమత్తత, ప్రజల ఆకాంక్షలు పరిగణలోకి తీసుకోవడం కాస్టిలోకు అనివార్యం. ఇప్పుడు పెరూ అగ్నిగోళంలో ఉంది. అందువల్ల ప్రజల శాంతి, సామరస్యాల కోసం నిబద్ధతతో కృషి చేయవల్సిఉంది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధ్వంసం పట్ల ప్రపంచ వ్యాప్తంగా ఉద్యమాలు, చర్చలు జరుగుతున్న నేపథ్యంలో వామపక్ష అభ్యర్థి అధ్యక్షుడుగా గెలువడంతో లాటిన్ అమెరికాలోని దేశాలతో పాటు, ప్రపంచ దేశాల్లోని ప్రజా ఉద్యమాలను తప్పక ప్రభావితం చేస్తుందని ఆశిద్దాం.

ముగింపు:

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలకు వ్యతిరేకంగా పలు దేశాలు (ఇరాక్, కంబోడియా, పెరూ, చిలే, లెబనాన్, ఈక్వెడార్, ఫ్రాన్స్, జర్మనీ) ప్రజాగ్రహంతో రగిలి పోతున్నాయి. నిరసనల హోరు కొనసాగుతోంది. ప్రభుత్వాల పెట్టుబడి అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ ఆందోళనలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. ఇంకెన్నేళ్ళు సంయమనం పాటించాలి అంటూ మండి పడుతున్నారు. లక్షలాది ప్రజలు వీధుల్లోకి వస్తున్నారు. నెలల తరబడి ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ఉపాధి లేమి, ధరల పెరుగుదల, అరకొర విద్య, వైద్య తదితర మౌలిక వసతుల కల్పనను తీవ్రంగా నిరసిస్తున్నారు. మెరుగైన సమాజం కావాలంటూ ముక్త కంఠంతో డిమాండ్ చేస్తున్నారు. పెరూలో సామ్రాజ్యవాద అనుకూల ప్రభుత్వాన్ని ఎన్నికల్లో మట్టి కరిపించారు. వామపక్ష అభ్యర్థి కాస్టిలోకు పట్టం గట్టారు. చిలేలో నూతన రాజ్యాంగ రూపకల్పన ప్రక్రియలో తమకు భాగస్వామ్యం కావాలని ఉద్యమించి విజయం సాధించారు. గత దశాబ్ద కాలంగా పలు దేశాలలో జరుగుతున్న ప్రజా ఉద్యమాలకు అంతర్జాతీయ అంతస్సూచనలు ఉన్నాయి. ఒక్కో దేశంలో ఒక్కో రకమైన ప్రత్యేకత కనిపిస్తోంది. వీటి మధ్య గల ఒక సారూప్యత ఏమంటే నిరసన ప్రదర్శనలలో మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు. ప్రపంచ ఆర్థిక సంక్షోభం, పర్యావరణ విధ్వంసం, ఉపాధి రహిత వృద్ధి, ఆర్థిక అంతరాలు, కార్పొరేట్ల దోపిడీ వలన నెరవేరని యువత ఆకాంక్షలు దేశాధినేతలకు రాజకీయ టైంబాంబులుగా మారుతున్నాయి. ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న ప్రజా ఆందోళనలు సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాల దుష్పరిణామాలకు వ్యతిరేకంగా ఒక ప్రత్యామ్నాయ ఆర్థిక వ్యవస్థ కోసం ప్రజలు ఆలోచిస్తున్నట్లు స్పష్టమైన సంకేతం కనిపిస్తోంది. అయితే ఈ ఉద్యమాలకు రాజకీయ, చారిత్రక దృక్పథం అందించగల ఉద్యమ నాయకత్వం అత్యంత కీలకాంశం. అదే నేటి చారిత్రక, రాజకీయ సంధికాలంలో అత్యంత ప్రాధాన్యత గల అంశంగా ముందుకు వస్తుంది.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

హిందుత్వ - మార్కెట్ ముట్టడిలో లక్షద్వీప్

లక్షద్వీప్ పాలకుడిగా ప్రఫుల్ ఖోడా పటేల్‌ను నియమించి అక్కడి భౌగోళిక ప్రత్యేకత, సాంస్కృతిక, సామాజిక, చారిత్రక అంశాలకు భిన్నంగా హిందుత్వ-కార్పొరేట్ విధానాలను రుద్దుతున్నారని అంటున్నారు **సతీష్ బైరెడ్డి**

తెల్లగా పరుచుకున్న ఇసుక తిన్నెలు, హొయలు పోయే సముద్రపు నీలి కెరటాలు. చుట్టూతా అల్లుకుపోయిన పగడపు దీవులు. ప్రకృతి సోయగాలతో అలరారే చిన్న చిన్న దీవుల సమూహం లక్షద్వీప్. అందమైన దీవుల్లో విహరించేందుకు దేశ విదేశాలనుండి వచ్చే పర్యాటకులతో సందడిగా ఉండే లక్షద్వీప్ పెద్దగా వార్తల్లో ఉండే ప్రాంతం కాదు. దేశ విదేశాల దృష్టిని ఆకర్షించే రాజకీయ, ఆర్థిక కార్యకలాపాలు జరిగే కేంద్రం కూడా కాదు. ప్రధాన జనజీవన స్రవంతిగా పిలవబడే సమాజానికి దూరంగా విసిరేయబడ్డట్టు ఉండే ఈ దీవుల్లో గడచిన ఆరు నెలలుగా ఆందోళన అలుముకున్నది. పెద్దగా వీధుల్లోకి రాని జనం వీధుల్లో నిలబడి మిగతా ప్రపంచానికి తమ గొంతును వినిపిస్తున్నారు. అంతర్జాల పుణ్యమా అని అంతర్జాతీయ స్థాయిలో ఇవ్వాళ ఆందోళనా స్వరం వినపడుతోంది.

శతాబ్దాలుగా అక్కడి నేలతో, గాలితో సంద్రపు అలలతో పెనవేసుకపోయిన జీవితపు అనుబంధాలేవో పెకిలించబడుతాయనే దిగులేదో దీవుల నిండా పరుచుకున్నది. లక్షద్వీప్ 36 దీవులతో 32 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఉన్న అతి చిన్న కేంద్ర పాలిత ప్రాంతం. 70 వేల లోపే జనాభా. వీరిలో అత్యధికులు ముస్లింలు. మెజారిటీ ప్రజలు చేపల వేట, కొబ్బరి సాగు పైన ఆధారపడి జీవించేవారే. పర్యాటక ప్రాంతం కావడంతో పర్యాటకులతో కూడా ఇక్కడి ప్రజల ఆర్థిక పరిస్థితి నిలబడుతున్నది. అలా అని ఇక్కడి ప్రజలంతా గొప్పగా బతుకుతున్నారనీ కాదు.

భౌగోళికంగా కేరళతో అతి సమీపంగా ఉండటమే కాకుండా లక్షద్వీప్ సాంస్కృతిక మూలాలు కూడా కేరళ సమాజపు మూలాలతో ముడిపడి ఉన్నవే. జలమార్గం, వాయు మార్గంలో కేరళకు వెళ్లడం అక్కడే చదువు, ఉపాధి ఉద్యోగాలు వెతుక్కోవడం అక్కడి ప్రజలు దశాబ్దాలుగా చేస్తూనే ఉన్నారు. కేంద్ర పాలిత ప్రాంతం కావడంతో దాని ఆలనా పాలనా అంతా కూడా కేంద్రం చేతుల్లోనే ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం చేత నియమించబడిన అఖిల భారత సర్వీసులకు చెందిన అధికారులే పాలనా అధికారులుగా ఈ ప్రాంతానికి వ్యవహరిస్తారు. ఇక్కడ స్థానిక సంస్థలు కూడా ఉనికిలో ఉన్నాయి.

అఖిల భారత సర్వీసులనుండి ఎంపిక చేసుకునే ఆనవాయితికి భిన్నంగా గత సంవత్సరం డిసెంబర్ నెలలో ప్రధాని నరేంద్ర మోడీకి సన్నిహితుడైన, గుజరాత్ రాష్ట్రానికి చెందిన బిజెపి నాయకుడైన ప్రఫుల్ ఖోడా పటేల్‌ని లక్షద్వీప్ ప్రాంత పాలకుడిగా నియమించారు. ఆయన అప్పటికే దాద్రనాగర్, హావేలి అనే కేంద్ర పాలిత ప్రాంతానికి కూడా పాలకుడిగా వ్యవహరిస్తున్నాడు. ఈయన నియామకంతోనే దీవుల్లో అలజడి మొదలయ్యింది. కొత్త పాలకుడు వచ్చినప్పుడల్లా ఏదో ఒక కొత్తదనం, విధాన మార్పు కనిపించడం సర్వసాధారణం. కొత్త మార్పులు, విధాన నిర్ణయాలు ప్రజల ఆమోదంతో, భాగస్వామ్యంతో ఉండినపుడు అవి విజయవంతం అవుతాయి. అభివృద్ధికి బాటలు పడుతాయి. కానీ ఇవ్వాళ అమలవుతున్న అభివృద్ధి నమూనా మొత్తంగా క్షేత్ర స్థాయిలో ప్రజల అభివృద్ధి ఆకాంక్షలతో సంబంధం లేకుండా ఏకాఏకిన పైనుండి రుద్దబదుతున్నది. సరిగ్గా ఇవ్వాల్టి ఆందోళనకు, అలజడికి ప్రఫుల్ పటేల్ రూపొందించిన'గుజరాత్' మోడల్ యే మూలమయ్యింది. అక్కడి భౌగోళిక ప్రత్యేకత, సాంస్కృతిక మూలాలు, సామాజిక, చారిత్రక అంశాలతో సరిపోలని ఏ విధాన నిర్ణయమైనా ప్రజలనుండి ప్రతిఘటన ఎదుర్కొంటుంది అని చరిత్ర చెబుతూనే ఉంది. ప్రజాభీష్టానుసారం కాకుండా వ్యక్తుల చిత్తానుసారం, వారు ప్రాతినిధ్యం వహిస్తున్న సమూహాల ప్రయోజనమే పరమావధిగా ముందుకు తోయబడిన అభివృద్ధి ప్రణాళికలు అభాసుపాలవుతాయి.

లక్షద్వీప్ డెవలప్‌మెంట్ అథారిటీ రేగులేషన్ 2021 పేరిట ఓ బృహత్తర ప్రణాళికను ముందుకు తెచ్చాడు ప్రఫుల్ పటేల్. "మౌలిక సదుపాయాలను మెరుగు పర్చడం, సుపరిపాలన అందించడం, ప్రణాళికా బద్ధ అభివృద్ధి సాధించడం" ఇది బయటికి చెప్పబడుతున్న లక్షద్వీప్ కొత్త సంస్కరణల ప్యాకేజీ. నిజమే స్థూలంగా ఇలాంటి ప్రతిపాదనల పట్ల ఎవరికి ఏ ఇబ్బంది ఉండాల్సింది ఏమీ లేదు! అయితేలోతుల్లోకి వెళ్లినపుడే అభివృద్ధి ప్రణాళిక చాటున ఇంకేదో అసలు లక్ష్యం ఉన్నట్టు బోధపడుతుంది. అసలు లక్ష్యాన్ని దాచేలా మేలిముసుగులు కప్పడం పాలకులకు అలవాటైన విద్యయే! ఇది అలాంటి మేలిముసుగు కప్పుకున్న ప్రమాదకర అభివృద్ధి ప్రతిపాదనయే. దీని ప్రతిపాదనా పునాదిలోనే ఒక సుదూర లక్ష్యం ఉన్నది.

ప్రఫుల్ పటేల్ వస్తూ వస్తూనే రాబోయే అభివృద్ధిలో ఏమి జరుగుతుందో అనేదానికి సాంపుల్ గా అంగన్ వాడి ఉద్యోగులను, ఉపాధ్యాయులను, మధ్యాహ్న భోజన పథకంలో పని చేస్తున్న కార్మికులను, ఒప్పంద ఉద్యోగులను, రోజు వారి ప్రాతిపదికన పని చేసే చిన్నా చితక ఉద్యోగులను మూకుమ్మడిగా తొలగించాడు. ఇలా మొదలయిన ఆయన పాలన లక్షద్వీప్ అభివృద్ధి పేరుతో అనేక కొత్త చట్టాల రూపకల్పన వరకూ వెళ్లింది. స్థానికంగా ఉన్న పాడి పరిశ్రమను దెబ్బతీసేలా స్థానిక పాల ఉత్పత్తులు నిషేదించి తన రాష్ట్రానికే చెందిన సంఘ్ పరివార్, బిజెపి అండదండలు ఉన్న అమూల్ ఉత్పత్తులకు ప్రవేశాన్ని సుగమం చేశాడు. అక్కడి ప్రజల ప్రధాన ఆహారమైన మాంసాహారాన్నీ లక్షద్వీప్ అనిమల్ ప్రిజర్వేషన్-నియంత్రణ పేరుతో నిషేధించారు. మధ్యాహ్న భోజనం మెనూలోంచి బీఫ్‌ను తొలగించారు. ఒకటి రెండు రిసార్ట్స్‌లో మాత్రమే అందుబాటులో ఉండే మద్యాన్ని

లక్షద్వీప్‌లో ఎక్కడైనా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

బహుశా ప్రపంచంలోనే అతి తక్కువ నేరాలు నమోదయ్యే ప్రాంతంలో లక్షద్వీప్ కూడా ఒకటి. అలాంటి చోట అసాంఘిక శక్తుల కార్యకలాపాల నియంత్రణ పేరుతో యాంటీ గూండా యాక్ట్‌ని తీసుకొచ్చారు. కోస్ట్ గార్డ్ చట్టాన్ని సాకుగా చూపెట్టి మత్స్యకారులు తమ వృత్తిపరమైన పనిముట్లను ఇతర సామాగ్రిని దాచుకునేందుకు వీలుగా సముద్రపు ఒడ్డున నిర్మించుకున్న షెడ్లను కూల్చివేశారు. పశు గ్రాసాన్ని నిలువ పెట్టుకోవడం కూడా నిషేధించారు. సైకిళ్లు కూడా తిరగడం కష్టమైన చోట నాలుగు వరుసల రోడ్ల పేరుతో రోడ్డు కిరువైపులా ఇండ్లను కూల్చివేస్తామంటున్నారు. ఈ సంస్కరణల్లో భాగంగానే దౌర్జన్యపూరితంగా భూమిని గుంజుకునే పద్ధతి మొదలు పెట్టారు. భూమిని గుంజుకునే ప్రక్రియను ఎవరు వ్యతిరేకించినా, ఆందోళన చేసినా, నిరసన తెలిపినా సంవత్సరం వరకు ఎలాంటి విచారణ లేకుండా ఎవరినైనా బందించవచ్చు. గోవధకు పాల్పడితే 10 సంవత్సరాలు జైలు శిక్ష, 5 లక్షల జరిమానా అని నిర్ణయించేశారు. ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ ఉంటే పంచాయతీ ఎన్నికల్లో పోటీకి అనర్హులు. అసలు మొత్తంగా ఆ వ్యవస్థలనే తమ గుప్పిట్లో పెట్టుకొని వాటి అస్తిత్వాన్ని ప్రమాదంలో పడేశారు.అంతా ఒక వ్యక్తి కేంద్రంగానే పాలన నడవాలనే అప్రజాస్వామిక విధానం రాజ్యమేలుతోంది. ప్రతి మనిషిని నిఘా నీడలో పెట్టేందుకు, వారి ప్రతి కదలికను కనిపెట్టేందుకు ఆ ప్రాంత ఉద్యోగులను సైతం మత్స్యకారుల చేపల పడవలపై ప్రయాణం చేయాలని అక్కడి పాలకుడు అదేశించాడంటే అది ఒక ఫాసిస్టు ఎజెండా కాకుండా మరేమిటి?

అక్కడ మొదలైన ఈ కొత్త అభివృద్ధి ప్రణాళిక అమలు కార్యాచరణలో భాగంగా కాంట్రాక్టులన్నిటిని గుజరాత్ వారికే కట్టబెడుతున్నారు. పెద్ద పెద్ద రిసార్ట్స్, హోటల్స్ నిర్మించడం కోసం పెద్ద కంపెనీలు, కార్పొరేట్స్‌ను ఆహ్వానిస్తున్నారు. వ్యాపార కేంద్రాలను నిర్మించుకునేలా మార్గం సుగమం చేస్తున్నారు. వీరి రాకతోనే ఈ కేంద్ర పాలిత ప్రాంత ప్రధాన కేంద్రం అయిన కవరత్తిని స్మార్ట్ నగరంగా మారుస్తామంటున్నారు. అంటే పచ్చని ప్రకృతి, సున్నితమైన, సుందరమైన సముద్ర తీరాన కాంక్రీటు ప్రపంచం పరుచుకో పోతుందన్న మాట. పర్యాటకులుగా, అతిథులుగా వెళ్లే సదుపాయమే కాకుండా అక్కడ ఆస్తులు కొనుక్కోవచ్చు. పాలకుల సహాయంతో, అభివృద్ధి పేరుతో అక్కడి వారి భూమిని గుంజుకొని దర్జాగా విలాస భవనాలు కట్టుకోవడమే కాదు స్థానికులను బానిసలుగా చేసుకోవచ్చు. అన్ని రకాల శ్రమ దోపిడీ చేయవచ్చు. వారికి తమదంటూ ఏమి లేకుండా చేసి, వారిని ఏమీ కాకుండా చేసి తమ నేల మీద తామే కాందిశీకులను చేయవచ్చు. ఇంకేదో చట్టం తెచ్చి అసలు మొత్తంగానే అక్కడ బతకనివ్వకుండా చెయ్యవచ్చు. కట్టుబట్టలతో, కన్నీళ్లతో మరో ప్రాంతానికి శరణార్థులుగా పంపేయొచ్చు.

ఇవ్వాళ బడా బాబులకు ఏ అసౌకర్యం లేకుండా, ఎలాంటి రణగొణ ధ్వనులు లేని భద్రతాయుతమైన ప్రశాంత దీవులు కావాలి. ఇవ్వాల్టి పాలకుల శ్రమ అంతా వారికోసమే కదా. మొత్తంగా దీవుల జనజీవితాలను తలకిందులు చేసే సునామీ అలల లాంటి ఈ సంస్కరణలకు వ్యతిరేకంగా మొదలైన నిరసన గళం చిన్న చినుకులుగా మొదలైనా చిక్కబడుతూనే ఉంది. లక్షద్వీప్ స్టూడెంట్ అసోసియేషన్ అంతర్జాలంలో మొదలు పెట్టిన ప్రతిఘటన స్వరం పదునెక్కింది. దేశంలో ప్రజా ఉద్యమ శక్తులు, ప్రగతి శీలురు, పర్యావరణ ప్రేమికులు లక్ష 'దీపా' నికి చేతులు అడ్డుపెడుతున్నారు. కేరళలో పెద్ద ఎత్తున ఆందోళనలు నడుస్తున్నాయి. ఆ రాష్ట్ర శాసన సభ లక్షద్వీప్ పరిపాలకుణ్ణి వెనక్కి పిలవాలని తీర్మానం చేసింది.

ఈ సందర్భంలోనే ప్రగతిశీల కేరళ ప్రభావం మరింత ఉంటుందని బయపడ్డారేమో పాలకులు. అందుకే లక్షద్వీప్‌ను ఆ రాష్ట్ర హైకోర్టు పరిధి నుండి తప్పించాలని కర్ణాటక హైకోర్టు కిందికి తీసుకురావాలనే సరికొత్త ప్రతిపాదనలను తెరమీదికి తెచ్చారు. ఇంకా అతికీలకమైన రవాణా అంశానికి సంబంధించి లక్షద్వీప్ కార్యకలాపాలన్ని మంగుళూరు తోనే జరపాలని బలంగా ప్రతిపాదిస్తున్నారు. మంగుళూరు సంఘ్ పరివార్ బలమైన కేంద్రం అవడమే ఆ ప్రతిపాదనకు కారణం తప్ప మరోరకంగా లక్షద్వీప్ ప్రజలకు ఎలా ఉపయోగపడేది కాదు. కర్ణాటకలో బిజెపి అధికారంలో ఉంది కాబట్టే లక్షద్వీప్‌ను ఆ రాష్ట్ర హైకోర్టు పరిధి అనే పల్లవి తప్ప మరొకటి ఏమీ లేదు. బిజెపి పాలకుడు ఇటువంటి ఎజెండాతో కాకుండా మరోలా ఎలా పనిచేస్తాడు.

శతాబ్దాలుగా ప్రజల సాంస్కృతిక హక్కైన పశు మాంసాన్ని నిషేధించే ఎజెండాను ముందుకు తీసుకెళ్లడం ఏ విధానంలో భాగంగా వచ్చింది? 'ఇద్దరు' పిల్లల పరిమితి ఇప్పుడే హఠాత్తుగా ఎందుకు గుర్తుకు వచ్చింది? కేరళతో పెనవేసుకున్న లక్షద్వీప్ ప్రజల అనుబంధాన్ని తెంపాలనుకుంటున్న తెంపరితనం వెనుక దాక్కున్న దురుద్దేశ్యం ఏమిటి? మంగళూరుకు మార్గం వేయటం ఏ విద్వేష సంస్కృతిని విస్తరించడానికి? బిజెపి ఈశాన్య రాష్ట్రాల్లో పశు మాంసం మీద ఒక నాలుకతో లక్షద్వీప్‌లోనో మరో చోట మరో నాలుకతో ఎందుకు మాట్లాడుతుంది? ఇది ఆ ప్రాంత వికాసం కోసం తీసుకొస్తున్న అభివృద్ధి సంస్కరణల రథం కాదు అక్కడి ప్రజల స్థానికత, వారి ఆకాంక్షల, ఆ నేల సాంస్కృతిక కుదుళ్లను కదతేర్చే హిందూత్వ - కార్పొరేట్ కలగలిసి చేస్తున్న దాడి తప్ప మరొకటి కాదు. లక్షద్వీప్ కోసం లక్షల ధిక్కార స్వరాలు మొదలయ్యాయి. కోటి స్వరాలుగా మారక ముందే ఆ నేల మీద మోపిన మీ కాళ్లను ఉపసంహరించుకోండి.

(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు) వీ

మడత నారాయణదాస్ మృతి

తెలంగాణ తొలి దశ ఉద్యమ నాయకుడు, సామాజిక కార్యకర్త మడత నారాయణదాస్(79) మరణించారు. అనారోగ్యంతో ఉన్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ జూన్ 12న మృతిచెందారు. వరంగల్ జిల్లా రాంపూర్ గ్రామంలో 1942లో జన్మించారు. 1969లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రమే తమ సమస్యలకు పరిష్కారమని భావించిన నారాయణదాస్ తెలంగాణ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేసి సారథ్యం వహించారు.

మల్లన్న సాగర్ దీక్షకు ఐదేండ్లు

సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని వేములఘాట్ గ్రామంలో మల్లన్న సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా గ్రామస్థులు ప్రారంభించిన దీక్షకు జూన్ 5 నాటికి ఐదు సంవత్సరాలు పూర్తి అయ్యాయి. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, ఇంటికి ఖాళీ స్థలానికి, పైపులైన్ తదితరాలకు సంబంధించిన పరిహారాలు రానివారు, డబుల్ బెడ్రూం ఇండ్లు రానివారు, కోర్టులో కేసులు ఉన్న భూ నిర్వాసితులు నిరసన దీక్ష చేపట్టారు. జూన్ 5న గ్రామంలోని దీక్షా శిభిరంలో కండ్లకు, చెవులకు, నోటికి నల్లటి దుస్తులు కట్టుకొని నిరసన తెలిపారు.

విరసం పై నిషేధం ఎత్తివేయాలని కోరుతూ లేఖ

16 ప్రజా సంఘాలను నిషేధిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులలో విప్లవ రచయితల సంఘం మీద కూడ నిషేధం విధించడాన్ని ఉభయ తెలుగు రాష్ట్రాలు, ఇతర రాష్ట్రాలు, విదేశాలలో ఉన్న తెలుగు కవులు, రచయితలు, కళాకారులు, జర్నలిస్టులు, మేధావులు సహా 780 మంది ఖండిస్తూ ప్రభుత్వానికి లేఖ రాశారు. జూన్ 10న పత్రికలకు విడుదల చేసిన ఈ లేఖలో 'విప్లవ రచయితల సంఘం యాభై ఏళ్లకు పైగా తెలుగు సాహిత్య మేధో రంగాల్లో పనిచేస్తున్న సంస్థ... ఆర్థిక అసమానతలు లేని నవ సమాజ నిర్మాణం లక్ష్యంగా అభ్యుదయ భావజాలం కలిగిన రచయితలు సంఘాలుగా ఏర్పడి చేసిన కృషిని మరింత నిర్దిష్టంగా, సముజ్వలంగా కొనసాగిస్తున్న సంస్థ విరసం. అటువంటి విరసంను తెలంగాణ ప్రభుత్వం చట్ట వ్యతిరేక సంస్థగా ప్రకటించడం ప్రజాస్వామ్య విలువలకు, ఆదర్శాలకు భంగకరం' అని ఆ లేఖలో అభిప్రాయపడ్డారు. నిషేధ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని కోరారు.

పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలను వ్యతిరేకిస్తూ నిరసన

పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను ఉపసంహరించుకోవాలని పట్నం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.జి. నర్సింహారావు డిమాండ్ చేశారు. ధరలు పెంపును నిరసిస్తూ జూన్ 11న ప్రజా సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఓ వైపు కరోనా కారణంగా అనేక మంది సామాన్య ప్రజలు ఉపాధి కోల్పోతుంటే కేంద్ర సర్కారు మాత్రం రోజు రోజుకూ పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ వారిపై మరింత భారం మోపుతుందని ఆరోపించారు. అంతర్జాతీయ స్థాయిలో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతుంటే మన దేశంలో మాత్రం పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్నాయని విమర్శించారు.

జర్నలిస్ట్ సంఘాల నిరసన

జర్నలిస్ట్ రఘు అక్రమ అరెస్టును నిరసిస్తూ పలు జర్నలిస్ట్ సంఘాలు జూన్ 11న హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్క్ వద్ద బహిరంగ నిరసన చేపట్టాయి. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్, తెలంగాణ బ్రాడ్‌కాస్ట్ అసోసియేషన్, హైదరాబాద్ జర్నలిస్టుల యూనియన్ తదితర జర్నలిస్ట్ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో వందలాది మంది జర్నలిస్టులు పాల్గొన్నారు. పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసిన జర్నలిస్ట్ రఘును వెంటనే విడుదల చేయాలని, ఆ అక్రమ అరెస్టుకు కారణమైన పోలీసులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని నినాదాలు చేస్తూ ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. జర్నలిస్టులకు రక్షణ కరువైందని, ప్రజాస్వామ్యం, పత్రికా స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రమాదంలో పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ జిల్లా కొయ్యూరు మండలం మంప పోలీసు స్టేషన్ పరిధిలోని తీగలమెట్ట వద్ద గ్రేహౌండ్స్ దళాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాలు జరిగాయని పోలీసుల అధికారులు తెలిపారు. మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో మంప పోలీసు స్టేషన్ పరిధిలో జూన్ 16న పోలీసులు కూంబింగ్ చేపట్టారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య కాల్పులు జరిగినట్లు డిజిపి గౌతమ్ సవాంగ్ తెలిపారు.

పోలీసు కస్టడిలో మహిళ మృతి

దొంగతనం కేసులో పోలీసుల అదుపులో ఉన్న మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఖమ్మం జిల్లా కోమట్లగూడానికి చెందిన అంబడిపూడి మరియమ్మ(50) యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడురు మండలం గోవిందాపురం గ్రామ చర్చిలో వంటపని చేసేది. చర్చిలో 2 లక్షల నగదు పోయిందని చర్చి ఫాదర్ బాలశౌరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరియమ్మపై అనుమానం వ్యక్తం చేశారు. మరియమ్మను జూన్ 16న అడ్డగూడూరు పోలీసు స్టేషన్‌కు తరలించి విచారిస్తున్న క్రమంలో ఆమె అస్వస్తతకు గురవడంతో పోలీసులు స్థానిక ఆర్ఎంపి వద్ద ప్రాథమిక చికిత్స చేయించి భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు.

హన్మకొండలో మంత్రిని అడ్డుకున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

హన్మకొండలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు జూన్ 19న అడ్డుకున్నారు. తమను విధుల్లోకి తీసుకోవాలని ఎర్రబెల్లి దయాకర్‌రావును మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి అని నినాదాలు చేశారు. ఆయన కాన్వాయ్‌ని అడ్డుకోవడంతో తోపులాట జరిగి పోలీసులు వారిని చెదరగొట్టారు.

ఆర్‌డిఎస్ ముట్టడిని అడ్డుకున్న పోలీసులు

రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్‌డిఎస్) పరిధిలో ఎపి ప్రభుత్వం చేపట్టిన కుడి కాల్వ నిర్మాణాన్ని అడ్డుకునేందుకు కాంగ్రెస్ నేతలు జూన్ 24న తలపెట్టిన కార్యక్రమాన్ని కర్ణాటక పోలీసులు అడ్డుకున్నారు. అలంపూర్ మాజీ ఎంఎల్ఏ తదితరుల ఆధ్వర్యంలో 300 మంది గద్వాల నుంచి జూన్ 24న బయలుదేరగా కర్ణాటక సరిహద్దులోని బల్గెర వద్ద కర్ణాటక పోలీసులు వారిని అడ్డుకున్నారు. తమ రాష్ట్రంలో 144 సెక్షన్ అమల్లో ఉందని, ఇంత మందిని అనుమతించబోమని రాయచూరు అడిషనల్ ఎస్‌పి తెలిపారు. దీంతో నేతలందరూ రోడ్డుపై బైటాయించి నిరసనకు దిగారు. చివరకు రాయచూర్ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు.

రైతు వ్యతిరేక చట్టాలను రద్దుచేయాలని నిరసన

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మూడు రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కోరుతూ రైతు సంఘాలు, ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. రైతులకు మద్దతుగా దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలో భాగంగా ఏఐకెఎస్‌సిసి, ఎస్‌కెఎంల పిలుపు మేరకు జూన్ 26న ఇందిరా పార్క్ నుంచి రాజ్‌భవన్‌కు ర్యాలీగా బయలుదేరిన రైతు, ప్రజా సంఘాల నేతలను అనుమతి లేదంటూ ఇందిరాపార్కు వద్ద పోలీసులు అడ్డుకుని, అరెస్టు చేసి వివిధ పోలీసు స్టేషన్‌లకు తరలించారు. రైతులకు నష్టం కలిగించే చట్టాలను ప్రభుత్వం రద్దుచేసేంత వరకు రైతులకు మద్దతుగా పోరాటాలు చేస్తామన్నారు. వీ

మధ్యప్రదేశ్‌లో జూనియర్ డాక్టర్ల సమ్మె

తమ డిమాండ్ల సాధనకోసం మధ్యప్రదేశ్‌లో సుమారు 3 వేల మంది జూనియర్ డాక్టర్లు మే 31న సమ్మెకు దిగారు. కొవిడ్–19 సోకితే...తమకు, తమ కుటుంబానికి ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలతో ఆసుపత్రుల్లో కరోనా సేవలకు అంతరాయం కలిగింది. సుమారు ఆరు మెడికల్ కాలేజీల్లోని 3 వేల మందికి పైగా జూనియర్ వైద్యులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. వివిధ ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లోని ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్ విభాగాలతో పాటు పలు వార్డుల్లో జూనియర్ డాక్టర్లు విధులకు దూరంగా ఉన్నారని మధ్యప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అరవింద్ మీనా తెలిపారు. తమ డిమాండ్లను నెరవేర్చుతూ రాతపూర్వక ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోతే... రాష్ట్రవ్యాప్తంగా కొవిడ్ బాధ్యతల నుండి పూర్తిగా తప్పుకుంటామని అన్నారు.

పూణేలోని శానిటైజర్ కంపెనీలో ప్రమాదం

మహారాష్ట్రలోని పూణేలో జూన్ 7న ఒక కెమికల్ పరిశ్రమకు చెందిన శానిటైజర్ తయారీ యూనిట్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 17 మంది కార్మికులు మృతిచెందారు. మృతుల్లో 15 మంది మహిళలే. పూణే శివార్లలోని పిరాట్ ఎంఐడిసి ఏరియాలోని ఎస్‌విఎస్ అక్వా టెక్నాలజీస్ ఫ్యాక్టరీలో చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో మరో 20 మందిని సురక్షితంగా అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. ఒక యంత్రంలో పేలుడు కారణంగా మంటలు రావడంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు బయటకు రాలేకపోయారని స్థానిక రెవెన్యూ అధికారులు తెలిపారు. ప్రమాదం సంభవించిన సమయంలో ప్లాంట్‌లో 37 మంది కార్మికులు పనిచేస్తున్నారని స్థానిక అగ్నిమాపక దళ విభాగం తెలిపింది.

ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లలో మావోయిస్టుల మృతి

ఛత్తీస్‌గఢ్‌లోని కొండగావ్ జిల్లాలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జూన్ 1న జరిగిన కాల్పుల ఘటనలో ఒక మహిళతో సహా ఇద్దరు మావోయిస్టులు మరణించారు. భండర్పల్ గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో మధ్యాహ్నం సమయంలో ఈ కాల్పులు చోటుచేసుకున్నాయని పోలీసు అధికారి తెలిపారు. జిల్లా పోలీసుల రిజర్వ్ గార్డ్ (డిఆర్‌డి) బృందం నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్‌కు వెళ్లిన సమయంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగిందని బస్తర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందరాజ్ తెలిపారు. జూన్ 18న బస్తర్–సుక్మా సరిహద్దు ప్రాంతంలో జరిగిన కాల్పుల్లో ఒక మహిళా మవోయిస్టు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. బస్తర్ డివిజన్ నారాయణపూర్ జిల్లాలో జూన్ 20న జరిగిన రెండు వేరు వేరు ఎన్‌కౌంటర్‌లలో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు. పోలీసుల వివరాల ప్రకారం ఇతుల్, కోర్వాయ అటవీ ప్రాంతాలలో ఈ ఘటనలు జరిగాయన్నారు.

ఢిల్లీ అల్లర్ల కేసులో ఆరుగురికి బెయిల్

గతేడాది ఫిబ్రవరిలో ఈశాన్య ఢిల్లీలో జరిగిన అల్లర్లలో ఒక హత్య కేసులో నిందితులుగా ఉన్న ముగ్గురికి ఢిల్లీ హైకోర్టు జూన్ 6న షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ హింసలో నిందితులు పాల్గొన్నారనడానికి కానీ, హత్యకు పాల్పడ్డారన్న దానికి గానీ ఎటువంటి ప్రాథమిక ఆధారాలు లేవని జస్టిస్ ముక్తా గుప్తా పేర్కొన్నారు. రు. 25 వేల వ్యక్తిగత పూచీతో షబీర్ అలీ, మెహ్లూట్, రియాస్ అహ్మాయేను విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ఇదే కేసులో అరెస్టయిన విద్యార్థి నాయకులు నటాషా నర్వాల్, దేవాంగన కలిత, అసిఫ్ ఇక్బాల్ తన్హాలకు జూన్ 15న బెయిల్ మంజూరు చేస్తూ ఢిల్లీ హైకోర్టు ఆదేశాలిచ్చింది. విడుదలను అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించినా జూన్ 17న విడుదలయ్యారు. ఈశాన్య ఢిల్లీ అల్లర్ల కేసుకు సంబంధించి పోలీసులు 750కి పైగా కేసులు నమోదు చేశారు. ఈ హింసాకాండలో 53 మంది చనిపోగా, వందలాది మందికి గాయాలయ్యాయి.

కశ్మీర్‌లో హక్కుల ఉల్లంఘన: ఐరాస

జమ్మూ కశ్మీర్ పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పిడిపి) యువజన అధ్యక్షుడు వహీద్ పారా నిర్బంధాన్ని కొనసాగించడంపై వివరణ కావాలని ఐక్యరాజ్య సమితి ప్రత్యేక నిపుణుల బృందం జూన్ 7న భారత ప్రభుత్వాన్ని కోరింది. జమ్మూ కశ్మీర్‌లో ఒక దుకాణాదారు కస్టడీలో ఉండగా హత్యకు గురికావడం, మరో టీనేజర్ అదృశ్యం కావడంపై కూడా సమాచారం కావాలని వారు కోరారు. ఐక్యరాజ్య సమితికి చెందిన ఐదుగురు నిపుణులు మార్చి 31న ప్రభుత్వాన్ని కోరిన విషయాన్ని ఇటీవల బహిరంగపరిచారు. తీవ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలతో గతేడాది నవంబర్ 25న జాతీయ దర్యాప్తు సంస్థ పారాను అరెస్టు చేసింది.

హర్యానాలో పోలీస్ స్టేషన్‌ను దిగ్బంధించిన రైతులు

హర్యానాలో రైతులు అరెస్టు చేసిన రైతులను విడుదల చేయాలని, వారిపై పెట్టిన తప్పుడు కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 7న తొహానా పోలీస్ స్టేషన్‌ను దిగ్బంధించారు. వేలాది మంది రైతులు పోలీస్ స్టేషన్ వెలుపల బైఠాయించి సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు రవి అజాద్, వికాస్ సీజర్లను బేషరతుగా విడుదల చేసేంతవరకు తమ ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీనికి సంఘీభావంగా ఇతర జిల్లాల్లో కూడా రైతులు పోలీస్ స్టేషన్ల దిగ్బంధనం చేపట్టారు. దీంతో హర్యానాలో మనోహర్ లాల్ ఖట్టర్ ప్రభుత్వం దిగొచ్చింది. రైతుల డిమాండ్లను అంగీకరించింది. రవి అజాద్, వికాస్ సీజర్తో బాటు అరెస్టు అయిన మక్కన్ సింగన్ను కూడా విడుదల చేసింది. గత రెండు రోజులుగా సంయుక్త కిసాన్ మోర్చా నాయకులతో సహా వేలాది మంది రైతులు రాత్రి పోలీస్ స్టేషన్‌లో గడిపారు. తొహానా పోలీస్ స్టేషన్ ముట్టడికి మద్దతుగా సిర్సా, ఫతేహాబాద్, జింద్, హిసార్ వంటి జిల్లాల నుండి వేలాది మంది రైతులు తరలివచ్చారు.

రాజద్రోహ చట్టాన్ని రద్దుచేయాలి

కాలం చెల్లిన రాజద్రోహం చట్టాన్ని రద్దు చేయాలని ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా డిమాండ్ చేసింది. ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలో అటువంటి చట్టాలకు స్థానం లేదని జూన్ 4న ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపినందుకు, ప్రభుత్వ విధానాలను విమర్శించినందుకు జర్నలిస్టులపై ప్రభుత్వాలు రాజద్రోహం కేసులు నమోదు చేయడం సాధారణమైందని ఐడబ్ల్యుపిసి ఆందోళన వ్యక్తం చేసింది. ప్రధానమంత్రిని విమర్శించినందుకు జర్నలిస్టు వినోద్ దువాపై నమోదు చేసిన కేసును సుప్రీం కోర్టు కొట్టివేయడాన్ని ఎడిటర్స్ గిల్డ్‌తో పాటు అసోసియేషన్‌లు స్వాగతించాయి. కెదార్‌నాథ్ సింగ్ కేసును అనుసరించి జర్నలిస్టులకు రాజద్రోహం కేసుల నుంచి రక్షణ కల్పించడం హర్షణీయమన్నారు. రైతుల ఉద్యమంపై ట్వీట్లు చేసినందుకు మృణాల్ పాండేతో పాటు ఇతర జర్నలిస్టులపై రాజద్రోహం కేసు నమోదు చేశారని, జర్నలిస్టు సిద్దిఖ్ కప్పన్ పై రాజద్రోహం, ఉపా చట్టాల కింద కేసులు నమోదు చేసి గతేడాది అక్టోబర్ నుంచి జైల్లో నిర్బంధించి ఉంచారని గుర్తుచేసింది.

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్‌లు

జమ్మూకశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలోని సొపోర్ పట్టణంలో జూన్ 12న కశ్మీర్ మిలిటెంట్లు జరిపిన దాడిలో ఇద్దరు పోలీసులు, ముగ్గురు పౌరులు చనిపోయారు. బారాముల్లా జిల్లా సొపోర్‌లో జూన్ 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో లష్కరే తోయిబాకు చెందిన ముగ్గురు మిలిటెంట్లు మృతిచెందినట్లు పోలీసు అధికారులు తెలిపారు. సొపోర్‌లోని గుండ్ బ్రాత్ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. ముగ్గురు మిలిటెంట్లు ఉన్నట్లు సమాచారం అందడంతో ఈ ప్రాంతంలో కార్డన్‌సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్న క్రమంలో ఎన్‌కౌంటర్ జరిగిందన్నారు. వీ

అది మానవ హక్కుల అణచివేతే!

పాలస్తీనాపై ఈ మధ్య జరిగిన తీర్మాన సమయంలో భారత్ గైర్హాజరవడం వల్ల ప్రజలందరి మానవ హక్కులు అణచివేతకు గురయ్యాయని పాలస్తీనా విదేశాంగ మంత్రి రియాద్ మల్కీ అన్నారు. ఈ మేరకు మే 30న విదేశాంగ మంత్రి జైశంకర్‌కు లేఖ రాశారు. 'తూర్పు జెరూసలేంతో సహా ఆక్రమిత పాలస్తీనా భూభాగంలో అంతర్జాతీయ మానవ హక్కుల చట్టం, మానవతా సహాయం చట్టాలను గౌరవం కల్పించడానికి హామీ కల్పించడమన్న' శీర్షికతో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. మే 27న మానవ హక్కుల మండలి సమావేశంలో తీర్మానంపై జరిగిన ఓటింగ్‌కు భారత్ గైర్హాజరయింది. ఇటీవల ఇజ్రాయిల్ దురాక్రమణ పూరిత దాడులపై దర్యాప్తునకు స్వతంత్ర కమిషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ తీర్మానాన్ని రూపొందించారు. 24 మంది సభ్యులు తీర్మానానికి అనుకూలంగా ఓటింగ్ చేయగా 9 మంది వ్యతిరేకంగా ఓట్లు వేశారు.

సంక్షోభంలో మయన్మార్

మయన్మార్ సంక్షోభానికి తెరతీస్తూ ఐక్యరాజ్య సమితి ప్రవేశపెట్టిన తీర్మానంపై ఓటింగ్ జరగగా అందులో భారత్ పాల్గొనలేదు. ఎన్నికల్లో మయన్మార్ ప్రజలు ఇచ్చిన తీర్పు మేరకు ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించాలని సైనికాధికారులను కోరుతూ సర్వ ప్రతినిధి సభలో ఐక్యరాజ్య సమితి తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. భారత్‌తో పాటు మయన్మార్‌కు పొరుగు దేశాలైన బంగ్లాదేశ్, భూటాన్, చైనా, లావోస్, నేపాల్, థాయ్‌లాండ్, రష్యా సైతం ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. ఒక్క బెలారస్ మాత్రమే తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేయగా, 119 దేశాలు అనుకూలంగా ఓటు వేశాయి. మయన్మార్‌లో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కాదని, పాలనను సైన్యం తన చేతుల్లోకి తీసుకోవడంతో పాటు అంగ్‌సాన్ సూచీ వంటి కీలక నేతల్ని నిర్బంధించారు. సైనిక పాలనకు వ్యతిరేకంగా సామాన్య ప్రజలు చేస్తున్న నిరసనల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు.

ఇరాన్ నూతన అధ్యక్షుడిగా ఇబ్రహీమ్ రైసే

ఇరాన్‌లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ఇబ్రహీమ్ రైసే గెలుపొందారు. ఆ దేశంలోని అధికార పార్టీకి చెందిన రైసే ఇప్పటివరకు న్యాయ వ్యవస్థకు అధిపతిగా ఉన్నారు. రైసేకి 61.95 శాతం ఓట్లు వచ్చాయి. ఈసారి ఎన్నికల్లో 48.8 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆగస్టులో రైసే బాధ్యతలు చేపట్టనున్నారు. అధ్యక్ష ఎన్నికలను ఇరాన్ తుడే పార్టీ (ఇరాన్ కమ్యూనిస్టు పార్టీ) బహిష్కరించింది. నిరంకుశ మత ఛాందసవాద ప్రభుత్వం ఎన్నికలను ఒక ప్రహసనంగా మార్చుతున్నందున ప్రజాస్వామ్యవాదులు, దేశ భక్తియుత శక్తులు ఈ ఎన్నికలను బహిష్కరించాలని తుడే పార్టీ పిలుపునిచ్చింది. ఇరాన్‌లో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం ప్రజా వ్యతిరేకమైనది కాబట్టి దీనిని తొలగించి ప్రజలందరి భాగస్వామ్యంతో కూడిన ప్రభుత్వాన్ని నెలకొల్పేందుకు ఉద్యమాన్ని ఉధృతం చేయాలని తుడే పార్టీ పిలుపునిచ్చింది.

బుర్కినాఫాసోలో ఉగ్రదాడి... 100 మంది మృతి

ఆఫ్రికాలోని బుర్కినాఫాసోలో ఇస్లామిక్ ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో వంది మంది పౌరులు చనిపోయారు. జూన్ 5న అర్ధరాత్రి యాఘా ప్రావిన్స్‌లోని సోల్హన్ పట్టణంలో పౌరులపై విచక్షణారహితంగా దాడిచేశారు. ఈ దాడి మృతుల్లో పురుషులతో పాటు మహిళలు, పిల్లలు కూడా ఉన్నారు. ముష్కరులు పట్టణంలోకి చొరబడి పౌరులపై కాల్పులు జరిపారు. కొంతమందిని ఉరివేసి చంపారు. 2015 తరువాత జరిగిన అతి భీకర ఉగ్రదాడి ఇదేనని అంటున్నారు.

క్యూబాపై అమెరికా దాడి

క్యూబా ఇతర దేశాలపై ఇటీవల అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ చేసిన ప్రకటనను అమెరికా కమ్యూనిస్టు పార్టీ (సిపియుఎస్ఎ) ఖండించింది. తీవ్రవాదంపై పోరులో పూర్తిగా సహకరించని దేశాల జాబితాలో క్యూబాతో పాటు వెనిజులా, ఇరాన్, సిరియా, ఉత్తర కొరియా దేశాలు ఉన్నాయని అమెరికా విదేశాంగ శాఖ ప్రకటించింది. ఈ చర్యను క్యూబా విదేశాంగ మంత్రి బ్రూనో రొడ్రిగజ్ తీవ్రంగా ఖండించారు. అమెరికా పాల్పడిన 700కి పైగా తీవ్రవాద దాడులకు క్యూబా బలైపోయిందని విమర్శించారు. సోషలిస్టు క్యూబా పై సామ్రాజ్యవాద దాడులను తక్షణమే అమెరికా ప్రభుత్వం ఆపాలని అమెరికా కమ్యూనిస్టు పార్టీ డిమాండ్ చేసింది. క్యూబా దేశ సార్వభౌమాధికారాన్ని గౌరవించాలని, క్యూబన్ల సంక్షేమాన్ని దెబ్బతీసేలా ఆంక్షలు, వాణిజ్య నిర్బంధం ఉన్నాయని విమర్శించింది. క్యూబా పై అమెరికా ఆర్థిక దురాక్రమణ విధానాలకు స్వస్తి పలికే తీర్మానానికి మద్దతివ్వాల్సిందిగా కాంగ్రెస్ ప్రతినిధులను, సెనెటర్లను కోరాలని పార్టీ సభ్యులకు, సానుభూతిపరులకు విజ్ఞప్తి చేసింది.

ప్రమాదంలో బాల్యం

ప్రపంచవ్యాప్తంగా బాల కార్మికుల సంఖ్య అనూహ్యంగా పెరుగుతోందని యునిసెఫ్, అంతర్జాతీయ కార్మిక సమాఖ్య(ఐఎల్ఓ) ఆందోళన వ్యక్తం చేసింది.గత నాలుగేండ్లలో 84 లక్షల మంది బాలలు చదువుకు దూరమై, కార్మికులుగా మారారనీ, బాల కార్మికుల సంఖ్య 16 కోట్లకు పెరిగిందనీ యూనిసెఫ్, ఐఎల్ఓ తాజా నివేదిక (చైల్డ్ లేబర్ : గ్లోబల్ ఎస్టిమేట్స్ 2020) తెలిపింది. బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం క్రమంగా బలహీనపడుతోందని నివేదిక హెచ్చరించింది. గత 20 ఏండ్లలో ఇంతగా బాల కార్మికులు పెరగలేదని తెలిపారు. జూన్ 12న బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఈ నివేదికను జెనీవాలో విడుదల చేశారు.

నిరసనలతో హోరెత్తిన లక్షద్వీప్

లక్షద్వీప్ అడ్మినిస్ట్రేటర్ ప్రఫుల్ పటేల్ అనుసరిస్తున్న నిరంకుశ, అప్రజాస్వామిక చర్యలకు వ్యతిరేకంగా ఈ ప్రాంతమంతా నిరసనలతో మారుమోగింది. ప్రఫుల్‌ను తక్షణం వెనక్కు పిలవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ జూన్ 7న కరోనా నిబంధనల దృష్ట్యా లక్షద్వీప్‌లోని అన్ని ప్రాంతాల్లో ప్రజలు ఎవరి ఇళ్లలో వారే ఉదయం నుంచి సాయంత్రం వరకు దీక్షలో పాల్గొన్నారు. సముద్రంలో మునిగి 'సేవ్ లక్షద్వీప్' సహా.. కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు. లక్షద్వీప్‌లోని అన్ని రాజకీయ పార్టీలు, సంఘాలతో కలిసి ఏర్పడిన 'సేవ్ లక్షద్వీప్ ఫోరం' అధికార ప్రతినిధి అడ్మినిస్ట్రేటర్ తీసుకొచ్చిన ప్రజా వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. లక్షద్వీప్ ప్రజల జీవనాన్ని, వారి జీవనోపాధిని, ఇక్కడి సంస్కృతిని దెబ్బతీసేలా ప్రఫుల్ ఇటీవలి చర్యలున్నాయన్నారు.

జి-7 దేశాల సమిట్‌ను వ్యతిరేకిస్తూ నిరసనలు

బ్రిటన్‌లోని కార్న్‌వాల్‌లో నిర్వహిస్తున్న జి–7 దేశాధ్యక్షుల సమిట్‌ను వ్యతిరేకిస్తూ ఆక్స్‌ఫామ్‌కు చెందిన పర్యావరణవేత్తలు స్వాన్‌పూల్ బీచ్‌లో జూన్ 13న నిరసన తెలిపారు. సమిట్ తొలిరోజు జూన్ 11న దాదాపు 500 మంది నిరసనకారులు మార్చ్ నిర్వహించారు. వారంతా 'వాతావరణం అంశం, ఎకోలాజికల్ ఎమర్జెన్సీ'పై అధ్యక్షులు మాట్లాడాలని డిమాండ్ చేశారు. బ్రిటన్‌లోని వందల మంది మయన్మార్ దేశస్థులు సమిట్ జరిగే కార్న్‌వాల్ వద్ద సమావేశమై 'సేవ్ డెమోక్రసీ ఇన్ మయన్మార్' పేరిట నిరసన తెలిపారు. ఇజ్రాయిల్‌కు బ్రిటన్ మద్దతు పలకడం ఆపి, పాలస్తీనాలో ఇజ్రాయిల్ ఆక్రమణల్ని అడ్డుకోవాలని నినాదాలు చేశారు. బ్రిటన్ ఆయుధాలు అమ్మడం వల్ల అమాయక పౌరులు చనిపోతున్నారన్నారు. సమిట్ జరిగిన మూడు రోజులు ఇంగ్లాడ్‌లోని పలు నగరాల్లో నిరసనలు వెల్లువెత్తాయి వీ

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 236 - June-July 2021 • ISSN 2231-6892
• RNI Regn.No.APTEL/2003/11482 • Published on 27/06/2021 • Postal Regn. No. HD/1100/2020-22

వీక్షణంను ఆదుకోండి

నాలుగు కాలాలు నిలబడేందుకు సహాయం అందించండి

వీక్షణం రాజకీయార్థిక సామాజిక మాసపత్రిక పందొమ్మిది సంవత్సరాలుగా తెలుగు సమాజానికి చేస్తున్న సేవ మీకు తెలుసు. విద్యావంతులలో, బుద్ధిజీవులలో, సామాజిక కార్యకర్తలలో ఈ పత్రికకు ఉన్న పేరు ప్రఖ్యాతులు, విశ్వసనీయత, వారి మేధో, ఆలోచనా అవసరాలకు ఈ పత్రిక ఎంతగానో ఉపయోగపడడం మీరు చూస్తూనే ఉన్నారు. అయితే ఇంతటి ఆదరాభిమానాలు సంపాదించుకున్నప్పటికీ వీక్షణం ఆర్థిక పరిస్థితి ఎన్నడూ ఈ విశేష జనాదరణకు తగినట్టుగా లేదు. వీక్షణం పాఠకులకు, అభిమానులకు, ఉపయోగించుకునేవారికి వీక్షణంకు సహాయం చేసేంత ఆర్థిక స్తోమత లేదు. ఎందరో తమకు తోచిన, చేయగలిగిన సహాయం చేస్తున్నప్పటికీ, అది సరిపోవడం లేదు. వ్యవసాయాదాయం తప్ప మరే ఆదాయవనరూ లేని డెబ్బై సంవత్సరాలు దాటిన వృద్ధ దంపతులు, రోజుకూలీ చేసుకునే శ్రామికులు, ఎనభయవ పడిలో పెన్షన్ మీద మాత్రమే బతుకుతున్న రిటైర్డ్ ప్రభుత్వోద్యోగులు వంటి వారెందరో ఇబ్బందులు పడుతూ కూడా వీక్షణంకు విరాళం ఇవ్వడానికి చేస్తున్న ప్రయత్నాలు చూసి ఆ ఆదరాభిమానాలకు మా కళ్లు చెమరుస్తున్నాయి. అటువంటి వందలాది మంది చేస్తున్న చిన్న చిన్న సహాయాలే వీక్షణం ఎప్పటికప్పుడు ఆగిపోకుండా కాపాడుతున్నాయి. సాలీనా ఐదు లక్షల రూపాయల లోటుతో, ఎప్పటికప్పుడు అప్పు చేస్తూ, ఏడాదికొకసారి దాతల దగ్గరికి వెళ్లి ఆ అప్పు తీర్చే మార్గాలు వెతుకుతూ వీక్షణం నడుపుతూ వస్తున్నాం. ఇలా దినదిన గండంగా ఎన్నాళ్లు బండి లాగగలమో తెలియదు. చందాలు, విరాళాలతో పాటు సొంత ప్రచురణల అమ్మకాలు, ఇతర ప్రచురణల అమ్మకాలపై కమిషన్లతో బండి నడుస్తూ ఉండేది. గోరుచుట్టుపై రోకటిపోటు లాగ కొవిడ్ లాక్‌డౌన్ మొదలైనప్పటి నుంచీ చందాల పునరుద్ధరణ ఆగిపోయింది. కొత్త చందాలు రావడం తగ్గిపోయింది. పుస్తకాల అమ్మకాలు దాదాపుగా ఆగిపోయాయి. విరాళాల ధార ఎండాకాలపు వాగులాగ పల్చబడుతున్నది. అందువల్ల మరొకసారి అభిమానులకూ, పాఠకులకూ, దాతలకూ సవినయ విజ్ఞప్తి చేయక తప్పడం లేదు. ఇప్పుడున్న స్థితి యథాతథంగా కొనసాగితే వీక్షణంను ఇంక ఎక్కువ కాలం నడపడం సాధ్యం కాదు. పందొమ్మిది సంవత్సరాలుగా దృఢంగా ప్రజల పక్షాన నిలిచిన అతి తక్కువ పత్రికలలో వీక్షణం ఒకటి. దేశంలోనూ, రెండు తెలుగు రాష్ట్రాలలోనూ పెరిగిపోతున్న ఆధిపత్య సంస్కృతిలో, ప్రశ్నించే గొంతులను, ప్రజా స్వరాలను మూసివేయడానికి జరుగుతున్న ప్రయత్నాలలో వీక్షణంను కాపాడుకోవలసిన బాధ్యత ప్రజలదే.

If undelivered please return to:
VEEKSHANAM
Mytri Residency, 3-6-394, St. No. 3,
Himayatnagar, Hyderabad - 500 029.
Phone: 040 66843495

To:
Mr./Mrs.____________________

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at NAVYA PRINTERS, 2-3-655/C/16/B, Durga Nagar, Amberpet, Hyderabad -500013 (New Declaration filed) for Charitha Impressions (as per RNI records) and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao